

'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 152

గురువారం 22-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అమెజాన్ చేసిందేమీ లేదు..

మార్కెట్‌ను దెబ్బకొట్టే ధరలతో లాభమేంటన్న పీయూష్ గోయల్ - 15లో



ఆఫీస్... ఆల్ హ్యాపీస్

ఉద్యోగుల కోసం కార్పొరేట్ కంపెనీల్లో హ్యాపీనెస్ టీమ్‌లు... - 13లో



అన్ని దేశాలతో కలిసి నడుస్తాం

భారత్ అన్ని దేశాలతో అనుసంధానం అవుతోందని, అందరి అభివృద్ధి కాంక్షిస్తోందని పోలండ్‌లో ప్రధాని మోదీ అన్నారు.

- వివరాలు 6లో



సాక్ష్యాధారాలిస్తే జకీర్ అప్పగింత

తగిన ఆధారాలు సమర్పిస్తే జకీర్ నాయక్‌ను భారత్‌కు అప్పగించేందుకు అభ్యంతరం లేదని మలేషియా ప్రధాని అన్వర్ తెలిపారు.

- వివరాలు 6లో



దీదీ సర్కారు 10 తప్పులు

యువ వైద్యురాలి హత్యోదంతంలో దోషులను కాపాడేందుకు ప్రభుత్వమే ప్రయత్నిస్తోందన్న అనుమానాలు నానాటికీ బలపడుతున్నాయి.

- వివరాలు 6లో



.. అత్యంత అర్హురాలు హారిసే

అమెరికాకు నేతృత్వం వహించేందుకు పూర్తి అర్హురాలు కమలా హారిసేనని దేశ మాజీ ప్రథమ మహిళ మిషెల్ ఒబామా అన్నారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

17 మంది టీడీపీ ఎమ్మెల్యేలు నేరచరితులు



17 మంది టీడీపీ ఎమ్మెల్యేలు, ఇద్దరు జనసేన పార్టీ ఎమ్మెల్యేలు నేరచరితులని, వీరిపై మహిళలపై నేరాలకు పాల్పడ్డ అభియోగాలు ఉన్నాయని ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థలు వెల్లడించాయి.

- వివరాలు 12లో


పాత మొబైల్ ఫోన్లతో సైబర్ నేరాలు



డబ్బులు, ప్లాస్టిక్ వస్తువులు ఇచ్చి పాత మొబైల్ ఫోన్లను కొని సైబర్ నేరాలకు వాడుతున్న కేటుగాళ్ల ముఠాను టీజీ సీఎస్‌బీ అధికారులు అరెస్టు చేశారు. ముగ్గురి నుంచి 4 వేల పాత మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

- వివరాలు 3లో

ఆ స్కిల్స్ ఏవీ?



భారత్‌లో ఇంజనీరింగ్ విద్యను లైట్‌గా తీసుకున్న విద్యార్థులు..ఎంఎస్ చేయడానికి విదేశాలకు వెళ్లాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీటెక్‌లో ముఖ్యమైన నైపుణ్యాలపై దృష్టి పెట్టకపోవడంతో అక్కడ చాలామంది స్కిల్ ఉద్యోగాలు పొందలేకపోతున్నారు.

- వివరాలు 3లో

'కాళేశ్వరం' నిర్ణయాలు ఎవరివి?



'కాళేశ్వరం ప్రాజెక్టుపై అత్యున్నత స్థాయిలో నిర్ణయాలు తీసుకున్నది ఎవరు? ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు బదులు దీన్ని నిర్మించాలనే నిర్ణయం ఎవరిది?..' అంటూ నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఈఎన్‌సీ (జనరల్)పై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది.

- వివరాలు 12లో

బోగస్ కృష్ణ'పట్టా'!

కృష్ణపట్టె భూములను చెరబట్టిన అక్రమార్కులు

నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలంలో 3,900 ఎకరాలకు బోగస్ పట్టాలు

- రాజకీయ నేతల అండదండలు, అధికారుల సహకారంతో భారీగా అక్రమాలు
- ప్రైవేటు, ప్రభుత్వ భూములకు సంబంధించి ధరణిలో అనర్హుల పేర్లు నమోదు
- వారికి ఏటా రూ.3.5 కోట్ల చొప్పున రైతుబంధు..
- ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, బ్యాంకు రుణాలు కూడా..
- భూములు స్వాధీనంలో ఉండి, వ్యవసాయం చేస్తున్నవారికి అందని పథకాలు
- భూసమస్యలపై పైలట్ ప్రాజెక్టులో బయటపడిన బాగోతం
- పూర్తిస్థాయిలో అక్రమాలను నిగ్గుతేల్చేందుకు క్షేత్రస్థాయిలో సర్వే



కృష్ణపట్టె భూముల్లో సర్వే చేస్తున్న అధికారులు



తిరుమలగిరి (సాగర్) మండలంలోని గోడుమడకకు చెందిన ఈయన పేరు బారు శివయ్య. ఆయనకు చింతల పాలెం రెవెన్యూ శివార్లలోని సర్వే నంబర్ 14లో 4.30 గుంటల భూమి ఉంది. తాతల కాలం నుంచీ వారే ఆ భూమిని సాగుచేసుకుంటున్నారు. నేటికీ రికార్డుల్లో పేరు లేకపోవడంతో పట్టాదారు పాసుపుస్తకం అందలేదు. కానీ కొందరు ఈ భూమికి సంబంధించి అక్రమంగా పట్టాలను చేయించుకుని రైతుబంధు, రైతుబీమా పథకాలు పొందుతున్నారు. బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకున్నారు. భూమి తమ స్వాధీనం (కబ్జా)లో ఉన్నా.. తమకు పాస్ పుస్తకం లేక ప్రభుత్వ పథకాలు అందడం లేదని శివయ్య వాపోయారు.

..ఈయన ఒక్కరి భూమే కాదు. కేవలం ప్రైవేటు వ్యక్తుల అధీనంలోని స్థలాలే కాదు.. వేల ఎకరాల ప్రభుత్వ భూములను కూడా అక్రమార్కులు చెరబట్టారు. భూమిని ఏళ్లకేళ్లుగా సాగుచేసుకుంటున్నవారు పట్టాలు లేక, హక్కుల్లేక ప్రభుత్వ పథకాలకు దూరమైతే... కొందరు అవే భూములపై నకిలీ పట్టాలు సృష్టించి, ప్రభుత్వం నుంచి రైతు బంధు, రైతు బీమా వంటి పథకాల సొమ్మును కాజేస్తున్నారు. ఇంకొందరైతే ఏకంగా ప్రభుత్వ భూములకే బోగస్ పట్టాలు సృష్టించేశారు. కృష్ణపట్టె ప్రాంతమైన నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలంలో తాజాగా బయటపడిన బాగోతమిది. అక్రమార్కులు ఈ మండలంలో 3,900 ఎకరాలకు బోగస్ పట్టాలు సృష్టించినట్టు రెవెన్యూ యంత్రాంగం గుర్తించింది. తద్వారా ఏటా రూ.3.5 కోట్ల చొప్పున గత పదేళ్లలో రూ.35 కోట్లకుపైగా రైతుబంధు రూపంలోనే పొందినట్టు అధికారులు భావిస్తున్నారు. బోగస్ పట్టాలతో రైతుబీమా, బ్యాంకుల్లో రుణాలు పొందినట్టు తేల్చారు. సమీపంలోని దామరచర్ల మండలంలోనూ వేల ఎకరాల ప్రభుత్వ భూములు బోగస్ పట్టాలతో కబ్జా అయినట్టు రెవెన్యూ యంత్రాంగం ప్రాథమిక అంచనాకు వచ్చింది. ముడుపులకు అలవాటుపడిన అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతోనే ఈ అక్రమాలు సాగాయని అంటున్నారు.

- సాక్షి ప్రతినిధి, నల్లగొండ

- వివరాలు 2లో

మృత్యుఘోష

17 మంది మృతి

ఏపీలోని అచ్యుతాపురం సెజ్‌లో భారీ విస్ఫోటం

'ఎసైన్షియా' ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్

- తునాతునకలైన కార్మికుల శరీర భాగాలు.. యంత్రాలకు, చెట్లకు వేలాడుతున్న మాంసపు ముద్దలు
- ఘటనా స్థలిలో భీతావహ దృశ్యాలు.. ఎగసిపడ్డ దట్టమైన మంటలు.. కమ్ముకున్న పొగ
- సాల్వెంట్‌లో రియాక్షనే ప్రమాదానికి కారణం?
- 40 మందికి గాయాలు.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- మృతుల్లో భద్రాద్రి జిల్లా వాసి...
- మృతదేహాలు మూటగట్టి గుట్టుగా కేజీహెచ్‌కు తరలింపుపై నిలదీసిన బాధిత కుటుంబాలు




రియాక్టర్ పేలుడుతో శిథిలాల్లో పడి ఉన్న మృతదేహం

సాక్షి, అనకాపల్లి, అచ్యుతాపురం: అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ.. మధ్యాహ్నం 2.15 గంటలు.. భోజన విరామం.. ఇటు విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్తున్నవారు.. అటు రెండో షిఫ్ట్ కోసం వస్తున్న కార్మికులతో అక్కడంతా కోలాహలంగా ఉంది. అకస్మాత్తుగా భారీ పేలుడు.. ఏడంతస్తుల భవనం చిగురుటాకులా కంపించింది. చుట్టూ కిలోమీటర్ మేర దట్టమైన పొగలు.. ఏం జరిగిందో తెలుసుకునే లోపే నిండు ప్రాణాలు గాల్లో కలిశాయి. పలువురు అపస్మారక స్థితికి చేరుకున్నారు. క్షతగాత్రుల ఆర్తనాదాలు.. మాంసం ముద్దలు.. ఒలికిన రసాయనాలు.. ఫ్లోరంతా రక్తపు చారికలు, హాహాకారాలతో ఆ ప్రాంతం భీతావహంగా మారింది. భవనం కిందనున్నవారు చూస్తుండగానే తమ సహచరుల శరీర భాగాలు గాల్లో ఎగురుతూ కనిపించాయి. కొన్ని మృతదేహాలు యంత్రాలకు, చెట్లకు వేలాడుతున్నాయి. దట్టమైన పొగల మధ్య నుంచి బయటకు పరుగులు తీస్తున్న కార్మికులకు ఊపిరాడని పరిస్థితి నెలకొంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం మధ్యాహ్నం రియాక్టర్ పేలి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటనలో 17 మంది మరణించారు. 40 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన ఎం. సురేంద్ర ఉన్నారు. శిథిలాల కింద ఇంకా ఎందరున్నారో.. రక్తపు ముద్దలు, శరీర భాగాలు ఎవరివో తెలియని

మిగతా 12వ పేజీలో ▶

ఫాంహౌస్ కూల్చివేతపై స్టే ఇవ్వలేం



అక్రమ నిర్మాణాల కూల్చివేతలో చట్టప్రకారం ముందుకెళ్లండి

- జీవో 99 నిబంధనల మేరకు హైడ్రా వ్యవహరించాలి
- 'జన్వాడ' కేసులో హైకోర్టు ఆదేశం.. కోర్టు ఆదేశాలతోనే 'ఎఫ్‌టీఎల్' ఆక్రమణలను తొలగించామన్న సర్కార్

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాల కూల్చివేతలో చట్టప్రకారం ముందుకెళ్లాలని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్)ను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ వద్ద ఉన్న డాక్యుమెంట్లు, రసీదులను తప్పకుండా పరిశీలించాలని, జీవో 99 నిబంధనల మేరకు వ్యవహరించాలని చెప్పింది. చెరువుల పరిరక్షణ అభినందనీయమే అయినా చట్టాన్ని మాత్రం పాటించాలని స్పష్టం చేసింది. అలాగే భవన నిర్మాణానికి సర్పంచ్ అనుమతి ఇవ్వడం చెల్లదని వ్యాఖ్యానించింది. ఫాంహౌస్ కూల్చివేతపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. చట్టప్రకారం చర్యలు లేకుంటే పిటిషనర్ ఎప్పుడైనా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చంటూ స్వేచ్ఛనిచ్చింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 12కు వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ పంచాయతీ పరిధి (ప్రస్తుతం నార్సింగి మున్సిపాలిటీ) సర్వే నంబర్ 311/పార్టులోని 1,210 చదరపు గజాల ఫాంహౌస్‌ను కూల్చొద్దని, స్టే ఇవ్వాలని కోరుతూ వ్యాపారవేత్త ప్రదీప్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆగస్టు 14న కొందరు అధికారులు వచ్చి ఉస్మాన్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఫాంహౌస్ ఉన్నందున త్వరలో కూల్చివేస్తామని బెదిరించారన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. 2014లో జన్వాడ ఫాంహౌస్ నిర్మాణం చేపట్టారని.. 2019లో ప్రదీప్‌రెడ్డి కొనుగోలు చేశారని పిటిషనర్ తరపు న్యాయవాది వి.హరిహరణ్ పేర్కొన్నారు. హైడ్రా పేరిట హైడ్రామా సృష్టిస్తున్నారన్నారు. హెచ్‌ఎండీఏ 2016లో నిర్ధారించిన ఎఫ్‌టీఎల్ ప్రకారం బఫర్ జోన్‌లో ఫాంహౌస్ లేదని చెప్పారు.

హైడ్రా విధివిధానాలేంటి?: 'అక్రమ నిర్మాణాల కూల్చివేతకు ఏర్పాటు చేసిన హైడ్రా విధివిధానాలు ఏంటి? ఏ ప్రాతిపదికన ఏర్పాటు చేశారు? హైడ్రా ఇప్పటివరకు ఎన్ని నిర్మాణాలను కూల్చింది?

మిగతా 12వ పేజీలో ▶

సెప్టెంబర్ 21న ఓటరు జాబితా



వార్డులు, జీపీల వారీగా జాబితాల తయారీకి షెడ్యూల్ జారీ

- స్థానిక ఎన్నికలకు సన్నాహాలు
- పీఆర్ అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల (సెప్టెంబర్) 21న వార్డులు, గ్రామ పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాలను పంచాయతీలు, మండల పరిషత్‌లలో ప్రచురించనున్నారు. అసెంబ్లీ ఓటరు జాబితాల ఆధారంగా వార్డులు, పంచాయతీల వారీ ఓటరులిస్టుల తయారీ, ప్రచురణ నిమిత్తం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) షెడ్యూల్ విడుదల చేసింది. బుధవారం ఎస్ఈసీ కార్యాలయంలో.. సర్పంచ్, వార్డు మెంబర్ల పదవులకు జరగాల్సిన రెండో సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటరు లిస్టుల తయారీ, ప్రచురణపై అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి సమీక్ష నిర్వహించారు. పీఆర్ ఆర్డీ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సంగ్రామ్, ఈసీ అధికారులతో చర్చించారు. అనంతరం ఓటరు జాబితాల తయారీ, ప్రచురణ నిమిత్తం ఎస్ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది.

ఎన్నికలపై స్పష్టత రాకున్నా..: గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరపాలనే దానిపై ప్రభుత్వం ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. కులగణన లేదా ఓటర్ల జాబితా.. దేని ఆధారంగా రిజర్వేషన్లను నిర్ధారిస్తారన్న దానిపైనా స్పష్టత కొరవడింది. అయినప్పటికీ ఎన్నికల సన్నద్ధతపై ఎస్ఈసీ దృష్టి పెట్టింది. ఓటర్ల జాబితాలు సిద్ధమయ్యాక వాటిని

మిగతా 5వ పేజీలో ▶

ఏడేళ్ల క్రితం అదృశ్యమై.. శవమై కనిపించింది

5లో

కోవర్టు నెపంతో మహిళా మావోయిస్టు రాధ హత్య

ఆర్ఆర్ఆర్ పనులపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, సీఎస్ శాంతికుమారి



వేగంగా భూసేకరణ

ట్రిపుల్ ఆర్ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

- దక్షిణ భాగం భూసేకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి
- ఉత్తర భాగం ఇప్పటికే చాలావరకు పూర్తయ్యింది
- రోజువారీ పురోగతి నాకు తెలియజేయాలి
- ఉన్నతాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: 'సంగారెడ్డి–ఆమన్‌గల్–షాద్‌నగర్–చౌటుప్పల్ (189.20 కి.మీ.) మీదుగా నిర్మించే రీజనల్ రింగు రోడ్డు దక్షిణ భాగానికి సంబంధించి భూ సేకరణ ప్రక్రియ ప్రారంభించాలి. ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలావరకు పూర్తయినందున, దక్షిణ భాగం కోసం కూడా ప్రారంభించాలి. భూ సేకరణలో పారదర్శకంగా వ్యవహరించాలి. ఈ రోడ్డు విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలి. పనుల్లో మాత్రం జాప్యం లేకుండా చూడాలి..' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ట్రిపుల్ ఆర్ పురోగతిపై సంబంధిత విభాగాల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు.

'భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా దక్షిణ భాగం అలైన్‌మెంట్ ఉండాలి. ఈ విషయంలో పారదర్శకంగా

మిగతా 2వ పేజీలో ▶

ఇంకుజగత్



ఎందుకు మేడం! రెండువోట్లు నటించడమే కదా!

కేటీఆర్, హరీశ్‌రావుకు సిగ్గూఎగ్గూ లేదు

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధ్వజం



- రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులు ఆపై మొత్తాన్ని చెల్లిస్తే వారికీ మాఫీ వర్తిస్తుంది
- అధికారులను పరుగులు పెట్టిస్తామని వెల్లడి

ఎర్రుపాలెం: ధనిక రాష్ట్రంగా తెలంగాణను అప్పగిస్తే పదేళ్లలో రూ.లక్ష రుణమాఫీ కూడా చేయకుండా రైతులను మోసం చేసి, ఇప్పుడు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై అవాకులు చెవాకులు పేలుతున్న కేటీఆర్, హరీశ్‌రావుకు సిగ్గూఎగ్గూ లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం జమలాపురంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం భట్టి మీడియాతో మాట్లాడారు. రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న రైతులు ఆపై మొత్తాన్ని బ్యాంకులకు చెల్లిస్తే వారికి కూడా రుణమాఫీ అమలవుతుందని తెలిపారు. దేశ చరిత్రలోనే అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోనే ఒకే దఫా రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం రుణాలు మాఫీ చేయడమేకాక

మిగతా 2వ పేజీలో ▶

పావుశాతం మాఫీతో వంద శాతం మోసం

రైతులను ప్రభుత్వం దగా చేస్తోంది: కేటీఆర్



- ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఎం బజారు భాష... నేడు రాష్ట్రవ్యాప్తంగా 'రైతు ధర్నా' నిర్వహించాలని రైతులు, బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పేరిట రైతులను పచ్చి దగా చేస్తోందని, రైతులందరికీ రుణమాఫీ జరిగేంత వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్పష్టం చేశారు. కేవలం పావు శాతం రుణమాఫీతో వంద శాతం రైతులను మోసం చేశారని.. ఈ అంశంపై సీఎం, మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రుణమాఫీ కోరుతున్న రైతులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం ఏమిటని నిలదీశారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి బజారు భాష మాట్లాడుతున్నారని, ఆయన పన్నిన వలలో తాము చిక్కుకునే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేసేలా ప్రభుత్వం మెడలు వంచేందుకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'రైతు ధర్నా' కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రకటించారు. బుధవారం బీఆర్ఎస్

మిగతా 2వ పేజీలో ▶

బంగారు తెలంగాణ రాలేదు.. ప్రజాపాలన రాలేదు

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై కిషన్‌రెడ్డి ధ్వజం



- ఈ రెండు పార్టీల కారణంగానే అభివృద్ధి కుంటుపడింది... రుణమాఫీ పూర్తిగా చేయకుండా మోసం చేశారు
- స్థానిక ఎన్నికల్లో అన్నిచోట్లా బీజేపీ పోటీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పాలనలో బంగారు తెలంగాణ రాలేదని, అలాగే కాంగ్రెస్ హయాంలో ప్రజా పాలన రాలేదని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీల కారణంగా రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం నెలకొని అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయని విమర్శించారు. తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కేంద్రంపై అబద్ధపు ప్రచారం చేయాలనేదే ఈ పార్టీల ఆలోచన అని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీల పట్ల విసిగిపోయారన్నారు. గతంలో గెలిచిన ఎమ్మెల్యేలు గాంధీ భవన్ నుంచి తెలంగాణ భవన్‌కు వెళ్లారని, ఇప్పుడు గెలిచిన ఎమ్మెల్యేలు తెలంగాణ భవన్ నుంచి గాంధీ భవన్‌కు వెళ్తున్నారని అన్నారు. రుణమాఫీ పూర్తిగా చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు సుమారు 400 పైచిలుకు హామీలు,

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

12 ఏళ్ల క్రితం చనిపోయిన రైతుకు రుణమాఫీ!

నేలకొండపల్లి: ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీ తమకు అమలు కాలేదని ఒకవైపు అనేక మంది రైతులు ఆందోళనచేస్తుంటే, మరో వైపు ఎప్పుడో మృతి చెందిన రైతు పేరు రుణమాఫీ జాబితాలో వచ్చింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంకు చెందిన తుళ్లూరి వెంకయ్య 12 సంవత్సరాల కిందటే మృతి చెందారు. ఆయనకు టేకులపల్లి ఆంధ్రా బ్యాంక్‌లో ఖాతా ఉండగా.. ఆయన కానీ, ఆయన చనిపోయాక కుటుంబీకులు కానీ రుణం తీసుకోలేదని చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం విడుదల చేసిన రుణ మాఫీ జాబితాలో వెంకయ్య పేరు వచ్చింది. ఈ విషయమై వెంకయ్య కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ తండ్రి కానీ, తాము కానీ ఏనాడు బ్యాంక్‌లో రుణం తీసుకోలేదని.. ఇప్పుడు రుణమాఫీ జాబితాలో పేరు ఎలా వచ్చిందో తెలియదని వెల్లడించారు.

స్పీకర్ ఖాతాలో రుణమాఫీ నగదు జమ

తిరిగి డబ్బు ప్రభుత్వానికి వాపస్



అనంతగిరి: రుణ మాఫీ పథకం కింద శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ బ్యాంకు ఖాతాలో పొరపాటున రూ.1,50,863 జమయ్యాయని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరులోని డీసీసీబీలో జరిగిన సాంకేతిక పొరపాటు కారణంగా స్పీకర్ ఖాతాలో డబ్బు జమయినట్టు స్పష్టం చేశారు. దీనిపై సభాపతి ప్రసాద్‌కుమార్ స్పందిస్తూ తన బ్యాంకు ఖాతాలో పొరపాటున జమయిన నగదును.. తిరిగి అదే ఖాతా నుంచి ప్రభుత్వానికి వాపస్ చేశానని తెలిపారు.

మంచి చేస్తే సహకరిస్తాం.. లేదంటే ప్రశ్నిస్తాం

సీఎం రేవంత్‌కు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు స్పష్టీకరణ



సీఎం రేవంత్‌ను కలిసిన రాఘవులు. చిత్రంలో జూలకంటి రంగారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తే సహకరిస్తామని.. లేదంటే ప్రశ్నిస్తామని సీఎం రేవంత్‌కు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సచివా లయంలో సీఎం రేవంత్‌రెడ్డిని బీవీ రాఘ వులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీవీ రాఘవులు మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. వివిధ వర్గాల సమస్యలపై సీఎంకు పలు వినతి పత్రాలు సమర్పించారు.

అందరికీ రుణమాఫీ: సీఎం

సీఎం రేవంత్‌కు, సీపీఎం నేతలకు మధ్య రుణ మాఫీలో తలెత్తిన సమస్యల విషయం ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ వర్తింపచేస్తామన్నారు.

వీఆర్ఎల్, వీటీపీఎల్ సంస్థలకు ట్రాన్స్‌పోర్ట్ అవార్డులు



సాక్షి, హైదరాబాద్: రోడ్డు రవాణా, లాజిస్టిక్స్ రంగాలకు చెందిన సంస్థల్లో ఆవిష్కరణలు, భద్రత, సుస్థిరత విభాగాల్లో ప్రతిష్టాత్మక వీఆర్ఎల్, వీటీపీఎల్ సంస్థలకు 2024 ఏడాదికి గాను ట్రాన్స్ పోర్టు అవార్డులు లభించాయి. సరుకు రవాణా కేటగిరీలో వీఆర్ఎల్ లాజిస్టిక్స్ సంస్థ ఎండీ డాక్టర్ ఆనంద్‌శంకేశ్వర్‌కు ఉత్తమ వ్యాపారవేత్తగా అవార్డు లభించింది. బస్సుల నిర్వహణ కేటగిరీలో విజయానంద్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (వీటీపీఎల్)కు ఎమర్జింగ్ బ్రాండ్ పురస్కారం లభించింది. టీవీ 9, కాంటినెంటల్ టైర్స్ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి హర్ష్ మల్హోత్రా ముఖ్య అతిథిగా హాజరై అవార్డులను అందజేశారు.

కేటీఆర్, హరీశ్‌రావుకు సిగ్గూఎగ్గూ లేదు

▶ మొదటి పేజీ తరువాయి

రైతుబీమా, పంటల బీమాకు ప్రీమియం చెల్లిస్తోందని చెప్పారు. వివిధ కారణాలతో రుణ మాఫీ కాని రైతులు అధికారులను సంప్రదిస్తే లోపాలను సరి చేస్తారని వెల్లడించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్లు ఇస్తుండగా.. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తామని భట్టి వెల్లడించారు. నిమిషం కూడా వృథా చేయకుండా అధికారులు, నాయకులను పరుగులు పెట్టిస్తామని.. పదేళ్ల వెనకబాటుతనం పోవాలంటే వేగంగా అభివృద్ధి చేయాల్సిన అవసరముందని తెలిపారు. ఈ సందర్భంగా తమకు రూ.4 వేల పింఛన్లు ఇప్పించాలని పలువురు కోరగా దాన్ని కూడా ఇస్తామని భట్టి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బోగస్ కృష్ణ 'పట్టా'!



ఈ చిత్రంలోని రైతు పేరు మేరావత్ ముని నాయక్. నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలం నాయకునితండాకు చెందిన ఆయనకు.. 2005లో అప్పటి వైఎస్ ప్రభుత్వం భూపంపిణీలో భాగంగా కాందిశీకుల భూమిని కేటాయించింది. మూడెకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకం అందజేసింది. 2017 వరకు ఆయనకు 1బీ, పహాణీ కూడా వచ్చాయి. 2018లో ధరణి అమల్లోకి వచ్చినప్పటి నుంచి 1బీ, పహాణీ రావడం లేదు. కొత్త పట్టాదారు పాస్ బుక్ ఇవ్వలేదు. 19 ఏళ్లుగా స్వాధీనంలో ఉండి, సాగుచేసుకుంటున్న ముని నాయక్‌కు కాకుండా.. మరో వ్యక్తి పేరును ధరణిలో చేర్చారు.



తిరుమలగిరి (సాగర్) మండలం చింతలపాలెం గ్రామ శివారులోని సర్వే నంబర్ 52లో కాందిశీకుల భూములు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ధరణి సమస్యలతో రైతులు ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో పరిష్కార మార్గాలపై సర్కారు దృష్టి పెట్టింది. ఈ క్రమంలో నల్లగొండ జిల్లా లోని తిరుమలగిరి (సాగర్) మండలంలో నెలకొన్న పరిస్థితిని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనితో ప్రభుత్వం తిరుమలగిరి (సాగర్) మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. భూముల సమస్యలపై విచారణ చేపట్టింది. అధికారులు ప్రాథమిక విచారణలోనే 3,900 ఎకరాలకు కొందరు బోగస్ పట్టాలు సృష్టించినట్టు గుర్తించారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలోని 12, 222, 158, 162, 223 సర్వే నంబర్లలో, తిమ్మాయి పాలెం గ్రామంలోని 38, 39, 60, 70, 74 సర్వే నంబర్లలో అక్రమ పట్టాలు ఉన్నట్టు తేల్చారు. వీటితోపాటు తునికినూతల గ్రామంలో సర్వే నంబర్ 45, నెల్లికల్ గ్రామంలో 424 సర్వే నంబర్, జమ్మలకోట గ్రామంలో 28 సర్వేనంబర్లలో అక్రమంగా పట్టాలు పొందినట్టు గుర్తించారు. చింతలపాలెం, తిమ్మాయిపల్లి రెండు గ్రామాల్లోనే 2,800 ఎకరా లకు నకిలీ పట్టాలు సృష్టించినట్టు తేలడం గమనార్హం. ప్రభుత్వ భూములనూ బోగస్ పట్టాలతో చెరబట్టినట్టు గుర్తించారు. దీంతో ఈ అక్రమాలను పూర్తి స్థాయిలో నిగ్గుతేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 14 రెవెన్యూ, సర్వే బృందాల ఆధ్వర్యంలో 80 మందికిపైగా సిబ్బంది తో క్షేత్రస్థాయి సర్వేకు శ్రీకారం చుట్టింది.

నకిలీ స్వాతంత్య్ర సమరయోధుల పేరిట పట్టాలు

దామరచర్ల మండలంలోని సర్వే నంబర్లు 686, 691, 1100, 735, 655, 621, 690, 714తోపాటు మరో 33 సర్వే నంబర్లలో 4,542 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూములపై కబ్జాదారు ల కన్ను పడింది. దీంతో భూబకాసురులకు.. స్వాతంత్య్ర సమరయోధులు గుర్తుకొచ్చారు. నకిలీ సమర యోధులను సృష్టించి, తమ చేతివాటం ప్రదర్శించి, అధికారులను మచ్చిక చేసుకొని కోట్ల రూపాయల విలువైన భూములను దోచేశారు. వాటిపైనే ఇప్పుడు జిల్లా యంత్రాంగం ఫోకస్ పెట్టింది.

60 ఏళ్లుగా సేద్యం చేస్తున్నా.. హక్కులు తొలగించారు



నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో మా గ్రామం ముంపునకు గురి కావడంతో చిన్నాయిపాలెం తండాలో పునరావాసం కల్పించారు. 1962లో అప్పటి ప్రభుత్వం పట్టాలు అందజేసింది. 60 ఏళ్లుగా అక్కడే సేద్యం చేసుకుంటూ జీవిస్తున్నాం. ధరణికి ముందు వరకు బ్యాంకులో రుణాలు పొందాం. 2016 భూప్రక్షాళన సమయంలో మా భూములను పార్ట్–బీలో చేర్చడంతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందలేదు. అప్పటి నుంచి ప్రభుత్వ పథకాలు అందడం లేదు. బ్యాంకు రుణం తీసుకునే అవకాశం లేకుండాపోయింది.

– రమావత్ హనుమ, చెన్నాయపాలెం

మొత్తం రీసర్వే.. అక్రమ పట్టాల తొలగింపే లక్ష్యం



తిరుమలగిరి సాగర్ మండలంలోని అన్ని భూములపై రీసర్వే చేస్తున్నాం. అక్కడ చాలా సమస్యలు ఉన్నాయి. 100 ఎకరాల భూమి ఉంటే రికార్డుల్లో 200 ఎకరాలకు పేర్లు ఉన్నాయి. భూమి స్వాధీనంలో ఉన్న వారి పేర్లు ధరణిలో లేవు. ధరణిలో పేర్లు ఉన్నవారి స్వాధీనంలో భూములు లేవు. ఎవాక్యూ ప్రాపర్టీని కబ్జా చేసి పట్టాలు సృష్టించారు. అటవీ భూముల హద్దుల సమస్యలు ఉన్నాయి. వాటన్నింటినీ తేల్చి.. అర్హులకు పట్టాలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశం. అందుకే ఈ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఈ మండలంలోని ప్రతి సర్వే నంబరులోనూ విస్తృత సర్వే చేస్తున్నాం. ఆ భూమి ఎవరిదని తేల్చి, నకిలీ పట్టాలను రద్దు చేసి.. కబ్జాలో ఉన్న అసలైన అర్హుల పేరిట పట్టాలు ఇచ్చి, న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నాం.

– నారాయణరెడ్డి, నల్లగొండ జిల్లా కలెక్టర్

రుణమాఫీ కోసం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు



రుణమాఫీ కోసం రైతుల ఆందోళన

కామారెడ్డిలో ర్యాలీ.. కలెక్టరేట్ ఎదుట ధర్నా

వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో బ్యాంకుల వద్ద రైతుల రద్దీ

కామారెడ్డి క్రైం/తిరుమలగిరి (తుంగతుర్తి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి కొద్దిమందికి మాత్రమే చేసిన నేపథ్యంలో పంట రుణాలు మాఫీ కాని రైతులు ఎక్కడికక్కడ ఆందోళనలు చేస్తున్నారు. భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైతులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ధర్నా నేపథ్యంలో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతు సంఘాల ప్రతినిధులు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు లొంక వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, ప్రతినిధులు ఆనంద్‌రావు, నగేశ్‌తోపాటు భారీ ఎత్తున రైతులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఒకవైపు తిరుమలగిరి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తమకు రుణమాఫీ అయిందో...లేదో తెలుసుకునేందుకు మరోవైపు కొత్తగా రుణాలు తీసుకునేందుకు కూడా బ్యాంకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఉదయం నుంచే రైతులు బ్యాంకుల వద్ద వేచి ఉన్నారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంకులోకి ఒకేసారి రైతులు మూకుమ్మడిగా వెళ్లడంతో అద్దాలు పగిలిపోయాయి.

అన్నదాతలు ఆగం కావద్దు

అధికారులను మీ ఇంటికి పంపిస్తున్నాం

లోపాలను సరిచేసి రుణమాఫీ చేస్తాం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: రుణమాఫీ విషయంలో అన్నదాతలు అయోమయానికి గురికావద్దని.. రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.18 వేల కోట్లను 22 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్న నేపథ్యంలో ఒకేసారి రూ.31 వేల కోట్లు మాఫీ చేయడం కష్టమైనా తమ ప్రభుత్వం చేసి చూపిస్తోందన్నారు. రుణాలకు సంబంధించి 41,78,892 మంది రైతుల ఖాతాలను బ్యాంకులు ప్రభుత్వానికి పంపించాయని తెలిపారు. రూ.2 లక్షలకు పైన రుణాల మాఫీపై త్వరలోనే కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తుమ్మల వెల్లడించారు. కాగా, బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ రైతుల పేరు ఎత్తని కేటీఆర్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ వారిని ఆందోళనలోకి నెడుతున్నారని మండిపడ్డారు. అయితే, రైతులెవరూ అధైర్యపడవద్దని, అధికారులే నేరుగా ఇళ్లకు వచ్చి ఏమైనా లోపాలు ఉంటే సరిచేసి రుణమాఫీ చేస్తారని తెలిపారు. ఇప్పటికే బ్యాంకుల వారీ తప్పిదాలు, ఆధార్‌లో తప్పులు ఉన్న వారికి రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించామన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తున్నామని.. ఈ విషయంలో ప్రతిపక్షాలు లబ్ధి పొందాలనుకుంటే వారిని చరిత్ర వెంటాడుతుందని హెచ్చరించారు. గత ప్రభుత్వ కాలంలో రుణమాఫీ ఒక దోపిడీ మాదిరిగా జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తమ ప్రభుత్వం అలాంటి తప్పులు చేయదలచుకోలేదని మంత్రి వెల్లడించారు. బీఆర్ఎస్ నేతలు ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నా తొలిసారి రైతుల విషయమై మాట్లాడిన కేటీఆర్‌కు ధన్యవాదాలు చెబుతున్నట్లు తెలిపారు.

వేగంగా భూసేకరణ

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవహరించాలి. (రోడ్డు అలైన్‌మెంటు మ్యాప్‌ను గూగుల్ మ్యాప్‌తో బేరీజు వేసుకుంటూ ముఖ్యమంత్రి పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పులను సూచించారు). నేను సూచించిన మార్పులపై క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలి..' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

రోజువారీ సమీక్షలు నిర్వహించాలి

'ఆర్ఆర్ఆర్ పురోగతిపై రోజువారీ సమీక్షలు నిర్వహించాలి. భూ సేకరణ సహా ఇతర అన్ని అంశాలకు సంబంధించిన తాజా సమాచారాన్ని నాకు అందజేయాలి. ఉత్తర భాగం విషయంలో రోజువారీ పురోగతి, దక్షిణ భాగానికి భూసేకరణ ప్రక్రియ ప్రారంభానికి ఏర్పాట్లు, ఇతర అంశాల వివరాలను ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిరోజు సాయంత్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలపాలి. సీఎస్‌తో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అందులో అప్‌డేట్ చేయాలి. ఒక సమీక్ష సమావేశానికి, మరో సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పురోగతి తప్పనిసరిగా ఉండాలి..' అని రేవంత్ స్పష్టం చేశారు.

రేడియల్ రోడ్లపై ప్లాన్ సిద్ధం చేయాలి

ఫ్యూచర్ సిటీకి సంబంధించి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా సీఎం పలు సూచనలు చేశారు. 'రేడియల్ రోడ్లు ప్రధాన రహదారులతో ఏయే ప్రాంతాల్లో అనుసంధానం చేస్తే మెరుగ్గా ఉంటుందో, సిగ్నలింగ్ సహా ఇతర సమస్యలు ఎదురు కాకుండా ఉండాలంటే ఏం చేయాలో ప్లాన్ సిద్ధం చేయాలి. అవి ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల అనుసంధానానికి అనువుగా ఉండాలి. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు కానున్న వివిధ పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలి..' అని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన తదితరులు పాల్గొన్నారు.

15 నాటికి ఉత్తర భాగం భూసేకరణ పూర్తి: మంత్రి కోమటిరెడ్డి

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి సంబంధించిన మిగతా భూసేకరణ వచ్చేనెల 15 నాటికి పూర్తి చేసి కేంద్రానికి నివేదిస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. ఆ వెంటనే టెండర్ నోటిఫికేషన్ జారీ అవుతుందని అన్నారు. ట్రిపుల్ ఆర్ పై సీఎం సమీక్ష అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్–విజయవాడ (ఎన్.హెచ్–65) రోడ్డు పనులకు స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ ఆమోదం తెలిపిందని, రెండు నెలల్లో టెండర్లు పిలిచి నవంబర్ నాటికి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికే మన్నెగూడ ఎక్స్‌ప్రెస్‌వే పనులు ప్రారంభించామని, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలో పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రెండేళ్లలో రాష్ట్రంలోని జాతీయ, రాష్ట్ర రహదారులను గొప్పగా రూపొందిస్తామని, అవసరమైన సాయం కోసం త్వరలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో భేటీ కానున్నట్టు తెలిపారు.

పావుశాతం మాఫీతో వంద శాతం మోసం

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాలయం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

రైతులపై కేసులు పెట్టి వేధిస్తున్నారు..

''సీఎం రవ్వంత రుణమాఫీ చేసి కొండంత డబ్బా కొట్టుకుంటున్నారు. అసలు రైతులకు ఎంత మేర రుణం మాఫీ అయిందో కూడా సీఎం, మంత్రులకు తెలియనట్టుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూ.7,500 కోట్లు మాత్రమే రైతుల ఖాతాలో జమయ్యాయని చెప్తున్నారు. నిజంగా వంద శాతం రుణ మాఫీ అయి ఉంటే రైతులు ఎందుకు ఆందోళనలు చేస్తున్నారో సీఎం చెప్పాలి..'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతులు స్వచ్ఛందంగా ఎక్కడికక్కడ ఆందోళన చేస్తూ, బ్యాంకులను ముట్టడిస్తున్నారని.. రైతు రుణమాఫీ కోరుతున్న రైతులపై ఆదిలాబాద్ జిల్లా తలమడుగు, బజార్‌హత్నూర్‌లలో ప్రభుత్వం కేసులు పెట్టి వేధిస్తోందని మండిపడ్డారు. కేసులను ఉపసంహరించుకోని పక్షంలో రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి జైల్‌భరోకు పిలుపునిస్తామని చెప్పారు. లక్షలాది మంది రైతులను మోసం చేసిన ప్రభుత్వంపై చీటింగ్ కేసు నమోదు చేయాలన్నారు.

బజారు భాషకు వ్యతిరేకంగా పాలాభిషేకాలు

''తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నందుకు సీఎం రేవంత్ బజారు భాష మాట్లాడారు. ఆ బజారు భాషకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేసి రైతు ధర్నాను ప్రారంభించాలి'' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. సీఎం నియోజకవర్గం కొడంగల్‌లోని కోస్గి మండలంలో ఐదు బ్యాంకుల్లో కలిపి 20,239 రైతు ఖాతాలుంటే.. కేవలం 8,527 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని చెప్పారు. రైతు ద్రోహి ప్రభుత్వాన్ని వదిలిపెట్టకుండాం వెంటాడుతాం, వేటాడుతామని చెప్పారు.

రేవంత్ ఫామ్‌హౌజ్‌ను కూల్చివేయాలి

''జన్వాడలో నాకు ఎలాంటి ఫామ్‌హౌజ్ లేదు.. ఓ మిత్రుడి ఫామ్‌ను లీజుకు తీసుకున్నా. ఒకవేళ ఆ ఫామ్‌హౌస్ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కూల్చేయండి. ప్రభుత్వానికి దమ్ముంటే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి, మహేందర్‌రెడ్డి, వివేక్ వంటి కాంగ్రెస్ నాయకుల రాజభవనాలు కూడా కూల్చేయాలి. ఇప్పటికైనా హైడ్రా పేరుతో చేస్తున్న హైడ్రామా ఆపాలి..'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే అన్ని అక్రమ నిర్మాణాలను ఒకేరోజు కూల్చాలని.. రేవంత్‌రెడ్డి అధీనంలోని అక్రమ నిర్మాణాలను కూడా కూల్చి అందరికీ ఆదర్శంగా ఉండాలని కోరారు.



సెంట్రల్ లండన్‌లోని టవర్ బ్రిడ్జి వద్ద కనువిందు చేస్తున్న సూపర్‌మూన్

సీఎంకు పాపం తగలకూడదు

- అందుకే నేడు యాదగిరిగుట్టలో పూజలు: హరీశ్‌రావు
- అనంతరం ఆలేరు ధర్నాకు హాజరు కానున్న మాజీమంత్రి



సాక్షి, హైదరాబాద్: రైతులందరికీ ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేస్తానని దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మాటతప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆ పాపం తగలకుండా పూజలు చేస్తానని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి చేసిన పాపం రాష్ట్ర ప్రజలకు తగలకుండా ఉండేందుకు కూడా గురువారం యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకోనున్నారు. అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులతో కలసి పూజలు నిర్వహించ బోతున్నట్లు హరీశ్‌రావు బుధవారం ఓ ప్రకట నలో వెల్లడించారు. వ్యవసాయ రుణాలు రూ.49 వేల కోట్లు ఉన్నాయని ఒక్క ఏడాదిలో రూ.40వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం అన్నారని పేర్కొన్నారు. తర్వాత కేబినెట్ భేటీలో నిర్ణయించిన రూ.31వేల కోట్లు రుణమాఫీ చేస్తామని అందరి దేవుళ్ల మీద ఒట్లు వేసి, బడ్జెట్ కేటాయింపుల్లో రూ.26వేల కోట్లకు కుదించారని గుర్తు చేశారు. చివరికి ఆగస్టు15న రుణమాఫీ పూర్తయిందని చెప్పి కేవలం రూ.17వేల కోట్ల లెక్క తేల్చారని ధ్వజమెత్తారు. రుణమాఫీ పూర్తిగా జరగలేదని, మిగిలిన రూ.12 వేల కోట్లను కూడా విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారని, మరో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రూ.17 లక్షల మందికి మాత్రమే ఇంకా రుణ మాఫీ కాలేదని అంటున్నారని, ఇందులో ఎవరి మాట నిజమో తెలియక రైతులు గందరగోళానికి గురవుతున్నా రని విమర్శించారు. రుణమాఫీ కాక రైతులు వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకులు, కలెక్టరేట్ల చుట్టూ చెప్పులరిగేలా తిరుగు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు బాసటగా సీఎం రేవంత్‌ను నిలదీసేందుకు ఆలేరులో నిర్వహించే ధర్నాకు హాజరవుతున్నట్లు హరీశ్‌రావు తెలిపారు.

పోలీసులపై వివక్ష తగదు

రాష్ట్రంలోని పోలీస్ కానిస్టేబుళ్లకు సరెండర్, అదనపు సరెండ ర్ లీవ్ బెనిఫిట్ కింద అందించే డబ్బులను కొన్ని జిల్లాలకు మాత్రమే విడుదల చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తప్పుపట్టారు. కామారెడ్డి, నిజా మాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా ల్లోని సుమారు ఆరు వేల మంది కానిస్టేబుళ్లకు సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బెనిఫిట్‌ను గత 8 నెలలుగా పెండింగ్‌లో పెట్టారన్నారు. ఈ మేరకు ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బుధవారం బహిరంగ లేఖ రాశారు. కాగా, 'డెంగీ, మలే రియా వంటి జ్వరాలతో రాష్ట్రం వణుకుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని హరీశ్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పారిశుధ్య నిర్వహణ, ఆసుపత్రుల సన్నద్ధత వంటి అంశాలపై వెంటనే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని సూచించారు.

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మార్పు?

ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్‌భగేల్ వస్తారనే చర్చ.. నేడు లేదా రేపు ఢిల్లీకి సీఎం రేవంత్?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని మారుస్తారనే చర్చ తెలంగాణ కాంగ్రెస్‌వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఏఐసీసీలో మార్పులు త్వరలోనే జరుగుతాయని, అందులో భాగంగా సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జ్‌లతో సహా పలువురు ఏఐ సీసీ ప్రధాన కార్యదర్శులను మారుస్తారని తెలు స్తోంది. ఈ మార్పుల అనంతరం పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు మాజీ సీఎంలను ఇన్‌చార్జ్‌లుగా పంపే యోచనలో కాంగ్రెస్ అధి ష్టానం ఉన్నట్టు తెలుస్తోంది. మాజీ సీఎంల జాబితాలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్‌ను తెలంగాణ ఇన్‌చార్జ్‌గా పంపుతారని సమాచారం. ఈ మేరకు అతి త్వరలోనే మార్పులు జరుగుతా యని, తెలంగాణ ఇన్‌చార్జ్ మార్పుపై కాంగ్రెస్ పెద్దలతో చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి గురువారం లేదా శుక్రవారం ఢిల్లీ వెళ్లనున్నట్టు గాంధీభవన్‌వర్గాలు చెప్పాయి.

బంగారు తెలంగాణ రాలేదు..

ప్రజాపాలన రాలేదు

▶ మొదటి పేజీ తరువాయి

6 గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మభ్యపెట్టిందని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

త్వరలో కమిటీలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తారని కిషన్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో సుమారు 77 లక్షల మంది ఓటర్లు బీజేపీకి మద్దతునిచ్చారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు వేసి, వాటి నేతృత్వంలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

రైతులు, మహిళలు, యువత లక్ష్యంగా సభ్యత్వ నమోదు

అక్టోబర్‌లో దేశ వ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ సేకరణ ప్రారంభమవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. రాష్ట్రంలో మరింత బలమైన శక్తిగా ఎదగడానికి ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకుంటామన్నారు. ఈసారి రైతులు, మహిళలు, యువత ప్రధాన లక్ష్యంగా సభ్యత్వం ఉంటుందని చెప్పారు. సమావేశాలు, వర్క్ షాపులతో పోలింగ్ బూత్ స్థాయి నుంచి సభ్యత్వ నమోదు చేస్తామన్నారు. సభ్యత్వ నమోదుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా కార్యాచరణ ఉండాలని చెప్పారు. కాగా బుధవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు వర్క్‌షాపులో మాట్లాడుతూ..'పార్లమెంటు ఎన్నికల్లో అపూర్వ రీతిలో ప్రజల నుంచి మద్దతు కూడగట్టాం. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ మరింత బలపడేలా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..' అని కిషన్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్, బీజేపీ జాతీయ కార్యదర్శి విజయ రాహత్కర్ , పార్టీ నేతలు డా.కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, ఏవీఎన్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్ తివారి, ఎన్.రామచంద్రరావు పాల్గొన్నారు.

'హైడ్రా' వెనుక కలెక్షన్ల దందా

- మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల ఖర్చుకు కలెక్షన్ల కోసమే దాడులు
- కేంద్ర మంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: 'హైడ్రా దాడుల వెనుక తతంగం వేరే ఉంది. అంతా కలెక్షన్ల దందానే'అని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గుంట, రెండు గుంటల్లో ఇళ్లు కట్టుకుంటే కూల్చివేస్తున్న అధికారులు.. ఎకరాల కొద్దీ భూముల్లో ఫాంహౌస్‌లు కట్టుకున్న వాళ్లవి ఎందుకు కూల్చడం లేదు? అని ప్రశ్నించారు. 'కబ్జాల్లో ఎక్కువగా కాంగ్రెస్ నేతలవే ఉన్నాయి. మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాల్లో ఎన్నికల ఖర్చుకు కలెక్షన్ల కోసమే ఈ దందా. హైడ్రా అధికారి రంగనాథ్‌ది ఏముంది? రాసిచ్చిందే చదువుతారు. ఆయన గతంలో నాపై కూడా కేసు పెట్టారు'అని వ్యాఖ్యానించారు. బుధవారం బీజేపీ సభ్యత్వనమోదు వర్క్‌షాపు సందర్భంగా సంజయ్ మీడియాతో మాట్లాడుతూ..'ఇకనైనా విగ్రహాల లొల్లి బంద్ చేయాలి. ప్రజా సమస్య లపై దృష్టి పెట్టాలి. మాకు కూడా మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఉంది. కానీ దీనిపై ఇప్పుడు చర్చ పెట్టడం లేదు. ఇప్పుడు కావాల్సింది 6 గ్యారంటీల అమలు. దీనిపై చర్చ పెట్టాలి'అని డిమాండ్ చేశారు. 38 ఎమ్మెల్యేలున్నా పోటీ ఎందుకు చేయలేదు? 'కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న రాజ్యసభ అభ్యర్థి అభిషేక్ సింఘ్వీ బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల ఉమ్మడి అభ్యర్థి. అతిత్వరలో కాంగ్రెస్‌లో బీఆర్ ఎస్ విలీనం తథ్యం'అని సంజయ్ అన్నారు. కాంగ్రెస్ రాజ్య సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాయకుడు.. కేసీఆర్ కుమార్తె కవితకు లిక్కర్ కేసులో బెయిల్ ఇప్పించేందుకు ప్రయత్నం చేసి కోర్టులో వాదన లు వినిపించారు. అందుకే కేసీఆర్ సూచన మేరకు కాంగ్రెస్ అభ్యర్థిగా సింఘ్వీని ప్రకటించారు'అని తెలిపారు. 'ఈరోజు రాజ్యసభ నామి నేషన్లకు చివరి రోజు. 38 మంది ఎమ్మెల్యేలున్న బీఆర్ఎస్ ఎందుకు పోటీ చేయడంలేదో సమాధానం చెప్పాలి'అని డిమాండ్‌చేశారు. 'బీఆర్ఎస్ పోటీ పెట్టి ఉంటే రాజ్యసభ సీటు గెలిచేది. కాంగ్రెస్ సభ్యుల్లో పెద్ద ఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగేది. మాకున్న సమాచారం మేరకు.. దాదాపు 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నారు'అని అన్నారు.

ఇంజనీరింగ్ విద్యను లైట్‌గా తీసుకుంటున్న యువత

ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, సెమినార్ల ఊసే ఎత్తని విధానం

విదేశాల్లో ఉద్యోగాల సాధనలో తప్పని ఎదురీత

ఆ స్కిల్స్ ఏవీ?



సాక్షి, హైదరాబాద్ : భారత్‌లో ఇంజనీరింగ్ విద్యను లైట్‌గా తీసుకున్న విద్యార్థులు..ఎంఎస్ చేయడానికి విదేశాలకు వెళ్లాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీటెక్‌లో ముఖ్యమైన నైపుణ్య మెళకువలపై దృష్టి పెట్టకపోవడం అక్కడ చాలామంది స్కిల్ ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు ఇండియాలో సరిగ్గా పూర్తి చేయకపోవడంతో విదేశీ ఉద్యోగాలు చేజిక్కడం లేదు. ఇంజనీరింగ్‌లో సెమినార్‌ను లైట్‌గా తీసుకోవడం వల్ల విదేశాల్లో కమ్యూనికేషన్ నైపుణ్యం ప్రదర్శించలేక పోతున్నారు. ఎంఎస్ కోసం ఏటా 7.50 లక్షల మంది భారతీయులు విదేశాలకు వెళుతున్నారు. వీరిలో 1.90 లక్షల మంది హైదరాబాద్ నుంచి వెళ్లేవారే. ఇందులోనూ అత్యధికంగా అమెరికాకు 90 వేలకుపైగా వెళుతున్నారు. లీప్ స్కాలర్స్ అధ్యయనం ప్రకారం అమెరికాలో వివిధ దేశాలకు చెందిన 2.25 లక్షల మంది ఏటా స్కిల్ ఉద్యోగాలు పొందుతుంటే, తెలంగాణ విద్యార్థుల వాటా 8 వేలకు మించడం లేదు. మిగతా వారంతా అన్‌స్కిల్డ్, పార్ట్‌టైం ఉద్యోగాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇంజనీరింగ్ విద్యలో నైపుణ్యాలపై దృష్టి పెట్టకపోవడమే ఈ పరిస్థితికి కారణమని ప్రవాస భారతీయులు అంటున్నారు.

కలివిడితనమే కీలకం

ఎంఎస్ తర్వాత విదేశాల్లో ఉద్యోగం పొందాలంటే కలివిడిగా దూసుకెళ్లడం కీలకం. ఇంటర్వ్యూలు, సెమినార్లు, గ్రూప్ డిస్కషన్స్‌కు విదేశీ సంస్థలు ప్రాధాన్యమిస్తాయి. నాయకత్వ లక్షణం ఉంటేనే ప్రాజెక్టు ముందుకెళుతుందనే భావనతో ఉంటాయి. చాలామందిలో ఈ లోపం కనిపిస్తోందని యూఎస్‌లో లీడింగ్ సంస్థలో సాఫ్ట్‌వేర్ నిపుణుడు నీరజ్ పంకజ్ తెలిపారు. అమెరికా వస్తున్న భారతీయ విద్యార్థులకు స్థానిక వసతి, రవాణా, మార్కెట్లు, కరెన్సీ వంటి అంశాలపై కూడా ఆరునెలల వరకూ అవగాహన ఉండటం లేదని తెలిపారు. కేవలం కన్సల్టెన్సీలనే నమ్ముకుంటున్నారని, ఇతరులతో పరిచయాలు పెంచుకునే నైజం ఉండటం లేదన్నారు. ఇంజనీరింగ్‌లో ఇంటర్న్‌షిప్‌లు, గ్రూప్ డిస్కషన్స్‌లో పాల్గొంటే, సెమినార్లు తరచు చేస్తూ ఉంటే ఈ సమస్య ఉండదన్నారు.

ఏకాగ్రతను దెబ్బతీసే అలవాటు

మనకు, ఇతర దేశాలకు వాతావరణ పరిస్థితుల్లో చాలా తేడాలుంటాయి. సంస్కృతి, భాష వంటకాల్లో కూడా అంతే. ఈ అసౌకర్యంతో చాలా మంది విద్యార్థుల ఏకాగ్రత దెబ్బ తింటోంది. హోమ్‌సిక్ బారిన పడుతున్నారు. మనవారు సాధారణంగా టూరిస్ట్ గైడ్, టీచింగ్ అసిస్టెంట్, లైబ్రరీ మానిటర్, గిగ్ మార్కెట్‌లో పనిచేస్తుంటారు. ఇవన్నీ పార్ట్‌టైం ఉద్యోగాలే. వాస్తవానికి ఇండియాలో ఉన్నప్పుడు అసలీ రంగాలపైనే వారికి అవగాహన ఉండటం లేదని, ఇతర దేశాలకు వెళ్లి నేర్చుకోవడం కష్టంగా ఉంటోందని ఆస్ట్రేలియాలో ఉంటున్న ప్రవాస భారతీయుడు ఆదిత్య తెలిపారు. ఈ అసౌకర్యం వల్ల ప్రధానమైన స్కిల్ ఉద్యోగాలపై ఏకాగ్రత తగ్గుతోందన్నారు. వీసా గడువు పూర్తయ్యే నాటికి కూడా మంచి ఉద్యోగం పొందే స్కిల్ ఉండటం లేదని చెప్పారు.

ఆ నిర్లక్ష్యంతోనే ఒత్తిడి

ఎంఎస్ కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థి ఏకకాలంలో ఎన్నో పనులు చేయాలి. క్లాసులకు హాజరవ్వాలి. అసైన్‌మెంట్లు, గ్రూప్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి. ఇంకోవైపు పార్ట్‌టైం ఉద్యోగమూ చేయాలి. వాస్తవానికి ఇవన్నీ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుతాయి. ఇంజనీరింగ్ చేసేప్పుడూ ఇవన్నీ ఉంటాయి. కానీ మనవారు పట్టించుకోవడం లేదని కెనడాలో ఉంటున్న హైదరాబాద్‌వాసి సాయిచరణ్ తెలిపారు. విదేశాల్లో ఇవన్నీ ఏకకాలంలో చేయాల్సి రావడంతో ఒత్తిడికి గురవుతున్నారు. ప్రణాళికాబద్ధమైన జీవన విధానం దెబ్బతింటోందన్నారు. సామాజిక అవగాహనతో ఇంజనీరింగ్ విద్య చేసేవారు ఈ ఒత్తిడికి దూరంగా ఉంటున్నారు. అంతర్జాతీయంగా వస్తున్న ఆవిష్కరణలు, వాటిపై జరిగే సెమినార్లలో పాల్గొంటే ఈ సమస్య ఉండదని నిపుణులు చెబుతున్నారు.

ఏ దేశానికి భారతీయులు ఎంత మంది?

దేశం	విద్యార్థులు
అమెరికా	1,90,512
కెనడా	1,85,995
యూకే	1,32,709
ఆస్ట్రేలియా	59,044
జర్మనీ	20,684
సింగపూర్	17,085

ఈ జాగ్రత్తలు అవసరం

నాణ్యమైన విశ్వవిద్యాలయం నుంచి వచ్చే విద్యార్థులకే విదేశీ ఉద్యోగాలు తేలికగా లభిస్తున్నాయి. అక్కడే వివిధ అంశాల బోధనకు అవసరమైన వాతావరణం ఉంటుంది. ఇందులోనే పరిశోధన ఉంటుందని నమ్ముతున్నాయి. జ్ఞానాన్నీ, తార్కిక ఆలోచనా నైపుణ్యాన్నీ పెంచుకునే అవకాశాలు విద్యార్థులకు విస్తృతంగా ఉంటాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని మార్కెట్‌లో రాణించే మెళకువలు ఇంజనీరింగ్ నుంచే అభివృద్ధి చేసుకోవాలని నిపుణులు అంటున్నారు. తరగతిగదిలో లెక్చరర్లు బోధించే సమయం, వారానికి కొన్ని గంటలపాటు పరిమితంగానే ఉంటుంది. కానీ ఆ తర్వాత నేర్చుకోవడం, అవసరమైన సమాచారాన్ని సేకరించగలగడమే విదేశీ విద్య తర్వాత రాణించడానికి మార్గం సుగమం చేస్తుంది.

కొన్నేళ్లుగా విదేశాలకు వెళ్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య

సంవత్సరం	సంఖ్య
2018	5,18,015
2019	5,86,337
2020	2,59,655
2021	4,44,553
2022	7,50,365
2023	7,56,435
2024	7,75,692

ప్రజలతో మర్యాదగా మెలగండి

ట్రైనీ ఎస్‌ఐలకు డీజీపీ జితేందర్ సూచన



సాక్షి, హైదరాబాద్: ప్రజలతో మర్యాదపూర్వకంగా, బాధితులపై సానుభూతితో వ్యవహరించాలని ట్రైనీ ఎస్‌ఐలకు డీజీపీ జితేందర్ ఉద్బోధించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 547 మంది ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన కాసేపు మాట్లాడారు. అకాడమీలో అందుతున్న శిక్షణ, కల్పిస్తున్న మౌలిక వసతులు తదితర అంశాలను డీజీపీ జితేందర్, అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్‌తో బుధవారం కలిసి పరిశీలించారు. అనంతరం ట్రైనీ ఎస్‌ఐలను ఉద్దేశించి మాట్లాడారు. అకాడమీలో అందుతున్న శిక్షణపై డీజీపీ ప్రశ్నించగా.. ట్రైనీ ఎస్‌ఐలు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డి.మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సి.నర్మద, సునీత మోహన్ పాల్గొన్నారు.

వ్యవసాయ కోర్సుల దరఖాస్తుకు గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో వివిధ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు తేదీని ఈనెల 29 వరకు పొడిగించారు. ఈ మేరకు జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి తెలిపారు. తొలి విడతలో దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.pjtsau.edu.inను సందర్శించాలని సూచించారు.

కేజీబీవీల్లో బదిలీలకు దరఖాస్తు

సాక్షి, హైదరాబాద్: కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో తాత్కాలిక, కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న సిబ్బంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ కోరింది. స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, ఏఎన్‌ఎంలు, అకౌంటెంట్లు, పీఈటీలు దరఖాస్తులు చేసుకోవాలని కోరింది. https://schooledu.telangana.gov.in/ISMS వెబ్‌సైట్లో గురు, శుక్రవారాల్లో తమ అభ్యర్థనను పంపుకోవాలని సూచించింది.

ఇంజనీరింగ్ సీట్ల స్లైడింగ్ షురూ

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో అంతర్గత సీట్ల స్లైడింగ్ ప్రక్రియ మొదలైంది. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా కళాశాలల వారీగా స్లైడింగ్‌కు అందుబాటులో ఉన్న వివిధ బ్రాంచీల్లోని సీట్లను సాంకేతిక విద్యా విభాగం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. మూడో దశలో భర్తీ చేయని సీట్లు, ఈ దశలో సీట్లు వచ్చినా విద్యార్థులు చేరకపోవడంతో 11, 836 సీట్లు మిగిలాయి. గురువారం వరకూ ఈ అవకాశం కల్పిస్తారు.

ఓపెన్ వర్సిటీ ప్రవేశాల గడువు 31

ఉస్మానియా యూనివర్సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ప్రవేశాల గడువును ఆగస్టు 31 వరకు పొడిగించారు. డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. డిగ్రీ లో 2016-17 నుంచి 2023-24 వరకు ద్వితీయ సంవత్సరం పూర్వ విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు. గతంలో డిగ్రీ పూర్తి చేయలేక పోయిన పూర్వవిద్యార్థులు వర్సిటీ కార్యాలయం ద్వారా ఆన్‌లైన్‌లో పునః ప్రవేశాలు పొందాలని కోరారు. వివరాలకు ఓపెన్ వర్సిటీ వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

పాత మొబైల్ ఫోన్లతో సైబర్ నేరాలు

ఫోన్లు కొని ముఠాకు చేరవేస్తున్న ముగ్గురి అరెస్టు

- నాలుగు వేల మొబైల్ ఫోన్లు స్వాధీనం
- పాత ఫోన్లు అపరిచితులకు అమ్మితే ముప్పే: టీజీ సీఎస్‌బీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు

సాక్షి, హైదరాబాద్: డబ్బులు, ప్లాస్టిక్ వస్తువులు ఇచ్చి ప్రజల నుంచి పాత, వినియోగంలో లేని మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసి సైబర్ నేరాలకు వాడుతున్న కేటుగాళ్ల ముఠాను రామగుండం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీ సీఎస్‌బీ) అధికారులు అరెస్టు చేశారు. పట్టుబడిన ముగ్గురు నిందితుల వద్ద నుంచి ఏకంగా 4 వేల పాత మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన మొబైల్ ఫోన్లను బిహార్‌లోని కొందరికి ఎగుమతి చేస్తున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. సేకరించిన పాత మొబైల్ ఫోన్లను రిపేర్ చేసి వాటిని జామ్‌తార, దియోగఢ్‌లోని సైబర్ నేరగాళ్లకు సరఫరా చేస్తున్నట్టు నిందితులు వెల్లడించారు. వారిని బిహార్‌కు చెందిన మహ్మద్ షమీమ్, అబ్దుల్ సలామ్, మహ్మద్ ఇఫ్తికర్‌గా గుర్తించారు. నిందితులపై రామగుండం సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఐటీ యాక్ట్ 66 డీ, బీఎన్‌ఎస్‌ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు టీజీ సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖాగోయల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇలా చిక్కారు..

బిహార్‌కు చెందిన కొందరు వ్యక్తులు పట్టణంలో తిరుగుతూ పాత మొబైల్ ఫోన్లను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్టు రామగుండం సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ సిబ్బందికి విశ్వసనీయ సమాచారం అందింది. వారు గోదావరిఖనిలో తనిఖీ చేయగా ముగ్గురు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 4 వేల పాత మొబైల్ ఫోన్లు పట్టుబడ్డాయి. గత నెల రోజులుగా రామగుండంతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి పాత మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసి బిహార్‌లోని తమ ముఠాలకు చేరవేసినట్టు నిందితులు అంగీకరించారు. కాగా అపరిచిత వ్యక్తులకు పాత మొబైల్ ఫోన్లను విక్రయించవద్దని శిఖాగోయల్ సూచించారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు మొబైల్ ఫోన్ పాత యజమాని డివైస్ ఐడెంటీనే పోలీసుల దర్యాప్తులో బయటకు వస్తుందని, దీనివల్ల చిక్కుల్లో పడతారని హెచ్చరించారు.

మహిళల భద్రతకు ప్రత్యేక నిధి!

మంత్రులు, ఉన్నతాధికారులతో కోర్‌కమిటీ ఏర్పాటు: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: పని ప్రదేశంలో మహిళలు ధైర్యంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందని మంత్రి సీతక్క వెల్లడించారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరుగుతున్న ఘటనలతో మహిళలు భయాందోళనకు గురవుతున్నారని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మహిళలపై దాడులు చేసిన వారికి వెంటనే శిక్ష అమలయితేనే ఇలాంటి ఘటనలు తగ్గుతాయని మంత్రి అభిప్రాయపడ్డారు. మహిళల భద్రతపై బుధవారం సచివాలయంలో మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. మహిళలపై హింస పెరగడానికి డ్రగ్స్, గంజాయి కూడా కారణమవుతున్నాయని వివరించారు. ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల్లో షీ టీమ్స్ గస్తీ పెంచుతామన్నారు. పబ్లిక్ ప్లేసుల్లో, ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలను పెంచుతామన్నారు. మంత్రులు, ఉన్నతాధికారులతో కోర్ కమిటీని ఏర్పాటు చేస్తామని, అన్ని శాఖల్లో త్వరలో ఉమెన్ సేఫ్టీ కమిటీలు నియమిస్తామని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రతి శాఖకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించే అంశాన్ని తమ ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. మహిళా ఉద్యోగుల భద్రతపై ప్రతీ కార్యాలయంలో కమిటీలు ఏర్పాటు చేయాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద సూచించారు.

బచ్‌పన్ బచావోతో కలసి పనిచేస్తాం..

బాల కార్మికులు, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న బచ్‌పన్ బచావో ఆందోళన్ ప్రతినిధుల బృందం బుధవారం సచివాలయంలో మంత్రి సీతక్కతో సమావేశమయింది. నోబెల్ అవార్డు గ్రహీత కై లాశ్ సత్యార్థి నేతృత్వంలో బచ్‌పన్ బచావో ఆందోళన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సంపూర్ణ బెహరా, ధనుంజయ్ తింగాల్, ప్రతినిధులు వీఎస్ శుక్లా, చందన, వెంకటేశ్వర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బచ్‌పన్ బచావో ఆందోళన్‌తో రాష్ట్ర ప్రభుత్వం కలసి పనిచేస్తుందని తెలిపారు.

'పదోన్నతులివ్వకపోతే ఆందోళనే'

సాక్షి, హైదరాబాద్: అన్ని అనుమతులు వచ్చినప్పటికీ తమకు న్యాయంగా రావాల్సిన పదోన్నతులు శనివారంలోగా ఇవ్వకపోతే ఆందోళన తప్పదని ఆర్థిక శాఖ సచివాలయ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొందరు వ్యక్తుల కారణంగా ఏళ్ల తరబడి తమ పదోన్నతులు నిలిచిపోయాయని వెంటనే ప్రమోషన్లకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ సచివాలయ ఉద్యో గుల సంఘం అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌రెడ్డి, చైర్మన్ నాగరాజు, సలహాదారు రవీందర్, మహిళా అధ్యక్షురాలు లావణ్యలత తదితరులతో కలసి ఆర్థిక శాఖ ఉద్యోగులు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కలసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన రామకృష్ణారావు శనివారం నాటి కల్లా అన్ని ఫైళ్ల క్లియర్ చేసి పదోన్నతులు కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.



మనిషికి తాను ఏ తీరం చేరాలో తెలియకపోతే,
ఏ గాలీ అతడికి అనుకూలంగా ఉండదు.
– సెనెకా

సాక్షి
గురువారం, 22 ఆగస్టు 2024

సుప్రీమ్ 'అభయ'మ్!

హేయమైన కోల్‌కతా హత్యాచార ఘటనపై సర్వోన్నత న్యాయస్థానం స్వచ్ఛందంగా జోక్యం చేసుకోవడం వ్యవస్థలపై సడలుతున్న నమ్మకాన్ని కాస్త నిలబెట్టింది. విధినిర్వహణలోని వైద్యశిక్షణార్థి జీవితాన్ని చిదిమేసిన ఆగస్ట్ 9 నాటి ఉదంతంతో వైద్యసేవకుల భద్రత, ఇతర అంశాలకు సంబంధించి సిఫార్సులు చేసేందుకు నేషనల్ టాస్క్‌ఫోర్స్ (ఎన్‌టీఎఫ్)ను సుప్రీమ్ కోర్టు మంగళవారం ఏర్పాటు చేసింది. సంతృప్తి చెందక జాతీయస్థాయిలో జూనియర్ డాక్టర్లు నిరసనలు కొనసాగిస్తున్నా అసలంటూ రోగాన్ని గుర్తించి, మందు కనుగొనే ప్రయత్నమైనా జరుగుతున్నందుకు సంతోషించాలి. ప్రముఖ డాక్టర్ల సారథ్యంలోని ఈ టాస్క్‌ఫోర్స్ మహిళలు సురక్షితంగా పని చేసేందుకు చేపట్టాల్సిన సమూల సంస్కరణలపై సిఫార్సులు చేయనుంది. కోర్ట్ ఆదేశించినట్టు మూడు వారాల్లో మధ్యంతర నివేదిక, రెండు నెలల్లో తుది నివేదిక సమర్పించాల్సి ఉంది.

దేశంలో నూటికి 80 ప్రజారోగ్య వసతుల్లో నిర్ణీత ప్రమాణాలైనా లేవని జాతీయ హెల్త్ మిషనే చెబుతోంది. ఈ పరిస్థితుల్లో పనిప్రదేశంలో సురక్షిత వాతావరణ కల్పనకు ఒక విధాన ఏర్పాటుకు జాతీయ వైద్యసంఘం గత వారమే వైద్యకళాశాలలకూ, ఆస్పత్రులకూ నోటీసిచ్చింది. వైద్యులకు విశ్రాంతి గదులు, నిఘాకు సీసీ టీవీలు కరవైన మన ఆరోగ్య వ్యవస్థకు ఇప్పుడు టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల చికిత్స చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగానే ఆడవాళ్ళు నైట్‌డ్యూటీలలో లేకుండా చూడాలని బెంగాల్ సర్కార్, ఒకవేళ డ్యూటీలో ఆడవాళ్ళుంటే వారికి తోడుండేలా చూడాలని కేంద్ర సర్కార్ సూచనలివ్వడం విడ్డూరం. శ్రామిక శక్తిలో మహిళా భాగస్వామ్యం తక్కువున్న దేశంలో దాన్ని మరింత తగ్గించే ఇలాంటి ఆదేశాలు తిరోగమన ఆలోచనా ధోరణికి అద్దం పడుతున్నాయి.

కోల్‌కతా 'అభయ' ఘటన, చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం చేతగానితనంపై దేశమంతటా ప్రజాగ్రహం పెల్లుబుకుతుంటే... పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ యంత్రాంగం దృష్టి అంతా విమర్శకుల నోళ్ళు మూయించడంపై ఉండడం విషాదం. నిరసనకారులపై 'రాజ్యాధికారం' ప్రయోగించే కన్నా దేశవ్యాప్తంగా లోలోపలి భావోద్వేగాలు బయటపడుతున్న వేళ వారితో మరింత సున్నితంగా వ్యవహరించాలని సాక్షాత్తూ సుప్రీమ్ కోర్ట్ హితవు చెప్పాల్సి వచ్చింది. అదే సమయంలో – ఘటన జరిగిన ఆర్జీ కార్ ఆస్పత్రికి అప్పట్లో ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన వ్యక్తిపై తీవ్రమైన ఆరోపణలున్నా ప్రభుత్వ పెద్దలు ఆయనను కాపాడాలని చూడడం నీచం. సదరు వ్యక్తి మానవ అక్రమ రవాణాకూ, బలవంతపు వసూళ్ళకూ పాల్పడినట్టు ఆయన మాజీ సహచరులే ఆరోపిస్తున్నారు. ఇక, ఆస్పత్రిలో సాగిన అవినీతి, అక్రమాలపై కథనాలైతే కొల్లలు. అటు సీబీఐ దర్యాప్తు, ఇటు సుప్రీమ్ సొంత చొరవతో కేసులో ఇంకెన్ని లోతైన అంశాలు బయటపెడతాయో తెలీదు. ఇక, తాజాగా ఆసుపత్రికి భద్రతగా సీఐఎస్ఎఫ్ దళాల పహారా పెట్టాల్సి రావడం పోగొట్టుకున్న నమ్మకానికి పరాకాష్ఠ.

అసలు మన దేశంలో ప్రతి వంద మంది డాక్టర్లలో 75 మంది సాధారణంగా రోగులు, వారి బంధువుల నుంచి ఏదో ఒక విధమైన హింస, దాడులను ఎదుర్కొన్నవారే. అమెరికాలో ఆ సంఖ్య 47 శాతమే. ఇలాంటి అనేక కారణాల రీత్యానే రెండేళ్ళ క్రితం 2022లో ప్రవేశపెట్టిన 'ఆరోగ్య వృత్తి నిపుణులు, సంస్థలపై హింసా నిరోధక బిల్లు'ను తక్షణం ఆమోదించి, అమలు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది. నిజానికి, 2007 నుంచి మన దేశంలో మెడికల్ ప్రొటెక్షన్ యాక్ట్ (ఎంపీఏ) ఉంది. 23 రాష్ట్రాలు దాన్ని తమదైన రూపంలో అమలు చేస్తున్నాయి. ఆరోగ్య సేవకుల భద్రత నిమిత్తం అలా ఇప్పటికే చట్టాలున్నా ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయన్నది వేరే కథ. పైగా, ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకం శిక్ష. అంతటా ఒకే విధమైన నమూనా చట్టం అమలయ్యేలా చూడాల్సి ఉంది.

అయితే, కేవలం చట్టాలతో పరిస్థితి చక్కబడుతుందనీ, దాడుల నుంచి వైద్యులను కాపాడగలమనీ అనుకోవడం కూడా పొరపాటే. ప్రజారోగ్య సేవకుల భద్రత అనేది దీర్ఘకాలిక ప్రణాళికతో సాగాల్సిన ప్రభుత్వ విధానం. ముమ్మొందుగా ఉన్నతమైన వైద్యవృత్తికీ, వైద్యులకూ సమాజంలో గౌరవం ఇనుమడించే వాతావరణం పెంపొందించాలి. రోగులకు ప్రాణదాతలై రాత్రీ పగలూ లేకుండా శ్రమించే వైద్యులకు జీతభత్యాలే కాదు... మెరుగైన పని పరిస్థితులు కల్పించడం కనీస బాధ్యత. ఆరోగ్య రంగానికి నిధుల పెంపుతో పాటు 'అభయ' లాంటివారు 36 గంటలు ఆపకుండా పని చేయాల్సిన అవస్థ తప్పించేలా తగినంతమంది వైద్య సిబ్బందిని తీసుకోవాలి. ప్రభుత్వాలు, వైద్య సంస్థలు సమష్టిగా దీని మీద దృష్టి పెట్టాలి. సుప్రీమ్ చెప్పినట్టు ఆస్పత్రుల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్) వర్తిస్తుందని గుర్తించాలి. ఇవాళ్టికీ జూనియర్ డాక్టర్లు అమానవీయ పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తున్న తీరును గుర్తించి, ముందు అక్కడ నుంచే మార్పు మొదలుపెట్టాలి.

కోల్‌కతా ఘటనపై ఆందోళన ఆగక ముందే, మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో బడిలో చదువుకుంటున్న ఇద్దరు కిండర్‌గార్టెన్ చిన్నారుల్ని కాపలాదారు రూపంలోని ఓ మానవ మృగం కాటేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. కుళ్ళిన వ్యవస్థలోని విలువల పతనాన్ని మరోమారు నగ్నంగా నిలబెట్టింది. ఈ వరుస ఘటనలు ఆందోళనతో పాటు సత్వర కార్యాచరణ అవసరాన్ని పెంచుతున్నాయి. 'బాగా చదువుకోవాలి. బంగారు పతకం సాధించాలి. పెద్ద ఆసుపత్రుల్లో పనిచేయాలి. అమ్మానాన్నల్ని బాగా చూసుకోవాలి' అంటూ డైరీలో ఆఖరిరోజున సైతం రాసుకున్న ఓ మధ్యతరగతి అమ్మాయి కలల్ని చిదిమేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాల్సిందే. ఈ ఘటనలకు మూలకారణమవుతున్న వ్యవస్థాగత లోపాల్ని సరిదిద్దాల్సిందే! సుప్రీమ్ తీసుకున్న చొరవ, పాలకుల చర్యలు అందుకు దోహదపడితేనే అభం శుభం తెలియని 'అభయ'లెందరికో ఆత్మశాంతి.

నేర్చుకోవలసిన పొరుగు పాఠాలు

విశ్లేషణ



నిరుపమా సుబ్రమణియన్

ఈ సంవత్సరం జనవరి – మార్చి మధ్య కాలంలో క్షీణస్థాయికి చేరుకున్న సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి భారత్, మాల్దీవులు నిశ్శబ్దంగా పని చేస్తున్నాయి. ఒకరికొకరు అవసరమని ఇరుపక్షాలూ గ్రహించాయి. మాల్దీవుల ఆర్థిక వ్యవస్థకు భారత ప్రాముఖ్యం ఎంతో ఉందని ఆ దేశ ఆర్థిక మంత్రి పేర్కొనడం గమనార్హం. విదేశాల్లోని ప్రభుత్వాలను 'ఢిల్లీ మిత్రుడు' లేదా 'భారత వ్యతిరేకి' అనే పరిమితార్థంలో వర్ణించడం మన అభద్రతా భావాలనే వెల్లడిస్తుంది. ఉదాహరణకు బంగ్లాదేశ్‌లో చాలా ఎక్కువగా ప్రచారమైన భారత్, షేఖ్ హసీనా 'స్నేహం' ప్రస్తుత భారత్, బంగ్లా ద్వైపాక్షిక సంబంధాలను రిస్కులో పడేసింది. ప్రజాస్వామ్య దేశాల్లో ప్రభుత్వ మార్పు అనివార్యం కాబట్టి, ప్రతిపక్ష పార్టీలకు కూడా దౌత్యపరంగా చేరువకావడం ముఖ్యం.

ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవం కోసం మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు ఢిల్లీకి విచ్చేసిన రెండు నెలల తర్వాత, ఆగస్టు నెల ప్రారంభంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాలే పర్యటనకు వెళ్లివచ్చారు. మాల్దీవుల నుండి భారత్ తన సైనిక సిబ్బందిని ఉపసంహరించుకోవలసి వచ్చింది. కానీ, ఈ ద్వీపసమూహానికి చెందిన పర్యాటక, దిగుమతుల ఆధారిత ఆర్థిక వ్యవస్థ... నిండా మునిగిపోతోంది. గత నెలలో, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు ప్రభుత్వ ఖర్చుల్లో కోతలను ప్రకటించారు. దీంతో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి. ఆర్థిక కష్టాల నుంచి బయట పడటానికి మాల్దీవులకు ఢిల్లీ అవసరం. కాగా, మాల్దీవుల వ్యూహాత్మక ప్రాముఖ్యత గురించి కేంద్ర ప్రభుత్వానికి బాగా తెలుసు. మాలే అభ్యర్థన మేరకు, 5 కోట్ల డాలర్ల ట్రెజరీ బిల్లు గడువును మరో ఏడాది పాటు ఢిల్లీ పొడిగించింది.

ఒక నెల తర్వాత మాల్దీవుల నుంచి కృతజ్ఞతా పూర్వకమైన సందేశం వచ్చింది. తన చైనా పర్యటన సమయంలో, మాల్దీవుల ఆర్థిక అభివృద్ధి, వాణిజ్య మంత్రి మహమ్మద్ సయీద్ ఒక టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, మాల్దీవుల ఆర్థిక వ్యవస్థకు భారతదేశ ప్రాముఖ్యత ఎంతో ఉందని పేర్కొన్నారు. దీన్ని ఈ జనవరి నెలలో బీజింగ్‌లో ముయిజ్జు చేసిన 'భారతదేశం మా సార్వభౌమత్వానికి ముప్పు' ప్రకటన నుండి 180 డిగ్రీల మలుపుగా చెప్పొచ్చు.

కానీ మాల్దీవుల నుండి మరింత ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అడిగేది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ). మాలేలో విలేఖరుల సమావేశంలో సయీద్ మాట్లాడుతూ, దీనికి సంబంధించి చర్చలు ప్రారంభమయ్యాయని చెప్పారు. 'వాణిజ్య సౌలభ్యం' కోసం మాల్దీవులు 'అన్ని దేశాలతో' ఎఫ్‌టీఏలను కలిగి ఉండటానికి సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. చైనాతో 2018 సంవత్సరంలోనే మాల్దీవులు ఎఫ్‌టీఏని కలిగి ఉంది. దీనిపై అబ్దుల్లా యమీన్ ప్రభుత్వ హయాంలోనే సంతకాలు జరిగాయి. అది అమలు కాకముందే ఆయనను ప్రజలు ఓడించారు. తదనంతరం వచ్చిన ఇబు సోలిహ్ ప్రభుత్వం దానిని నిలిపివేసింది. చైనాతో ఎఫ్‌టీఏ అమలుపై ముయిజ్జు సెప్టెంబరు నెలలో చేయనున్న ప్రకటనకు కొన్ని రోజుల ముందు జైశంకర్ మాల్దీవులలో పర్యటించడం గమనార్హం.

విదేశాల్లోని ప్రభుత్వాలను 'ఢిల్లీ మిత్రుడు' లేదా 'భారత వ్యతిరేకి' అనే పరిమితార్థంలో వర్ణించడం భారతదేశ స్వీయ అభద్రతా భావాలను మాత్రమే వెల్లడిస్తుంది. ఇది ఆదర్శ పరిస్థితుల్లో మాత్రమే దౌత్యం విజయవంతమయ్యే పరిస్థితులను కల్పిస్తుంది. ఇతర ప్రభుత్వం నుండి 'విధేయత' కేంద్ర స్థానంలో ఉన్నప్పుడే ఇలా జరుగుతుంది. 2022లో భారత్‌పై విమర్శలను చట్టవిరుద్ధం చేయాలనే 'భారత అనుకూల' నేత ఇబు సోలిహ్ తీసుకున్న నిర్ణయంపై ఢిల్లీ ప్రభావం ఎంత స్థాయిలో ఉందో తెలియదు. స్పష్టమైన విషయం ఏమిటంటే, మాల్దీవుల ప్రతిపక్షంతోపాటు, 'వెళ్లిపో ఇండియా' నిరసనల వెనుక ఉన్నవారు పై అప్రజాస్వామిక ఉత్తర్వుతో బాగా ఆడుకున్నారు. ఇదే తరహాలో బంగ్లాదేశ్‌లో చాలా ఎక్కువగా ప్రచారమైన భారత్, షేఖ్ హసీనా 'స్నేహం' ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను రిస్కులో పడేసింది. ప్రత్యేకించి తీస్తా జలాల పంపిణీ ఒప్పందం గురించిన షేఖ్ హసీనా పెద్ద డిమాండ్‌ను భారత ప్రభుత్వం సాకారం చేయని నేపథ్యంలో. మరో వైపున నిరంకుశత్వం వైపు హసీనా ప్రయాణించిన క్రమంలో భారత్‌పై నిందలు రావడం మొదలైంది.



మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుతో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్

ప్రజాస్వామ్య దేశాల్లో ప్రభుత్వ మార్పు అనివార్యం కాబట్టి, ప్రతిపక్ష పార్టీలకు కూడా దౌత్యపరంగా చేరువకావడం ముఖ్యం. శ్రీలంకలో, భారతదేశాన్ని తీవ్రంగా వ్యతిరేకించే చరిత్ర కలిగిన జనతా విముక్తి పెరమున (జేవీపీ)కి భారత్ చేరువ కావడం కనిపించింది. జేవీపీ నాయకుడు అనురా కుమార దిసానాయకే రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో బలమైన పోటీదారుగా ఉండబోతున్నారు. ఆయనను ఇటీవల భారతదేశానికి ఆహ్వానించటం జరిగింది. భారతదేశంలో పాల స్వయం సమృద్ధి కేంద్రస్థానమైన ఆనంద్, కేరళ పర్యటనలకు అనూరాను ఆహ్వానించారు. సింహళ జాతీయవాదాన్ని వామపక్ష వాదంతో కలిపిన పార్టీ అయిన జేవీపీ, భారత్‌లో ఫెడరలిజం ఎలా పనిచేస్తోందో కేరళలో చూడవచ్చు. ఒక ముఖ్యమైన ఎన్నికలు జరగడానికి ఆరు నెలల ముందు, భారత్ ఇలా చేయడం ఇంకో రకమైన సంకేతం ఇస్తుంది. ఇలాంటివి దీర్ఘకాలంగా సాగాలి. బంగ్లాదేశ్ విషయానికి వస్తే, భారత్ 2012 నుండి బంగ్లా నేషనల్ పార్టీకి దూరంగా ఉంది.

మాల్దీవులలో సోలిహ్ ప్రభుత్వం ఇండియా ఫస్ట్ విధానాన్ని కలిగి ఉన్నప్పటికీ, బీజేపీ ప్రతినిధి 2022 జూన్‌లో మహమ్మద్ ప్రవక్తకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యల కారణంగా ఆ దేశ ప్రతిపక్షం తీసుకొచ్చిన ఒత్తిడితో సోలిహ్ ప్రభుత్వం ఈ అంశంపై తన 'తీవ్ర ఆందోళన' ప్రకటనను జారీ చేయవలసి వచ్చింది. మరోవైపు, మైనారిటీలను రక్షించమని బంగ్లాదేశ్‌ను కోరడంలో భారత్ వైఖరి సరైనదే. కానీ స్వదేశంలో మైనారిటీల పరిరక్షణకు సంబంధించి ఉదాహరణగా నిలబడటంలో భారత్ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధిపతి మహమ్మద్ యూనిస్ హిందూ దేవాలయాన్ని సందర్శించి దేశంలోని హిందువులకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ భారత ప్రధాని ప్రమాదకరమైన గావుకేకలు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఆర్థిక అత్యవసర పరిస్థితుల నుండి వాతావరణ మార్పు, పైరసీ, సముద్రంలో ప్రమాదాలు, నీటి కొరత, సునామీలు, భూకంపాలు మొదలైన వాటిపై మొదట ప్రతిస్పందించే దేశంగా తనను తాను నిలబెట్టుకునే భారతదేశానికి, ప్రజలతో వ్యవహరించడమే కేంద్రస్థానంలో ఉండాలి. నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, మాల్దీవులు, పౌర సమాజంతోపాటు మీడియా బలమైన పాత్రలు పోషిస్తుంటాయి. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడంలో వీటన్నింటి పాత్ర తక్కువగా ఉండదు. భారతదేశం, దాని పాత్ర గురించి ప్రజలలో ఉండే అవగాహన, అభిప్రాయాలు ఈ దేశాలలో చాలా వరకు అధికార పార్టీపట్ల వ్యతిరేకతకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దోహదం చేస్తాయి.

నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకకు చెందిన మీడియా ప్రతినిధులు, పౌర సమాజ కార్యకర్తలు ఇటీవల చేసిన ప్రకటనల్లో భారతదేశం 'దక్షిణాసియా ప్రజల ప్రజాస్వామ్య ఆకాంక్షలకు మద్దతుగా ఉండాలనీ, భవిష్యత్తుకు వారి వ్యక్తిగత మార్గాలను నిర్మించుకోనివ్వాలనీ' కోరటం జరిగింది. కానీ ఈ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంలో ప్రభుత్వేతర వ్యక్తులతో వ్యవహరించడంలో తక్కువ పాత్రను కలిగివుంది. ఇది స్వదేశంలో ప్రభుత్వేతర వ్యక్తుల పట్ల మోదీ ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతుంది. భారత విదేశాంగ మంత్రి చివరిసారిగా ఈ దేశాల్లోని మీడియాకు ఎప్పుడు ఇంటర్వ్యూ ఇచ్చారు? దీనికి బదులుగా, ఈ దేశాల్లో ప్రజా సంస్థలను తక్కువ చేసి మాట్లాడే ధోరణి ఉంది.

ఈ ప్రాంతంలో భారతదేశాన్ని బేషరతుగా ప్రేమిస్తున్న ప్రజలున్న ఏకైక దేశం అఫ్గానిస్తాన్. కాగా, భద్రత కోసం పాకిస్తాన్‌పై ఆధారపడిన తాలిబన్ల వల్ల ఇరుదేశాల ప్రజలమధ్య సంబంధాల నుంచి భారత్ ఉద్దేశపూర్వకంగా వైదొలిగింది. కానీ అక్కడ కూడా, అఫ్గాన్ ప్రజలు తమ ప్రాతినిధ్యాన్ని ఎన్నటికీ తిరిగి గెలవలేరని నమ్మడం ఢిల్లీ చేస్తున్న తప్పు అవుతుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇన్నేళ్ల తర్వాత...



ఊహించండి! 45 ఏళ్ల తర్వాత పోలండ్‌లో పర్యటిస్తున్న మొదటి ప్రధాని నరేంద్ర మోదీ. 1979లో చిట్టచివరగా పర్యటించిన భారత ప్రధాని మొరార్జీ దేశాయ్. ఇండియా, పోలండ్ దేశాలు 70వ దౌత్య సంబంధాలను ఉత్సవం జరుపుకొంటున్నాయి.

– ఆదిత్యా రాజ్ కౌల్, జర్నలిస్ట్

కుర్చీ దిగుతారా?



ఆర్ఎస్ఎస్ ప్రచారకుల సంస్కారానికి లోబడి, తన 75వ జన్మదినం తర్వాత సెప్టెంబర్ 17న మోదీ గనక మార్గదర్శన్ మండల్‌లో చేరుతున్నట్టుగా ప్రకటించకపోతే, ఆయన తన ప్రధానమంత్రి కుర్చీని వేరే పద్ధతుల్లో కోల్పోతారు.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

ఉడికించిన గుడ్ల నయం



గౌరవనీయ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్! అల్పాహారంగా ఆమ్లెట్‌కు బదులుగా ఉడికించిన గుడ్లను ఇవ్వొచ్చు. అలాగే అవకాశం ఉంటే ప్రయాణికుడు, ఆమ్లెట్‌లోనే రెండు గుడ్లకు బదులుగా ఒక ఉడికించిన గుడ్డును కోరుకోవచ్చు. ఇంకా ఆమ్లెట్లు చేసేందుకు వాడే నూనె ఎలాంటిదో కూడా మనకు కచ్చితంగా తెలియదు. ఈ ఆలోచనను పరిగణించండి.

– కిరణ్ బేడీ, మాజీ గవర్నర్


అంగీకరించరు!



వివాహాలు ఎందుకు తగ్గిపోతున్నాయంటే... సగటు మహిళలు (తమను తాము సగటు కంటే ఎక్కువ అనుకుంటారు) సగటు పురుషులను అంగీకరించకపోవడం వల్ల!

– జియా మకూల్, ప్రో-మ్యారేజ్ రచయిత్రి

సానుకూల తుపాను



అన్ని తుపానులూ మన జీవితాన్ని చిందర వందర చేయడానికి రావు. కొన్ని తుపానులు దారిని శుభ్రం చేయడానికి వస్తాయి.

– పాలో కొయిలో, రచయిత

ఉపాధి రహిత వృద్ధి వృథాయే!

కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల తరువాత ఎదురైన ఆర్థిక సవాళ్లను అధిగమించి ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలబడింది. కాబట్టి భవిష్యత్తులో భారత్ ఒక బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని ఆర్థిక రంగ నిపుణులు భావిస్తున్నారు. స్థిరమైన వృద్ధిరేటుతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనతోనే 2047 నాటికి భారత్ 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోగలుగుతుంది. ఒక్క సంపద సృష్టితోనే ఏ ఆర్థిక వ్యవస్థా బలంగా ఎదగలేదు. సంపద వృద్ధితో పాటు మానవ వనరుల ప్రమాణాలను పెంచే ఉపాధి ఉద్యోగ అవకాశాల కల్పనతోనే ఏ ఆర్థిక వ్యవస్థ అయినా బలంగా ఎదుగుతుంది. కానీ ఆరు దశాబ్దాల ప్రణాళికా యుగంలో భారత దేశంలో వృద్ధిరేటు ఉపాధి రహితంగా మందకొడిగా కొనసాగింది. ఫలితంగా ఉద్యోగ అవకాశాల సృష్టిలో వెనకబడటం వలన దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చింది. 1991 నుండి దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన తరువాత ఆర్థిక వృద్ధిరేటు పెరిగినా అది కూడా ఉపాధి రహితంగానే కొనసాగిందనే చెప్పాలి.

ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వజ్రోత్సవంలో పాల్గొన్న సందర్భంగా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతా గోపీనాథ్ మాట్లాడుతూ... భారత దేశంలోని ఉద్యోగ ఉపాధి కల్పనపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగాల కల్పనలో భారతదేశం జీ-20 దేశాల కంటే వెనకబడి ఉంది. అలాగే 2010- 20ల మధ్యకాలంలో దేశంలో సగటు వృద్ధిరేటు 6.6 శాతంగా ఉంటే ఉపాధి కల్పన రేటు మాత్రం కేవలం రెండు శాతం గానే ఉంది. అంటే ఇప్పటికీ భారతదేశంలో ఉపాధి రహిత వృద్ధి కొనసాగుతోందని గీతా గోపీనాథ్ కూడా భావిస్తున్నారని చెప్పాలి. సులభతర వ్యాపారం ద్వారా దిగుమతి సుంకాలను తగ్గించి మరింత ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించటం ద్వారా ఉద్యోగాల సృష్టి జరగటానికి అవకాశం ఉంటుందని గీతా గోపీనాథ్ సూచిస్తున్నారు.

2024– 25 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతం నుండి 7 శాతం వరకు ఉండే అవకాశం ఉందని ఆర్థిక సర్వే భావిస్తోంది. అలాగే ప్రపంచ బ్యాంకు కూడా భారత్ వార్షిక వృద్ధి రేటు 6.3 శాతంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. కానీ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎమ్ఐఈ) రిపోర్ట్ ప్రకారంగా 2014లో 5.4 శాతంగా ఉన్న నిరుద్యోగితా రేటు 2024 మొదటి త్రైమాసికానికి 9.2 శాతానికి పెరగటం, పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారంగా 15 ఏళ్లు పైబడిన వయసుగల వారిలో నిరుద్యోగిత రేటు 17 శాతంగా ఉండటం కూడా ఆందోళన కలిగించే అంశం. ఆర్థిక మందగమనం వలన ప్రైవేట్ రంగంలో, ప్రభుత్వ విధానాల వలన ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంలో జాప్యం వలన నిరుద్యోగ సమస్య తీవ్రత దేశంలో పెరుగుతుందని చెప్పాలి. 3,942 అమెరికన్ డాలర్ల జీడీపీగా ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్... గీతా గోపీనాథ్ చెప్పినట్లు 2027 నాటికి జర్మనీ, జపాన్‌లను కూడా అధిగమించి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగవచ్చు. కానీ ఆ ఎదుగుదల ఉపాధి ఉద్యోగాలను సృష్టించేదిగా ఉంటే యువ భారత్‌కి ఉపయోగకరంగా ఉంటుంది.

– డాక్టర్ తిరునహరి శేషు
అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ విశ్వవిద్యాలయం । 98854 65877

ఆక్రమణదారులకు సింహస్వప్నం!

అభిప్రాయం



వెలిచాల రాజేందర్ రావు

హైదరాబాద్ పరిధిలో అన్యాక్రాంతమైన అన్ని రకాల ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికీ, కొత్తగా ఆక్రమణలకు గురికాకుండా చూడడానికీ 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ' (హైడ్రా)ని ఏర్పాటు చేసింది ప్రభుత్వం. సీఎం రేవంత్ రెడ్డి సరికొత్తగా ఆలోచన చేసి దీనిని ప్రత్యేక వ్యవస్థగా రూపుదిద్దారు.

జీహెచ్ఎమ్‌సీ, హెచ్ఎమ్‌డీఏ పరిధిలోని వేలాది ఎకరాల ప్రభుత్వ, ఇనాం, వక్ఫ్, దేవాదాయ భూములు, చెరువులు కబ్జాకు గురయ్యాయి. గత బీఆర్ఎస్ పాలనలో చెరువులను మాయం చేసి, కొండలు గుట్టలను ధ్వంసం చేసి రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి అమ్మేశారు. జీవో 59 ముసుగులో భూములను రక్షించాల్సిన వారే భక్షించారు. అధికారులు వారికి వంత పాడారు. రోజురోజుకూ కబ్జాలు పెరిగిపోతుండడంతో ముఖ్యమంత్రి ఇతర దేశాల్లో ప్రభుత్వాస్తుల రక్షణకు చేపట్టిన విధి, విధానాలపై అధ్యయనం చేశారు. అక్కడ సత్ఫలితాలు ఇస్తున్న విధానాన్ని హైదరాబాద్ లోనూ అమలు చేయడానికి హైడ్రాను ప్రత్యేక వ్యవస్థగా ఏర్పాటు చేశారు. దీని విధి విధానాలు ఖరారు చేస్తూ ఇటీవల జీవో 99ని జారీ చేశారు. దీనికి ఐజీ స్థాయి సీనియర్ పోలీసు అధికారి ఏవీ రంగనాథ్‌ను కమిషనర్‌గా నియమించారు.



హైడ్రాను ఏర్పాటు చేసిన వెంటనే ప్రభుత్వం దానికి సంబంధించి రూ. 200 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. అక్రమ నిర్మాణాల అంతు తేల్చడానికి ప్రభుత్వం ఎంత అంకితభావంతో ఉందో ఈ బడ్జెట్ కేటాయింపే నిదర్శనం. జీహెచ్ఎమ్‌సీతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాలు హైడ్రా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. సుమారు 2,500 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న 27 మున్సిపాలిటీలు, 33 గ్రామ పంచాయతీలను కలిపి స్వయం ప్రతిపత్తితో ఉండేలా హైడ్రాను అందుబాటులోకి తెచ్చారు. జీహెచ్ఎమ్‌సీతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) గా నామకరణం చేస్తూ ప్రభుత్వం ఆ ప్రాంతం వరకు విపత్తు నిర్వహణ తదితర అధికారులతో హైడ్రాను ఏర్పాటు చేశారు.

హైడ్రా పాలకమండలికి ముఖ్యమంత్రి చైర్మన్‌గా, మున్సిపల్ మంత్రి, రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్మెంట్ మంత్రి; హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల ఇన్చార్జి మంత్రులు; హైదరాబాద్ మేయర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సభ్యులుగా ఉంటారు.

చెరువులు, పార్కుల పరిరక్షణ కోసం హైడ్రా త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్నది. చెరువులు కుంటలు, నాళాలు, పార్కులు ప్రభుత్వ స్థలాల్లో జరిగిన అక్రమ కట్టడాలే కాకుండా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఏళ్ల క్రితమే అనుమతులతో వెలసిన భవనాలను చట్ట ప్రకారం కూల్చివేసేందుకు హైడ్రా సిద్ధమైంది. ఈ మేరకు రంగంలోకి దిగింది. అక్రమ కట్టడాలపై ఉక్కు పాదం మోపుతోంది. జూబ్లీహిల్స్‌లోని నందగిరి హిల్స్, బంజారాహిల్స్ లోని మిథిలా కాలనీ, గాజుల రామారం, భూమ్ రుఖా ఉద్ దవాల్ చెరువుల్లో అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఆక్రమణలపై హైడ్రాకు రోజుకు 40 నుంచి 50 ఫిర్యాదులు వస్తుండడం విశేషంగా చెప్పవచ్చు. ప్రభుత్వ స్థలాల్లో ఇప్పటికే ఇచ్చిన లే ఔట్లకు సంబంధించిన అనుమతులు రద్దు చేసే ఆలోచనతో హైడ్రా ముందుకు వెళ్తోంది. చెరువుల ఆక్రమణలు జరగకుండా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సాంకేతికంగా కూడా చర్యలు తీసుకుంటున్నది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధి వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నది. ప్లాట్లు, ఇండ్లుకొనే వ్యక్తులు ఈ స్థలం ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందా రాదా అన్నది తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందిస్తున్నారు.

హైడ్రాకు త్వరలోనే ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నది. ఈ పోలీస్ స్టేషన్ ద్వారానే ఎస్ఓటీ ఏర్పాటు చేసి కబ్జాదారులపై ఉక్కు పాదం మోపనున్నారు. హైడ్రాకు మొత్తం 3,500 మంది సిబ్బందిని త్వరలో నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. హైడ్రా కింద అసెట్ ప్రొటెక్షన్‌తో పాటు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు కూడా కొనసాగుతుంది. పట్టణ ప్రణాళిక- విపత్తుల నిర్వహణ విభాగాలు, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో 72 టీమ్‌లు పనిచేస్తున్నాయి. త్వరలో కొన్ని జిల్లాల్లోనూ ఇటువంటి వ్యవస్థలను ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం ఆలోచించడం ముదావహం.

వ్యాసకర్త కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత । 9849 061481

అసలైన ప్రార్థన

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మన శాస్త్రాల్లో సాధకులకు ఉపయోగపడే వందల కొలది మార్గాలు ఉన్నాయి. ప్రపంచంలో వేల కొలది బోధకులు ఉన్నారు. మన సంప్రదాయాలను అనుసరించి భగవంతునికి కోట్లాది రూపాలున్నాయి. సాధకులు తమ మార్గాలను, గురువులను, వారు పూజించు దేవుళ్ళను మార్చుకోవడం చూస్తూ ఉంటాం. ఆ విధంగా చేయడం సరైనదే కావచ్చు, కాకపోనూ వచ్చు. కానీ లక్ష్యాలను చేరుకోవడానికి వారు చూపించే ఉత్సాహం మెచ్చుకోతగింది. అటువంటివారి దృష్టి అంతా ఎల్లప్పుడూ ఆదర్శమార్గం, ఆదర్శ గురువు, ఆదర్శప్రాయమైన భగవత్ స్వరూపం పైననే ఉంటుంది. వారు ఏ మార్గాన్ని అనుసరించినప్పటికీ, ప్రయాణం మాత్రం అంతరాత్మలోనికే అనే విషయాన్ని అర్థం చేసుకోలేక పోతున్నారు.

గురువులందనూ బోధించే సత్యం ఒకటే. భగవంతుని ఏ స్వరూపంలో పూజించినప్పటికీ, అది సర్వేశ్వరుని పూజించినట్లే. వారు ఎంచుకొనే మార్గం, అనుసరించే గురువు, ఆరాధించే భగవత్ స్వరూపం... ఇవన్నీ సాంకేతికంగా భగవంతుని సూచిస్తాయి. నీవు నీ మార్గాన్ని గంభీరంగా, భక్తిపూర్వకంగా నిశ్చిత బుద్ధితో అనుసరించడమే ముఖ్యం.

ప్రపంచంలోని అన్ని మతాలవారికీ ప్రార్థన ఉంది. అయితే చేసే విధానాలు విభిన్నంగా ఉండవచ్చు. కాని ఇది అందరికీ ముఖ్యమైనది. కేవలం మానవులకు మాత్రమే ప్రార్థన అనేదాన్ని భగవంతుడు అనుగ్రహించాడు. ప్రార్థన చాలా శక్తిమంతమైనది. మనకు ఆపదలు, దుఃఖం కలిగినప్పుడు మాత్రమే సాధారణంగా భగవంతుని ప్రార్థిస్తాం. దీనిలో నష్టం ఏమీ లేదు. అయినప్పటికీ, అన్ని పరిస్థితుల్లో భగవంతుని ప్రార్థించడం అలవరచుకోవాలి.

వ్యక్తిత్వాన్ని సరిచేసుకోవడం, ఆత్మవికాసమే ప్రార్థన ముఖ్య ఉద్దేశాలుగా ఉండాలి. భౌతిక అవసరాలను లేక కోరికలను తీర్చుకోవడానికి భగవంతుని ప్రార్థించకూడదు. కాబట్టి నీవు చేసే ప్రార్థన బంధ విముక్తి కోసం చేయాలి. ఎట్టి పరిస్థితిలో అయినా ఆ దేవదేవుని మరచిపోకుండా ఉండేట్లు ఉంచమని ఆయననే ప్రార్థించాలి. కొన్ని విషయాలు మనకు సంతోషం కలిగించవు. అందువలన బాధ కలుగుతుంది. అటువంటి విషయాలను ప్రార్థన ద్వారా దేవుని అడుగరాదు. అదే నిజమైన ప్రార్థన. నీ ప్రార్థన భగవంతుని నియమానుసారానికి లోబడి ఉండాలి. అందుకు తగినట్లు నిన్ను నీవు మలచుకోవాలి.

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** బ.తదియ సా.5.52 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.3.13 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ప.1.50 నుండి 3.18 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.58 నుండి 10.46 వరకు, తదుపరి ప.3.00 నుండి 3.48 వరకు, **అమృత ఘడియలు:** రా.10.47 నుండి 12.16 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.47, **సూర్యాస్తమయం:** 6.20.

ఎమ్మెల్సీగా ప్రమాణం చేస్తున్న బొత్స



ప్రజల పక్షాన పనిచేస్తా: ఎమ్మెల్సీ బొత్స

సాక్షి,అమరావతి: ప్రజలు ఆశించినట్లుగా వైఎస్సార్‌సీపీ విధానాలకు అనుగుణంగా మండలిలో ప్రజల పక్షాన, ప్రజల గొంతుకగా పని చేస్తానని ఏపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రజల తరఫున బాధ్యతాయుతంగా పనిచేస్తానని తెలిపారు. బుధవారం ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు.. కాగా, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ బొత్స బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసేముందు పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చి వైఎస్ జగన్‌ను బొత్స కలవగా ఆయనను జగన్ అభినందించారు. విశాఖ జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన బొత్సను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు శాసనమండలి ప్రతిపక్షనేతగా ఎంపిక చేసినట్లు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు.

ముగ్గురు బాలురు సహా అయిదుగురిపై కుక్కల దాడి



సుఫియాన్ గొంతు వద్ద గాయాలు

బయ్యారం/శాయంపేట/సంగెం: వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు బాలురు సహా మొత్తం అయిదుగురిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లి–కొత్తపేట గ్రామానికి చెందిన మహ్మద్ యూసుఫ్ చిన్న కుమారుడు సుఫియాన్ మంగళవారం రాత్రి ఇంటి వరండాలో ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో ఊరకుక్క సుఫియాన్ గొంతు వద్ద కరిచింది. అప్పుడే బయటినుంచి ఇంటికి వచ్చిన యూసుఫ్ కుక్కను తరిమేందుకు ప్రయత్నం చేయగా.. అతన్ని సైతం కరిచింది. హనుమకొండ జిల్లా శాయంపేట గ్రామానికి చెందిన వంగరి రాజు–విజయ దంపతుల కుమారుడు శివసాయి ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల ముందున్న రోడ్డుపై తోటి పిల్లలతో ఆడుకుంటున్నాడు. అదే సమయంలో పిచ్చికుక్క శివసాయిపై దాడి చేసి గాయపరచడంతో.. దాన్ని స్థానికులు తరిమికొట్టారు. బాలుని ఎడమ చేయి, కాలిపై గాయాలయ్యాయి. అర్ధగంట తరువాత అదే గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మెహరున్నీసా కాలిని కూడా పిచ్చికుక్క కొరికి గాయపరిచింది. వరంగల్ జిల్లా సంగెం రామచంద్రాపురం గ్రామానికి చెందిన వేల్పుల అనిల్ కుమార్ కుమారుడు విలోహిత్ తీగరాజుపల్లిలోని నోటరేడ్యామ్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం ఇంటికి వెళ్తుండగా.. కుక్కలు దాడిచేసి గాయపరిచాయి.

పిల్లలమర్రి.. చూద్దాం రండి

ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

పాలమూరు: ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద, ప్రఖ్యాతిగాంచిన పిల్లలమర్రి మహావృక్షం ఆరేళ్ల తర్వాత సందర్శకులకు అందుబాటులోకి వచ్చింది. 2018లో మూతపడిన ఈ మహావృక్షానికి దాదాపు ఆరేళ్లపాటు రూ.కోటి వ్యయంతో ప్రత్యేక చికిత్స అందించారు. కొత్త సొబగులతో తీర్చిదిద్దిన పిల్లలమర్రిని బుధవారం పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. అదేవిధంగా అక్కడ ఏర్పాటు చేసిన చిన్నారుల పార్కును సైతం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జూపల్లి మీడియాతో మాట్లాడుతూ.. ఎంతో ప్రఖ్యాతిగాంచిన పిల్లలమర్రి వృక్షాన్ని నేటి నుంచి అందరూ సందర్శించవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాల్లో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి టూరిజం మార్కెట్ నెలకొల్పు తామన్నారు. పిల్లలమర్రిని మరింత అభివృద్ధి చేయడంతోపాటు నల్లమల అభయారణ్యం, మల్లెల తీర్థం, సోమశిల, సరళాసాగర్ తదితర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని వివరించారు. ఉమ్మడి జిల్లాలో 150 కి.మీ. మేర ఉన్న కృష్ణానదిలో వాటర్ స్పోర్ట్స్ బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. పాలమూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. పిల్లల మర్రి మహావృక్షం మొదలు ఎక్కడ ఉందో ఇప్పటివరకు ఎవరూ గుర్తించలేదని చెప్పారు. పిల్లలమర్రి వద్ద ప్రత్యేక రెస్టారెంట్‌తోపాటు పర్యాటకులకు అవసరమైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పిల్లల మర్రి చెట్టును పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

ఏడేళ్ల కిందట అదృశ్యం..

శవమై ప్రత్యక్షం

కోవర్టు నెపంతో మహిళా మావోయిస్టు హత్య ● తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఘటన

చర్ల మండలంలో మృతదేహాన్ని వదిలేసిన మావోలు ● కమాండర్ స్థాయికి ఎదిగిన రాధ స్వస్థలం యాదాద్రి జిల్లా



మహిళా మావోయిస్టు రాధ మృతదేహం

సాక్షిప్రతినిధి, వరంగల్/ యాదాద్రి/ చర్ల/కాప్రా: ఏడేళ్ల క్రితం అదృశ్యమై..మావోయిస్టు పార్టీలో చేరి కీలకంగా ఎదిగిన బంటి (పల్లెపాటి) రాధ అలియాస్ నీల్సో శవమై ప్రత్యక్షమైంది. చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) సభ్యురాలి నుంచి దండకారణ్యంలో చేరి నాయకత్వ రక్షణదళ కమాండర్‌గా ఎదిగిన ఆమె.. చివరకు దళం సహచరుల చేతిలోనే హత మైంది. విద్యార్థి నుంచి దళనేతగా సాగిన ఏడేళ్ల ప్రస్థానం విషాదాంతంగా ముగిసింది. ఉద్యమంలో కొనసాగుతూనే ఛత్తీస్‌గఢ్, తెలంగాణ పోలీసులకు 'కోవర్టు'గా మారిందన్న సమాచారం మేరకు మావోయిస్టు పార్టీ నాయకత్వం.. ప్రజాకోర్టు నిర్వహించి రాధ అలియాస్ నీల్సోను చర్ల సమీపంలో హతమార్చి ఏవోబీ కార్యదర్శి గణేష్ పేరిట బుధవారం వీడియో, ప్రకటన విడుదల చేసింది.

రాధ కేసు..రంగంలోకి దిగిన ఎన్ఐఏ

బంటి బాలయ్య– పోచమ్మ (బాలమ్మ)ల స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం. ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. మేడ్చల్ పరిధిలోని కాప్రాలో నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు సూర్యం, కూతురు రాధలు ఉండగా.. బంటి రాధ అలియాస్ నీల్సో 2017లో ఇంటర్ తర్వాత మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చేస్తూ అదృశ్యమైంది. రాజాపేటకు చెందిన జిట్టా సుదర్శన్‌రెడ్డి పీపుల్‌వార్ నల్లగొండ జిల్లా కార్యదర్శిగా పనిచేసే సమయంలో రాధ విప్లవ గీతాలు ఆకర్షితురాలయ్యారు. అప్పట్లో ఆమె అదృశ్యం సంచలనంగా మారగా.. మొదట హైదరాబాద్‌లో ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు 2022, జనవరి 2న విశాఖపట్నం జిల్లా పెద్దబయలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును అక్కడి పోలీసులు ఎటూ తేల్చలేదు. కేంద్రహోంశాఖ ఆదేశాల మేరకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఈ కేసును రీ ఓపెన్ చేసింది. మావోయిస్టులు ఆమెను బలవంతంగా పార్టీలో చేర్చుకున్నారన్న అభియోగంపై మావోయిస్టు పార్టీ అగ్రనేతలు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, కాకరాల మాధవి అలియాస్ అరుణలతో పాటు పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇదే క్రమంలో 2022, జూన్ 23 హైదరాబాద్‌లోని చిలకానగర్, ఫిర్జాదిగూడ, మెదక్ జిల్లా చేగుంట, వరంగల్ నగరంలలో ఎన్ఐఏ చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్)తో సంబంధం ఉన్న పలువురి ఇళ్లల్లో సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయవాదులు డొంగరి దేవేంద్ర, చుక్కా శిల్పా, దుబాసి స్వప్నలను అరెస్టు చేసి ఎన్ఐఏ రాధ ఆచూకీ కోసం విచారించింది. వరంగల్ నగరంలోని హంటర్‌రోడ్డు, ప్రకాశ్‌రెడ్డి పేటలలోనూ సోదాలు నిర్వహించింది.

నేడు కాప్రాలో అంత్యక్రియలు

పోలీసులు రాధ మృతదేహానికి భద్రాచలం ప్రభుత్వ వైద్యశాలలో శవ పంచనామా చేయించాక, కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, రాధ మెడకు ప్లాస్టిక్ తాడు కట్టి చెట్టుకు లాగడం ద్వారా ప్రాణం తీసినట్లు తెలుస్తోంది.

కీలకంగా ఎదిగి... సహచరుల చేతిలో హతమై

ఓ వైపు పోలీసులు, మరోవైపు ఎన్ఐఏ బంటి రాధ కోసం ఆరా తీస్తుండగా.. ఆమె మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా ఎదిగింది. విశాఖపట్నం వెళ్లి 2017 డిసెంబర్‌లో అదృశ్యమైన ఆమె.. ఆంధ్ర–ఒడిశా బార్డర్ (ఏవోబీ) మావోయిస్టు కమిటీకి కీలకంగా మారింది. ఏడాదిలోనే పార్టీ నాయకత్వ కమిటీకి రక్షణ దళ కమాండర్‌గా ఎదిగింది. ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ (కోవిడ్ సమయంలో చనిపోయారు)తో పాటు పలువురు నేతలకు రక్షణ కల్పించే ప్లటూన్‌కు కీలకమైంది. సుమారు ఏడేళ్లపాటు బంటి రాధ అలియాస్ నీల్సో ప్రస్థానం మావోయిస్టు పార్టీలో కొనసాగింది. మూడు నెలల కిందటే అనుమానం వచ్చిన మావోయిస్టు పార్టీ నాయకత్వం ఆమెను 'కోవర్టు'గా భావించి కీలక బాధ్యతల నుంచి తప్పించి నిఘా పెట్టింది. తన సోదరుడు సూర్యం ద్వారా పోలీసులకు సహకరిస్తుందని భావించిన పార్టీ నాయకత్వం, సెంట్రల్ కమిటీ ప్రొటెక్షన్ ఆర్మీ కమాండర్‌గా పనిచేసిన రాధ అలియాస్ నీల్సోను అంతమొందించినట్టు ప్రకటించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చెన్నాపురం సమీపంలో నీల్సోను చంపి ఈ హత్య తామే చేసినట్లు మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ పేరిట లేఖ విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలోని పోలీసులు మళ్లీ అలర్ట్ అయ్యారు.

గురువారం రాధ అంత్యక్రియలు కాప్రాలో నిర్వహించనున్నట్టు బంధువులు తెలిపారు.

హేయమైన చర్య : ఎస్పీ రోహిత్ రాజు

మావోయిస్టు పార్టీ నాయకుల వేధింపులు తట్టుకోలేక పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలవాలనుకున్న దళిత యువతి రాధ అలియాస్ నీల్సోను అతి కిరాతకంగా చంపడం హేయమైన చర్య అని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. సామాజిక న్యాయమంటూ మాటలు చెప్పే మావోయిస్టులు ఇతరులను వదిలేసి కేవలం దళితురాలైన రాధను ఎందుకు చంపారో సమాధానం చెప్పాలన్నారు.

కాటేసిన కల్తీ కల్లు

ఒకరి మృతి: 29 మందికి అస్వస్థత





గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు. (ఇన్‌సెట్లో) దుర్గయ్య


అనంతగిరి: కల్తీ కల్లు తాగి ఒక వ్యక్తి మృతి చెందగా, మరో 29 మంది ఆస్పత్రి పాలయ్యారు. వివరాలివి. వికారాబాద్ జిల్లా పీరంపల్లిలోని ఒక దుకాణంలో 19వ తేదీ సోమవారం సాయంత్రం కల్లు తాగిన వారిలో.. ఎనిమిది మంది మంగళవారం వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధి తులను వారి కుటుంబ సభ్యులు వికారాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేర్పించగా అర్ధరాత్రి తర్వాత దుర్గయ్య అనే వ్యక్తి మృతి చెందారు. అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ బుధవారం ఉదయాన్నే గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. శిబిరానికి వచ్చిన మరో 22 మంది పరిస్థితి బాగా లేకపోవడంతో వికారాబాద్‌కు తరలించారు. వీరిలో ఒకరిద్దరు మినహా మిగిలిన వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. బాధితుల్లో ప్రస్తుతం 15 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా.. మిగిలిన వారు డిశ్చార్జి అయ్యారు. ఎంపీడీవో వినయ్‌కుమార్, ఎంపీవో దయానంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి, పీహెచ్‌సీ వైద్యుడు సుధాకర్‌రెడ్డి గ్రామంలో పర్యటించారు. బాధితుల ఇళ్లు, నీటి ట్యాంకులను పరిశీలించారు. నీరు కలుషితం కాలేదని నిర్ధారించారు. కాగా, ఈ ఘటనపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆరా తీశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు సైతం కల్లు నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కల్తీ లక్షణాల్లేవని ఆ శాఖ సీఐ రాగవీణ స్పష్టం చేశారు.

వ్యాయామం చేస్తూ ఏఎస్ఐ మృతి

ఖలీల్‌వాడి: నిజామా బాద్ జిల్లా కేంద్రంలో వ్యాయామం చేస్తూ ఏఎస్ఐ ఒకరు గుండెపోటుతో మృతి చెందారు. ఒకటో టౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్ఐ దత్తాద్రి బుధ వారం ఉదయం గాయత్రీ నగర్‌లోని నివాసంలో వ్యాయామం చేస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మార్గదర్శి విషయంపై ఇద్దరు సీఎంలు స్పందించాలి

- చంద్రబాబు, రేవంత్‌రెడ్డిల నుంచి కనీస స్పందన కరువు
- హైకోర్టు ఆదేశాలతోనైనా చలనం వస్తుందని భావిస్తున్నా
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



సాక్షి, రాజమహేంద్రవరం : మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తెలంగాణ హైకోర్టులో వాస్తవాలతో కూడిన అఫిడవిట్ దాఖలు చేయాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో విచారణ ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వాల నుంచి కనీస స్పందన కరువైందని ఆరోపించారు. తాజాగా హైకోర్టు ఆదేశాలతోనైనా వాళ్లలో చలనం కలుగుతుందని ఆశిస్తున్నానని అన్నారు. రాజమహేంద్రవరంలోని ఓ బుక్ హౌస్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంప్లీడ్ కావడంతో ఈ కేసుకు బలం వచ్చిందని చెప్పారు. ఇప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబుకు దివంగత రామోజీరావు, కుటుంబ సభ్యులతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో ఎలా స్పందిస్తారో తెలియడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తే గౌరవం దక్కుతుందన్నారు. కోర్టులో ఆలస్యం అవుతుందే తప్ప.. అన్యాయం జరగదని చెప్పారు. రామోజీతో సన్నిహిత సంబంధాలు ఉన్నా, సీఎం హోదాలో చంద్రబాబు విచారణకు సహకరించాలని కోరారు. మార్గదర్శి డిపాజిట్లకు సంబంధించిన వడ్డీల గురించి తనకు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. డిపాజిట్ల సొమ్ము అందరికీ అందిందా? లేదా? అన్న విషయాన్ని ప్రజలందరికీ అర్థమయ్యేలా ప్రకటన ఇవ్వాలని హైకోర్టు సూచించిందన్నారు. డిపాజిట్‌దారుల వివరాలను పెన్ డ్రైవ్‌లో నింపి ఇవ్వాలని కోర్టును అభ్యర్థించానని తెలిపారు. తాము ఎవరికి డబ్బు చెల్లించామన్న వివరాలను మార్గదర్శి 70 వేల పేజీల్లో నింపి సుప్రీంకోర్టుకు అందించిందని చెప్పారు.

సెప్టెంబర్ 21న ఓటరు జాబితా

▶ మొదటి పేజీ తరువాయి

పంచాయతీ రాజ్ శాఖకు అప్పగించనున్నారు. వాటి ఆధారంగా కులాల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తారు. ఈ జాబితాలు తమకు అందాక రాష్ట్ర బీసీ కమిషన్ బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయనుంది. ఇందుకు దాదాపు నెలరోజులు పట్టే అవకాశమున్నట్టు సమాచారం. ఓటర్ల జాబితాలతో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయిస్తే ఆ తర్వాత మరో 2, 3 నెలల్లోనే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అదే కులగణన ద్వారా ఎన్నికలు నిర్వహించాలని అనుకుంటే మాత్రం చాలా సమయం పడుతుందని అంటున్నారు. కాగా స్థానిక ఎన్నికల సన్నాహాలపై ఈ నెల 29న జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), డీపీవోలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.

ఇదీ షెడ్యూల్

- సెప్టెంబర్ 6న వార్డులు, జీపీల వారీగా ముసాయిదా ఓటర్ లిస్టులను ఆయా జిల్లాల్లో మండల అభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు తయారు చేసి గ్రామ పంచాయతీలలో ప్రచురిస్తారు
- 9,10 తేదీల్లో ఈ డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్లు, మండల అభివృద్ధి అధికారులు జిల్లా, మండల స్థాయి సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు
- 7 నుంచి 13 దాకా ముసాయిదా లిస్టులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే జిల్లా పంచాయతీ అధికారులు/ మండల అభివృద్ధి అధికారులు స్వీకరిస్తారు
- 19న అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం ఉంటుంది.
- 21న తుది ఓటరు జాబితాలు ప్రచురిస్తారు

వైద్యురాలి హత్యోదంతంలో...

దీదీ సర్కారు 10 తప్పులు

వైద్యురాలి హత్యకు నిరసనగా ఆర్‌జీ కర్ ఆస్పత్రిపై నిరసన బ్యానర్



యావద్దేశాన్నీ కదిలించిన యువ వైద్యురాలి పాశవిక హత్యోదంతంలో మమతా సర్కారు తీరు మొదటినుంచీ తీవ్ర విమర్శలపాలైంది. దాంతో దోషులను కాపాడేందుకు ప్రభుత్వమే ప్రయత్నిస్తోందన్న అనుమానాలు నానాటికీ బలపడుతున్నాయి. ఈ ఘటన పట్ల రగిలిపోయిన వైద్యులు, వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి రోడ్లపైకెక్కారు. ఇది దేశ వ్యాప్త ఆందోళనలకు దారితీయడంతో సుప్రీంకోర్టే ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించాల్సి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలి ఆద్యంతం తప్పలతడకేనంటూ అత్యున్నత న్యాయస్థానం కూడా తాజాగా తీవ్రంగా తలంటింది. ఇంతటి దారుణాన్ని ఆత్మహత్యగా చిత్రించజూసిన వైద్య కళాశాల ప్రిన్సిపల్ పట్ల పక్షపాతం, శాంతియుతంగా నిరసన చేస్తున్న వైద్య సిబ్బందిపై ఉక్కుపాదం, సోషల్ మీడియా విమర్శకుల నోళ్లు మూయించడానికి నోటీసులు, నేరం జరిగిన సెమినార్ హాల్లో ఆదరబాదరాగా మరమ్మతులు, ఆస్పత్రిపై మూక దాడిని అడ్డుకోలేక చేతులెత్తేయడం... ఇలా మమతా సర్కారు, కోల్‌కతా పోలీసులు వేసిన తప్పటడుగులు అన్నీ ఇన్నీ కావు...

- సాక్షి, నేషనల్ డెస్క్

ఆస్పత్రి వర్గాల నిర్వాకం...

1. వైద్యురాలి అర్ధనగ్న మృతదేహం కళ్లముందు కన్పిస్తున్నా, ఒంటి నిండా గాయాలున్నా ఆసుపత్రి వర్గాలు ఆత్మహత్యగా చిత్రించేందుకు విశ్వ ప్రయత్నం చేశాయి. కానీ జరిగిన దారుణాన్ని పోస్ట్‌మార్టం నివేదిక బట్టబయలు చేసింది. ఒంటిపై 16, అంతర్గతంగా 9 గాయాలున్నాయని, ఒకరికి మించి రేప్ చేశారని, రెండు కాళ్లూ దారుణంగా విరిచేశారని, గొంతు నులిమి పాశవికంగా హత్య చేశారని పేర్కొంది.

2. కూతురిని పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులను 3 గంటలకు పైగా ఆసుపత్రి బయటే నిలబెట్టారు. మృతదేహం దగ్గరికి కూడా పోనీయలేదు. పైగా ఆగమేఘాల మీద అంత్యక్రియలు పూర్తి చేయించేలా ఒత్తిడి తెచ్చారు. కోల్‌కతా పోలీసులు సరైన కోణంలో విచారణ జరపలేదని, దర్యాప్తు కొనసాగుతుండగానే హడావుడిగా అంత్యక్రియలు పూర్తి చేయించారని విపక్షాలతో పాటు డాక్టర్లు, బాధితురాలి తండ్రి ఆరోపించారు.

పోలీసుల తీరు వెనక...?

3. వైద్యురాలు ఆత్మహత్య చేసుకున్నట్టు ఆమె తల్లిదండ్రులకు పోలీసులు తొలుత చెప్పారు. తర్వాత రేప్, హత్య అని తెలిపారు. ఇంత సున్నితమైన అంశంలో ఇలా వ్యవహరించడం యాదృచ్ఛికం కాదంటూ అనుమానాలు వ్యక్తమయ్యాయి. హతురాలి డైరీతో సహా పలు ఆధారాలను పోలీసులే ధ్వంసం చేశారనే ఆరోపణలున్నాయి. ఆమె తనను వేధించిన వారి గురించి డైరీలో కచ్చితంగా పేర్కొని ఉంటారంటున్నారు. ఈ ఉదంతం కోల్‌కతా పోలీసుల విశ్వసనీయతనే ప్రశ్నార్థకం చేసింది. దీనికి తోడు బాధితురాలి కుటుంబానికి మమత సర్కారు రూ.10 లక్షల పరిహారం ప్రకటించడం అగ్నికి మరింత ఆజ్యం పోసింది. న్యాయమడిగితే పరిహారం పేరిట ఈ పరిహాసమేమిటంటూ అంతా దుయ్యబట్టారు. వీటిపై కూడా ప్రభుత్వం నుంచి నిర్లక్ష్యపూరిత వ్యాఖ్యలే విన్పించాయి.

సాక్ష్యాల చెరిపి వేత?

4. ఓవైపు హత్యాచారాన్ని నిరసిస్తూ ఆసుపత్రి బయట ఆందోళనలు, భారీ ప్రదర్శనలు జరుగుతుండగానే ఘోరానికి వేదికైన ఆస్పత్రి సెమినార్ హాల్లో ఆదరబాదరా మరమ్మతులు చేపట్టారు. పక్కనున్న బాత్‌రూం గోడను కూల్చేశారు. ఇదంతా ఆధారాలను చెరిపేసేందుకేననే సందేహాలు సహజంగానే తలెత్తాయి. మరమ్మతులు తప్పనిసరే అనుకున్నా ఇంతటి కీలక కేసు దర్యాప్తు జరుగుతుంటే ఇంకొంతకాలం ఆగలేరా అన్న వైద్య సమాజం ప్రశ్నలకు బదులే లేదు.

5. ఆగస్టు 14న అర్ధరాత్రి సంఘీభావ ప్రదర్శనలు జరగుతుండగా.. అల్లరిమూకలు ఆర్‌జి కార్ ఆసుపత్రిలో విధ్వంసానికి దిగాయి. 40 నిమిషాలు వీరంగం సృష్టించాయి. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. ఆధారాలను ధ్వంసం చేసేందుకు టీఎంసీ గూండాలే ఈ దాడికి పాల్పడ్డారని బీజేపీతో సహా పలువురు ఆరోపించారు.

ప్రిన్సిపల్‌పై వల్లమాలిన ప్రేమ

6. ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌కు మమత సర్కారు దన్నుగా నిలిచిన తీరు తీవ్ర దుమారం రేపింది. హత్యాచారాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేయడమే గాక హతురాలి గురించి నెగెటివ్ వ్యాఖ్యలు చేయడంతో వైద్య లోకం మండిపడింది. వారి నిరసనల నేపథ్యంలో పదవికే రాజీనామా చేయాల్సి వచ్చింది. కానీ ఆ తర్వాత మమత సర్కారు వ్యవహరించిన తీరు ఆశ్రిత పక్షపాతానికి పరాకాష్టగా నిలిచిపోయింది. ఘోష్ రాజీనామాను ఆమోదించకపోగా, కొద్ది గంట్లోనే ఆయనను ప్రతిష్టాత్మక కోల్‌కతా నేషనల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా బదిలీ చేసింది. లెక్కలేనితనంతో వ్యవహరించినందుకు కనీసం క్రమశిక్షణ చర్యలైనా తీసుకోకపోగా ఈ రివార్డు ఏమిటంటూ వైద్యులంతా దుమ్మెత్తిపోశారు. 'గో బ్యాక్' అంటూ కోల్‌కతా మెడికల్ కాలేజీ వైద్యులు, వైద్య సిబ్బంది కూడా ప్లకార్డులు ప్రదర్శించారు. చివరికి ఘోష్ తీరును కోల్‌కతా హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టి సెలవుపై పంపింది.

నిరసనకారులపై ఉక్కుపాదం

7. హత్యాచారాన్ని నిరసిస్తూ వైద్యులు చేపట్టిన ఆందోళనలపై మమత సర్కారు తొలినుంచీ మొండివైఖరే ప్రదర్శించింది. వైద్యురాలి హత్య వెనుక మతలబుందని ఆర్‌జి కార్ ఆసుపత్రి తోటి వైద్యులు వెంటనే నిరసనకు దిగారు. సమ్మెకు దిగడం ద్వారా ప్రజలకు వారు అసౌకర్యం కలిగిస్తున్నారంటూ ప్రభుత్వం నిందించింది. వైద్యురాలికే భద్రత లేని వైనంపై ఆత్మవిమర్శ చేసుకోవడంతో పాటు సురక్షిత పనిప్రదేశాలపై వైద్యుల దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి సున్నితత్వమే లేకుండా వ్యవహరించింది. తక్షణం సమ్మె విరమించి విధులకు హాజరవాలంటూ డాక్టర్లపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది.

8. భద్రతా కారణాల సాకుతో మోహన్‌బగాన్, ఈస్ట్‌బెంగాల్ జట్ల మధ్య జరగాల్సిన డెర్బీ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను కోల్‌కతా పోలీసులు రద్దు చేశారు. మ్యాచ్‌కు భారీగా వచ్చే అభిమానులు డాక్టర్‌కు సంఘీభావంగా, మమత రాజీనామా డిమాండ్‌తో కదం తొక్కవచ్చనే భయంతోనే మ్యాచ్‌ను రద్దు చేశారని విమర్శకులు, అభిమానులు మండిపడ్డారు. దీన్ని జనాగ్రహాన్ని అణచివేసే చర్యగానే చూశారు.

9. జనాగ్రహం, వైద్యుల నిరసనల సెగతో ఉక్కిరిబిక్కిరైన కోల్‌కతా పోలీసులు తప్పిదాలను దిద్దుకోవాల్సింది పోయి ఎదురుదాడికి దిగి మరింత అప్రతిష్ట పాలయ్యారు. మమత రాజీనామా చేయాలన్న డిమాండ్లపై పోలీసు ఉన్నతాధికారులు ఎదురుదాడికి దిగి అధికార తృణమూల్ కాంగ్రెస్ నేతల్లా వ్యవహరించారు. మీడియా అబద్ధాలను వ్యాప్తి చేస్తోందని, ఈ ఉదంతాన్ని రాజకీయం చేయాలని చూస్తోందని కోల్‌కతా పోలీస్ కమిషనర్ ఆరోపించారు. ఇక రాష్ట్ర మంత్రి ఉదయన్ గుహ మరో అడుగు ముందుకేసి మమత వైపు చూపుతున్న వేళ్లను విరిచేయాలంటూ పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లు, డాక్టర్లు, విద్యార్థులపై పోలీసులు విరుచుకుపడ్డారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు 280 మందికి నోటీసులిచ్చారు.

ముఖ్యమంత్రే నిరసనలకు దిగి...

10. సీఎంగా పరిస్థితిని చక్కదిద్దేందుకు కావాల్సిన అన్ని అధికారాలూ చేతిలో ఉన్న మమత స్వయంగా రోడ్డెక్కి అభాసుపాలయ్యారు. దోషులకు మరణశిక్ష పడాలని డిమాండ్ చేస్తూ కోల్‌కతాలో ర్యాలీ నిర్వహించారు. నిజానికి సీబీఐకి కేసు బదిలీ కాకముందు కోల్‌కతా పోలీసుల ఉద్దేశపూర్వక అలక్ష్యమే కేసును పూర్తిగా నీరుగార్చిందనే ఆరోపణలున్నాయి. రాష్ట్ర హోం శాఖ మమత చేతిలోనే ఉండటం కొసమెరుపు.

ఆస్పత్రిలో అవినీతి జలగ

- సందీప్ ఘోష్ అనాథ మృతదేహాలను అమ్ముకున్నారు
- ఆస్పత్రి వ్యర్థాలను రీసైకిల్ చేసి బంగ్లాదేశ్‌కు పంపారు
- ఆస్పత్రి మాజీ అధికారి అఖ్తర్ అలీ సంచలన ఆరోపణ



సందీప్ ఘోష్

కోల్‌కతా: కర్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యోదంతం వేళ ఆ ఆస్పత్రి తాజా మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌పై అవినీతి ఆరోపణలు గుప్పుమన్నాయి. గతంలో ఆయన పలు ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని అదే ఆస్పత్రి మాజీ డెప్యూటీ సూపరింటెండెంట్ అఖ్తర్ అలీ ఒక జాతీయ ఛానెల్ ఇంటర్వ్యూలో చెప్పారు. ''సందీప్ సెక్యూరిటీ సిబ్బందిలో నిందితుడు సంజయ్ రాయ్ కూడా ఉన్నాడు. ఆస్పత్రి, వైద్యకళాశాలలోని అనాథ మృతదేహాలను సందీప్ అమ్ముకునేవాడు. దీనిపై కేసు నమోదైంది. తనకు సెక్యూరిటీగా ఉండే బంగ్లాదేశీలతో కలిసి సిరంజీలు, గ్లౌజులు, బయో వ్యర్థాలను రీసైకిల్ చేసి బంగ్లాదేశ్‌కు తరలించి సొమ్ము చేసుకునేవారు. నేను గతేడాది వరకు ఆస్పత్రిలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉండగా సందీప్ అక్రమాలపై విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదుచేశా. దీనిపై ఏర్పాటుచేసిన దర్యాప్తు కమిటీలో నేనూ ఉన్నా. సందీప్‌ను దోషిగా తేల్చినా చర్యలు తీసుకోలేదు. రాష్ట్ర ఆరోగ్య శాఖకు నివేదిక పంపిన రోజు నన్ను, కమిటీలోని ఇద్దరు సభ్యులను బదిలీచేశారు. ఈయన నుంచి విద్యార్థులను కాపాడేందుకు ప్రయత్నించి విఫలమయ్యా'' అని అఖ్తర్ అన్నారు.

ప్రతి టెండర్‌లో 20 శాతం కమిషన్

'' ఆస్పత్రి, వైద్యకళాశాల పరిధిలో చేపట్టే ప్రతి టెండర్ ప్రక్రియలో సందీప్ 20 శాతం కమిషన్ తీసుకునేవాడు. తనకు అనుకూలమైన సుమన్ హజ్రా, బిప్లబ్ సింఘాలకు ఈ టెండర్లు దక్కేలా చూసేవాడు. సుమన్, సింఘాలకు 12 కంపెనీలు ఉన్నాయి. ఏ టెండర్ అయినా వారికి రావాల్సిందే. డబ్బులు ఇచ్చిన వైద్య విద్యార్థులనే పాస్ చేసేవాడు. లేకుంటే ఫెయిలే. తర్వాత డబ్బులు తీసుకుని మళ్లీ పాస్ చేయించేవాడు. 'శక్తివంతమైన' వ్యక్తులతో సందీప్‌కు సత్సంబంధాలున్నాయి. అందుకే రెండు సార్లు బదిలీచేసినా మళ్లీ ఇక్కడే తిష్టవేశాడు'' అని అఖ్తర్ చెప్పారు.

కొత్త ప్రిన్సిపల్ తొలగింపు

కోల్‌కతా: వైద్య విద్యార్థుల డిమాండ్ మేరకు ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ కొత్త ప్రిన్సిపల్ సుహ్రిత పాల్‌ను బెంగాల్ ప్రభుత్వం తొలగించింది. వైస్-ప్రిన్సిపల్ బుల్‌బుల్, మరో ఇద్దరిని కూడా తొలగిస్తూ బుధవారం నిర్ణయం తీసుకుంది. ''మా కొత్త ప్రిన్సిపల్ సుహ్రిత పాల్ పత్తా లేరు. మాకు సంరక్షకురాలి వ్యవహరించాల్సిన ఆమె ఆర్‌జి కర్ ఆసుపత్రిలో విధ్వంసం జరిగిన రాత్రి నుంచి ఆసుపత్రి ప్రాంగణంలో కనిపించలేదు. ఆమె స్వాస్థ్య భవన్ నుంచి పనిచేస్తున్నారని విన్నాం. అందుకే ఇక్కడకు వచ్చాం' అని ఒక జూనియర్ డాక్టర్ బుధవారం ఉదయం ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఆస్పత్రిపై దుండగులు దాడి చేస్తుంటే అడ్డుకోకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారంటూ ఇద్దరు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లు, ఒక ఇన్‌స్పెక్టర్‌ను కూడా కోల్‌కతా పోలీసు శాఖ బుధవారం సస్పెండ్ చేసింది. మంగళవారం నాటి సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కర్ ఆస్పత్రి, వైద్యకళాశాల వద్ద దాదాపు 150 మంది పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బందితో కట్టుదిట్టమైన రక్షణ కల్పించారు. మరోవైపు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద డాక్టర్ల ఆందోళనలు పదోరోజు కూడా కొనసాగాయి. విధుల్లో చేరాలని రెసిడెంట్ డాక్టర్స్‌కు ఎయిమ్స్ విజ్ఞప్తి చేసింది.

సాక్ష్యాధారాలు సమర్పిస్తే జకీర్ నాయక్‌ను అప్పగిస్తాం

మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం

న్యూఢిల్లీ: వివాదాస్పద మత బోధకుడు జకీర్ నాయక్‌ను భారత్‌కు అప్పగించే విషయంలో మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం సానుకూలంగా స్పందించారు. అతడిపై వచ్చిన ఆరోపణలపై తగిన ఆధారాలు సమర్పిస్తే భారత్‌కు అప్పగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టంచేశారు. భారత్‌లో పర్యటిస్తున్న ఇబ్రహీం బుధవారం ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్‌కు వ్యతిరేకంగా మలేషియాలో జకీర్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. తమ దేశ భద్రతకు జకీర్ వల్ల ఎలాంటి ముప్పు వాటిల్లనంతవరకు, ఎలాంటి సమస్యలు రానంత వరకు అతడి విషయంలో తాము కలుగజేసుకోబోమని తెలిపారు. అయితే, తగిన సాక్ష్యాధారాలు సమర్పిస్తే చట్టప్రకారం భారత్ అప్పగించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రధాని అన్వర్ ఇబ్రహీం స్పష్టం చేశారు.

శ్రీలంకకు ఇక వీసా అక్కర్లేదు

కొలంబో: భారత పౌరులకు ఆరు నెలలపాటు వీసారహిత ప్రవేశాన్ని కల్పించాలని శ్రీలంక ప్రభుత్వం నిర్ణయించింది. భారత్‌తో పాటు మరో 35 దేశాలకు ఈ సౌకర్యాన్ని కల్పించడానికి శ్రీలంక మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ఏడాది అక్టోబరు 1 నుంచి వీసారహిత ప్రయాణం అందుబాటులోకి వస్తుందని పర్యాటక శాఖ సలహాదారు హరిన్ ఫెర్నాండో వెల్లడించారు.

అన్ని దేశాలతో కలిసి నడుస్తాం

పోలండ్‌లో ప్రధాని మోదీ

- భారతీయులనుద్దేశించి ప్రసంగం
- నేడు ప్రధాని, అధ్యక్షుడితో భేటీ
- రేపు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు

వార్సా/సాక్షి, న్యూఢిల్లీ: ''దశాబ్దాల క్రితం పలు దేశాలతో సమదూరం పాటించిన భారత్ నేడు అన్ని దేశాలతో అనుసంధానమవుతోంది. అందరి అభివృద్ధినీ కాంక్షిస్తోంది'' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బుధవారం రాత్రి పోలండ్ రాజధాని వార్సాలో భారతీయ సంతతి ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ''ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలి. యుద్ధం మానవాళికి మహా ముప్పు. భారత్ అనాదికాలం నుంచి శాంతినే ప్రవచించింది. ఇది యుద్ధాల యుగం కాదంటూ మన వైఖరిని ఇప్పటికే స్పష్టం చేశాం. ఈ విపత్కర పరిస్థితుల్లో సమష్టిగా ముందుకు సాగాలి. చర్చలు, సంప్రదింపులు, దౌత్యమార్గం ద్వారానే శాంతి సాధ్యం. సంక్షోభం అంచుకు చేరిన ఏ దేశానికైనా ఆపన్న హస్తం అందించేందుకు భారత్ సదా సిద్ధం. సహానుభూతికి సరైన అర్థం 'భారత్'. కష్టజీవులకు చిరునామా భారత్. బుద్ధుని బోధలతో పునీతమైన నేల భారత్. ప్రపంచంలో ఎక్కడ విలయాలు సంభవించినా 'మానవాళికి సాయం' మంత్రాన్నే జపిస్తుంది'' అని ప్రధాని స్పష్టం చేశారు. ఆయన మాట్లాడినంతసేపూ 'మోదీ మోదీ' నినాదాలతో సభావేదిక మార్మోగింది.

వార్సాలో ఘనస్వాగతం

అంతకుముందు మోదీ మూడు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా పోలండ్ రాజధాని వార్సా చేరుకున్నారు. పోలాండ్ అధికారులు, భారతీయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మోదీ బస చేసిన హోటల్‌లో భారతీయ, పోలండ్ కళాకారులు సంప్రదాయ గుజరాతీ దుస్తులు ధరించి అద్భుతమైన నృత్యరూపకం ప్రదర్శించారు. వారి నృత్యాన్ని మోదీ అభినందించారు. భారత ప్రధాని పోలండ్‌లో పర్యటించడం గత 45 ఏళ్లలో ఇదే తొలిసారి! పోలండ్ అధ్యక్షుడు అండ్రెజ్ సెబాస్టియన్ డుడా, ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో మోదీ గురువారం సమావేశమవుతారు. శుక్రవారం మోదీ ట్రైన్ ఫోర్స్ వన్ రైలులో ఉక్రెయిన్ రాజధాని కీవ్ చేరుకుంటారు.

తెలుగు సంఘం ప్రతినిధుల స్వాగతం

పోలండ్ తెలుగు అసోసియేషన్ (పోటా) ప్రతినిధులు మోదీకి ఘనస్వాగతం పలికారు. ఆయన బస చేసిన హోటల్‌లో తెలుగు తల్లికి వందనం, భరతమాతకు వందనం అంటూ స్వాగతించారు. పోలండ్‌లో దాదాపు 25వేల మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో 5 వేల మందికిపైగా ఉన్నత విద్య కోసం వచ్చిన విద్యార్థులున్నారు.




బుధవారం వార్సాలో జామ్‌సాహెబ్ స్మారకం వద్ద ప్రధాని మోదీ నివాళులు

పోలండ్ మనసు గెలచిన మహారాజు - ప్రత్యేక కథనం ఈపేపర్‌లో...

గుడ్ మహారాజా స్క్వేర్ వద్ద నివాళులు

జామ్‌నగర్ పాలకుడు జామ్ సాహెబ్ దిగ్విజయ్‌సింగ్‌జీ రంజిత్‌సింగ్‌జీ జడేజా స్మారకార్థం వార్సాలో ఏర్పాటు చేసిన 'గుడ్ మహారాజా స్క్వేర్' వద్ద మోదీ నివాళులర్పించారు. నగరంలోని మాంటె కసీనో వార్ మెమోరియల్ సమీపంలోని వలివాడె-కొల్హాపూర్ స్మారకం వద్ద కూడా నివాళులర్పించారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్ పట్టణ సమీపంలోని వలివాడె గ్రామం రెండో ప్రపంచ యుద్ధ సమయంలో 6 వేల మందికిపైగా పోలండ్ ప్రజలకు ఆశ్రయమిచ్చింది.

చంపయ్ కొత్త పార్టీ!



రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంతి చంపయ్ సోరెన్ సొంత పార్టీ పెట్టనున్నట్లు సంకేతాలిచ్చారు. రాజకీయాల నుంచి వైదొలగడం లేదని తేల్చిచెప్పారు. కొత్త రాజకీయ పార్టీపై వారం రోజుల్లో స్పష్టత వస్తుందని బుధవారం చెప్పారు. పార్టీ కోసం తన జీవితాన్ని ధారబోస్తే.. జేఎంఎం నాయకులు తనకు తీవ్రంగా అవమానించారని అన్నారు. 'నా జీవితంలో కొత్త అధ్యాయమిది. రాజకీయాలకు గుడ్‌బై చెప్పడం లేదు. నా అనుచరుల నుంచి ఎంతో ప్రేమ, మద్దతు లభిస్తోంది. నా ముందు మూడు మార్గాలున్నాయని ఇదివరకు చెప్పాను. రాజకీయాలకు స్వస్తి పలకడం. కొత్త పార్టీ పెట్టడం. కలిసొచ్చే సహచరుని (పార్టీ)తో చేరడం. రాజకీయాల నుంచి వైదొలగడమనే అధ్యాయం ముగిసింది. బహుశా కొత్త పార్టీ పెడతానేమో' అని స్వగ్రామం జిలింగోరాలో చంపయ్ సోరెన్ బుధవారం విలేకరులతో అన్నారు. భావసారూప్య పార్టీలతో కలిసి సాగుతామన్నారు. ఈనెల 18న చంపయ్ కొంతమంది జేఎంఎం ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీకి వెళ్లడంతో ఆయన బీజేపీలో చేరుతారని జోరుగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే.

పవార్‌కు 'జడ్ ప్లస్' భద్రత



న్యూఢిల్లీ: రాజకీయ కురువృద్ధుడు, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్‌కు కేంద్ర ప్రభుత్వం జడ్ ప్లస్ భద్రతను కల్పించింది. వీవీఐపీ భద్రతలో జడ్ ప్లస్ అత్యధిక రక్షణ కవచం. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అయిన 83 ఏళ్ల శరద్ పవార్‌కు జడ్ ప్లస్ రక్షణను కల్పించాలని కేంద్ర హోంశాఖ సెంట్రల్ రిజర్వు పోలీసు ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)ను కోరింది. జడ్ ప్లస్ కేటగిరీ కింద 55 మంది సాయుధ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది రక్షణ కల్పిస్తారు. కేంద్ర ఏజెన్సీలు ముప్పును అంచనా వేసి.. శరద్ పవార్‌కు అత్యంత పటిష్టమైన భద్రతను కల్పించాలని సిఫారసు చేశాయి.

కేరళ చీఫ్ సెక్రటరీగా భర్త తర్వాత భార్య

కొత్త సీఎస్‌గా శారదా మురళీధరన్



తిరువనంతపురం: దక్షిణ భారతదేశంలో నెల వ్యవధిలోనే అరుదైన రికార్డు పునరావృతమైంది. కేరళ నూతన ప్రధాన కార్యదర్శిగా శారదా మురళీధరన్ బుధవారం నియమితులయ్యారు. ఆమె తన భర్త, ప్రస్తుత ప్రధాన కార్యదర్శి వి.వేణు నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. వేణు ఆగస్టు 31న పదవీ విరమణ చేయనున్నారు. ప్రణాళిక విభాగంలో అడిషనల్ చీఫ్ సెక్రటరీగా పనిచేస్తున్న 1990 బ్యాచ్ ఐఏఎస్ శారదను తదుపరి సీఎస్‌గా ఎంపిక చేస్తూ కేరళ కేబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుంది. కర్నాటకలోనూ ఆగస్టు 1న శాలినీ రజనీష్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. భర్త రజనీష్ గోయెల్ రిటైరయ్యాక ఆయన స్థానంలో శాలినీ సీఎస్ అయ్యారు.

యుద్ధ విమానం నుంచి జారిపడ్డ సామగ్రి



జైపూర్: భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) చెందిన యుద్ధ విమానం గాల్లో దూసుకెళ్తుండగా అనూహ్యమైన సంఘటన జరిగింది. సాంకేతిక సమస్యతో పలురకాల వైమానిక సామగ్రి జారిపడింది. రాజస్తాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్ సమీపంలో బుధవారం ఈ ఘటన జరిగింది. యుద్ధ విమానం అనుకోకుండా నిర్మానుష్య ప్రాంతంలో సామగ్రిని జారవిడిచినట్లు అధికారులు తెలియజేశారు. ప్రాణ, ఆస్తి నష్టమేమీ జరగలేదన్నారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. జారిపడిన సామగ్రి ఏమిటన్నది బయటపెట్టలేదు. సైనిక భాషలో బాంబు, క్షిపణులు, ఆయుధాలు, చమురు ట్యాంక్‌లను కూడా వైమానిక సామగ్రిగా పిలుస్తుంటారు.



మా తల్లులు నేర్పిందదే

''హారిస్ తల్లి, నా తల్లి సప్త సముద్రాలకు చెరోవైపున పుట్టి ఉండొచ్చు. కానీ వాళ్లు నిత్యం విశ్వసించిందీ, మాకు నిరంతరం నేర్పింది ఒక్కటే. వ్యవస్థను విమర్శించే బదులు దాన్ని సరిచేసేందుకు మన వంతుగా శక్తివంచన లేకుండా కృషి చేయాలని'' అని మిషెల్ అన్నారు. మిషెల్ ప్రసంగానికి డెమొక్రాట్ ప్రతినిధులంతా మంత్రముగ్ధులయ్యారు. ఆమె మాట్లాడటం ముగించిన చాలాసేపటిదాకా చప్పట్లతో అభినందించారు.

అత్యంత అర్హురాలు హారిసే

మిషెల్ వ్యాఖ్యలు ● ట్రంప్ జాతి విద్వేషి, స్త్రీ విద్వేషి ● తూర్పారబట్టిన మాజీ ఫస్ట్ లేడీ

షికాగో: ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాకు నేతృత్వం వహించేందుకు అత్యంత అర్హురాలు, సమర్థురాలు కమలా హారిసేనని దేశ మాజీ ప్రథమ మహిళ మిషెల్ ఒబామా అభిప్రాయపడ్డారు. ''చాలామంది సగటు అమెరికన్ల మాదిరిగానే కమలా హారిస్‌ది కూడా మధ్య తరగతి నేపథ్యం. అక్కడినుంచి ప్రతి దశలోనూ నిరంతరం కష్టించి ఎదిగారు. తనను తాను మలచుకుంటూ ఉపాధ్యక్షురాలి స్థాయికి చేరుకున్నారు. అందుకే ఆమె కథ మీ కథ. నా కథ. మెరుగైన జీవితం కోసం కలలుగంటున్న అమెరికన్లందరి కథ!'' అంటూ కొనియాడారు. షికాగోలో జరుగుతున్న డెమొక్రాట్ల జాతీయ కన్వెన్షన్‌లో మంగళవారం ఆమె ఆద్యంతం స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. హారిస్ రాకతో అమెరికాకు మెరుగైన భవితపై కొత్త ఆశలు చిగురిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ''అమెరికన్లందరికీ ఎదుగుదలకు అవకాశాలు దక్కేలా కమల నిరంతరం కృషి చేశారు. దేశం పట్ల తన నిబద్ధతను అలా చాటుకున్నారు. అంతే తప్ప ట్రంప్ మాదిరిగా జాతులపై విద్వేషం చిమ్మడం ద్వారానో, వ్యక్తులపై బురదజల్లడం ద్వారానో కాదు'' అని రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థిపై మిషెల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ''ట్రంప్ ప్రపంచం పట్ల విశాల దృష్టి లేని కురచ వ్యక్తి. బాగా చదువుకున్న, నిరంతరం కష్టించే స్వభావమున్న నల్లజాతీయులను చూస్తే ఆయనకు భయం'' అంటూ దుయ్యబట్టారు. ''నన్ను, నా భర్త (మాజీ అధ్యక్షుడు) బరాక్ ఒబామాను ట్రంప్ ఎప్పుడూ ఆయన రాజకీయ మనుగడకే పెను ముప్పుగానే చూశారు. మేం అత్యంత విజయవంతమైన నల్లజాతి వ్యక్తులం కావడమే అందుకు కారణం'' అని చెప్పుకొచ్చారు. కనుక హారిస్‌పై కూడా ట్రంప్ జాతి విమర్శలు, తప్పుడు ప్రచారాలు చేయడం ఖాయమన్నారు. వాటన్నింటినీ అమెరికన్లు తిప్పికొడతారని, హారిస్‌ను ప్రెసిడెంట్‌గా ఎన్నుకుని చరిత్ర సృష్టిస్తారని జోస్యం చెప్పారు. అయితే, ''ఈసారి అధ్యక్ష ఎన్నిక అత్యంత హోరాహోరీగా సాగడం ఖాయం. చాలా రాష్ట్రాల్లో అతి తక్కువ ఓట్ల తేడాతో ఫలితాలు తారుమారు కావచ్చు. అందుకే భారీ సంఖ్యలో తరలిరండి. పార్టీ అభిమానాలను, రాగద్వేషాలను పక్కన పెట్టి కేవలం మీ మనస్సాక్షి ప్రకారం నడచుకోండి. అమెరికన్లు ప్రాణప్రదంగా భావించే స్వేచ్ఛను, మానవత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, హుందాతనాన్ని నిలబెట్టే హారిస్‌కే ఓటేయండి'' అని అమెరికన్లకు పిలుపునిచ్చారు. ట్రంప్ రూపంలో మరో నాలుగేళ్ల అస్తవ్యస్త పాలనను నెత్తిన రుద్దుకునేందుకు అమెరికన్లు సిద్ధంగా లేరని, హారిస్‌ను ప్రెసిడెంట్‌గా ఎన్నుకుని కొత్త చరిత్ర సృష్టించనున్నారని బరాక్ ఒబామా అన్నారు.

హారిస్, నేను అలా కలిశాం: డగ్లస్

అమెరికన్లందరూ గర్వించేంత గొప్ప ప్రెసిడెంట్‌గా హారిస్ చరిత్రలో నిలిచిపోతారని ఆమె భర్త డగ్లస్ ఎమోఫ్ అభిప్రాయపడ్డారు. తనను తాను అమెరికా చరిత్రలో తొలి 'సెకండ్ జంటిల్మన్ (ఉపాధ్యక్షురాలి భర్త)'గా సభకు పరిచయం చేసుకుని ఆకట్టుకున్నారు! 2013లో ఒక క్లయింట్ మీటింగ్ సందర్భంగా కమలతో తాను బ్లైండ్ డేట్‌కు వెళ్లడం, అది ప్రేమగా మారి, పెళ్లిగా పరిణమించిన వైనాన్ని ఆసక్తికరంగా వివరించారు. తొలి భార్యతో తనకు కలిగిన సంతానం కూడా కమలను ప్రేమగా మొమలా అని పిలుస్తారని డగ్లస్ వివరించారు.

నల్లవాళ్లంటే ట్రంప్‌కు చులకన

నల్లవాళ్లంటే ట్రంప్‌కు బాగా చిన్నచూపంటూ మిషెల్ మండిపడ్డారు. అసహ్యకరమైన స్త్రీ విద్వేష, జాత్యహంకార వ్యాఖ్యలు చేయడం ఆయన నైజమన్నారు. ''అందుకే ఆయన అమెరికా అధ్యక్షునిగా ఉన్న నాలుగేళ్ల కాలంలో నల్లజాతీయులంటే అందరికీ భయం కలిగించేందుకు ఎంతగానో ప్రయత్నించారు. నల్లజాతీయులు చేసే ఉద్యోగాలను బ్లాక్ జాబ్స్ అంటూ చులకనగా మాట్లాడుతున్నారు. కానీ ఇప్పుడు ట్రంప్ అర్రులుచాస్తున్న అమెరికా అధ్యక్ష పదవి కూడా బ్లాక్ జాబేనని ఆయనకు ఎవరు చెప్పాలి!'' అంటూ ఎద్దేవా చేశారు. అమెరికా చరిత్రలో తొలి నల్లజాతి అధ్యక్షునిగా బరాక్ ఒబామా చరిత్ర సృష్టించడం తెలిసిందే.



దూసుకొచ్చిన మృత్యువు

బైక్‌ను డీసీఎం వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో తండ్రీ కూతుళ్లు మృత్యువాత పడ్డారు. ఈ విషాదకర ఘటన బుధవారం కుల్సుంపురా పరిధి లోని పురానాపూల్‌లో చోటుచేసుకుంది. -8లో



పీక్స్‌లో.. పికిల్ బాల్..

ఓ అంతర్జాతీయ సరికొత్త క్రీడ నగరవాసుల్ని ఉర్రూతలూగిస్తోంది. హాబీగా ఆడుకునేవాళ్లని ఉత్సాహపరుస్తోంది.. సీరియస్ ప్రొఫెషన్‌గానూ ఊరిస్తోంది. - సిటీ ప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
33.0/23.0

వాతావరణం

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి లేదా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 33.. కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.





ఆనంద పేరిణి

పేరిణి నృత్యం ప్రేక్షకులను సమ్మోహితుల్ని చేసింది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మణిద్వీప ఆర్ట్స్ అకాడమీ, న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం సంయుక్తాధ్వర్యంలో బుధవారం రవీంద్ర భారతిలో నిర్వహించిన పేరిణి నాట్య పదం ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది.
– గన్‌ఫౌండ్రీ

మెడకు చున్నీ బిగించి భర్తను చంపిన భార్య

నిత్యం మద్యం తాగొచ్చి వేధిస్తున్నాడని..

మియాపూర్: నిత్యం మద్యం తాగి వచ్చి వేధిస్తున్న భర్త ఆగడాలను భరించలేకపోయింది ఆ ఇల్లాలు. సహనం కోల్పోయి అతని మెడకు చున్నీ బిగించి చంపేసిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రానికి చెందిన అలీ హుస్సేన్ లస్కర్ (35), రుస్తానా బేగం లస్కర్ దంపతులు. వీరికి ముగ్గురు సంతానం. బతుకుదెరువు నిమిత్తం రెండేళ్ల క్రితం నగరానికి వచ్చి మియాపూర్ హాఫీజ్‌పేటలోని ప్రేమ్‌నగర్ కాలనీలో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో అలీ హుస్సేన్ లస్కర్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగి వచ్చి భార్యను వేధించేవాడు. పిల్లలను కొట్టేవాడు. సోమవారం రాత్రి అలీ హుస్సేన్ లస్కర్ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్య రుస్తానాతో గొడవ పడ్డాడు. మంగళవారం తెల్లవారుజామున మళ్లీ గొడవ పడడంతో సహనం కోల్పోయిన రుస్తానా చున్నీతో భర్త అలీ హుస్సేన్ లస్కర్ మెడకు బిగించింది. దీంతో అతడు మృతి చెందడంతో అక్కడి ఆమె నుంచి ఆమె పారిపోయింది. మృతుడి సోదరుడు అక్బర్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. రుస్తానా బేగంను బుధవారం అదుపులోకి తీసుకుని విచారణ చేయగా.. భర్త వేధింపులకు విసుగు చెంది చునీతో మెడకు బిగించి తానే హత్య చేసినట్లు అంగీకరించిందని పోలీసులు తెలిపారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.


అలీ హుస్సేన్ లస్కర్ (ఫైల్)

నిండని జంట జలాశయాలు

గతేడాది కంటే 7 అడుగులు తక్కువగానే

- ఈసీ, మూసీ వాగులు వెలవెల
- సీజన్ చివరిలో భారీ వర్షాలపైనే ఆశలు

ఎగువ ప్రాంతాల నుంచి కనిపించని వరద

ప్రస్తుతం పరిస్థితి ఇదీ..

జలాశయం	మొత్తం నీటిమట్టం	ప్రస్తుతం	గతేడాది (అడుగుల్లో)
ఉస్మాన్‌సాగర్	1790.000	1780.00	1787.500
హిమాయత్‌సాగర్	1763.500	1755.500	1761.950


ఉస్మాన్‌సాగర్

సాక్షి, సిటీబ్యూరో:

నగరానికి తాగునీరు సరఫరా చేసే నాగార్జున సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరిన సమయంలో ఆదుకునే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల్లో నీటిమట్టం పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నీటి మట్టం పెరగని పరిస్థితి నెలకొంది. ఎగువ ప్రాంతాల్లో ఆశించిన వర్షాలు లేక ఈసీ, మూసీ నదులు వెలవెలబోతున్నాయి. ఫలితంగా దిగువన ఉన్న జంట జలాశయాలకు వరద నీరు ప్రశ్నార్థకంగా తయారైంది. ప్రతి ఏటా వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. ఈసారి పరిస్థితి తారుమారైంది. గతేడాదితో పోల్చితే రెండు జలాశయాల్లో నీటిమట్టం సగటున 7 అడుగులు తక్కువగా కనిపిస్తోంది.

పరిమిత టీఎంసీలు..

ప్రస్తుతం జంట జలాశయాల్లో నీటిమట్టం సామర్థ్యం సగం టీఎంసీలకు పరితమైంది. ఉస్మాన్‌సాగర్ జలాశయం మొత్తం సామర్థ్యం 3.900 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1.984 టీఎంసీలకే పరిమితమైంది. గతేడాది 3.328 టీఎంసీలు ఉనట్లు గణాంకాలు స్పష్టం చేస్తునాయి. హిమాయత్‌సాగర్‌లో మొత్తం 2.967 టీఎంసీలు నిల్వ సామర్థ్యం కాగా.. ప్రస్తుత 1.675 టీఎంసీలు మాత్రమే ఉంది. అదే గతేడాది 2.595 టీఎంసీలు ఉంది. వాస్తవంగా ఎగువ ప్రాంతాల్లో కురిసే భారీ వర్షాలకు ప్రతిసారి రోజువారీగా సుమారు నాలుగు వేల నుంచి ఆరువేల క్యూసెక్కుల నీరు వచ్చి నిండుకుండలా మారుతాయి. రెండింటిలో వరదనీరు పోటెత్తడంతో గేట్లు ఎత్తి దిగువన వరదనీటిని మూసీ నదిలోకి విడుదల చేస్తుంటారు. ఈసారి మాత్రం వరద ప్రవాహం లేకుండా పోయింది. సీజన్ చివరిలో కురిసే భారీ వర్షాలే ఆధారంగా కనిపిస్తోంది.

భవిష్యత్ అవసరాల దృష్ట్యా..

నగర నీటి అవసరాల దృష్ట్యా ఆఖరి నిజాం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ పేరిట జంట రిజర్వాయర్లను నిర్మించారు. అప్పటి నుంచి నగరానికి ఇవి తాగునీరు అందిస్తున్నాయి. కృష్ణా, గోదావరి నీటి సరఫరా పథకాలు ప్రారంభం అనంతరం ఎంతో చారిత్రక ప్రాశస్త్యం గల రెండు రిజర్వాయర్లు గత పాలకుల తీరు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గత వేసవిలో సాగర్, ఎల్లంపల్లి జలాశయాల్లో నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరడంతో జంట జలాశయాలు కొంత ఆదుకున్నాయి. వాస్తవంగా హైదరాబాద్ నగర ప్రజల వినియోగం కోసం ఉస్మాన్ సాగర్ నుంచి ఏడాది పొడవునా 64 మిలియన్ లీటర్ల నీటిని వినిగిస్తుంటారు. ఈ వేసవి వినియోగం 108 మిలియన్ లీటర్లకు పెరిగింది.

మట్టి గణపతినే పూజిద్దాం

సీఎస్ శాంతికుమారి


పోస్టర్ విడుదల చేస్తున్న సీఎస్ శాంతికుమారి తదితరులు

సనత్‌నగర్: పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలంటూ తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. వినాయక చవితి సమీపిస్తున్న దృష్ట్యా ప్రచార సాధనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఆ మేరకు పీసీబీ అధికారులు ప్రణాళికను రూపొందించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఆవిష్కరించారు. గతంతో పోలిస్తే ప్రజల్లో మట్టి గణపతి విగ్రహాలను పూజించడంపై అవగాహన పెరిగిందని శాంతికుమారి పేర్కొన్నారు. ప్రజలను మరింత చైతన్యపర్చడంలో పీసీబీ ప్రధాన భూమిక పోషించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ నదీం, టీజీపీసీబీ మెంబర్ సెక్రటరీ రవి పాల్గొన్నారు.

25న హైడ్రాకు మద్దతుగా వాక్



సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో జల వనరుల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా ఏర్పడిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కి మద్దతు పెరుగుతోంది. ఈ విభాగం దూకుడు కొందరి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. మరికొందరు హైడ్రానే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 'జన్వాడ గెస్ట్‌హౌస్' వ్యవహారం ఏకంగా హైకోర్టు వరకు వెళ్లింది. ఈ పరిణామాల నేపథ్యంలో గండిపేట్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హైడ్రాకు మద్దతుగా ముందుకు వచ్చారు. ఈ నెల 25న (ఆదివారం) ఉదయం 10 గంటలకు ఉస్మాన్ సాగర్ (గండిపేట చెరువు) వద్ద హైడ్రాకు సపోర్ట్‌గా వాక్ నిర్వహించనున్నట్లు బుధవారం ప్రకటించారు. గండిపేట చుట్టూ జరగనున్న ఈ వాక్‌లో ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలతో హాజరు కావాలని సొసైటీ కోరింది.

జలమండలి ఈడీ బాధ్యతల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా మయాంక్ మిట్టల్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఎండీ అశోక్ రెడ్డిని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జలమండలి ఉన్నతాధికారులు, ఉద్యోగులు సైతం నూతన ఈడీకి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. సుదీర్ఘ కాలం తర్వాత ఓ ఐఏఎస్ అధికారి ఈడీగా రావడంపై వాటర్‌బోర్డు అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

ఓయూ పీజీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో సెప్టెంబర్ 4 నుంచి 17 వరకు జరగాల్సిన వివిధ పీజీ కోర్సుల 2, 4 సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. యూజీసీ జేఆర్‌ఎఫ్, నెట్‌తో పాటు టీఎస్ సెట్ పరీక్షల కారణంగా పీజీ పరీక్షలను వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. తిరిగి పరీక్షలను నిర్వహించే తేదీలను త్వరలో వెల్లడించనున్నట్లు చెప్పారు.

‘ప్రైవేట్’కు మరో మోడల్ మార్కెట్

దాట్ల ఫౌండేషన్‌కు అప్పగించేందుకు సిద్ధమైన జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ మోడల్ మార్కెట్లలో మరో మోడల్ మార్కెట్ భవనం ప్రైవేట్ పరం కానుంది. సీఎస్సార్ కింద డాక్టర్ విజయ్‌కుమార్ దాట్ల ఫౌండేషన్, బయోలాజికల్ ఈ లిమిటెడ్‌కు మోడల్ మార్కెట్ భవనాన్ని అప్పగించేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. స్కిల్లింగ్ అండ్ లివ్లీహుడ్ ప్రోగ్రామ్ కింద స్లమ్స్‌లోని పేద మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా ఆయా అంశాల్లో తగిన శిక్షణతో నైపుణ్యం కల్పించడంతో పాటు వారికి ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు లభించేలా, ఉపాధి పొందేలా సహకరిస్తామనే ప్రతిపాదనతో సదరు ఫౌండేషన్ జీహెచ్‌ఎంసీని అభ్యర్థించడంతో తొలుత ఏడాది కాలానికి ఒప్పందం కుదుర్చుకొని పని తీరును బట్టి పొడిగించాలనే యోచనలో జీహెచ్‌ఎంసీ ఉంది.

20 వేల కుటుంబాలకు అందుబాటులో ఉండటంతో..

కూకట్‌పల్లి జోన్ అల్వాల్ సర్కిల్ పరిధిలోని బొల్లారంలో ఖాళీగా ఉన్న మోడల్ మార్కెట్ భవనం పరిసర స్లమ్స్‌లోని దాదాపు 20 వేల కుటుంబాల వారికి అందుబాటులో ఉంటుందని తమ ప్రతిపాదనల్లో పేర్కొంది. తొలుత ఏడాది కాలంలో పనితీరు పరిశీలించి, శిక్షణ పొందిన వారందరికీ నూరు శాతం ఉపాధి లభించడాన్ని బట్టి తదుపరి పొడిగింపునివ్వాలనే తలంపుతో ఉన్న జీహెచ్‌ఎంసీ ఈమేరకు స్టాండింగ్ కమిటీ ముందుంచనుంది. స్టాండింగ్ కమిటీ ఆమోదం అనంతరం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఒప్పందానికి సంబంధించిన పనులు పూర్తి చేయనున్నారు. జీహెచ్‌ఎంసీ నుంచి సంబంధిత అల్వాల్ సర్కిల్ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ఏడాదికి 600–1200 మందికి శిక్షణనిచ్చి ఉపాధి కల్పించాలనే లక్ష్యాన్ని జీహెచ్‌ఎంసీ ఫౌండేషన్ ముందుంచింది. ఇంకా, స్పోకెన్ ఇంగ్లిష్, డిజిటల్ అంశాల్లోనూ తగిన శిక్షణనివ్వాలి. శిక్షణ పొందేవారిలో 50 శాతం మహిళలు ఉండాలనే నిబంధన ఉంచింది.

దారి మారుతున్న మోడల్ మార్కెట్లు

నగరంలో ప్రతి పదివేల మందికి ఒక మార్కెట్ ఉండాలనే తలంపుతో మోడల్ మార్కెట్ల నిర్మాణాన్ని చేపట్టిన జీహెచ్‌ఎంసీ దాదాపు 40 మోడల్ మార్కెట్లను నిర్మించినా వాటిని మోడల్ మార్కెట్లుగా వినియోగంలోకి తేవడంలో విఫలమైంది. ఇప్పటికే చందానగర్‌లో ఒక మోడల్ మార్కెట్ భవనాన్ని లైట్‌హౌస్ కమ్యూనిటీస్‌కు ఆయా అంశాల్లో శిక్షణ కార్యక్రమాలకు అప్పగించారు. ఇప్పుడు బొల్లారంలోనిది అప్పగించనున్నారు. దీంతో ముందుముందు ఇంకెన్ని మోడల్ మార్కెట్ భవనాలు ఇతర అవసరాలకు మళ్లిస్తారో అంతుచిక్కడం లేదు.

గాడి తప్పిన లక్ష్యం..

గ్రేటర్‌లోని ప్రజలకు ఎక్కడి వారికి అక్కడే చిన్నపాటి సూపర్‌మార్కెట్లలా మోడల్ మార్కెట్లు ఉపయోగపడాలనేది గత ప్రభుత్వ ఆలోచన. వాటిని నిర్మించేముందే అవి నిజంగా ప్రజలకు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది పట్టించుకోకుండా ఎక్కడ పడితే అక్కడ నిర్మించడంతో అవి ప్రజల నివాస ప్రాంతాలు, కాలనీలకు దూరంగా ఉన్నాయి. దాంతో మోడల్ మార్కెట్లలో దుకాణాలు లీజుకు తీసుకునేందుకు ముందుకొచ్చేవారు కరువయ్యారు. ఆశించిన ప్రయోజనం నెరవేరకుండా పోయింది.



వాటర్ ట్యాంకుపై నుంచి దూకి

వ్యక్తి ఆత్మహత్య

సోషల్ మీడియాలో వైరల్ అయిన దృశ్యాలు

జీడిమెట్ల: మద్యం మత్తులో ఓ వ్యక్తి వాటర్ ట్యాంక్ పైనుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పార్వతీపురంనకు చెందిన బావిరి రాము (53)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జీవనోపాధి కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి కుత్బుల్లాపూర్‌లో ఉంటూ మేస్త్రీ పనులు చేస్తున్నాడు. ప్రతిరోజూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. 15 రోజుల క్రితం కూడా రాము మద్యం మత్తులో భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయి గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. సోమవారం ఉదయం మద్యం మత్తులో స్థానిక ఎల్లమ్మ పోచమ్మ గుడి వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కి కిందికి దూకి మృతి చెందాడు. మృతుడి కుమారుడు జైకుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా.. రాము వాటర్ ట్యాంక్‌పై నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడిన దృశ్యాలు బుధవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

పోలీసులకు సమాచారం అందినా స్పందించలేదా?

రాము ట్యాంక్‌పైకి ఎక్కడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించినా వారు పట్టించుకోలేదనే వదంతులు ఉన్నాయి. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ మల్లేశ్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా.. రాము ట్యాంక్‌పైకి ఎక్కి నిమిషాల్లోనే దూకి మృతి చెందాడని, ఈ విషయమై తమకు, డయల్ 100కు ఎలాంటి ఫోన్ కాల్ రాలేదని తెలిపారు.

జలమండలి మేనేజర్ రిమాండ్

రెండో రోజూ కొనసాగిన సోదాలు

- 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు
- రూ.25 లక్షల నగదు, 35 తులాల బంగారం స్వాధీనం



మణికొండ: రెండు నీటి కనెక్షన్లు ఇచ్చేందుకు రూ.30 వేలు లంచం డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కిన జలమండలి మేనేజర్ స్ఫూర్తి రెడ్డితో పాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌కుమార్‌లకు ఏసీబీ కోర్టు బుధవారం 14 రోజుల రిమాండ్ విధించింది. మంగళవారం సాయంత్రం మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లోని జలమండలి కార్యాలయంలో ఫిర్యాదుదారు బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి నుంచి రూ. 30వేలు తీసుకున్న నవీన్ కుమార్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విషయం విదితమే. తనకు ఫిర్యాదుదారు నుంచి డబ్బు ముట్టిందని మేనేజర్ స్ఫూర్తిరెడ్డికి అతను వాట్సాప్‌లో మెసేజ్ పెట్టాడు. విచారణలోనూ మేనేజర్ ఆదేశాల మేరకు డబ్బు వసూలు చేశానని, దాన్ని మేనేజర్‌తో పాటు డీజీఎం, జీఎంలకు ఇవ్వాలని అంగీకరించాడు. దాంతో మేనేజర్‌ను అరెస్టు చేశారు.

ఇంట్లో కొనసాగిన దాడులు...

మంగళవారం సాయంత్రం జలమండలి మేనేజర్‌తో పాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని అదుపులోకి తీసుకుని అరెస్టు చూయించిన ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం రాత్రంతా జలమండలి కార్యాలయంలో ఫైల్‌లను తనిఖీలు చేశారు. అదే సమయంలో మేనేజర్ స్ఫూర్తిరెడ్డి ఇంట్లోను సోదాలు చేయాలని ఇంటి చిరునామా చెప్పాలని ఏసీబీ అధికారులు చెప్పినా ఆమె అంగీకరించలేదని తెలిసింది. ఎట్టకేలకు బుధవారం ఉదయం ఇంట్లో తనిఖీలు చేయగా రూ. 25లక్షల నగదు, 35 తులాల బంగారం లభించినట్టు అధికారులు తెలిపారు. ఆమె లాకర్‌లను ఇంకా తెరవాల్సి ఉందని, త్వరలోనే వాటిని తెరిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందని వారు వివరించారు. బుధవారం ఇద్దరినీ ఏసీబీ కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. త్వరలోనే ఆమెను కస్టడీలోకి తీసుకుని లాకర్‌లను తెరుస్తామని వివరించారు.

ఆహార నాణ్యతపై తనిఖీలు చేపట్టండి

- దోమల నివారణపై అవగాహన కల్పించండి
- అధికారులకు ఆమ్రపాలి ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: ఆహార పదార్థాల నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలపై తనిఖీలు చేయాలన్నారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి, అన్ని కోచింగ్ సెంటర్లు, క్యాంటీన్లు, ఆహార పదార్థాల తయారీ కేంద్రాలను తనిఖీ చేసి నాణ్యత ప్రమాణాలతో, పరిశుభ్రంగా తయారు చేస్తున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే ఫుడ్ సెంటర్లు, హాస్టల్ యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని సూచించారు. దోమల నివారణ చర్యలపై నగరంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టాలని ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. దోమల నివారణ, నియంత్రణ కార్యక్రమాలపైనా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు.

రంగంలోకి దిగిన అధికారులు..

కమిషనర్ ఆదేశాలతో బుధవారం జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో తనిఖీలు చేశారు. చార్మినార్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్, కూకట్‌పల్లి,ఎల్‌బీనగర్, ఖైరతాబాద్ జోన్లలోని 12 రెసిడెన్షియల్ విద్యాలయాలు/హాస్టళ్లను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలు, హాస్టళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

గ్రామాల విలీనంపై వివరాలివ్వండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ కార్పొరేషన్‌లో శంషాబాద్ మండలానికి చెందిన చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ, హమీదుల్లానగర్, బహదూర్‌గూడ, రషీద్‌గూడ గ్రామాల విలీనంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. సమీప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గ్రామాల విలీనం చేసేలా జూలై 26న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ శంషాబాద్ మండలానికి చెందిన చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ, హమీదుల్లానగర్, బహదూర్‌గూడ, రషీద్‌గూడ గ్రామాల మాజీ సర్పంచ్‌లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్ కుమార్ బుధవారం విచారణ చేపట్టారు.

బతుకమ్మ కుంటను సందర్శించిన హైడ్రా కమిషనర్



బతుకమ్మ కుంటలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

అంబర్‌పేట: మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మ కుంటను పునరుద్ధరించాలని మాజీ ఎంపీ హనుమంతురావు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం తన సిబ్బందితో కలిసి రంగనాథ్ బతుకమ్మ కుంటను సందర్శించారు. బతుకమ్మ కుంట భూమికి సంబంధించిన మ్యాప్‌ను వీహెచ్ స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి వివరించారు. బతుకమ్మ కుంట సుమారు ఏడు ఎకరాలు ఉండేదని, ఇప్పుడు దాదాపు రెండెకరాలు మిగిలిందని, అందులో నీటి కుంటను ఏర్పాటు చేస్తే మహిళలు బతుకమ్మ ఆడుకుని పండుగ చేసుకుంటారన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ అక్కడే ఉన్న తహశీల్దార్ వీరాబాయిని బతుకమ్మ కుంట స్థలానికి సంబంధించిన సర్వే వివరాలను తమకు అందించాలని సూచించారు. అలాగే జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం వద్ద ఉన్న వివరాలు సైతం సమర్పించాలన్నారు. బతుకమ్మ కుంటపై సమగ్ర వివరాలు తెలుసుకుని, విచారణ జరిపించి చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే మూసీ బఫర్ జోన్ అక్రమణలపై సైతం కాంగ్రెస్ నేతలు రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు రోహిన్‌రెడ్డి, నేతలు ఆర్.లక్ష్మణ్ యాదవ్, పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, దిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి కోర్టుకు కేంద్ర మంత్రి బండి సంజయ్

సిటీ కోర్టు: ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులను దండుపాళ్యం బ్యాచ్‌గా చిత్రీకరించి, దోపిడీ దొంగలుగా అభివర్ణించారని వచ్చిన ఆరోపణల కేసులో బీజేపీ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. విచారణ చేపట్టిన ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసింది. 2022, అక్టోబర్‌లో మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలో భాగంగా అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న బండి సంజయ్ బీఆర్‌ఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, నిబంధనలు ఉల్లంఘించారని ఎంసీసీ అధికారులు (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్), మానిటరింగ్ కమిటీ సభ్యుడి ఫిర్యాదు మేరకు మర్రిగూడ పోలీసులు ఐపీసీ సెక్షన్ 188, 171-సీ, 171-ఎఫ్ కింద కేసు నమోదు చేశారు. దీనిపై స్పెషల్ కోర్టు కమ్ ఎక్సైజ్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి విచారణ చేపట్టారు. బండి సంజయ్ తరుపు న్యాయవాది కరుణ సాగర్ పోలీసులను క్రాస్ ఎగ్జామిన్ చేసిన తర్వాత ఫిర్యాదులో చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టుముందు నిరూపించారు. తదుపరి విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

విద్యుత్ సౌధ ముట్టడి

సాక్షి, సిటీబ్యూరో: దశాబ్దాలుగా అమల్లో ఉన్న రోస్టర్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం బుధవారం విద్యుత్ సౌధ ముందు ఆందోళనకు దిగింది. ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామ్‌మనోహర్, ప్రధాన కార్యదర్శి మేడి రమేష్‌లు మాట్లాడారు. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో గత ప్రభుత్వంలోని యాజమాన్యం ఎలాంటి జీఓలు లేనప్పటికీ దొడ్డిదారిన తీసుకొచ్చిన టీఓఓ 954, ఎన్‌ఓఓ 37, ఎస్‌పీఓఓ101, టీజీఓఓ 62లను వెంటనే రద్దు చేసి, ఉద్యోగుల సీనియార్టీ జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. డైరెక్ట్ రిక్రూట్మెంట్‌లో వచ్చిన పోస్టుల్లో సీనియార్టీని రోస్టర్ విధానంలో నిర్ణయించి ఇచ్చిన అడ్‌హాక్ ప్రమోషన్లను రెగ్యులరైజ్ చేసి, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ నిరసన ప్రదర్శనలో నాంపల్లి చంద్రయ్య, సోమ్లా నాయక్, నారాయణ నాయక్, నాగరాజు, ఆనంద్ బాబు, ఆనందం, కుమారస్వామి, సత్యనారాయణ, రవీందర్, కృష్ణ పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ముందు వెళ్తున్న బైకును వేగంగా ఢీకొట్టిన డీసీఎం వ్యాను
- తండ్రీ కూతుళ్ల దుర్మరణం

జియాగూడ: ద్విచక్రవాహనంపై రహదారి గుండా వెళ్తున్న తండ్రీ కూతుళ్లను వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ఈ విషాదకర సంఘటన కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలోని పురానాపూల్ 100 ఫీట్ల జాతీయరహదారిపై జరిగింది. ఇన్‌స్పెక్టర్ సునీల్ తెల్పిన వివరాల మేరకు బుధవారం మధ్యాహ్నం జియాగూడ ఇంద్రనగర్ జోషివాడి ప్రాంతానికి చెందిన తండ్రీ కూతుళ్ల బాబూమియా(55), నాషిన్(19)లు హుస్సేని ఆలంలోని ఆజాం కాలేజీ నుండి జియాగూడలో ఉన్న ఇంటికి చేతక్ బైకుపై వెళ్తున్నారు. అదే సమయంలో పురానాపూల్ చౌరస్తా నుండి సిమెంట్ బస్తాల లోడ్‌తో వేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ వీరి వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంతో పాటు తండ్రీ కూతుళ్లు డీసీఎం చక్రాల కింద నలిగి పోయారు. స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే కూతురు నాసీన్ మృతి చెందగా, బాబూమియ తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



డీసీఎం కింద నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనం



మృతిచెందిన నాసీన్

గ్రామస్థాయి నుంచి క్రీడారంగం అభివృద్ధికి బాటలు

సీఎం క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి



క్రీడా పాలసీ ముసాయిదాపై జరిగిన సమావేశంలో జితేందర్‌రెడ్డి తదితరులు

సనత్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మారుమూల గ్రామస్థాయి నుంచి క్రీడా రంగం అభివృద్ధికి బాటలుపరుస్తూ మట్టిలో మాణిక్యాలను వెలికితీసే లక్ష్యంగా సమగ్ర క్రీడా పాలసీని రూపొందిస్తామని సీఎం క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు స్పష్టం చేశారు. స్పోర్ట్స్ పాలసీ ముసాయిదాపై స్టేట్ లెవల్ కమిటీ సమావేశం బుధవారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో జరిగింది. ఈ సమావేశానికి వారితో పాటు వేణుగోపాలచారి, రాష్ట్ర యువజన సర్వీసులు, సాంస్కృతిక, క్రీడా శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ అండ్ ఎండీ సోనీ బాలాదేవి, జగదీశ్వర్‌యాదవ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత పుల్లెల గోపీచంద్, ఇస్మాయిల్‌బేగ్, ప్రముఖ క్రీడా కన్సల్టెన్సీ పీడబ్ల్యూసీ ప్రతినిధి ప్రాన్సు జైన్, ఇతర క్రీడా ప్రముఖులతో పాటు సింగరేణి, విద్యా, ఇతర శాఖల అధికారులు పాల్గొని క్రీడా ముసాయిదాపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల పాఠశాల స్థాయి నుంచి ప్రతి విద్యార్థి కనీసం ఏదో ఒక క్రీడలో పాల్గొనేవిధంగా తెలంగాణ క్రీడా పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పించారన్నారు. అందుకనుగుణంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తెచ్చే ప్రతిభావంతులైన క్రీడాకారులను తయారుచేసి, ప్రోత్సహించేందుకు పటిష్టమైన స్పోర్ట్స్ పాలసీని రూపొందించడం జరుగుతుందన్నారు. క్రీడా ముసాయిదాపై అందిన సూచనలను సీఎం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. గతంతో పోల్చితే క్రీడలకు ఈ సంవత్సరం 10 రెట్లు అధికంగా నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. క్రీడా క్యాలెండర్ అమలుకు అవసరమైన వసతులతో పాటు నిర్వహణకు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను వివరించారు. క్రీడలను ప్రోత్సహించడంలో ఐటీ, ఫార్మా, ఇతర ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యం కోసం ఒక సమావేశం నిర్వహించాలని పలువురు అభిప్రాయపడ్డారు. స్టేడియాలు, రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల్లో ఉన్న వసతులను అభివృద్ధి చేసి పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్న ప్రోత్సాహకాలను పరిశీలించాలన్నారు. పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో రెగ్యులర్‌గా క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తంచేశారు.

గణేశ్ ఉత్సవాలకు సహకరించాలి



మాట్లాడుతున్న నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్

అబిడ్స్: నగరంలో గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి ధూల్‌పేట్ పరిధిలోని రహీంపురాలో జరిగిన మండప నిర్వాహకులు, విగ్రహాల తయారీదారుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ధూల్‌పేట్ నుండి నగరం నలుమూలలతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లే గణేష్ విగ్రహాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా కృషి చేస్తాయన్నారు. గణేష్ నవరాత్రులు, గణేష్ నిమజ్జనం శాంతియుతంగా జరిగేందుకు అందరు సహకరించాలని కోరారు. నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ పి.విశ్వప్రసాద్ మాట్లాడుతూ ధూల్‌పేట్ నుండి గణేష్ విగ్రహాల తరలింపు సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లిస్తామన్నారు. రోడ్లపై గుంతలు, రోడ్ల మరమ్మతులు, జీహెచ్‌ఎంసీ అధికారులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. వీధి దీపాలు రాత్రి వేళ నిరంతరం ఉండే విధంగా విద్యుత్ శాఖ అధికారులు చూడాలని ఆయన అన్నారు. రోడ్లపై అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను వెంటనే తెలగించాలని ఆయన సూచించారు. విగ్రహాల కొనుగోలుకు ధూల్‌పేట్ వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిశాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్, గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్‌లతో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రపురిలో కొనసాగిన కూల్చివేతలు



చిత్రపురి కాలనీలో విల్లాలను కూలుస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

మణికొండ: తీసుకున్న అనుమతుల కన్నా అధికంగా నిర్మించిన విల్లాల కూల్చివేతల కార్యక్రమం చిత్రపురి కాలనీలో రెండవ రోజు బుధవారం సైతం కొనసాగింది. మంగళవారం ఒక విల్లాను కూల్చివేసిన విషయం తెలిసిందే. బుధవారం మూడు విల్లాలను నేలమట్టం చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి హౌసింగ్ కోఆపరేటీవ్ సొసైటీ తరపున 2009లో 225 విల్లాలకు హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులను తీసుకుని మరో ఆరు విల్లాలను అదనంగా నిర్మించారు. వాటిని కూల్చివేసే కార్యక్రమాన్ని మణికొండ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం నుంచి మొదలు పెట్టారు. మొదటి రోజు ఒకటి, రెండవ రోజు మూడు, మొత్తం నాలుగు విల్లాలను కూల్చివేశారు. మరో రెండు విల్లాలు కూల్చాల్సి ఉందని, వాటిని కూల్చే వరకు పనులను కొనసాగిస్తామని మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ తెలిపారు.



కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ తెలంగాణా ఉమెన్ మోటో బైక్ సభ్యులు బుధవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సంఘం నాయకులు డాక్టర్ ఉదయ్, శ్వేత, పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు. - బంజారాహిల్స్

ఊరగాయలో బల్లి

- నాంపల్లిలోని మహేష్ హోటల్‌లో ఘటన
- పలువురు కస్టమర్లకు అస్వస్థత
- హోటల్ సీజ్ చేసిన పోలీసులు



నాంపల్లి: తిరుపతికి వెళ్లి తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు వెళ్తున్న భక్తులకు నగరంలో అపశృతి చోటుచేసుకుంది. నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ హోటల్‌లో బల్లిపడిన వంటకాన్ని తిని వాంతులు చేసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి నాంపల్లి శాంతిభద్రతల పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన 30 మంది భక్తులు దైవదర్శనం కోసం ఇటీవల తిరుపతికి వెళ్లారు. దర్శనం అనంతరం రైలులో మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. బుధవారం ఉదయాన్నే హైదరాబాద్ రైల్వే స్టేషన్ నుండి పూర్ణా ప్యాసింజర్ రైలులో సొంతూరు వెళ్లాల్సి ఉంది. మంగళవారం రాత్రి నగరంలోనే బస చేయడంతో రైల్వే స్టేషన్‌కు చేరువలో ఉండే మహేష్ రెస్టారెంట్‌లో డిన్నర్ చేశారు. 30 మంది ఒకేసారి భోజనాలు చేస్తుండగా ఊరగాయ(పికిల్)లో చనిపోయిన బల్లిని చూశారు. అన్నంలో ఊరగాయను వేసుకుని కలుపుతుండగా ఓ భక్తుడి చేతికి బల్లి తగిలింది. దీంతో అతడక్కడే వాంతులు చేసుకున్నారు. ఈ క్రమంలో మిగతా వారూ అస్వస్థతకు గురై వాంతులు చేసుకున్నారు. స్థానికులు గమనించి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వీరంతా త్వరగానే కోలుకోవడంతో తిరిగి ఉదయాన్నే హైదరాబాదు రైల్వే స్టేషన్‌కు చేరుకుని పూర్ణా ప్యాసింజర్ రైలులో తిరుగుపయనం అయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మహేష్ హోటల్‌ను రాత్రి మూసివేయించారు. హోటల్ సిబ్బందిని, యజమానిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పెన్షనర్లకు శుభవార్త

సాక్షి, సిటీబ్యూరో: లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాల్సిన పెన్షనర్లకు ఊరట. కూకట్‌పల్లి ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయం లైఫ్ సర్టిఫికెట్లను డిజిటల్‌గా సమర్పించేందుకు మొబైల్ యాప్ రూపొందించింది. అన్ని రకాల పెన్షనర్లకూ ఉపయోగకరంగా ఉంటుందని, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారికి మరింతగా ఉపయోగపడుతుందని సంబంధిత అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. http:// jeevanpramaan. gov. in/ package/ download లింకు ద్వారా లేదా గూగుల్ ప్లేస్టోర్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత ఒకసారి ఫేస్ స్కాన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ సాయంతో పనిచేసే ఈ యాప్‌లో ఎప్పటికప్పుడు సరైన కాంతి పడిన ప్రదేశంలో కళ్లు మూస్తూ.. తెరుస్తూ ఫొటో దిగి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఆ వెంటనే రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబర్‌కు సర్టిఫికెట్ లింకు వస్తుంది. ఆ లింకు ద్వారా జీవన్ ప్రమాణ్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని అందరు పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కూకట్‌పల్లి ప్రాంతీయ కార్యాలయం కమిషనర్ హేమంత్ ఎం తిర్పుడే సూచించారు.

గానసభకు ప్రభుత్వ సహకారం ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉండాలని, అది త్వరలోనే నెరవేరనుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి అన్నారు. బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో నూతనంగా నిర్మించిన కళా సంగీత నాట్యవేదికను గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగీత, నాట్య కళాకారుల కోసం నూతన వేదికను ప్రారంభించడం అభినందనీయమన్నారు. గానసభ అధ్యక్షుడు జనార్దన మూర్తి మాట్లాడుతూ గానసభ అభివృద్ధిపై కొందరు వ్యతిరేకంగా ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ప్రముఖ హాస్యావధాని, సీనియర్ జర్నలిస్ట్ శంకర నారాయణ మాట్లాడుతూ పాతపడితే పనికిరాకుండా పోయినట్లు కాదని, మరమ్మతులు జరిపి గానసభను నూతనంగా రూపొందిస్తూ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పురాణపండ శ్రీనివాస్, వంశీ రామరాజు, చక్రపాణి ప్రసాద్, గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్తకు జియో సైన్స్ అవార్డు



ద్రౌపదీ ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న బంటూ ప్రశాంత్ కుమార్

ఉప్పల్: నేషనల్ జియో ఫిజిక్స్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ) చీఫ్ సైంటిస్టు డా.బంటూ ప్రశాంత్ కుమార్ పత్రూ నేషనల్ జియో సైన్స్ అవార్డును అందుకున్నారు. మైనింగ్, మినరల్ బెనిఫిసియేషన్ అండ్ సస్టెనబుల్ మినరల్ డెవలప్‌మెంట్ విభాగంలో చేసిన విశేష కృషికి గాను ఈ అవార్డును మంగళవారం న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో మంత్రి కొండా సురేఖ



సుల్తాన్‌బజార్: బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయ కమిషనరేట్ ప్రాంగణంలో ఉన్న అమ్మవారికి సంప్రదాయ బద్ధంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక తొట్టెలను సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఆషాఢమాసం అంతా బోనాల పండుగలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసిందన్నారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో బోనాల పండుగకు నిధులు కేటాయించి సక్రమంగా నిర్వహించామని తెలిపారు. పోలీసులు అధికారులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సక్రమైన పద్ధతిలో కార్యక్రమం నిర్వహించినందుకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, అడిషనల్ కమిషనర్‌లు జ్యోతి కురకుల, కృష్ణవేణి, రామకృష్ణారావవు, దేవాదాయశాఖ టీఎన్జీఓస్ యూనిట్ అధ్యక్షులు బాబు శంకర్, కార్తిక్, వెంకటేష్‌తో పాటు అర్చక ఉద్యోగ జేఏసీ ఛైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, ఉద్యోగ సంఘం అధ్యక్షులు కృష్ణమాచారి, ప్రధాన కార్యదర్శి పరశురామ్ రవీంద్రచారి, చంద్రశేఖర శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికే టోకరా

సీసీఎస్‌లో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: లాభాలు తెచ్చిపెట్టే పెట్టుబడులు, వీసా ప్రాసెసింగ్ పేరుతో అనేక మందిని మోసం చేసిన వ్యక్తితో పాటు సహకరించిన కుటుంబీకులపై సీసీఎస్‌లో బుధవారం కేసు నమోదైంది. ప్రధాన నిందితుడి స్నేహితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఇది రిజిస్టర్ కావడం గమనార్హం. టోలిచౌకికి చెందిన మహ్మద్ అబ్దుల్ హాదీ, మహ్మద్ అలీముద్దీన్ ఫారూఖీ కాలేజీ రోజుల నుంచి స్నేహితులు. అలీముద్దీన్ అత్తాపూర్‌లో ఎన్‌ఏఎఫ్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఓ సంస్థను నిర్వహిస్తున్నారు. అనేక మంది నుంచి డిపాజిట్లు వసూలు చేయడం, వీటిని వివిధ స్కీముల్లో పెట్టుబడి పెట్టడం, వచ్చిన లాభాలు వారికి పంచడం తమ వ్యాపారం అంటూ ఈ సంస్థ ప్రచారం చేసుకుంది. దీంతో పాటు కెనడా, అమెరికా వెళ్లే విద్యార్థులకు వీసాలు సైతం ప్రాసెసింగ్ చేస్తామంటూ నమ్మబలికాడు. ఇప్పటికే ఇతడి ఉచ్చులో అనేక మంది డిపాజిట్‌దారులు, విద్యార్థులు చిక్కుకుని భారీ మొత్తాలు చెల్లించారు. లాభాలు ఆశ చూపిన అలీముద్దీన్ తన స్నేహితుడు అబ్దుల్ హాదీ నుంచి 2020 ఫిబ్రవరి 25న రూ.10 లక్షలు పెట్టుబడిగా తీసుకున్నాడు. ఆపై తన భార్య ద్వారా రూ.30 లక్షలు, స్నేహితుడి ద్వారా మరో రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టారు. మరికొందరు సైతం వీసా ప్రాసెసింగ్ కోసం మరికొంత మొత్తాలు చెల్లించారు. ఇలా దాదాపు రూ.1.12 కోట్లు వసూలు చేసిన అలీముద్దీన్ గత ఏడాది కెనడా ఉడాయించాడు. ఈ వ్యవహారంలో అలీముద్దీన్‌తో పాటు ఆయన భార్య ఆస్మా సుల్తానా, కుమారుడు ఎహబుద్దీన్ ఫారూఖీ, సోదరుడు మహ్మద్ ముజఫరుద్దీన్ ఫారూఖీ తదితరుల పాత్ర ఉందంటూ హాదీ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

నిరాధార ఆరోపణలతో బస్తీవాసుల మధ్య చిచ్చు

ఎమ్మెల్యే దానం ఎప్పుడూ అండగా ఉన్నారు : గోపాల్‌నాయక్


గురుబ్రహ్మనగర్‌లో ధర్నా నిర్వహిస్తున్న బస్తీవాసులు

ఫిలింనగర్: నిరాధార ఆరోపణలు చేసి బస్తీ వాసుల మధ్య చిచ్చు పెట్టవద్దని బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ సమీపంలోని గురుబ్రహ్మనగర్ బస్తీలో కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ, పట్టాలు ఇప్పించడంలోనూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తమకు ఎప్పుడూ అండగా ఉంటున్నారని, ఆయన తమను ఎప్పుడూ మోసం చేయలేదని గోపాల్‌నాయక్ తెలిపారు. బుధవారం బస్తీలో స్థానికులతో కలిసి చౌరస్తాలో బైఠాయించి ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బస్తీకి మూడు రోడ్ల నుంచి రాకపోకలు నిలిపివేశారని, అదే రోజు కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు తాను ఫోన్ చేసి చెప్పినా ఆయన స్పందించలేదని, ఎమ్మెల్యే దానం మాత్రమే ఇక్కడకు వచ్చి తమ కోసం నిలబడి, కలబడి, కేసులు కూడా నమోదు చేయించుకున్నారని, తమపై కూడా కేసులు నమోదయ్యాయని అన్నారు. తామందరిపై కేసులు నమోదై కోర్టులు చుట్టూ తిరుగుతుంటే కొంతమంది తీరిగ్గా వచ్చి నిజాన్ని కప్పేస్తున్నారని, ఉచితంగా ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే వల్ల తమ బస్తీకి న్యాయమే జరుగుతుందని, ఎప్పుడూ అన్యాయం జరగలేదని, ఆయనపై వచ్చిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బస్తీకి అన్యాయం జరిగితే దగ్గరుండి నిలబడ్డ ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందన్నారు.

నకిలీ ఫార్మసిస్ట్‌లపై తక్షణ చర్యలు తీసుకోవాలి


డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జేఏసీ నేతలు

వెంగళరావునగర్: రాష్ట్రంలో నిబంధనలకు వ్యతిరేకంగా మందులను విక్రయిస్తున్న నకిలీ ఫార్మసిస్ట్‌లపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫార్మసిస్ట్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బత్తిని సత్యనారాయణగౌడ్ డిమాండ్ చేశారు. వెంగళరావునగర్‌లోని డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయం ఎదుట బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బత్తిని మాట్లాడుతూ వాస్తవానికి మందుల షాపులో రిజిస్టర్డ్ ఫార్మాసిస్ట్ మాత్రమే మందులను విక్రయించాలని, అయితే 90 శాతం షాపుల్లో ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఫార్మాసిస్ట్‌లు తమ సర్టిఫికెట్స్‌ను మెడికల్ షాపుల యజమానులకు కిరాయికి ఇచ్చి ఇతర దేశాలకు వెళ్ళడం, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, ఇతర వ్యాపారాలు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయం సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వాస్తవానికి రాష్ట్రానికి సరిపోయేంత మంది ఫార్మాసిస్ట్‌లు ఉన్నారని, వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. డిప్లొమా ఫార్మసిస్ట్‌లకు రూ.30 వేలు, డిగ్రీ ఫార్మసిస్ట్‌లకు రూ.40 వేలు, మాస్టర్ ఆఫ్ ఫార్మసీ, ఫార్మ డి వారికి రూ.50 వేలు జీతాలను ఇచ్చి ఆయా మెడికల్ షాపుల్లో ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ షాప్స్ యజమానులు అక్రమ వ్యాపారాలు చేయడమే కాకుండా, రిజిస్టర్డ్ ఫార్మాసిస్ట్‌లపైనే దాడులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నకిలీ ఫార్మసిస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డ్రగ్స్ డైరెక్టర్ జనరల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమంలో జేఏసీ వైస్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ గౌడ్, తన్నీరు వేణు, అశోక్ తదితర జేఏసీ నేతలు పాల్గొన్నారు.

వర్గీకరణతో శాశ్వత శత్రువులుగా ఎస్సీ, ఎస్టీలు

మాల మహా మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ


ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న పబ్బతి శ్రీకృష్ణ

లిబర్టీ: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా నిర్వహించిన భారత్‌బంద్ బుధవారం విజయవంతం అయిందని మాల మహా మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. భారత్‌బంద్‌లో భాగంగా బుధవారం రాష్ట్ర కార్యాలయంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కులాలకు విడదీసి శాశ్వతంగా శత్రువులుగా మార్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తుందన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన 340, 341, 342లను సవరించాలని తద్వారా అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు పూర్తిగా తొలగించాలనే కుట్రలో భాగంగా ఈ వర్గీకరణ తీర్పు అన్నారు. నేటికి చదువులేని కులాలను పాలకులు మార్చిపోయి ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేటు సంస్థలకు అప్పగించి తిరిగి దళిత, గిరిజన ప్రజలను మరింత బలహీనులను చేయాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రలను ఎదుర్కోవడానికి ఎస్సీలు, ఎస్టీలు ఐక్యం కావాలని బీజేపీ లాంటి మతోన్మాద పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.బాలస్వామి, సురేష్, గోపాల్, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల పోరాటానికి సంఘీభావం


డాక్టర్లకు సంఘీభావం తెలుపుతున్న కేవీ శ్రీధర్

లిబర్టీ: కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచారాన్ని నిరసిస్తూ డాక్టర్లు చేస్తున్న పోరాటానికి ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కేవీ శ్రీధర్ సంఘీభావం ప్రకటించారు. డాక్టర్ మౌమితను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని హత్య చేసిన అసలైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, డాక్టర్లపై జరుగుతున్న దాడులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతు పలికారు. బుధవారం మెట్రో రైల్‌లో ఆందోళనకు తరలివెళ్తున్న డాక్టర్‌లను కలిసి పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డాక్టర్లకు భద్రత కల్పించే విధంగా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కోల్‌కతా లాంటి ఘటనలు మళ్లీ జగరకుండా క్రేంద, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం


అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న మాల మహానాడు నేతలు


నిరసన తెలుపుతున్న మాల వెలుగు సంఘం నేతలు

ఫిలింనగర్: ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు అన్యాయం జరుగుతుందని వర్గీకరణను నిలిపివేయాలంటూ మాల వెలుగు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఫిలింనగర్ మహనీయుల చౌరస్తాలో నేతలు నిరసన తెలిపారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్ తెలిపారు. రాజకీయంగా, పలు విధాలుగా ఈ వర్గీకరణ వల్ల అన్యాయం జరుగుతుందని దీన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు బి. సత్యనారాయణ, తులసి రాజలింగం, రాజు, సుమన్, బి.మధుసూదన్, శీతల అనిల్‌కుమార్, మునేందర్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో...

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపు మేరకు బుధవారం జరిగిన భారత్‌బంద్‌లో మాల మహానాడు నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి సోమాద్రి రామ్మూర్తి ఆధ్వర్యంలో నేతలు కిరణ్, సుధాకర్, యాదగిరి, కృష్ణ, లడ్డూ తదితరులు బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని జీవీకే చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు.

రాంగ్‌రూట్‌లో రయ్..రయ్..!

ఏడు నెలల వ్యవధిలో చిక్కిన 29,373 మంది వాహనదారులు

- ఆగని అడ్డదారులు... పెరిగిపోతున్న ప్రమాదాలు
- స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- పట్టుబడుతున్న వారికి కౌన్సెలింగ్



రాంగ్‌రూట్‌లో వెళ్లిన వాహనదారులు

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	పట్టుబడ్డవారు
ఎస్ఆర్‌నగర్	7018
పంజగుట్ట	13526
జూబ్లీహిల్స్	4430
బంజారాహిల్స్	4399


రాంగ్‌సైడ్ రైడింగ్ చేసిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు

బంజారాహిల్స్: త్వరగా గమ్యస్థానాలకు వెళ్లాలనే ఆత్రుత..పోలీసు చలాన్ల నుంచి తప్పించుకునే ప్రయత్నం..రాంగ్‌రూట్‌లో వెళ్తే అదో స్టైల్ అనుకుంటున్న యువత..ఇలా రకరకాల కారణాలతో ద్విచక్ర వాహనదారులు అడ్డదారుల్లో దూసుకెళ్తూ ట్రాఫిక్ పోలీసులకు అడ్డంగా బుక్ అవుతున్నారు. రాంగ్ రూట్ రైడింగ్‌లు రోజురోజుకూ పెరుగుతుండగా ఈ వ్యవహారం పోలీసులకు ఆందోళన కలిగిస్తోంది. రాంగ్‌రూట్‌లో వెళ్తుండడం మూలంగా వాహనదారులకు ప్రమాదం జరగడమే కాకుండా ఎదురుగా వస్తున్న వారు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో అనుకోకుండా రాంగ్‌రూట్‌లో దూసుకొచ్చే బైక్‌లను గమనించకుండా చాలా మంది పాదచారులు గాయాలపాలవుతున్నారు. ఇదంతా గత కొద్దిరోజుల నుంచి తీవ్రమవుతుండడంతో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వారిని పట్టుకుని దీని వల్ల ఎదురయ్యే పరిణామాలపై కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు. ప్రతిరోజూ ట్రాఫిక్ పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నా అడ్డదారుల్లో వెళ్లే వాహనదారుల ఆగడాలు ఆగడం లేదు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి జులై 31వ తేదీ వరకు ఏడు నెలల వ్యవధిలో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో రాంగ్‌రూట్‌లో బైక్‌లు నడుపుతూ 29,373 మంది పట్టుబడ్డారు. రాంగ్‌రూట్‌లో వెళ్లేవారికి ట్రాఫిక్ పోలీసులు రూ.200 జరిమానా విధిస్తున్నారు. ఏడు నెలల వ్యవధిలో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో రాంగ్‌రూట్ జరిమానాలు రూ.6 లక్షల వరకు వాహనదారులు సమర్పించుకున్నారు.

'ముఖ్యమంత్రిని తప్పదోవ పట్టిస్తున్న అధికారులు'

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు డిఎస్సీ ఉద్యోగ నియామకాల్లో అమలు చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు దేవని సతీష్ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారులు మరోమారు మాదిగలకు ఉద్యోగ నియామకాల్లో అన్యాయం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పుపై అసెంబ్లీలో చర్చజరిపి ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం ప్రకటించారని గుర్తుచేశారు. వర్గీకరణ చెయ్యకుండా నియామకాలు చేపడితే ముఖ్యమంత్రి ఇచ్చిన మాటకు విలువ లేకుండా పోతుందన్నారు.

కోల్‌కతా ఘటన నిందితులను శిక్షించాలి

బంజారాహిల్స్: కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో పీజీ మెడికల్ విద్యార్థినిపై ఇటీవల జరిగిన హత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా ఆరిజన్ (ఆపీ) అధ్యక్షుడు డాక్టర్ సతీష్ కత్తుల తెలిపారు. ఈ ఘటన తమను తీవ్రంగా కలచివేసిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో డాక్టర్లకు తగినంత భద్రత ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ చేయాలి

కాచిగూడ: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ అధ్యక్షుడు గడిప నాగయ్య కోరారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ చేసి అణగారిన మాదిగ, మాదిగ ఉపకులాలకు, మాల, మాల ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు అందజేయాలని కోరారు. అదే విధంగా బీసీల కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచిన తరువాతే గ్రామ పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణపై వెంటనే ఆర్డినెన్స్ తీసుకురావాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగుసూరి బాలరాజు, జిల్లా రాంచందర్, రతన్ శ్యాంసుందర్, బోగారపు వెంకటేశ్వర్ రావు, రాజయ్య, శివకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కార్యాలయం ముట్టడి

ఖైరతాబాద్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయు అనుబంధ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం లక్డీకాపూల్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయాన్ని కార్మికులు పెద్ద ఎత్తున ముట్టడించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.స్వప్న, ఎస్వీ రమలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందజేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. అదే విధంగా పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేస్తున్న లిటిల్‌స్టార్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా

బంజారాహిల్స్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని లిటిల్‌స్టార్ హైస్కూల్ ప్రిన్సిపాల్ అస్మతున్నీసా అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని బుధవారం జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-10లోని గాయత్రీహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డాక్టర్ అస్మతున్నీసా బహుమతులు ప్రదానం చేశారు. అస్మతున్నీసా మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించే విధంగా వారిని ప్రోత్సహిస్తుంటామని చెప్పారు. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో పుట్టి కూడా కొరియోగ్రాఫర్ లేకుండానే యూ ట్యూబ్‌లో చూసి నృత్యాలు నేర్చుకుని అద్భుతంగా ప్రదర్శిస్తున్న విద్యార్థులను అభినందించారు.

రేపిస్టులను బహిరంగంగా ఉరితీయాలి


క్యాండిల్ ప్రదర్శన చేస్తున్న ఆలిండియా పీస్ అండ్ సాలిడారిటీ సభ్యులు

ఖైరతాబాద్: మహిళలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే వారిని బహిరంగంగా ఉరితీయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కోరారు. బుధవారం ఆలిండియా పీస్ అండ్ సాలిడారిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యచార నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నెక్లెస్ రోడ్డులోని లవ్ హైదరాబాద్ వద్ద కొవ్వత్తుల ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలు చేసిన వారికి కఠిన శిక్షలు వేయాలని, ఆ శిక్షలు బహిరంగంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్, మహిళా విభాగం నేత హేమ, వైద్యుల విభాగం నాయకురాలు డాక్టర్ లాస్య నాయుడు, లోక్‌సత్తా తెలంగాణ విద్యావంతుల వేదిక, విద్యార్థి ఐక్య వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాంకు మహిళా ఉద్యోగుల ఆందోళన



కాచిగూడ: మహిళలకు పని ప్రదేశాలలో భద్రత లేకుండా పోతోందని బ్యాంకు మహిళా ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ బ్యాంకు జోనల్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం కోల్‌కతా జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కోల్‌కతాలో హత్యాచారానికి గురైన జూనియర్ డాక్టర్‌కు కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించి, నిందితుడికి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బిఎస్ రాంబాబుతో పాటు అనేక మంది ఉద్యోగులు కూడా సంఘీభావంగా పాల్గొన్నారు. ఆసుపత్రులలో పనిచేస్తున్న వైద్యులకు పూర్తి భద్రత కల్పించాలని కోరుతూ చేస్తున్న ఆందోళనకు బ్యాంకు ఉద్యోగుల మద్దతు ఉంటుందని రాంబాబు తెలియజేశారు. పీవీ కృష్ణారావు, మీనాక్షి, జి.పద్మ, రేఖ, మంజుల, సుప్రియ సార, సావిత్ర, జి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా గుంతల తవ్వకం!


కేబీఆర్ పార్కు ఫుట్‌పాత్‌పై ప్రమాదకరంగా గుంతలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ఫుట్‌పాత్‌పై గత నాలుగు రోజులుగా ఇష్టానుసారంగా గుంతలు తవ్వుతున్నారు. ఈ గుంతలు ఎవరు తవ్వుతున్నారు..ఎందుకు తవ్వుతున్నారు..అన్న విషయంలో జీహెచ్ఎంసీ అధికారులకే తెలియకపోవటం శోచనీయం. ఈ ఫుట్‌పాత్‌ల నిర్వహణను సీఆర్ఎంపీ చేపట్టింది. ఇక్కడ మొక్కలు నాటుతారా..? ఇంకేదేమైనా కార్యక్రమం చేపడతారా..? అన్నది తెలియకుండాపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ గుంతల్లో వరద నీరు చేరి పాదచారులకు ప్రమాదాలు తెచ్చిపెట్టేలా మారింది. కనీసం ఈ గుంతల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా గాలికొదిలేశారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఈ గుంతలు తవ్వి గాలికొదిలేసిన వారిపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

'పీజీ స్టార్'కు డాక్టర్ కార్తికేయ ఎంపిక


డాక్టర్ కార్తికేయ

వెంగళరావునగర్ : ప్రతిష్టాత్మక పీజీ స్టార్ కార్యక్రమానికి ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల విద్యార్థి డాక్టర్ పోలా కార్తికేయ ఎంపికయ్యారు. ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సీసీఆర్ఏఎస్) ఈ ప్రోగ్రాంను నిర్వహిస్తుంది. ఈ ప్రోగ్రాంలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా దాదాపు 1769 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా తెలంగాణా నుంచి ఈ కార్యక్రమానికి ఎంపికైన ఏకైక విద్యార్థిగా డాక్టర్ పోల కార్తికేయ పరిశోధన నిలిచింది. ఈ సందర్భంగా ఆయన పీజీ స్టార్ నుంచి రూ.లక్ష రూపాయలు గ్రాంట్ పొందారు. ఈ మేరకు ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి ఆయా వివరాలను వెల్లడించి డాక్టర్ కార్తికేను అభినందించారు. తమ కళాశాల విద్యార్థి ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఎంపిక కావడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. డాక్టర్ బాబూరావు మార్గదర్శకత్వంలో డాక్టర్ కార్తికేయ సయాటిక వంటి నొప్పి సంబంధిత రోగాలకు శస్త్ర చికిత్స లేకుండా ఆయుర్వేద చికిత్సలను అభివృద్ధి చేయడంపై పరిశోధన చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి తదితర వైద్యులు కార్తికేయను అభినందించారు.

రక్షణ కల్పిస్తున్న పోలీసులే నిజమైన సోదరులు

పోలీసు అధికారులకు రాఖీలు కట్టిన జేహెచ్‌పీఎస్ విద్యార్థినులు



ఫిలింనగర్: రక్షణ కవచంగా నిలుస్తూ భద్రత కల్పిస్తున్న పోలీసులే నిజమైన సోదరులని కృతజ్ఞతాభావంతో స్ఫూర్తిని చాటుకుంటూ జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు బుధవారం ఖాకీలతో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించుకున్నారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకటరెడ్డి, ఇన్‌స్పెక్టర్ కెఎం రాఘవేంద్ర, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులకు జేహెచ్‌పీఎస్ విద్యార్థినులు రాఖీలు కట్టి కృతజ్ఞతాభావాలను వారితో పంచుకున్నారు. సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి అవిశ్రాంతంగా పనిచేస్తున్న పోలీసులకు రాఖీలు కట్టి ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని ఈ సందర్భంగా విద్యార్థినులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని వారిని ప్రోత్సహించారు. పౌరులకు, చట్టాన్ని అమలు చేసే వారి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే అద్భుతమైన సంప్రదాయంతో విద్యార్థులు ఇందులో పాల్గొనడం తమకెంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు.

నకిలీ పత్రాలతో లక్షలాది రూపాయల వసూలు

ఫిలింనగర్: బోగస్ ఇంటి నెంబర్లతో చలామణీ అవుతూ నకిలీ పత్రాలతో లక్షలాది రూపాయలు వసూలు చేసిన నిందితుడిపై ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... ఓయూ కాలనీలో నివసించే వికాస్‌కుమార్ ఠాకూర్ అనే వ్యాపారికి కోట సందీప్ అనే యువకుడు పరిచయమయ్యాడు. ఈ క్రమంలో నారాయణఖేడ్ సమీపంలో రెండెకరాల స్థలం అమ్మకానికి ఉందని సందీప్ తెలిపాడు. రూ.50 లక్షలకు విక్రయిస్తున్నట్లు రూ.6 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. సర్వే చేసి రిజిస్ట్రేషన్ చేయించాల్సిందిగా వికాస్‌కుమార్ గత జులై 30వ తేదీ నుంచి సందీప్‌ను అడుగుతున్నాడు. అయితే సర్వే చేయించడానికి సందీప్ జాప్యం చేస్తుండటంతో అనుమానం వచ్చిన వికాస్‌కుమార్ సందీప్ ఇచ్చిన అడ్రస్‌ల్లో చూడగా అడ్రస్‌లు తప్పుగా తేలింది. దీంతో ఫోన్ చేయగా సందీప్ బెదిరింపులకు సైతం పాల్పడుతున్నాడు. సందీప్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగను పట్టించిన డ్రైవర్

వెంగళరావునగర్ : ఇంట్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ దొంగను డ్రైవర్ పోలీసులకు పట్టించిన సంఘటన మధురానగర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి....ఈనెల 20వ తేదీ రాత్రి సత్యనారాయణ మధురానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి ఇనుప గేటును దొంగలించడానికి ప్రయత్నిస్తుండటంతో గమనించిన డ్రైవర్ వెంకటరమణ సత్యనారాయణను పట్టుకుని మధురానగర్ పీఎస్‌కు అప్పగించాడు. గత ఏడాది డిసెంబరులో కూడా ఇతను అల్యూమినియం నిచ్చెనను దొంగిలించాడని, తాజాగా ఇనుపగేటును దొంగిలిస్తున్నాడని వెంకటరమణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడు తప్పిపోయాడని ఫిర్యాదు

వెంగళరావునగర్: తమ్ముడు తప్పిపోయాడని అన్న ఫిర్యాదు చేసిన సంఘటన మధురానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివసించే కట్టా అనిల్ కుమార్ ఈనెల 20వ తేదీన తన తమ్ముడు శ్రీనివాస్‌తో కలిసి ఇంట్లో నిద్రించాడు. 21వ తేదీ తెల్లవారుజామున శ్రీనివాస్ బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. అతనికి మానసిక పరిస్థితి సరిగా లేదు. అతని కోసం అనిల్‌కుమార్ బంధువులు, స్నేహితులను విచారించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్‌నెస్ కోచ్ బ్యాగ్ చోరీ

ఫిలింనగర్: ఓ ఫిట్‌నెస్ కోచ్ బ్యాగ్ చోరీకి గురైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఫిట్‌నెస్ కోచ్ టి.శ్రీధర్ మూడు రోజుల క్రితం శంషాబాద్‌లోని ఓ ఈవెంట్‌లో పాల్గొనేందుకు నగరానికి వచ్చి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీ లోటస్‌పాండ్‌లో సమీపంలో ఉన్న కైగో హాస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం ఉదయం ఈవెంట్‌కు హాజరయ్యేందుకు రెడీ అయ్యి అక్కడ ఉన్న బ్యాగ్ కోసం చూడగా కనిపించ లేదు. అందులో ల్యాప్‌ట్యాప్‌తో పాటు ఖరీదైన మొబైల్ ఫోన్, క్రెడిట్, డెబిట్, బిజినెస్ కార్డులు, నగదు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిలింనగర్ క్రైమ్ పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం

కవాడిగూడ: డ్వాక్రా మహిళలు, చేనేత కార్మికులు, హస్తకళాకారులు తయారు చేసిన వస్తువులతో ఎన్టీఆర్ స్టేడియంలో శ్రీ సాయి డ్వాక్రా చేనేత, హస్తకళ ప్రదర్శనను గురువారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకురాలు కె.పద్మజ తెలిపారు. బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 29వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో మొత్తం 100 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, అన్ని రాష్ట్రాల హస్తకళాకారులు తయారు చేసిన దుస్తులు, చీరలు, వస్తువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వీటిని మార్కెట్ కంటే తక్కువ ధరలకే వినియోగదారులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. జంటనగరాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని హస్తకళాకారులను ఆదరించాలని కోరారు.

నేడు ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 22న (నేడు) జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన అధికారి అమర్లపూడి వందన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ 'జే గ్రూప్'కంపెనీ, ఇతర సంస్థల్లోని 80 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ విద్యార్హత ఉండి 18 ఏళ్లు పైబడిన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి ప్రారంభ నెల వేతనం రూ.12 వేల నుంచి వారి అర్హత, నైపుణ్యాన్ని అనుసరించి రూ.14 వేలతోపాటు ఇతర ఇన్సెంటీవ్‌లు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు ఉదయం 10.30 గంటలకు విజయనగర్ కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ధ్రువీకరణపత్రాలతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు 83284 28933 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యబీమా 'ఎలివేట్' ఆవిష్కరణ



లక్డీకాపూల్: ఐసీఐసీఐ లాంబార్డ్ ఆరోగ్యబీమా ఉత్పత్తి 'ఎలివేట్'ను బుధవారం ఎర్రమంజిల్‌లోని మెర్క్యురీ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ప్రొడక్ట్, ఆపరేషన్స్, సర్వీసెస్ హెడ్ ప్రియా దేశ్‌ముఖ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఐ ఆధారిత 'ఎలివేట్'వినియోగదారులకు ఆరోగ్య దిక్సూచి అని అన్నారు. ఇందులో ఆరోగ్యానికి సంబంధించిన అత్యాధునిక ఫీచర్లు, డైనమిక్ జీవనశైలి, ఊహించని వైద్య అత్యవసర పరిస్థితులు, వైద్య ద్రవ్యోల్బణం అవసరాలను తీర్చడానికి వ్యక్తిగతీకరించిన పరిష్కారాలు, బీమా రంగంలో ప్రముఖ ఆవిష్కరణలున్నట్లు పేర్కొన్నారు.

రేపు పాతికేళ్ల తెలంగాణ సాహిత్య సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ తాత్వికవేత్త, తెలంగాణ తొలి బీసీ కమిషన్ చైర్మన్, రచయిత బి.ఎస్.రాములు 75 ఏళ్ల అమృతోత్సవాలు ఈ నెల 23న ఉదయం 11 నుంచి రాత్రి పది గంటల వరకు రవీంద్రభారతిలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాతికేళ్ల తెలంగాణ సాహిత్యంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బి.నర్సింగరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 ఏళ్ల తెలంగాణ కథ, కవిత, నవల, బహుజన సాహిత్యం, బాల సాహిత్యం, మహిళా సాహిత్యం, తెలంగాణ పాటపై ప్రముఖ రచయిత్రులు, కవులు, అధ్యాపకులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రత్యేకంగా బి.ఎస్. రాములు రచనలపై ప్రముఖుల విశ్లేషణలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రచయితలు రచించిన 20కిపైగా గ్రంథాలను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

మాలమహానాడు నేత శ్రీకృష్ణ ఆమరణ దీక్ష



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న పబ్బతి శ్రీకృష్ణ

కూకట్‌పల్లి: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా అంబేడ్కర్‌వాద పార్టీలైన బీఎస్పీ, ఎల్‌జేపీ, ఆర్‌పీఐ(ఎ), భీమ్ ఆర్మీ ఇచ్చిన భారత్‌బంద్‌కు మద్దతుగా మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కులాలను విడదీసి శాశ్వత శత్రువులుగా మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నేటికీ చదువులేని కులాలను పాలకులు మర్చిపోయారని, ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని, విద్యారంగాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించి, దళిత, గిరిజన ప్రజలను మరింత బలహీనులను చేయాలని కుట్ర చేస్తున్నారని అన్నారు. ఈ కుట్రలను ఎదుర్కోవడానికి ఎస్సీ, ఎస్టీలు ఐక్యం కావాలని, బీజేపీ లాంటి మతోన్మాద పార్టీల వలలో చిక్కుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.బాలస్వామి, సురేష్, గోపాల్, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు ధర్నా



ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కంటోన్మెంట్: ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరిస్తే రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో–కన్వీనర్ పిల్లి సుధాకర్ హెచ్చరించారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాలమహానాడు చేపట్టిన భారత్‌బంద్‌లో భాగంగా పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో జూబ్లీ బస్‌స్టేషన్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. పోలీసులు ధర్నాను అడ్డుకుని, నిరసనకారులను మారేడుపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. సుధాకర్ మాట్లాడుతూ దళితుల ఐక్యతను దెబ్బతీసే కుట్రలో భాగమే వర్గీకరణ అని అన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్, నేతలు చిప్పల నర్సింగ్‌రావు, సత్యం, నాయకోటి రవికాంత్, రాష్ట్ర మహిళా కన్వీనర్ ఇందిరాప్రియదర్శిని, ఓయూ విద్యార్థి నేతలు పట్ల నాగరాజు, దుర్గం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'ఫీవర్'లో నిలిచిన ఓపీ సేవలు



ఎమర్జెన్సీ కేసులకు మాత్రమే చికిత్సలు అని నోటీసులు అంటించిన దృశ్యం



వార్డు 3లో చికిత్స పొందుతున్న రోగుల కేస్‌షీట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ జయలక్ష్మి

కుక్కకాటు బాధితులు, అత్యవసర రోగులకే చికిత్స

నల్లకుంట: కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఈ నెల 17వ తేదీ నుంచి దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో గత శనివారం నుంచి నల్లకుంట ఫీవర్ ఆసుపత్రులో వైద్యులు, జూనియర్ డాక్టర్లు సాధారణ వైద్య సేవలను నిలిపివేశారు. అత్యవసర రోగులు, కుక్కకాటు బాధితులకు మాత్రమే ఎమర్జెన్సీ వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో జలుబు, దగ్గు, జ్వరం లాంటి సాధారణ సీజనల్ వ్యాధుల చికిత్సల కోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 24వ తేదీ వరకు పరిస్థితి ఇదేవిధంగా ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. సాధారణ ఓపీకి నిత్యం 500 నుంచి 7 వందల మంది రోగులు వచ్చేవారు. ఇప్పుడు వంద నుంచి 130 మందికి మాత్రమే ఎమర్జెన్సీ ఓపీలో చికిత్సలు అందుతున్నాయి. దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను రక్షిత ప్రాంతాలుగా ప్రకటించాలని, అప్పుడే భయం లేకుండా పని చేసుకుంటామని వైద్యులు పేర్కొంటున్నారు.

పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయిస్తాం..

మహిళా వైద్యులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో వైద్యుల రక్షణ కోసం ఫీవర్ ఆసుపత్రిలో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ విషయంపై వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడాం. పోలీసుల రక్షణ తీసుకోవాలని వారు చెప్పారు. వారి సూచనల మేరకు ముందుకు పోతాం. ఒకటి రెండు రోజుల్లో ఈస్ట్ జోన్ డీసీపీ, ఓయూ ఏసీపీ, నల్లకుంట పోలీసులకు దరఖాస్తు చేస్తాం.

–జయలక్ష్మి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

'కంటోన్మెంట్'కు అదనపు తాగునీరు

- జలమండలికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- సీఎంకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీగణేశ్



సీఎంకి వినతిపత్రం అందజేస్తున్న శ్రీగణేశ్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే శ్రీగణేశ్, కంటోన్మెంట్ కాంగ్రెస్ నేతలు

కంటోన్మెంట్: ఎట్టకేలకు కంటోన్మెంట్ ప్రాంతంలో తాగునీటి కష్టాలు తీరనున్నాయి. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా అదనపు నీటి విడుదల కోసం కంటోన్మెంట్ బోర్డు అధికారులు కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నారు. తాజాగా ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యపై వినతిపత్రం అందజేశారు. కంటోన్మెంట్ సమస్యలపై తనకు సంపూర్ణ అవగాహన ఉందని చెప్పిన సీఎం, తక్షణమే అదనపు నీటిని విడుదల చేయాలని జలమండలి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఒకట్రెండు రోజుల్లోనే అదనపు నీటి విడుదలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేశ్ వెల్లడించారు. కంటోన్మెంట్ పరిధిలో రోజుకు 6.0 మిలియన్ గ్యాలన్స్ పర్ డే(ఎంజీడీ) నీటిని విడుదల చేస్తుండగా, ఇకపై 7.0 మిలియన్ గ్యాలన్ల నీటిని విడుదల చేయనున్నారు. దీంతో కంటోన్మెంట్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీల్లో రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేసే అవకాశం కలుగుతుంది. గతంలో కంటోన్మెంట్‌కు అదనపు నీటి కోసం అదనపు కనెక్షన్ చార్జీలు ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం కండిషన్ పెట్టింది. అయితే, ఇప్పుడు ఎలాంటి భారం లేకుండానే అదనపు నీటిని విడుదల చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తోపాటు సీఎంను కలిసిన వారిలో కంటోన్మెంట్ కాంగ్రెస్ నేతలు బద్రీనాథ్ యాదవ్, సంకి రవీందర్, నర్సింగ్ రావు, శ్యాంసన్ రాజు, అనిల్ కుమార్, పెద్దాల నర్సింహ, నగేశ్ తదితరులున్నారు.

ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్



సాక్షి, సిటీబ్యూరో: విదేశీ విద్యావకాశాలు, వాటితో పాటు అత్యున్నత ఉపాధి అవకాశాలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో వీటిని అందిపుచ్చుకునేందుకు యువత సిద్ధంగా ఉండాలని నగరానికి చెందిన విద్యావేత్తలు సూచించారు. అంతర్జాతీయ సంస్థ ఈటీఎస్, నగరానికి చెందిన మల్లారెడ్డి యూనివర్సిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ విద్యార్థుల్ని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు నిపుణులు హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. దాంతో పాటే యుకె ఇండియా స్కాలర్‌షిప్స్ అవకాశాలు, జీఆర్‌ఈ ఇండియా ఛాంపియన్ షిప్ ద్వారా నగదు బహుమతులు.. వంటి విద్యార్థులకు ఆర్థికంగా ఉపకరించే అంశాలకూ ఈ ఫెయిర్‌లో చోటు కల్పించారు. ఈటీఎస్ ఇండియా కంట్రీ మేనేజర్ సచిన్ జైన్, మల్లారెడ్డి వర్సిటీ వీసీ డా.వీఎస్.కె.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో 'అల్లం' లొల్లి



రైతులతో సమావేశమైన అధికారులు

చాదర్‌ఘాట్: జహీరాబాద్, కర్ణాటక రైతుల మధ్య అల్లం వివాదం ముదురుతోంది. జహీరాబాద్ ప్రాంతంలోని కోహీర్, కేరళ సరిహద్దుల్లోని కర్ణాటక నుంచి హైదరబాద్ వ్యవసాయ మార్కెట్‌కు అల్లం దిగుమతి అవుతోంది. అయితే తమ అల్లం కొనుగోళ్లపట్ల వ్యాపారులు వివక్ష చూపుతున్నారని కోహీర్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోహీర్ అల్లం గట్టిగా, ఎర్రటి మట్టితో ఉంటుంది. రుచిగా కూడా ఉంటుంది. అల్లం శుభ్రంగా లేకపోవడంతో వ్యాపారులు ధర ఎక్కువగా పెట్టడంలేదు. అల్లంను కడిగి శుభ్రం చేస్తే విరిగిపోతుందని, దాంతో రేటు మరింత తక్కువగా వస్తుందని రైతులు అంటున్నారు. మరోవైపు కర్ణాటక అల్లం రుచి సప్పగా ఉన్నా, లేతగా, శుభ్రంగా ఉంటుంది. పైగా ధర తక్కువ, లాభాలు ఎక్కువగా వస్తుండటంతో వ్యాపారులు కర్ణాటక అల్లం వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో కర్ణాటక అల్లం అమ్మకాలను అడ్డుకుంటామని జహీరాబాద్ రైతులు హెచ్చరిస్తున్నారు. కోహీర్ అల్లం అమ్మిన తరువాతే కర్ణాటక అల్లంకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కోహీర్, కర్ణాటక అల్లం ధరలో క్వింటాకు రూ. 2,000 తేడా ఉంటుందని, అందువల్ల కూడా వ్యాపారులు కర్ణాటక అల్లం వైపు మొగ్గు చూపుతున్నారని మార్కెట్ అధికారులు అంటున్నారు. అయితే మంత్రి ఆదేశాల మేరకు వ్యాపారులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, కోహీర్ అల్లంకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా ప్రయత్నిస్తామని ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు.

కేంద్ర సర్వీసుల్లో 'లేటరల్'ను ఎత్తివేయాలి



రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: లేటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా 45 మందిని వివిధ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో భర్తీ చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించడం దుర్మార్గమని, ఇది ఐఏఎస్, ఐపీఎస్ పోస్టులను ప్రైవేటీకరించడమేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ లేటర్ విధానాన్ని ఎత్తివేయాలని, లేనియెడల దేశాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర స్థాయి బీసీల సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు గండికొట్టే కుట్రలో భాగంగానే ఈ లేటరల్ విధానాన్ని తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో నిపుణులను నియమించాలనే పేరుతో ప్రభుత్వ పాలనలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు లేకుండా బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 1,670 ఐఏఎస్, 1,482 ఐపీఎస్ పోస్టులను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయకుండా దొడ్డి దారిన రాజకీయ కార్యకర్తలను భర్తీ చేయాలని చూస్తోందన్నారు. రిజర్వేషన్ల వివాదానికి తెరదించాలంటే ప్రధాని నరేంద్రమోదీ చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు ప్రకటించాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.రాఘవేందర్, వేముల రామకృష్ణ, టి.రాజ్‌కుమార్, నంద గోపాల్, గొరిగె మల్లేష్ యాదవ్, మట్ట జయంతి, ఉదయ్ నేత, జిల్లాపల్లి అంజి, నిఖిల్ పటేల్, సతీష్ పాల్గొన్నారు.

'మహాప్రస్థానం' నిర్వహణ భేష్

– గ్రేటర్ చెన్నయ్ కమిషనర్ కితాబు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో ఆధునిక శ్మశానవాటికలు, పారిశుధ్య నిర్వహణ చర్యలు బాగున్నాయని గ్రేటర్ చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురు బరన్ అన్నారు. జీహెచ్‌ఎంసీలో ఆధునిక శ్మశానవాటికలు, పారిశుధ్య నిర్వహణ అంశాలను అధ్యయనం చేయడానికి నగరానికి వచ్చిన ఆయన సంజీవయ్య పార్కులో చేపట్టిన చెత్త ట్రాన్స్ఫర్ స్టేషన్, ఇందిరాపార్కు, జూబ్లీహిల్స్‌లోని మహా ప్రస్థానాలను సందర్శించారు. మహాప్రస్థానం నిర్వహణ గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని బాగుందని ప్రశంసించారు. మహాప్రస్థానం నిర్వాహకులను చెన్నైకి రావాలని కోరారు. ఇందిరా పార్క్‌లో గ్రీనరీ నిర్వహణ కూడా బాగుందన్నారు.

రోబో సాయంతో రొమ్ము కేన్సర్ చికిత్స

- తెలంగాణ, ఏపీలో తొలిసారిగా..
- విజయవంతంగా నిర్వహించిన అపోలో వైద్యులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచవ్యాప్తంగా ప్రతి 9 మంది మహిళల్లో ఒకరు రొమ్ము కేన్సర్ బారిన పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం 23 లక్షల మందికిపైగా మహిళలు రొమ్ము కేన్సర్‌తో బాధపడుతున్నారు. రొమ్ము కేన్సర్‌కు హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రి వైద్యులు తెలంగాణ, ఏపీలోనే తొలిసారిగా యూనీ పోర్టల్ రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీ నిర్వహించారు. సర్జికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ జగదీశ్వర్ నేతృత్వంలోని వైద్యబృందం ఈ సర్జరీని నిర్వహించింది. ఈ వినూత్న శస్త్రచికిత్సలో కచ్చితత్వంతో పాటు అనేక ప్రయోజనాలు ఉన్నాయని వైద్య బృందం వెల్లడించింది. బుధవారం శస్త్రచికిత్స విజయవంతంగా జరిగిన సందర్భంగా డాక్టర్ జగదీశ్వర్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ కేవలం 3 సెం.మీ. మేర కోత పెట్టి ఈ శస్త్రచికిత్స చేసి, కేన్సర్ సోకిన కణజాలాన్ని తొలగిస్తామని, దీంతో ఎలాంటి మచ్చ ఉండదని వివరించారు. కార్యక్రమంలో అపోలో కేన్సర్ సెంటర్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాచౌక్‌లో దివ్యాంగుల నిరసన

కాంగ్రెస్ హామీలను నెరవేర్చాలని డిమాండ్




ఇందిరాపార్కులో ధర్నా చేస్తున్న దివ్యాంగులు

కవాడిగూడ: అసెంబ్లీ ఎన్నికల ముందు దివ్యాంగులకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బుధవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్(డీఎస్‌డీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జంటనగరాలతోపాటు రాష్ట్రంలో ఉన్న దివ్యాంగులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే దివ్యాంగుల పింఛన్లను రూ.ఆరు వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారం చేపట్టి 9 నెలలు గడిచినా ఇంకా దానిని అమలు చేయడం లేదన్నారు. తమ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో చైర్మన్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రాలు అందజేయాలని ప్రయత్నిస్తున్నా, ఎవరూ అనుమతి ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కూడా గత ప్రభుత్వాల మాదిరిగానే దివ్యాంగుల పట్ల వ్యవహరించడం బాధాకరమన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం–2016ను పటిష్టంగా అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో దివ్యాంగులకు 5 శాతం కేటాయించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను నెలరోజుల్లోగా ప్రభుత్వం పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రజాభవన్ ముందు పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.భారతి, ఉపాధ్యక్షుడు కె.వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా నజర్.. కబ్జాదారుల ఫికర్!

- శివారులో వందలాది చెరువులు కబ్జాకు గురైనట్లు గుర్తింపు
- అక్రమ కట్టడాలపై గతంలో నామమాత్రపు చర్యలు



చింతల చెరువు

సాక్షి, సిటీబ్యూరో: ఆక్రమణదారుల్లో వణుకు మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం మహానగర విస్తరణకు అనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలు అందించేందుకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ అథారిటీ(హైడ్రా) ఏర్పాటు చేసింది. అది ఇప్పటికే కార్యాచరణ మొదలుపెట్టింది. శివారుల్లోని కొన్ని ప్రాంతాల్లో కబ్జాకు గురైన చెరువులపై అక్కడి ప్రజలిచ్చిన ఫిర్యాదులను స్వీకరించింది. ఈ నేపథ్యంలోనే ఆక్రమణకు గురైన చెరువులను గుర్తించి చర్యలకు ఉపక్రమించింది. వాననీరు, వరదలతో నిండి కళకళలాడాల్సిన చెరువులు బహుళ అంతస్తుల భవనాలకు, కాలనీలకు ఆవాసాలుగా మారాయి. రాజకీయ పలుకుబడి, అంగ, అర్థ బలం కలిగిన కబ్జాదారులు హైదరాబాద్‌సహా శివారుల్లోని మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో సుమారు 250 చెరువులను, చెరువు శిఖం భూములను, బఫర్‌జోన్‌లను ఆక్రమించి పెద్ద ఎత్తున వెంచర్‌లు వేశారు. రూ.వందల కోట్లు ఆర్జించారు. ఇవేమీ తెలియక స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకొన్న సామాన్య, మధ్య తరగతి ప్రజలు మాత్రం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఆయా కాలనీలు వర్షాకాలంలో జలమయమవుతున్నాయి. హబ్సిగూడ, రామంతాపూర్ చెరువును ఆనుకొని ఏర్పడిన మూడు కాలనీలు ప్రతి ఏటా వర్షాకాలంలో మునకేస్తున్నాయి.

- కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ప్రగతినగర్, నిజాంపేట్, గాజులరామారం, సరూర్‌నగర్, మేడ్చల్, దమ్మాయిగూడ, బోడుప్పల్, పీర్జాదిగూడ, టోలిచౌకి, గుండ్లపోచంపల్లి, జల్‌పల్లి, బడంగ్‌పేట్, నాచారం, ఉప్పల్, చెంగిచర్ల, మల్కాజిగిరి, ఘట్కేసర్, పోచారం తదితర ప్రాంతాల్లో చెరువులు అదృశ్యమై కాలనీలు పుట్టుకొచ్చాయి. ఇళ్ల నిర్మాణానికి నీటిపారుదల, రెవెన్యూ విభాగాలు యథేచ్ఛగా అనుమతులిచ్చేస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ అనుమతులు మరింత ఆజ్యం పోస్తున్నాయి.
- మేడ్చల్ నియోజకవర్గం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 'రా'చెరువు, చింతల చెరువు బఫర్ జోన్లను కొందరు దర్జాగా కబ్జా చేసి, బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. చెంగిచర్ల బస్సు డిపో సమీపంలో ఉన్న చెరువు కట్టను ధ్వంసం చేసి బహుళ అంతస్తుల భవనాలను నిర్మించారు.



చెంగిచర్ల చెరువులో..



- దమ్మాయిగూడ, నాగారం, పీర్జాదిగూడ, ఘట్కేసర్ పురపాలక సంఘాల పరిధిలోని చెరువు భూముల్లో కూడా అక్రమంగా భవనాలు వెలిశాయి.

గతంలో మొక్కుబడి కూల్చివేతలే...

కుత్బుల్లాపూర్, గాజుల రామారం,కూకట్‌పల్లి, ఉప్పల్ సర్కిళ్లలో వరదలతో కాలనీలన్నీ జలమయంగా మారినప్పుడల్లా చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ పరిధిలోని పలు అక్రమ కట్టడాలను అధికారులు మొక్కుబడిగా కూల్చివేసేవారు. వీరి అలసత్వాన్ని అవకాశంగా తీసుకున్న కబ్జాదారులు కోర్టు కెళ్లుతుండటంతో అధికారులు వాటి జోలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చెరువులు, కుంటల కబ్జాలపై పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు, ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు, ఉన్నత స్థాయి ఒత్తిళ్లు వచ్చినప్పుడు మాత్రమే నీటిపారుదల శాఖ అధికారులు రెవెన్యూ యంత్రాంగంతో కలిసి నామమాత్రం కూల్చివేతలు చేపట్టి చేతులు దులుపుకునేవారు. లేదంటే రెవెన్యూ–నీటిపారుదల శాఖల అధికారులు ఒకరిపై మరొకరు నెపం మోపుకునేవారు. ఈ శాఖల మధ్య సమన్వయ లోపం కబ్జాదారులకు వరంగా మారింది.



దమ్మాయిగూడ నాసిమ్ చెరువులో..

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 22, ఆగస్టు, 2024



ప్రతిభ వెలికితీసేందుకు..!

ఆర్‌వీ స్క్వేర్ క్రియేటివ్ హబ్ షురూ..



సాక్షి, సిటీబ్యూరో: సినీరంగంలో రాణించాలనుకుని, ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహించేందుకు ఇండో–ఆస్ట్రేలియన్ ప్రొడక్షన్ హౌజ్ అయిన మెల్‌బోర్న్ మామా క్రియేటివ్ స్పేస్ సంస్థతో మాదల వేణు, రమాకాంత్ కలిసి ఏర్పాటు చేసిన ఆర్‌వీ స్క్వేర్ క్రియేటివ్ హబ్‌తో కొలాబ్ అయ్యారు. ఔత్సాహిక నిర్మాతలు, ప్రతిభావంతులైన కళాకారుల కలలకు ప్రాణం పోసేందుకు ఈ రెండు సంస్థలు ఒకటయ్యాయి. సినిమా, వెబ్‌సిరీస్‌లకు సంబంధించి ఔత్సాహిక డైరెక్టర్లు, రచయితలు, నటీనటులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ప్రాజెక్టును ముందుకు నడిపించడమే తమ ఉద్దేశమని ఆర్‌వీ స్క్వేర్ క్రియేటివ్ హబ్ వ్యవస్థాపకుడు మాదల వేణు పేర్కొన్నారు. ఈ రెండు సంస్థల కలయికకు సంబంధించి కార్యక్రమం హైదరాబాద్‌లోని ఓ హోటల్ వేదికగా జరిగింది. ముఖ్య అతిథిగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో భారతీయం సత్యవాణి, పద్మశ్రీ శోభ రాజు, ఉప్పల శారద, పీవీ నర్సింహారావు మనవరాలు అజిత సురభి, మాలావత్ పూర్ణ, మాదల వేణు, ప్రముఖ సింగర్ ఎంఎం శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.



అమెరికాలో పుట్టి నగరంలోనూ హవా..

అక్టోబరులో అట్టహాసంగా వరల్డ్ కప్..

హాబీ గేమ్‌గా, ప్రొఫెషన్‌గానూ ఆదరణ

ఓ అంతర్జాతీయ సరికొత్త క్రీడ నగరవాసుల్ని ఉర్రూతలూగిస్తోంది. హాబీగా ఆడుకునేవాళ్లని ఉత్సాహపరుస్తోంది.. సీరియస్ ప్రొఫెషన్‌గానూ ఊరిస్తోంది. నటేకర్ స్పోర్ట్స్ అండ్ గేమింగ్ ఆధ్వర్యంలో జరగనున్న వరల్డ్ పికిల్ బాల్ లీగ్ (డబ్ల్యూపీబీఎల్)లో చెన్నై టీమ్‌ను నటి సమంత సొంతం చేసుకున్నారు. తొలిసారిగా క్రీడా పోటీల బరిలో సమంత దిగడంతో అందరి దృష్టి పికిల్ బాల్‌పై మళ్లింది. సిటీకి పరిచయమై ఏడాదిన్నరలోనే ఇంతింతై పికిలింతై అన్నట్టుగా విస్తరిస్తోన్న పికిల్ బాల్ గురించిన విశేషాలివే..

- సాక్షి, సిటీబ్యూరో





హైదరాబాద్ వైబ్స్

పీక్స్‌లో.. పికిల్ బాల్

సిటిజనుల్ని ఉర్రూతలూగిస్తోన్న ఆట



విశేషాలివే..

- ప్లేయర్లు కోర్టుల సంఖ్య పరంగా దేశంలో పికిల్‌బాల్‌లో అహ్మదాబాద్ అగ్రస్థానంలో ఉంది. ఈ సంవత్సరం అక్టోబర్ 23 నుంచి 27 వరకు ప్రపంచ పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూపీసీ)కి ఈ నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. గుజరాత్ స్టేట్ పికిల్‌బాల్ అసోసియేషన్, ఇండియన్ పికిల్‌బాల్ అసోసియేషన్, మార్చిలో ప్రకటించాయి. అక్టోబర్‌లో అహ్మదాబాద్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొంటారు.
- టెన్నిస్, బ్యాడ్మింటన్ వంటి ఇతర క్రీడలను ఆడినవారు సైతం పికిల్‌బాల్‌కు మారుతుండటం కనిపిస్తోంది. ఆసియాలో అగ్రశ్రేణి ఆటగాడిగా పేరొందిన 12 ఏళ్ల వీర్ షా సైతం టెన్నిస్ నుంచి పికిల్‌కు మారగా బ్యాడ్మింటన్ నుంచి పికిల్‌బాల్‌కు మారిన తేజస్ మహాజన్ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో బహుళ పతకాలను గెలుచుకున్నాడు.
- 'రాబోయే సంవత్సరాల్లో, క్రికెట్ తర్వాత భారతీయులలో పికిల్‌బాల్ రెండవ ఇష్టమైన క్రీడగా మారుతుందని పలువురు క్రీడా నిపుణుల అంచనా.
- కోర్టు నిర్మాణానికి వ్యయప్రయాసలు తక్కువ ఉండటం వల్ల ఈ పికిల్ బాల్ కోర్టులు అంతకంతకూ పెరుగుతున్నాయి. అంతేగాకుండా, దీని పట్ల ఆసక్తి చూపిస్తున్నవారిలో మహిళలతో సహా అన్ని వయసుల వారూ ఉన్నారు.
- పికిల్‌బాల్ మూలాలు 1960 ప్రాంతంలో యునైటెడ్ స్టేట్స్‌లో ఉన్నాయి. ఆల్ ఇండియా పికిల్‌బాల్ అసోసియేషన్ 2008లోనే ప్రారంభించబడినప్పటికీ, చాలా ఆలస్యంగా ఇది పుంజుకుంది.
- జాతీయ స్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్‌లు ఎలా ఉన్నప్పటికీ, 2022లో ముంబైలో పికిల్‌బాల్ ప్రపంచ కప్‌గా పరిగణన పొందిన బైన్‌బ్రిడ్జ్ కప్‌ను నిర్వహించడం పికిల్ బాల్‌కి బాగా ఊపు తెచ్చింది.

అమెరికాలో అత్యంత ఆదరణ పొందిన ఆట పికిల్ బాల్.. మన దేశానికి ఇటీవలే పరిచయమైనప్పటికీ.. శరవేగంగా ఔత్సాహికులకు చేరువవుతోంది. శిల్పాశెట్టి వంటి నిన్నటి తరం బాలీవుడ్ టాప్ స్టార్స్ సైతం హాబీగా పికిల్‌బాల్‌ను ఎంచుకుంటున్నారంటే ఈ ఆట ఎంత క్రేజీగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

మూడు ఆటల మేలు కలయిక...

టెన్నిస్, బ్యాడ్మింటన్ టేబుల్ టెన్నిస్‌ల మేలు కలయికగా పికిల్‌బాల్‌ను చెప్పుకోవచ్చు. ఇతర క్రీడలతో పోలిస్తే తక్కువ కదలికలు పరుగు అవసరం కాబట్టి ఏ వయస్సు వారైనా ఆడేందుకు వీలుంటుంది. బ్యాడ్మింటన్ కోర్ట్ లా పికిల్ బాల్ కోర్టు 44 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు ఉంటుంది. నెట్ ఎత్తు 36 అంగుళాలు మాత్రమే ఉంటుంది. పికిల్‌బాల్‌లో ఉపయోగించే పాడిల్ (చెక్క బ్యాట్) టేబుల్ టెన్నిస్‌లో ఉపయోగించే బ్యాట్ కంటే కొంచెం పెద్దది. దీని ధర రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. చిల్లులున్న ఓ గట్టి ప్లాస్టిక్ బంతిని ఉపయోగించి ఆడతారు. సింగిల్స్ లేదా డబుల్స్/మిక్స్‌డ్ డబుల్స్ కూడా ఆడవచ్చు. మొత్తం 11 పాయింట్ల కోసం ఆడాల్సి ఉంటుంది. 2 పాయింట్ల తేడాతో గెలవాల్సి ఉంటుంది. నేర్చుకోవడం చాలా సులభమే గానీ నైపుణ్యం సాధించడం చాలా కష్టం కావడం వల్ల తొలిదశలో చాలా మంది హాబీగా మాత్రమే దీన్ని ఎంచుకుంటున్నారు.

సిటీలో ఏడాదిన్నరగా..

ఈ ఆట నగరానికి పరిచయమై దాదాపుగా ఏడాదిన్నర కావస్తోంది. కొండాపూర్‌లో తొలిసారి పికిల్ బాల్ ఎరీనా పేరుతో ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఒకే చోట నాలుగు కోర్టులు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం మాదాపూర్, బంజారాహిల్స్‌లలో ఉన్న గేమ్ పాయింట్ మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో కూడా ఇది అందుబాటులో ఉంది. త్వరలోనే ఔటర్ రింగ్ రోడ్ సమీపంలో 8 కోర్టులు ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది. అమెరికా రిటర్న్‌డ్‌కి దీనిపై బాగా అవగాహన ఉంది. వాళ్లే ఎక్కువ ఏర్పాటు చేస్తున్నారు. అమెరికాలో టెన్నిస్ కోర్టులన్నీ పికిల్ బాల్ కోర్టులుగా మారుతున్నాయి.




రిక్రియేషన్ క్రీడగా ప్రాచుర్యంలోకి..



టెన్నిస్ బాల్‌తో పోలిస్తే పికిల్ బాల్ స్లోగా నేర్చుకోవడం సులభంగా ఉంటుంది. మరీ ఎక్కువ ఫిట్‌నెస్ కూడా ఉండాల్సిన అవసరం లేదు. అందువల్ల చిన్న పిల్లల నుంచి సీనియర్ సిటిజన్స్ ఇష్టపడుతున్నారు. అమ్మాయిలు కూడా ఇష్టం చూపిస్తున్నారు. ఒక్కో గేమ్ కనీసం 20 నిమిషాల నుంచి 30 నిమిషాల వరకూ ఉండటం వల్ల ఒక మంచి వ్యాయామంగా కూడా ఉపకరిస్తోంది. సో.. ప్రస్తుతం ఒక రిక్రియేషన్ గేమ్‌గా ఇది సిటీలో పాపులర్ అయ్యింది. అయితే ఇటీవలే దీన్ని ఒక సీరియస్‌గా కూడా తీసుకుని ఆడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మేం ఇటీవలే ఒక పికిల్‌బాల్ టోర్నమెంట్ కూడా నిర్వహించాం. భవిష్యత్తులో ఇది బలమైన క్రీడగా మారనుండటం మాత్రం తథ్యం.

– ఆదిత్య, నిర్వాహకులు, గేమ్ పాయింట్ మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్



లవ్ ఎట్ ఫస్ట్ సైట్..

పికిల్ బాల్‌తో నాది లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అని చెప్పాలి. ఈ ఆటతో నేను అమాంతం ప్రేమలో పడిపోయాను. తొలిసారి దీన్ని పరిచయం చేసిన దగ్గర్నుంచే ఇది నా మనసు దోచుకుంది. భారతీయ క్రీడాభివృద్ధిలో భాగం కావాలనేది ఎప్పటి నుంచో నా కోరిక.. అలాగే క్రీడల్లో మహిళల పురోగతిని మరింతగా కోరుకుంటున్నా.

– సమంత, సినీనటి



క్విక్ హెల్త్ ఇన్ఫర్మేషన్ @AI

- ప్రపంచంలో మొదటి హెల్త్ మానిటరింగ్ ఏఐ యాప్
- రూపొందించి, ఆవిష్కరించిన తెలుగు వ్యక్తి

హార్ట్ బీట్, వైటల్ చెక్ కోసం నూతన యాప్

సాక్షి, సిటీబ్యూరో: ఆరోగ్య సంరక్షణలో భాగంగా యాప్ ఆధారిత హెల్త్ టూల్స్‌లోకి కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అడుగులేస్తోంది. ఇందులో భాగంగా నగరంలోని హోటల్ ఆవాసా వేదికగా బుధవారం ప్రపంచంలోనే మొట్టమొదటి ఏఐ ఆధారిత డీప్ లెర్నింగ్ పవర్డ్ హెల్త్ మానిటరింగ్ యాప్ క్విక్ వైటల్స్‌ను ఆవిష్కరించారు. తెలుగు వ్యక్తి, బిసామ్ ఫార్మాస్యూటికల్స్ వ్యవస్థాపకులు ఎండీ హరీష్ బిసామ్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ యాప్ స్మార్ట్‌ఫోన్ లేదా టాబ్లెట్ ద్వారా కీలకమైన హెల్త్ డేటాను అందిస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్కో డాక్టర్ వంద మందికిపైగా రోగులను పరీక్షిస్తుంటారు. ఇలాంటి తరుణంలో ఈ యాప్‌లు కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రక్త పరిమాణంలోని వైవిధ్యాలను కాంతి శోషణ మార్పులను విశ్లేషించడానికి ఈ యాప్‌లో ఫొటోప్లెథిస్మోగ్రఫీ(పీపీజీ) అనే సాంకేతికతను వినియోగించడం విశేషం.

డేటా భద్రత, గోప్యతకు మా హామీ..

ఈ నేపథ్యంలో హరీష్ బిసామ్ మాట్లాడుతూ.. ఈ వినూత్న సాంకేతికత ఆధారంగా మొబైల్ యాప్‌లో కేవలం సెకన్లలో ఆరోగ్య సూచికలను ఖచ్చితంగా తెలుసుకోవచ్చు. డాక్టర్‌ను కలవకుండానే ప్రాథమిక సమాచారాన్ని పొందడానికి ఈ యాప్ దోహదపడుతుందని అన్నారు. ఈ యాప్ కెమెరా ఆధారిత కాంటాక్ట్‌లెస్ స్పాట్ చెక్‌లు, పీపీజీ సెన్సార్‌లతో పర్యవేక్షణ చేస్తుంది. ఇది బలమైన క్లౌడ్ రిజిస్ట్రేషన్‌తో పాటు కఠినమైన భారతీయ డేటా రక్షణ ప్రమాణాలకు కట్టుబడి ఉంటుందని, కాబట్టి డేటా భద్రత, గోప్యతకు ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. ఈ ఆవిష్కరణలో భాగంగా ఏఐ, డీప్ లెర్నింగ్: ది ఫ్యూచర్ ఆఫ్ హెల్త్‌కేర్ అంశంపై ప్రత్యేకంగా ప్యానెల్ చర్చ నిర్వహించారు. చర్చలో ప్లానింగ్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ చిన్నారెడ్డి, ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డా.సుధ, డ్రగ్ కంట్రోల్ అథారిటీ మాజీ డైరెక్టర్ డా.పి.వెంకటేశ్వర్లు, డా.పూర్ణిమ, ఇన్నోవేటర్–ప్రొడక్ట్ స్పెషలిస్ట్ డేనియల్ గోల్డ్‌మన్, కాటలిస్ట్ వ్యవస్థాపకులు ఆండ్రూ షోస్టాక్, డాక్టర్ ఉషతో పాటు టెక్ ఔత్సాహికులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.



వన్నె తగ్గని హ్యాండ్లూమ్

సాక్షి, సిటీబ్యూరో: చేనేతకారులు నేసిన వస్త్ర సౌందర్యాల మధ్య ప్రముఖ టాలీవుడ్ వర్ధమాన నటి సౌమ్య జాను సందడి చేశారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్–12లోని కళింగ కల్చరల్ హాలు వేదికగా బుధవారం ఏర్పాటు చేసిన 'హ్యాండ్ టూ హ్యాండ్' చేనేత వస్త్ర ప్రదర్శనను సినీ నటి సౌమ్య జాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని, ఈ ఉత్పత్తులపై నేటికీ వన్నె తగ్గలేదని తెలిపారు. నేటితరం యువత కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. వీటిని సినీతారలు ప్రత్యేకంగా కస్టమైజ్ చేసుకుని ధరిస్తున్నారని ఆమె అన్నారు. ప్రదర్శన 24వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. 14 రాష్ట్రాలకు చెందిన చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని నిర్వాహకులు జయేష్ గుప్తా వెల్లడించారు.




బాలీవుడ్ నైట్.. 23న

సాక్షి సిటీబ్యూరో: ముంబైకి చెందిన ప్రముఖ లేడీ డీజే కర్మ.. లైవ్ దర్బూక పేరిట ప్రదర్శన ఇస్తున్నారు. నగరంలోని శ్రీనగర్‌కాలనీ రోడ్‌లో ఉన్న కమలాపురి కాలనీలోని విస్‌ఫ్లోరా రెసిడెన్సీ హోటల్‌లో శుక్రవారం రాత్రి 8.30 గంటల నుంచీ ఈ బాలీవుడ్ నైట్ ఈవెంట్ జరగనుంది. ఈ షోలో తనదైన శైలిలో విభిన్న రకాల ట్రాక్స్‌ను ఆమె కదం తొక్కించనున్నారు.

డార్క్ కామెడీ షో.. 25న..

సాక్షి, సిటీబ్యూరో: నగరవాసుల్ని ఇటీవల అమితంగా ఆకట్టుకుంటున్న వాటిలో కామెడీ షోలదే అగ్రస్థానం. ఈ నేపథ్యంలో మరో హాస్యభరిత కార్యక్రమం ఓన్లీ కామిక్స్ లెఫ్ట్ ఎలైవ్ పేరిట ఏ డేంజరస్ స్టాండప్ కామెడీ షో అనే ట్యాగ్ లైన్‌తో సిటీలో ఓ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్‌లోని ఎన్‌హ్యాన్స్ కేఫ్ అండ్ కన్ఫెక్షనరీలో ఈ నెల 25వ తేదీన రాత్రి 7గంటలకు ఈ కార్యక్రమం ఉంటుంది.





డైనోసర్ ఎక్స్‌పీరియన్స్

సాక్షి, సిటీబ్యూరో: నగర ప్రజలకు సరికొత్త అనుభూతులు అందించడానికి నెక్సస్ మాల్లో 'డైనోసర్ ఎక్స్‌పీరియన్స్' ఏర్పాటు చేశారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15 వరకు కొనసాగుతుంది. డైనోసార్ ప్రదర్శనలో డినో ఫాసిల్ మ్యూజియం, ఎత్తయిన డినో లింబ్, డైనోసార్ ఫుట్‌స్టెప్స్ ట్రయల్, ఆకట్టుకునే స్కెలిటన్ డిస్‌ప్లే ఉన్నాయి. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అనుమతిస్తారు.

బర్మా ఫుడ్.. క్రేజీ టేస్ట్

- వారసత్వ వంటకాలకు సిటీలో క్రేజ్
- ఆసక్తికి అనుగుణంగా వినూత్న రెస్టారెంట్లు
- హైటెక్ సిటీ, నాలెడ్జ్ సిటీలో బర్మా పసందైన రుచులు

వినూత్న వంటకాలను ఆస్వాదించే వారి సంఖ్య ఈ మధ్య పెరిగింది. సిటీ లైఫ్‌లోని పాశ్చాత్య ఒరవడులకు గతకాలపు అభిరుచులను అద్ది వడ్డించే పసందైన రుచులకు ఆదరణ పెరిగింది. ఇలాంటి రెస్టారెంట్లు, ఫుడ్ స్పాట్స్‌కు నగరంలో మంచి క్రేజ్ ఉంది. ఐతే ఇలాంటి అంశాలతో కొన్ని రెస్టారెంట్లు నగరంలో ఇప్పటికే ఆదరణ పొందుతుండగా.. వారసత్వ వంటకాలకు అధునాతన హంగులద్ది వడ్డించే బర్మా బర్మా రెస్టారెంట్ హైటెక్ సిటీలో సందడి చేస్తోంది. అంతేగాకుండా బర్మీస్ వంటకాల రుచి తెలిసిన ఫుడ్ లవర్స్‌కు క్రేజీ స్పాట్‌గా మారింది.

- సాక్షి, సిటీబ్యూరో

బర్మా సంస్కృతికి ప్రతీకగా..

ఖౌసూయ్, టీ లీఫ్ సలాడ్, సమోసా సూప్, మాండలే నూడిల్ బౌల్, బర్మీస్ ఫలూదా వంటి వంటకాలు ఇప్పుడు చాలామందికి ఫేవరెట్ డిషెస్‌గా మారాయి. పరాటాతో టోఫు మాష్, కొబ్బరి క్రీమ్‌తో స్టిక్కీ రైస్, మెకాంగ్ కర్రీ, కుంకుమపువ్వు–సమోసా, చీజ్‌కేక్ వంటి నోరూరించే రుచులకు నాలెడ్జ్ సిటీలోని బర్మా కేఫ్ అడ్రస్‌గా మారింది. బర్మాలో ప్రసిద్ధి చెందిన ఈ విభిన్న రుచులు నగరంలో ప్రారంభించడం విశేషం. ఆసియాలోని అతిపెద్ద ఐటీ పార్కులలో ఒకటైన నగరాన్ని తన గమ్యస్థానంగా ఎంచుకోవడం, ఆహారాన్ని ఆస్వాదించడంలోనూ నగరవాసుల వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తోంది. బర్మా సంప్రదాయ ప్రతీకలైన బర్మీస్ స్వరాలతో పాటు అక్కడి వీధులు, గృహాల నుంచి ప్రేరణ పొందిన యాంబియన్స్‌తో ఆహ్లాద ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది. బర్మీస్ ప్రత్యేకతల నుంచి అత్యుత్తమంగా ఎంపిక చేసిన ఆర్టిసానల్ 'టీ'లు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇక్కడి స్ట్రీట్ ఫుడ్ మొదలు తరతరాలుగా ఆదరణ పొందుతున్న గిరిజన, వారసత్వ వంటకాలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉడికించిన అరటి ఆకు పాకెట్స్(కయునిన్ మావో) సిగ్నేచర్‌గా నిలుస్తుంది.



సంస్కృతుల సమ్మేళనం..

వలస ఆహార సంస్కృతులు, స్వదేశీ పదార్థాలతో సమ్మిళితమైన గతకాలపు హోమ్‌స్టైల్ వంటలు వైవిధ్యాన్ని ప్రదర్శిస్తుండగా ఇక్కడి బెస్ట్ సెల్లర్స్‌లో 'మామిడి సలాడ్, స్పైసీ టీ లీఫ్, అవకాడో సలాడ్, లోటస్ రూట్ చిప్స్, సమోసా సూప్, బ్రౌన్ ఆనియన్, రంగూన్ బేక్డ్ మిల్క్' ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. చిన్ననాటి స్నేహితులైన చిరాగ్ ఛజెర్, అంకిత్ గుప్తాల ఆలోచనల్లోంచి ఆవిష్కృతమైన బర్మా బర్మా.. ప్రస్తుతం బెంగళూరు, ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, అహ్మదాబాద్‌లో విస్తరించింది. ముఖ్యంగా కోల్‌కతాలో ఎన్నడూ లేనివిధంగా బర్మీస్ సంస్కృతికి జీవం పోస్తోందని సహవ్యవస్థాపకులు అంకిత్ గుప్తా పేర్కొన్నారు. 2023లో అందించిన కొండే నాస్ట్ ట్రావెలర్ టాప్ రెస్టారెంట్ అవార్డ్స్‌లో బర్మా బర్మా 34వ స్థానంలో నిలిచిందని అన్నారు. వంటకాలు పులుపు, కారం రుచులతో.. కాఫీర్ లైమ్‌లు, బాలాచాంగ్ మిరియాలు, పొద్దుతిరుగుడు విత్తనాలు తదితరాలను వినియోగిస్తాం. సిటీలో బర్మా నుంచి తీసుకొచ్చిన బాండెల్ చీజ్, పికిల్డ్ ప్లం, బాలచాంగ్ పెప్పర్స్, లాఫెట్ వంటి బర్మీస్ పదార్థాల రుచులతో నగరవాసులను యాంగోన్ వీధులకు తీసుకెళతామని వివరించారు.

సీఎం రేవంత్‌కు కోర్టు నోటీసులు

సిటీ కోర్టులు: పరువు నష్టం కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి నాంపల్లి కోర్టు నోటీసులు జారీ చేసింది. బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ రేవంత్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేశారంటూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పరువునష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సెప్టెంబర్ 25లోగా నోటీసులు జారీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. మే 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి బీజేపీపై నిరాధారమైన వ్యాఖ్యలు చేశారని కాసం పిటిషన్‌లో పేర్కొన్నారు. 50వేల కంటే ఎక్కువ మంది ఉన్న సభలో రేవంత్ రెచ్చగొట్టే ఆరోపణలు చేశారని, ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారని పేర్కొన్నారు. కాసం ఫిర్యాదు మేరకు రేవంత్‌పై సెక్షన్ 153, 171సీ, 171జీ, 499, 505 ఐపీసీ రెడ్‌విత్ సెక్షన్ 125 ప్రజాప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదైంది.

'ఫామ్‌హౌజ్ నిర్మాణంలో చట్టాన్ని ఉల్లంఘించలేదు'



చెన్నూర్: తన ఫామ్‌హౌజ్ నిర్మాణంలో చట్టాన్ని ఉల్లంఘించలేదని కొంతమంది పనిగట్టుకుని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైడ్రా చట్టం ప్రకారం తన ఫామ్‌హౌజ్ లేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే నిరూపించాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. లేనిపక్షంలో కేటీఆర్‌పై పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

'జన్వాడ భూములన్నీ కేటీఆర్‌వే'!



సాక్షి, హైదరాబాద్: జన్వాడలో కల్వకుంట్ల కుటుంబం పేరు మీద ఉన్న భూములన్నీ కేటీఆర్‌వేనని ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నాలాలను కూల్చి కేటీఆర్ ఫామ్‌హౌస్ కట్టారని, అది తనది కాదంటున్న ఆయన పౌరుషం ఉంటే అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని కూల్చి వేయాలని డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జన్వాడ ఫామ్‌హౌజ్ భూములన్నీ ఆయన సతీమణి శైలిమ పేరు మీద ఉన్నాయన్నారు.

కవిత కేసులో సీబీఐ చార్జిషీటుపై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులపై సీబీఐ దాఖలుచేసిన సప్లిమెంటరీ చార్జిషీటుపై ట్రయల్ కోర్టు విచారణ వాయిదా వేసింది. ఈ కేసు బుధవారం రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా విచారించారు.

జ్యోతిషుడు వేణుస్వామికి ఊరట

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ జ్యోతిషుడు వేణుస్వామికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ నెల 12న రాష్ట్ర మహిళా కమిషన్ ఇచ్చిన సమన్లను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 27కు వాయిదా వేసింది. 'నాకు జ్యోతిషం చెప్పడంలో విశేష అనుభవం ఉంది. నాపై వ్యక్తిగత ద్వేషంతో తెలుగు సినిమా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదు చేసింది. సోషల్ మీడియాలో తప్పుడు మెసేజ్‌లు సృష్టించి, సెలబ్రిటీలను అవమానిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చట్టం 1998లోని సెక్షన్ 14(1)(ఏ) కింద చైర్‌పర్సన్ జారీ చేసిన సమన్లు చట్టవిరుద్ధం. ఈ సమన్లను కొట్టివేయాలి'అని కోరుతూ వేణుస్వామి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూరేపల్లి నందా బుధవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సమన్లపై స్టే ఇస్తూ.. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించారు.

వివేకా హత్య కేసు నిందితుడికి బెయిల్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రతీ వారం పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు చేయాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని షరతులు విధించింది. గత ఏడాది ఏప్రిల్‌లో ఉదయ్‌కుమార్ రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే. అప్పటి నుంచి చంచల్‌గూడ జైలులో ఉంటున్న ఉదయ్‌కుమార్‌రెడ్డి.. బెయిల్ కోరుతూ గత నెల తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్.. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు చెప్పారు. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్‌తో పాటు ఇద్దరి పూచీకత్తు, ఒరిజినల్ పాస్‌పోర్టును సీబీఐ కోర్టుకు సమర్పించాలి. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పులివెందుల స్టేషన్‌లో రిపోర్టు చేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే.. బెయిల్ రద్దు కోసం న్యాయస్థానాన్ని సీబీఐ ఆశ్రయించవచ్చు. తదుపరి విచారణకు సహకరించాలి.



గుంతలో ఇసుక, కంకర పోస్తున్న భాని

గుంత పూడ్చి.. చింత తీర్చి..

రుద్రంగి (వేములవాడ): ఎవరో వస్తారని ఎదురుచూడలేదు.. ఎవరినీ విమర్శించలేదు. రాకపోకలకు ఇబ్బందికరంగా పరిణమించిన గుంతను పూడ్చి ఆదర్శంగా నిలిచిందొక విద్యార్థిని. రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రం శివారులోని పెట్రోల్‌బంకు తండా పరిసరాల్లో కొన్ని రోజుల క్రితం రోడ్డు ధ్వంసమై గుంత పడింది. అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి వర్షపు నీటితో గుంత నిండిపోయింది. ద్విచక్రవాహనదారులు ఆ గుంతను గమనించకుండా వెళ్లి ప్రమాదాలకు గురయ్యారు. విషయం తెలుసుకున్న రుద్రంగికి చెందిన మర్రిపెల్లి భాని అనే పదో తరగతి విద్యార్థిని.. మంగళవారం అక్కడికి వెళ్లి గుంతలో కంకర, ఇసుక పోసి మరమ్మతులు చేసింది. ఆ మార్గంలో వెళ్తున్న ప్రయాణికులు భానిని అభినందించారు.

అచ్యుతాపురం సెజ్‌లో రియాక్టర్ పేలుడు

17 మంది మృతి

▶ మొదటి పేజీ తరువాయి

విషాద పరిస్థితి నెలకొంది. పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో హెచ్‌పీసీఎల్ తర్వాత ఆ స్థాయిలో కార్మికులు/సిబ్బంది ఈ దుర్ఘటనలోనే చనిపోయినట్లు చెబుతున్నారు. పెను విషాదం చోటు చేసుకున్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు బాధితులను ఓదార్చే ప్రయత్నం చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పేలుడు ధాటికి తునాతునకలు..

అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదం అంతులేని విషాదాన్ని నింపింది. ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మూడో ఫ్లోర్‌లో 500 కిలోల సామర్థ్యం గల రియాక్టర్ పేలిపోవటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పేలుడు ధాటికి మృతదేహాలు తునాతునకలుగా చెల్లాచెదురయ్యాయి. చెట్ల కొమ్మలపై.. శ్లాబ్ కింద నుజ్జు నుజ్జుగా కనిపించాయి. ప్రమాదం ధాటికి ఫార్మా కంపెనీ పరిసరాల్లో భీతావహ పరిస్థితి కనిపించింది. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రమాద స్థలిని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు.

భోజన విరామం కావడంతో..

ఎసైన్షియా కంపెనీలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు 14 ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేస్తున్నారు. రియాక్టర్ ఒక్కసారిగా పేలడంతో గోడలు పగిలి దూరంగా పడిపోయాయి. ఫ్యాక్టరీలో రెండు షిఫ్టులలో 381 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. భోజన విరామం కావడంతో పేలుడు సంభవించినప్పుడు ఉద్యోగులు తక్కువ సంఖ్యలో విధుల్లో ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం అగ్ని ప్రమాదంలో 60 మంది కార్మికులు, ఉద్యోగులు చిక్కుకున్నారు.

సాల్వెంట్ మిశ్రమంలో రియాక్షన్‌తో..

అచ్యుతాపురం సెజ్‌లో రూ.200 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన ఈ కంపెనీ సెజ్‌లోని ప్లాట్ నం 11, 11ఏ, 12, 12ఏలో 40 ఎకరాల్లో విస్తరించి ఉంది. కంపెనీలో యాక్టివ్ ఫార్మాస్యూటికల్ పదార్థాలు (టానిక్‌లు, డ్రాప్స్), బల్క్ డ్రగ్స్, స్పిరిట్ అండ్ సాల్వెంట్స్ తయారీ, సప్లయింగ్ చేస్తున్నారు. సాల్వెంట్‌లో రియాక్షన్ కారణంగా ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. రసాయన మిశ్రమం కలిసే రెండో రియాక్టర్‌లో ఈ పేలుడు సంభవించింది.



చెట్టు తుప్పల్లో మృతదేహం



ఫ్యాక్టరీ ప్రాంగణంలోని ఓ చెట్టుకు వేలాడుతున్న శరీర భాగాలు

అంబులెన్స్‌లు లేక కంపెనీ బస్సుల్లోనే

అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించేందుకు అంబులెన్స్‌లు సకాలంలో రాకపోవడంతో కంపెనీ బస్సులో తరలించారు. ప్రమాదం జరిగిన గంట తరువాత మూడు అంబులెన్స్‌లు వచ్చాయి. సాయంత్రం 6 గంటలకు మరో పది అంబులెన్స్‌లు వచ్చాయి.

మృతదేహాలు మూట గట్టి కేజీహెచ్‌కు..

శ్లాబ్‌ల కింద ముక్కలు ముక్కలుగా చెల్లాచెదురైన మృతదేహాలను మూటగట్టి గుట్టు చప్పుడు కాకుండా కేజీహెచ్‌కు తరలిస్తున్నారు. సుమారు 15 ప్రైవేట్ అంబులెన్స్‌ల్లో రాత్రి 9 గంటల తరువాత కేజీహెచ్‌కు తరలించారు. మీడియా ప్రతినిధులు, బాధితుల కుటుంబ సభ్యులు లోపలకి వెళ్లకుండా సెక్యూరిటీ పెంచారు. స్థానికులు, సీఐటీయూ, సీపీఎం, కార్మిక సంఘాల నాయకులు, వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ ప్రజాప్రతినిధులు తదితరులు లోపలికి వెళ్లేందుకు యత్నించగా యాజమాన్యం అడ్డుకుంది. గాయపడ్డ వారి వివరాలు తెలుసుకునేందుకు కనీసం అంబులెన్స్‌ల వద్దకు కూడా వెళ్లనివ్వకుండా అడ్డుకుని పోలీసులను భారీగా మోహరించారు.

మా వాళ్లేమయ్యారో..!

రాంబిల్లి (యలమంచిలి): అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో ప్రమాదం నేపథ్యంలో పలువురు కార్మికుల ఆచూకీ తెలియకపోవడంతో కంపెనీ వద్ద వారి బంధువులు ఆందోళనకు దిగారు. తమ వారి వివరాలు చెప్పాలని పోలీసులను, కంపెనీ ప్రతినిధులను, అధికారులను వేడుకుంటున్నా కనీస స్పందన లేదని వాపోతున్నారు. బతికే ఉన్నారో.. చనిపోయారో తెలియక కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక, డీఐజీ గోపీనాథ్ జెట్టీ తదితరులు బయటకు వెళ్లకుండా మెయిన్ గేట్ వద్ద అడ్డుకుని బైఠాయించారు. హోంమంత్రి వంగలపూడి అనిత ప్రమాద స్థలికి రాత్రి 11 గంటల సమయంలో వస్తారనే సమాచారంతో బాధితుల కుటుంబీకులు, బంధువులు ఆకలి దప్పులు మరిచి అక్కడే కూర్చున్నారు. కంపెనీ వెనుక గేటు నుంచి మృతదేహాలను రహస్యంగా తరలిస్తున్నట్లు తెలియడంతో కొందరు అక్కడకు చేరుకుని బైఠాయించారు. మృతదేహాలను మూట గట్టి రహస్యంగా విశాఖ కేజీహెచ్‌కు తరలించడంపై బాధితుల కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరిన్ని వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అమెరికాలో కంపెనీ ఏర్పాటు..

ఎసైన్షియా లైఫ్ సైన్సెస్ కంపెనీ 2007లో అమెరికాలోని సౌత్ విండ్‌సర్‌లో స్థాపించారు. కంపెనీ తన కార్యకలాపాలను అమెరికాతో పాటు హైదరాబాద్, విశాఖపట్నంలో నిర్వహిస్తోంది. యాదగిరి పెండ్రి దీన్ని స్థాపించారు. ప్రస్తుతం ఆయన అమెరికాలో నివాసం ఉంటున్నారు. ఈ కంపెనీ 2016లో విశాఖలోని అచ్యుతాపురం సెజ్‌లో రిజిస్టర్ అయ్యింది. 2018లో కార్యకలాపాలను ప్రారంభించింది. వివిధ రకాల సిరప్‌లతో పాటు కొత్త ఔషధాల కోసం ప్రయోగాలు నిర్వహిస్తుంటారు.

వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో బుధవారం ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలడంపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్జీ పాలిమర్స్ బాధితులను ఆదుకున్న తరహాలోనే ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం అందించాలని జగన్ డిమాండ్ చేశారు. ఫార్మాకంపెనీలో రియాక్టర్ పేలుడు ఘటనాస్థలాన్ని శుక్రవారం వైఎస్ జగన్ సందర్శించనున్నారు. గురువారం ప్రమాదస్థలానికి ముఖ్యమంత్రి వెళ్తున్నారన్న వార్తల నేపథ్యంలో అధికారులకు ఇబ్బందులు కలిగించకూడదనే ఉద్దేశంతో జగన్ శుక్రవారం ఘటనాస్థలికి వెళ్లనున్నట్టు వైఎస్సార్‌సీపీ పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

ఏపీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ గోపాలకృష్ణారావు



జస్టిస్ వెంకట జ్యోతిర్మయి



జస్టిస్ గోపాలకృష్ణారావు

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు నియమితులయ్యారు. వీరి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు వీరి నియామకాన్ని నోటిఫై చేస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ గోపాలకృష్ణారావు శుక్రవారం శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణం చేసే అవకాశం ఉంది. వీరి నియామకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో జారీ చేస్తే శుక్రవారం వారి ప్రమాణం ఉంటుంది. వీరి చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయిస్తారు. వీరిద్దరినీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీం కొలీజియం ఇటీవల కేంద్రానికి సిఫారసు చేసిన సంగతి తెలిసిందే.

17 మంది టీడీపీ ఎమ్మెల్యేలు నేరచరితులు!

- ఇద్దరు జనసేన పార్టీ ఎమ్మెల్యేలు కూడా..
- వెల్లడించిన ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్
- నేరచరితుల్లో టీడీపీకి దేశంలోనే మూడో స్థానం



సాక్షి, న్యూఢిల్లీ: 17 మంది టీడీపీ ఎమ్మెల్యేలు, ఇద్దరు జనసేన పార్టీ ఎమ్మెల్యేలు నేరచరితులని, వీరిపై మహిళలపై నేరాలకు పాల్పడ్డ అభియోగాలు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థలు వెల్లడించాయి. 17 మంది నేరచరితులతో టీడీపీ దేశంలోనే మూడో స్థానంలో ఉందని స్పష్టం చేశాయి. మనదేశంలో 755 మంది సిట్టింగ్ ఎంపీలు, 3,938 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో 151 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయని తెలిపాయి. ఈ మేరకు దేశంలో సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేల 4,809 ఎన్నికల అఫిడవిట్‌ల్లో 4,693ను విశ్లేషించి రూపొందించిన నివేదికను బుధవారం విడుదల చేశాయి. మహిళలపై నేరాలను రాష్ట్రాల వారీగా చూస్తే పశ్చిమ బెంగాల్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో 25 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు ఉన్నాయి. రెండో స్థానంలో 21 మందితో ఏపీ ఉంది. 17 మందితో ఒడిశా మూడో స్థానంలో నిలిచింది. కాగా తెలంగాణ 11వ స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో ఐదుగురు ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. కాగా దేశంలో మొత్తం 151 మంది ఎంపీలు, ఎమ్మెల్యేల్లో 16 మందిపై అత్యాచారానికి సంబంధించిన కేసులు ఉన్నాయి. వీరిలో ఇద్దరు ఎంపీలు కాగా, 14 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

మహిళలపై నేరాలకు సంబంధించి కేసులు ఉన్న టీడీపీ ఎమ్మెల్యేలు..: చింతమనేని ప్రభాకర్, దెందులూరు; చదలవాడ అరవిందబాబు, నరసరావుపేట; చింతకాయల అయ్యన్నపాత్రుడు, నర్సీపట్నం; నంద్యాల వరదరాజులురెడ్డి, ప్రొద్దుటూరు; ఎస్.సవిత, పెనుకొండ; జి.భానుప్రకాశ్, నగరి; కందికుంట వెంకటప్రసాద్, కదిరి; బోనెల విజయచంద్ర, పార్వతీపురం; పొంగూరు నారాయణ, నెల్లూరు సిటీ; ప్రత్తిపాటి పుల్లారావు, చిలకలూరిపేట; కృష్ణచైతన్య రెడ్డి, కమలాపురం; తంగిరాల సౌమ్య, నందిగామ; సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి; వంగలపూడి అనిత, పాయకరావుపేట; బండారు సత్యానందరావు, కొత్తపేట; ఎం.ఎస్.రాజు, మడకశిర; బండారు సత్యనారాయణమూర్తి, మాడుగుల

కేసులు ఉన్న జనసేన పార్టీ ఎమ్మెల్యేలు : పంతం నానాజీ, కాకినాడ రూరల్; కందుల దుర్గేశ్, నిడదవోలు

'కాళేశ్వరం' నిర్ణయాలు ఎవరివి?

రిటైర్డ్ ఈఎన్‌సీ మురళీధర్‌పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నల వర్షం

సాక్షి, హైదరాబాద్: ''కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో అత్యున్నత స్థాయిలో నిర్ణయాలు తీసుకున్నది ఎవరు? ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు బదులు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలనే నిర్ణయం ఎవరిది? కాళేశ్వరం డీపీఆర్‌ను కేంద్ర జలసంఘాని(సీడబ్ల్యూసీ)కి పంపిన తర్వాత మళ్లీ ఎందుకు మార్పులు చేశారు?''అని రాష్ట్ర నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఈఎన్‌సీ (జనరల్) సి.మురళీధర్‌పై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. నిర్ణయాలు ప్రభుత్వం స్థాయిలో జరిగాయని మురళీధర్ బదులివ్వగా.. 'ప్రభుత్వం అంటే ఎవరు?' అని కమిషన్ తిరిగి ప్రశ్నించింది. 'హెడ్ ఆఫ్ ది గవర్నమెంట్ (ప్రభుత్వ అధినేత)'అని మురళీధర్ బదులివ్వగా.. ప్రభుత్వఅధినేత అంటే ఎవరని కమిషన్ వివరణ కోరింది. దీంతో నీటిపారుదల శాఖ కార్యదర్శి అని మురళీధర్ బదులిచ్చినట్టు తెలిసింది. కాళేశ్వరం బరాజ్‌లపై విచారణలో భాగంగా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ బుధవారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని తమ కార్యాలయంలో క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ప్రారంభించి.. తొలిరోజున రిటైర్డ్ ఈఎన్‌సీ మురళీధర్‌ను ప్రశ్నించింది. నీటి లభ్యతపై వ్యాప్కోస్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రాణహిత ప్రాజెక్టును రీఇంజనీరింగ్ చేసి.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినట్టు మురళీధర్ తెలిపారు. క్షేత్రస్థాయి ఇంజనీర్ల ప్రతిపాదనల ప్రకారమే డీపీఆర్‌లో మార్పులు చేసినట్టు వెల్లడించారు. పలు అంశాల్లో కిందిస్థాయి ఇంజనీర్లు తప్పు చేశారని పేర్కొన్న మురళీధర్.. గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధుల పాత్రపై ఎలాంటి ప్రస్తావన చేయలేదు.

కమిషన్ విచారణ తీరిది..

- బరాజ్‌ల నిర్మాణం పూర్తికాక ముందే కాంట్రాక్టర్లకు సబ్ స్టాన్షియల్ వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్లు ఎలా జారీ చేశారని కమిషన్ ప్రశ్నించగా.. జారీ చేసిన ఇంజనీర్లది వ్యక్తిగత స్థాయిలో తప్పేనని మురళీధర్ పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్టిఫికెట్ జారీ చేస్తే సూపరింటెండింగ్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ కూడా సంతకాలు చేశారని కమిషన్ ఎత్తిచూపగా.. వారు తప్పుచేశారని బదులిచ్చారు.
- బరాజ్‌ల నిర్మాణంలో పర్యవేక్షక ఇంజనీర్లతోపాటు క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజనీర్లు బాధ్యతల నిర్వహణలో విఫలమయ్యారని కమిషన్ పేర్కొంది. 2016–20 మధ్య బరాజ్‌ల నిర్మాణం జరిగితే.. వరంగల్‌లోని క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజనీర్లు ఒక్కసారి మాత్రమే తనిఖీ చేయడం ఏమిటని ప్రశ్నించింది. దీనితో సంబంధిత ఇంజనీర్లది తప్పేనని, పక్షం రోజులకోసారి పనుల్లో నాణ్యత పరీక్షించాల్సి ఉంటుందని మురళీధర్ బదులిచ్చారు. బరాజ్‌ల వైఫల్యానికి ఇది ప్రధాన కారణంగా పరిగణించాల్సి ఉంటుందని కమిషన్ తెలపగా.. ఒక కారణం కావచ్చని మురళీధర్ అన్నారు.
- బరాజ్‌ల కాంక్రీట్ పనులకు నాణ్యత పరీక్షలు నిర్వహించకుండానే రూ.1,342.72 కోట్ల బిల్లులను ఏ విధంగా చెల్లించారు? బిల్లుల రికార్డుల్లో పాత తేదీలతో ఎంట్రీ ఎందుకు చేశారని కమిషన్ ప్రశ్నించగా.. సంబంధిత ఇంజనీర్లది తప్పేనని సమాధానమిచ్చారు.
- డిజైన్ల ప్రకారం బరాజ్‌ల పునాదుల కింద షీట్‌పైల్స్ నిర్మించాల్సి ఉండగా.. సెకెంట్ పైల్స్‌కు ఎందుకు మారారు? నిర్మాణం ప్రారంభించాక డిజైన్లను మార్చవచ్చా? అని కమిషన్ ప్రశ్నించగా.. భూగర్భంలో ఇసుకతోపాటు భారీ రాళ్లు ఉండటంతో మార్చాల్సి వచ్చిందని మురళీధర్ వివరించారు. నిర్మాణ దశలో డిజైన్లలో మార్పులు జరగడం సాధారణమేనని బదులిచ్చారు.
- బరాజ్‌ల నిర్మాణం పూర్తయ్యాక లోపాలు బయటపడితే ఏం చర్యలు తీసుకున్నారని కమిషన్ ప్రశ్నించగా.. సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు మురళీధర్ వివరించారు.
- కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడం కోసం భవిష్యత్తులో అంచనా వ్యయం పెంచుకోవడానికి వీలు కల్పించే రీతిలో డిజైన్లను రూపొందించారా? అని కమిషన్ ప్రశ్నించగా.. లేదని మురళీధర్ బదులిచ్చారు. కాళేశ్వరం డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి పంపకముందే పనులు ఎందుకు ప్రారంభించారని ప్రశ్నించగా.. ప్యాకేజీ–4 పనులు ప్రారంభించినట్టు మురళీధర్ అంగీకరించారు.

మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు



శవానికి కుల బహిష్కరణ

క్షమాపణ చెబితేనే అంత్యక్రియల్లో పాల్గొంటామని స్పష్టీకరణ

దుబ్బాకరూరల్: తమ సామాజిక వర్గానికి చెందిన ఓ వృద్ధుడు చనిపోయినా, ఆ గ్రామానికి చెందిన కులస్తులెవరూ అంత్యక్రియల్లో పాల్గొనలేదు. భూ గొడవల నేపథ్యంలో వారంతా దూరంగా ఉండగా, గ్రామస్తులు అంత్యక్రియలు జరిపించారు. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండలం బొప్పాపూర్‌కు చెందిన బండమీది సాయిలు మాదిగ (71) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మాకు క్షమాపణ చెబితేనే అంత్యక్రియల్లో పాల్గొంటామని కులస్తులు తేల్చి చెప్పారు.

భూమి విషయమై కొన్నేళ్లుగా గొడవలు: సాయిలు ఇంటి ముందు కొంత ఖాళీ స్థలం, నాలుగు గుంటల సాగు భూమి ఉంది. ఈ భూమి విషయమై కొన్నేళ్ల నుంచి సాయిలుకు, తన సామాజికవర్గానికి చెందిన వారితో గొడవలు జరుగుతున్నాయి. అదే కులానికి చెందిన మరో వ్యక్తికి భూమి ఇవ్వాలని కులస్తులు పంచాయితీ పెట్టి సాయిలుకు చెప్పారు. దానికి సాయిలు ససేమిరా అన్నాడు. కులం మాట ఎందుకు వినడం లేదని మూడేళ్ల కింద బహిష్కరణ చేయడంతోపాటు రూ.20వేలు జరిమానా విధించారు. మళ్లీ వారం రోజుల కిందట సాయిలు కుటుంబ సభ్యులతో ఎవరైనా మాట్లాడినా.. వారి ఇంటికి వెళ్లినా రూ.5వేలు జరిమనా విధిస్తామని కులపెద్దలు నిర్ణయం తీసుకున్నారు. ఇంతలోనే సాయిలు చనిపోయాడు. రెండు రోజులుగా కులస్తులు రాకపోవడంతో గ్రామస్తులంతా కలిసి బుధవారం అంత్యక్రియలు జరిపించారు. సాయిలుకు కుమారులు లేకపోవడంతో చిన్న కూతురు తలకొరివి పెట్టింది.

న్యాయవాదులపై దాడులా?

వివరణ ఇవ్వాలని సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: న్యాయవాదులపై దాడుల ఘటనలకు సంబంధించి వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, బోరబండ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, డీఐలకు నోటీసులు జారీ చేసింది. న్యాయవ్యవస్థలో న్యాయవాదులు ముఖ్యమైన వ్యక్తులని, వారిని అత్యంత గౌరవంగా చూడాల్సిన బాధ్యత పోలీసు వ్యవస్థపై ఉందని పేర్కొంది. తదుపరి విచారణలోగా కౌంటర్‌తోపాటు న్యాయవాదుల భద్రత చట్టంపై నివేదికను దాఖలు చేయాలని అదనపు అడ్వొకేట్ జనరల్‌ను ధర్మాసనం ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. 'బెల్ట్‌షాప్ నడిపిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఆగస్టు 16న బోరబండ పోలీసులు న్యాయవాది సంతోష్ అద్దెకు ఉండే ఇంటికి వచ్చారు. పోలీసులు తలుపు పగలగొట్టే ప్రయత్నం చేయడంతో న్యాయవాది తప్పుబట్టారు. దీంతో పోలీసులు అతనిపై దాడి చేసి చేయి విరగ్గొట్టి, స్టేషన్‌కు తరలించారు'అంటూ హెచ్‌సీఏఏ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి సంజీవ్‌రెడ్డితోపాటు కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ గత వారం హైకోర్టు సీజే దృష్టికి తెచ్చారు. దాడి అంశంపై సుమోటోగా విచారణ చేపట్టాలని ప్రధాన న్యాయమూర్తి నిర్ణయించారు. ఈ పిటిషన్‌పై సీజే జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

మాల మేధావులంతా మనువాదులే

టీజేయూ మీట్ ది ప్రెస్‌లో మందకృష్ణ



సాక్షి, హైదరాబాద్/పంజగుట్ట: తెలుగు రాష్ట్రాల్లోని మాల మేధావులంతా మనువాదులే అని మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి(ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు వాఖ్యానించారు. వారంతా అంబేడ్కర్‌వాదులమనే ముసుగులో మనువాదాన్ని అనుసరిస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ విషయంలో ఎలాంటి వైఖరి ప్రదర్శించకుండా అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ పట్ల మాలమేధావులు తమ వైఖరిని బహిరంగంగా వ్యక్తపరచాలని..వ్యతిరేకమైనా, లేక అనుకూలమైనా ప్రజల్లోకి వచ్చి చెప్పాలన్నారు. బుధవారం సోమాజిగుడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్(టీజేయూ) నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో మందకృష్ణ మాట్లాడారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించాలని, ఈ తీర్పు నేపథ్యంలో ఆయన తన వైఖరేంటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ బాధ్యత రాష్ట్రాలకు ఇవ్వడంతో పార్లమెంట్‌లో బిల్లు పెట్టాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజేయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కప్పర ప్రసాదరావు, బింగి స్వామి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ వేగవంతం చేయండి

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ విషయంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా చర్యలు వెంటనే చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ, ఎస్సీ ఎమ్మెల్యేలు మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ఈ అంశంపై వేగవంతంగా చర్యలు జరిగేందుకు వీలుగా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించాలని సూచించారు. బుధవారం రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో మందకృష్ణ, మాదిగ సామాజికవర్గానికి చెందిన శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, కాలే యాదయ్య, మందుల సామేల్ సమావేశమయ్యారు.

ఫామ్‌హౌస్ కూల్చివేతపై స్టే ఇవ్వలేం

▶ మొదటి పేజీ తరువాయి

కూల్చివేతల్లో నిబంధనలు పాటించారా?' అని అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. 'సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ చేస్తారు.. మున్సిపాలిటీ అధికారులు అనుమతులు ఇస్తారు.. కన్వర్షన్ చార్జీలు వసూలు చేస్తారు. విద్యుత్, నీటి, ఆస్తి పన్నులను వసూలుచేస్తారు.. ఓ పది పదిహేనేళ్ల తర్వాత వచ్చి ఆ నిర్మాణం అక్రమమంటూ కూల్చివేతకు సిద్ధమవుతారు. ఒక్కో ప్రభుత్వ విభాగం ఒక్కోలా వ్యవహరిస్తుంది. ఇది ఎంత వరకు సమంజనం? అనుమతులు ఇచ్చిన అధికారులపై ఎలాంటి చర్యలు ఉండవు. 100 గజాల్లోపు ఇళ్లు కట్టుకున్న పేదలపై ప్రతాపం చూపిస్తారు. ఎవరో నిర్మిస్తారు? తర్వాత దాన్ని మరొకరు కొనుగోలు చేస్తారు? రిజిస్ట్రేషన్ సమయంలో ఎలాంటి అభ్యంతరం చెప్పరు? ఇది ఎంతవరకు సమంజసం' అని ఏఏజీని న్యాయమూర్తి ప్రశ్నించారు.

చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రా..: ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ హైడ్రా ఏర్పాటు, విధి విధానాలను న్యాయస్థానానికి వివరించారు. 'హైదరాబాద్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రభుత్వ భూమి, పార్కులతోపాటు చెరువులు, కుంటలు, నీటి వనరులు ఆక్రమణకు గురవుతున్నాయి. వీటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఆక్రమణల తొలగింపు చేపట్టాలని సీజే ధర్మాసనం ఆదేశించింది. ఇందులో భాగంగానే జూలై 19న హైడ్రా ఏర్పాటైంది. ఇది స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ. చెరువులు, కుంటలు, నీటి వనరుల పరిరక్షణ కోసం పనిచేస్తుంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మున్సిపాలిటీలు, పంచాయతీల పరిధిలో స్థానిక సంస్థల సమన్వయంతో పనిచేస్తుంది. స్థానిక సంస్థల నుంచి నోటీసులు వెళ్లిన తర్వాతే కూల్చివేతలు చేపడుతుంది. ఫాంహౌస్ నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోకి వస్తుంది. సర్పంచ్ నుంచి అనుమతి తీసుకుని నిర్మించారు. ఇది చెల్లదు' అని వివరించారు.

ఎఫ్‌టీఎల్ వివరాలివ్వండి..: 'జన్వాడ ఫాంహౌస్ నిర్మించి పదేళ్లయింది. ఇన్నాళ్లు ఎఫ్‌టీఎల్ గుర్తుకు రాలేదా? చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించారా? తుది లేదా ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారా? ఆ వివరాలివ్వండి' అని ఏఏజీని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ కేసులో హైదరాబాద్ వాటర్, సీవరేజీ బోర్డును కూడా ప్రతివాదుల జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీకి చెప్పారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌ను ప్రాథమికంగా నోటిఫై చేశామని, తుది నివేదిక రూపొందించాల్సి ఉందని ఏఏజీ తెలిపారు.

● ఇదీ ట్రెండ్



ఆఫీస్... ఆల్ హ్యాపీస్

ప్రతి ఒక్కరం ఆనందకరమైన జీవనం కోసం తాపత్రయపడుతుంటాం. అందుకు, పగలు-రాత్రి తేడా లేకుండా శ్రమిస్తుంటాం. దానికి తగ్గట్టు 'మనలో ఒత్తిడి కూడా అంతే స్థాయిలో పెరుగుతోంది' అంటున్నారు మనస్తత్వ నిపుణులు. ఒత్తిడి ప్రభావం పనిపై పడకుండా ఉద్యోగులను సంతోషంగా ఉంచడానికి హ్యాపీనెస్ టీమ్‌ను ప్రత్యేకంగా నియమించుకుంటున్నాయి కార్పొరేట్ కంపెనీలు. దానిలో డెలాయిట్ ఒకటి. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ ఐదు గుణగణాలు అలవరచుకుంటే సంతోషకరమైన జీవితం సాధ్యమని వివరిస్తున్నారు.

హార్వర్డ్ యూనివర్శిటీ 70 ఏళ్లుగా తమ విద్యార్థుల జీవితాలను ట్రాక్ చేస్తూ 'ఎవరు ఎంత ఆనందంగా ఉన్నారు' అనే విషయం మీద ఇప్పటికీ రీసెర్చ్ చేస్తోంది. ఎవరి జీవితాలు సంతోషంగా ఉన్నాయని ఆ పరిశోధక బృందం పరిశీలిస్తే ఎవరయితే ఎక్కువ హ్యూమన్ నెట్‌వర్కింగ్ చేయగలుగుతున్నారో వారు ఆనందాన్ని సంపూర్ణంగా పొందుతున్నారని అర్థం చేసుకున్నారు. డబ్బు, హోదా అందం, తెలివితేటలు.. ఇవేవీ ఆనందానికి కొలమానం కావని తెలుసుకున్నారు.

ఆనందాన్ని మర్చిపోతున్నామా?!

ఏ వ్యక్తులు అయితే తమని తాము ప్రశాంతంగా ఉంచుకొని, తమ జీవిత లక్ష్యాలను తెలుసుకుంటూ ప్రయాణిస్తున్నారో ఈ కింద ఉదాహరించిన 5 గుణగణాలను కలిగి ఉంటారు. కార్పొరేట్ లేదా మరే రంగంలో పనిచేసేవారికైనా ఈ ఐదు గుణగణాలను అలవర్చుకుంటే చాలు. వాటిలో...

1. శారీరకపరమైన ఆరోగ్యకరమైన అలవాట్లు: శరీరానికి కావల్సినవాటిని అందించడంలో లోపం ఏర్పడినా స్ట్రెస్ పెరుగుతుంది. ఫలితంగా పనితీరులో సంతృప్తి స్థాయి 20 శాతానికి పడిపోతుంది.

హ్యాపీనెస్ సన్ ఫ్లవర్

మేం ఉద్యోగుల ఆనందంపై దృష్టి పెడుతున్నామనే విషయం సంస్థలో ప్రతి ఒక్కరికీ తెలియపరిచాం. సంస్థలో టాలెంట్ ఫంక్షన్లు జరుపుతాం. జిమ్, యోగా వంటి క్లాసులు ఉంటాయి. ఎవరైనా వారి సమస్య గురించి చెప్పినప్పుడు ముందు వాటిని అర్థం చేసుకుంటాం. 'హ్యాపీనెస్ సన్‌ఫ్లవర్' ద్వారా సరైన పరిష్కారం లభించేలా ప్రయత్నిస్తాం. మేం రూపొందించిన 'పొద్దు తిరుగుడు పువ్వు'కు ఆరు ముఖ్యమైన అంశాలు ఉంటాయి. ఆరు పూలరేకల్లో ప్రతి రేకా ప్రత్యేక పనితీరుతో ఉంటుంది. ప్రయోజనం, అనుసంధానం, విశ్రాంతి, వైవిధ్యం- సమానత్వం, మానసిక, శారీరక ఆరోగ్యం వంటి ఆరు ముఖ్యమైన భాగాలు ఉంటాయి. అంతేకాదు అనుకూలత, ఫెయిర్‌నెస్, ధైర్యం, చురుకుదనం వంటి సూత్రాలతో సన్‌ఫ్లవర్ వికసిస్తుంది. అభిరుచితో జీవించడానికి, ఒక శక్తివంతమైన, ఆరోగ్యకరమైన కార్యాలయాన్ని సృష్టించడం మా హ్యాపీనెస్ టీమ్ లక్ష్యం.



– సరస్వతి కస్తూరి రంగన్,
డెలాయిట్ చీఫ్ హ్యాపీనెస్ ఆఫీసర్

వాస్తవంలోనే ఆనందం

మనం ఎదుటి వ్యక్తితో మాట్లాడుతున్నప్పుడు మన మాట, ప్రవర్తన పాజిటివ్‌గానూ, వాస్తవికంగానూ ఉండాలి. వర్చువల్ అనేది తాత్కాలిక ఆనందాన్ని మాత్రమే ఇస్తుంది. ప్రకృతి నుంచి లభించేవీ, మనం చేసే పనుల మంచి ఫలితాలే ఆనందాన్నిస్తాయి. కాలక్షేపం కోసం చేసే కొన్ని పనులు జీవితంలో నష్టం చేసేవిగానే ఉంటాయి.



– రాధికా ఆచార్య,
క్లినికల్ సైకాలజిస్ట్, స్టూడెంట్ కౌన్సెలర్

2. తెలివితేటలు (ఇంటెలెక్చువల్): ఒక అంశాన్ని ఎంత బాగా విశ్లేషిస్తున్నాం, ఎంత క్రియేటివ్‌గా వర్క్ చేస్తున్నాం .. అనేది మన బ్రెయిన్‌పైన ఆధారపడి ఉంటుంది. అస్తమానం మొబైల్‌లోని స్టఫ్‌ని చూస్తూ అదే ఆనందం అనుకుంటే మరో 20 శాతం పనితీరు పడిపోతుంది.

3. భావోద్వేగాల అదుపు: ఎదుటివారిని మన నియంత్రణలోకి తెచ్చుకోవాలి అనే ధ్యాస చాలా మందికి ఉంటుంది. ముఖ్యంగా తమ భావోద్వేగ పరిస్థితి పట్ల అవగాహన లేక అదుపే ఆనందాన్నిస్తుంది అనుకుంటారు. భావోద్వేగాల సమతుల్యతను పాటిస్తూ వెళ్లే వారు తమ పనితీరు సామర్థ్యాన్ని 20 శాతం పెంచుకుంటారు.

4. ఆధ్యాత్మికత: ప్రతి ఒక్కరూ 'నా ఈ జీవితానికి అర్థం ఏంటి?' అనుకుంటూ శోధించేవారు హాయిగా తమ జీవన గమనాన్ని సాగించగలుగుతారు. అందుకు దైవాన్ని ఆలంబనగా చేసుకుంటూ తమ కలలకు తగిన పనులు చేస్తూ మరో 20 శాతం సంతృప్తిని పెంచుకుంటారు.

5. ప్రతికూలత: తెల్లవారి లేస్తే ఎన్నో అనుకోని సమస్యలు ఉంటాయి. భావోద్వేగాల పరంగా కింద పడిపోతాం. కానీ, మట్టి ముద్దలాగా అలాగే ఉండకుండా తిరిగి ఎలా లేచి నిలబడతామనేది సవాల్‌గా తీసుకోవాలి. దీని వల్ల మరొక 20 శాతం ఆనందంగా ఉంటాం.

'ఇలా ఒక్కో గుణం నుంచి 20 శాతం ఆనందాన్ని పెంచుకుంటూ ప్రయాణించేవాళ్లు నూటికి నూరు శాతం సంతృప్తికరమైన జీవనం గడుపుతారు' అని క్లినికల్ సైకాలజిస్ట్ రాధికా ఆచార్య తెలియజేస్తున్నారు.

అంచనాలు భారీగా ఉంటాయి

'డబ్బుతో కొనలేని ఆనందంలో ఉత్పాదకత, సంతృప్తి, శ్రేయస్సు ఉంటాయి. ఒకసారి ఈ పోస్ట్‌కు కమిట్ అయ్యామంటే అంచనాలు కూడా భారీగా ఉంటాయి' అంటారు చీఫ్ హ్యాపీనెస్ ఆఫీసర్ సరస్వతి కస్తూరి రంగన్. డెలాయిట్ కంపెనీలో ఇటీవల మొదటిసారి కొత్త హోదాలో పది మంది సభ్యులతో ఉన్న బృందానికి నాయకత్వం వహిస్తున్నారు ఈ చీఫ్ హ్యాపీనెస్ ఆఫీసర్.

– నిర్మలారెడ్డి

● ఫీల్ గ్రేట్

'ద్వారాలు మూసే ఉన్నాయి' అని వెనక్కి తిరిగేవారు కొందరు. ఆ ద్వారాలను తెరిచి ముందుకు వెళ్లేవారు కొందరు. ఆకాంక్ష కుమారి రెండో కోవకు చెందిన మహిళ. తొలి భారతీయ మహిళా మైనింగ్ ఇంజినీర్‌గా చరిత్ర సృష్టించింది. ఉద్యోగంలో చేరిన రోజు ఎంత ఉత్సాహం, వృత్తి నిబద్ధతతో ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. 'నో రిగ్రెట్స్.. ఫీల్ గ్రేట్' అంటుంది. మైనింగ్ ఫీల్డ్‌లోకి రావాలనుకునే మహిళలకు ధైర్యాన్ని ఇస్తోంది.

రొటీన్ ఐటీ కాదు మైనింగ్ మేటి



ఝార్ఖండ్‌లోని మైనింగ్ ప్రాంతంలో పెరిగిన ఆకాంక్ష కుమారి బొగ్గు గనుల్లో 'పై కప్పు కూలిపోవడం' అనే మాటను ఎన్నో సార్లు విని ఉన్నది. మైనింగ్ ఇంజినీర్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలుపెట్టిన తరువాత 'పై కప్పు కూలిపోవడం' అనే మాటను వినడం కాదు ప్రత్యక్షంగా చూసింది.

'ఇది పురుషులు మాత్రమే చేసే కఠినమైన ఉద్యోగం అనుకునే వృత్తిని ఎంచుకోవడానికి కారణం ఏమిటి?' అనే ప్రశ్నకు ఆమె స్పందన ఇది...

'బొగ్గు తవ్వకాలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతంలో పుట్టి పెరిగాను. ఇక్కడి ప్రజలు ఏ మైనింగ్ కంపెనీలో పని చేయకపోయినా వాళ్లకు మైనింగ్ గురించి చాలా విషయాలు తెలుసు. స్కూల్ హాస్టల్‌లో నా స్నేహితులు పై కప్పు కూలిపోవడం గురించి మాట్లాడడం నేను ఎన్నోసార్లు విన్నాను. అదెలా? ఎందుకు?' అనేది నాకు ఆశ్చర్యంగా అనిపించేది. మైనింగ్‌కు సంబంధించి రకరకాల విషయాలు వినడం వల్ల నాకు తెలియకుండానే ఆ రంగంలో ఉద్యోగం చేయాలనుకునే కలకు బీజం పడింది' గతాన్ని గుర్తు చేసుకుంది ఆకాంక్ష.

'పదవ తరగతి పూర్తయిన తరువాత ఏం చేయాలి?' అనుకున్నప్పుడు ఆటల గురించి ఆలోచించింది. తాను జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో కూడా పాల్గొంది. ఆటలపై దృష్టి పెట్టాలా, చదువు కొనసాగించాలా అనే దాని గురించి ఆలోచిస్తున్నప్పుడు తాను ఉన్న పరిస్థితిల్లో ఉద్యోగం అనివార్యం కావడంతో చదువుకే ప్రాధాన్యత ఇచ్చింది.

ఇంటర్మీడియెట్ పూర్తి అయిన తరువాత 'ఐటీ రంగంలో ఉద్యోగంపై దృష్టి పెట్టు' అని కొందరు తనకు సలహా ఇచ్చారు. అయితే 'ఐటీ' అనేది ఆకాంక్షకు ఆసక్తికరమైన సబ్జెక్ట్ కాదు. ఆ సమయం లోనే తన మనసులో దాగిన కల బయటికి వచ్చింది. 'కోల్ మైనింగ్ ఫీల్డ్‌లో ఉద్యోగం చేయాలి' అని నిర్ణయించుకుంది. ఉపాధ్యాయుడైన తండ్రి, అంగన్‌వాడీ వర్కర్ అయిన తల్లిని ఒప్పించడం కష్టం కాలేదు.

'మా అమ్మాయి మైనింగ్ జాబ్ చేయాలనుకుంటుంది' అని ఆకాంక్ష తండ్రి మైనింగ్ కంపెనీలో పని చేసే తన స్నేహితుడిని సలహా అడిగితే...'చాలా కష్టం. మధ్యతరగతికి చెందిన ఆడపిల్లలు ఈ రంగంలో పనిచేయలేరు. ఆ పనిభారం తట్టుకోవడం ఆడపిల్లలకు చాలా కష్టం' అన్నాడు. స్నేహితుడు చెప్పిన విషయాలను కూతురితో పంచుకున్నాడు. అయినా సరే, ఆకాంక్ష వెనక్కి తగ్గలేదు. ఇంజినీరింగ్ కోర్స్ అడ్మిషన్ సమయంలో కౌన్సెలర్ ఆమెకు మైనింగ్ ఇంజినీరింగ్ ఇవ్వడానికి ఇష్టపడలేదు. వాదోపవాదాల తరువాత ఆకాంక్ష కల నెరవేరింది. ఝార్ఖండ్, ధన్‌బాద్‌లోని బిర్సా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సింద్రీలో బీటెక్ పాసైంది. వొకేషనల్ ట్రెయినింగ్‌లో భాగంగా అండర్ గ్రౌండ్ మైన్‌లో కూడా శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి.

'ఇక్కడికి నిన్ను ఎవరు పంపించారు? ఎలా పంపిస్తారు? ఇక్కడ మహిళలకు సౌకర్యాలు, సదుపాయాలు లేవన్న విషయం మీ డిపార్ట్‌మెంట్ హెడ్‌కు తెలియదా?' అని విసుక్కున్నాడు జనరల్ మేనేజర్. ఆ తరువాత మాత్రం గెస్ట్‌హౌజ్‌లో ఒక రూమ్ కేటాయించారు. అమ్మ, మేనత్తలతో కలిసి ఆ గదిలో ఉండేది ఆకాంక్ష. చదువు పూర్తయిన తరువాత హిందుస్తాన్ జింక్‌లో ఆకాంక్షకు ఉద్యోగం వచ్చింది. మూడు సంవత్సరాలు గనులలో పనిచేసింది. ఆ తరువాత సెంట్రల్ కోల్ ఫీల్డ్ లిమిటెడ్‌కు చెందిన బొగ్గు గనుల్లో పనిచేసింది. కనీస సౌకర్యాలు లేకపోయినప్పటికీ భూగర్భ గనుల్లో గరిష్ఠంగా ఆరు గంటలు పనిచేసింది.

2021లో కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్)లో ఆకాంక్ష చేరిన తరువాత ఇప్పటి వరకు మరో ముగ్గురు మహిళలు మాత్రమే పబ్లిక్ విభాగంలో చేరారు. అయినా సరే ఆకాంక్ష కుమారిలో ఆశాభావం తొలగిపోలేదు. మైనింగ్ ఫీల్డ్‌లో రావాలనుకుంటున్నవారికి సలహాలు ఇవ్వడం, దారి చూపడం మానడం లేదు. 'సౌకర్యాలు లేకపోవచ్చు. శ్రమతో కూడిన ఉద్యోగం కావచ్చు. అయినా సరే చేస్తాను అనే పట్టుదల మీలో ఉంటే మైనింగ్ ఫీల్డ్‌లోకి తప్పకుండా రావచ్చు' అంటుంది ఆకాంక్ష కుమారి.

తొలి అడుగు వేసి మాత్రమే ఊరుకోలేదు. మరిన్ని అడుగుల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తూనే తన వంతు ప్రయత్నం చేస్తోంది ఆకాంక్ష. ●

ఏ గుడ్డయినా... వెరీగుడ్డే!



ఫారం కోడిగుడ్ల కంటే నాటు కోడిగుడ్లలో బలం ఎక్కువగా ఉంటుందని కొందరిలో ఓ అపోహ ఉంటుంది. కానీ పోషక విలువల విషయంలో నాటు గుడ్లయినా, ఫారం గుడ్లయినా ఒకటే. రెండింటిలోనూ పోషకాలు ఒకేలా ఉంటాయి. కాకపోతే నాటు గుడ్లు ఫారం గుడ్ల కంటే కాస్తంత చిన్నగా ఉంటాయి, మరికాస్త ఎక్కువ ముదురురంగుతో కాస్త గోధుమరంగు అనిపించేలా ఉంటాయి. అంతేతప్ప పోషకాలతో పాటు మరింకే విషయంలోనూ తేడా ఉండదు. కాబట్టి అధిక ధర పెట్టి నాటు కోడిగుడ్లు కొనడమన్నది జేబుకు నష్టం తప్ప... ఒంటికి చేకూరేలా మరే లాభమూ ఉండదు.

విచారణ

కోల్‌కతా డాక్టర్ హత్యాచార కేసు ఇద్దరు మహిళా సీబీఐ అధికారులప్రవేశంతో వేగం అందుకుంది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కు 'పాలిగ్రాఫ్' టెస్ట్ చేసేందుకు తాజాగా అనుమతి తీసుకున్నారు. హెచ్‌జి కార్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌కు కూడా పాలిగ్రాఫ్ టెస్ట్ చేయిస్తారనే వార్తలు అందుతున్నాయి. సంపత్ మీనా, సీమా పహుజా... ఈ ఆఫీసర్ల వైపే సుప్రీంకోర్టు కూడా చూస్తోంది. నేడు (గురువారం) ఇప్పటివరకూ ఛేదించిన విషయాలను సమర్పించమంది. సంపత్ మీనా, సీమా పహుజాల పరిచయం.

మృగాళ్ల వేటలో...

అత్యంత పాశవిక ఘటనగా నమోదవడంతో పాటు, అత్యంత మిస్టరీగా మారిగా కోల్‌కతా జూనియర్ డాక్టర్ కేసును ఆగస్టు 13న కోల్‌కత్తా హైకోర్టు సీబీఐకి అప్పజెప్పింది. వెంటనే సీబీఐ ఈ కేసు ప్రాధాన్యం, స్వభావం దృష్ట్యా 'లేడీ సింగం'గా బిరుదు పొందిన సీబీఐ అడిషనల్ డైరెక్టర్ సంపత్ మీనాకు విచారణ బాధ్యత అప్పగించింది. ఆమెకు ప్రధాన సహాయకురాలిగా మరో సమర్థురాలైన సీబీఐ ఆఫీసర్ సీమా పహూజాను నియమించింది. మొత్తం 30 మంది సీబీఐ బృందంతో సంపత్ మీనా, సీమా పహుజా దుర్మార్గులను వేటాడుతున్నారు.

ఇద్దరు అధికారులు ఏం చేశారు?

జూనియర్ డాక్టర్ పై జరిగిన అత్యాచారం/హత్యను ఛేదించడానికి రంగంలో దిగిన సంపత్ మీనా, సీమా పహూజా తొలుత ప్రధాన నిందితుడైన సంజయ్ ఘోష్ వ్యవహారశైలిని పరిశీలించారు. అతడిని విచారిస్తున్న సమయంలో ప్రతిసారీ వాంగ్మూలాన్ని మార్చడం గమనించారు. ఏ రోజైతే రాత్రి ఘటన జరగబోతున్నదో ఆ ఉదయం సంజయ్ ఘోష్ ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో అంటే ఐసీయూ ఎక్స్‌రే యూనిట్... ఇవన్నీ తిరిగినట్టు సీబీఐ అధికారులు గుర్తించారు. అతను అక్కడ ఎందుకు తిరిగాడనేది ఆరా తీస్తున్నారు. ఆ సమయంలో బాధితురాలు ఎదురుపడి ఏదైనా వాదన చేసిందా తెలుసుకుంటున్నారు. లేదంటే రాత్రి జరగబోయే ఘటనను కుట్ర పన్నేందుకు వేరే ఎవరినైనా కలిశాడా అన్నది తేలుస్తున్నారు. ఇప్పటికే అతని మానసిక స్థితిని వారు అంచనా వేశారు. పాలిగ్రాఫ్ టెస్ట్ (ఒక విధమైన లై డిటెక్టర్ టెస్ట్) అలాగే బాధితురాలి అటాప్సీ రిపోర్టుతో పాటు 'సైకాలజీ అటాప్సీ'ని కూడా అంచనా కడుతున్నారు. అంటే ఘటనకు ముందు బాధితురాలు ఎవరితో ఏం మాట్లాడింది, ఏదైనా వేదన/నిరసన వ్యక్తం చేసిందా, డైరీలో ఏమన్నా రాసుకుందా... వీటన్నింటి ఆధారంగా ఆమె సైకాలజీ అటాప్సీని నిర్ధారిస్తారు. అలాగే కేసులో ముందు నుంచీ అనుమానాస్పదంగా ఉన్న మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ పైన కూడా పాలిగ్రాఫ్ టెస్ట్ నిర్వహించనున్నట్టు వార్తలు అందుతున్నాయి. పాలిగ్రాఫ్ టెస్ట్ ద్వారా చేసిన నిర్ధారణలు సాక్ష్యాధారాలుగా కోర్టులో చెల్లకపోయినా కేసును ముందుకు తీసుకెళ్లడంలో సాయపడతాయి.





సంపత్ మీనా

1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సంపత్ మీనాది రాజస్థాన్‌లోని సవాయిమధోపూర్. జార్ఖండ్‌లో ఆమె వివిధ జిల్లాలకు ఎస్.పి.గా పని చేసింది. బి.పి.ఆర్ అండ్ డి (బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్)లో పని చేసే సమయంలో 'ఆపరేషన్ ముస్కాన్' కింద ఆమె చైల్డ్ ట్రాఫికింగ్‌ను సమర్థంగా నిరోధించడంతో అందరి దృష్టిలో పడ్డారు. జార్ఖండ్‌లో 700 మంది పిల్లలను ఆమె వారి కుటుంబాలతో కలపగలిగారు. ఇక జార్ఖండ్‌లోని నక్సలైట్ ప్రాంతాల్లో ఆమె సమర్థంగా నిర్వహించిన విధులు ఆమె సాహసాన్ని తెలియచేశాయి. దాంతో 2017లో ఆమె సీబీఐకి డెప్యూట్ అయ్యారు. అనతి కాలంలోనే అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఎక్కడ ఏ పదవిలో ఉన్నా మహిళా చైతన్యం కోసం మహిళల హక్కుల కోసం ఆమె ఎక్కువ శ్రద్ధ పెడతారనే గుర్తింపు ఉంది. అందుకే ఉన్నావ్, హత్రాస్ ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వం ఆమెకే కేసులను అప్పగించింది.

సీమా పహుజా

1993లో ఢిల్లీ పోలీస్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రిక్రూట్ అయిన సీమా పహుజా సీబీఐలోని అవినీతి నిరోధక శాఖ స్పెషల్ క్రైమ్ యూనిట్‌లో చాలా సంవత్సరాలు పనిచేశారు. ఆమె ఇన్వెస్టిగేషనల్ స్కిల్స్ చూసి 2013లో డీఎస్పీగా పదోన్నతి ఇచ్చారు. మానవ అక్రమ రవాణా, మైనర్ బాలికలపై నేరాలకు సంబంధించిన అనేక కేసులను శోధించడంలో ఆమె దిట్ట. సిమ్లాలోని కొట్‌ఖైలో గుడియాపై అత్యాచారం, హత్య కేసును ఛేదించినందుకు సీమా పహుజా వార్తల్లో నిలిచారు. కుటుంబ బాధ్యతల కారణంగా రిటైర్మెంట్ తీసుకోవాలనుకుని ఆమె సీబీఐ డైరెక్టర్‌కు లేఖ రాశారు. అయితే అందుకు అధికారులు ఒప్పుకోలేదు. హత్రాస్ కేసులో సంపత్ మీనాతో పని చేసిన సీమా ఇప్పుడు కోల్‌కతా కేసులో కూడా ఆమెతో పని చేయనున్నారు. ఒక కేసు ఒప్పుకుంటే నేరస్తులను కటకటాల వెనక్కు తోసే వరకు నిద్రపోదని సీమాకు పేరుంది. అందుకే ఆమెను పోలీస్ మెడల్ కూడా వరించింది. కాబట్టి కోల్‌కతా కేసులో నేరగాళ్లను పట్టుకునే కర్తవ్యాన్ని ఈ మహిళా అధికారులిద్దరూ సమర్థంగా నిర్వర్తించి సమాజానికి సరైన సందేశాన్ని పంపిస్తారని ఆశిద్దాం.

మన(సు)లో మాట

ఆయనకు విపరీతమైన అనుమానం!



మా పెళ్ళయి పదేళ్ళయింది. ఇద్దరు పిల్లలు. మొదట్లో కొంతకాలం బాగున్నాం కానీ, తర్వాత నుంచి నా భర్తకు అనుమానం జబ్బు పట్టుకుని నన్ను మానసికంగా వేధిస్తున్నాడు. ప్రతివాళ్లతోనూ నాకు సంబంధం అంటగట్టి అనరాని మాటలతో చిత్రవధ చేస్తున్నాడు. సినిమాలకు, ఫంక్షన్లకు వెళ్ళినపుడు ఈ బాధ మరీ ఎక్కువవుతోంది. ఏం చేయాలో అర్థం కావడంలేదు. దయచేసి సలహా ఇవ్వగలరు.

– ఒక సోదరి, తెనాలి

మీరనుభవిస్తున్న మానసిక క్షోభను అర్థం చేసుకోగలను. వాస్తవం గాకున్నా... ఎలాంటి ఆధారం లేకున్నా ఇలా భార్యాభర్తలు ఒకరినొకరి శీలాన్ని శంకించే మానసిక రుగ్మతను 'డెల్యూజనల్ డిజార్డర్ లేదా కాంజుగల్ పారనోయియా' అంటారు. మిగతా అన్ని విషయాల్లో వీరు మామూలుగానే ఉంటారు. ఏవేవో ఊహించుకుని ఇలాంటి భ్రమలు- భ్రాంతులకు లోనవుతూ, కేవలం జీవిత భాగస్వామిని మాత్రమే ఇలా అనుమానిస్తూ, వేధిస్తూ ఉంటారు. మానసిక రుగ్మత ఉందంటే ఒప్పుకోరు. మీరు మీ బంధువులు, ఇతర పెద్దల సహకారంతో ఆయన్ని ఏదో ఒక విధంగా ఒప్పించి, వైద్యుల దగ్గరకు వెళ్లగలిగితే, 'యాంటీ సైకోటిక్స్'అనే మందులు, కౌన్సెలింగ్ ద్వారా చికిత్స చేసి, ఈ అనుమానాల ఊబి నుంచి పూర్తిగా బయట పడేస్తారు. మళ్లీ మీరు ప్రశాంతంగా, సంతోషంగా జీవితాన్ని గడపగలరు.

మా చుట్టాలబ్బాయి చిన్నప్పటినుంచి చదువులో టాప్! రెండు పీహెచ్‌డీలు చేశాడు. ఒక పెద్ద కంపెనీలో మంచి జీతంతో ఆఫర్ కూడా వచ్చింది. అయితే ఇటీవల ఉన్నట్టుండి అతని ప్రవర్తనలో బాగా మార్పు వచ్చింది. ఎవ్వరితోనూ మాట్లాడడు. ఒక్కడూ గదిలో తలుపులు వేసుకుని కూచుంటాడు. రోజుల తరబడి స్నానం చేయడు. తనలో తాను నవ్వుకోవడం... మాట్లాడుకోవడం. మా బంధువులందరూ చదువు ఎక్కువ అవడం వల్ల ఈ పిచ్చి వచ్చిందంటున్నారు. నిజమేనా?

– కుమార్, కర్నూలు

చదువుకు, తెలివితేటలకు, మానసిక జబ్బు రావడానికీ ఎలాంటి సంబంధం లేదు. ఇది కేవలం అపోహ మాత్రమే. ఎక్కువ చదివిన వారందరికీ మెంటల్ రావాలని లేదు. అలాగే తెలివితేటలు లేనివారికి, ఎక్కువ చదువుకోనివారికీ మానసిక జబ్బులు రావని ఏమీ లేదు. మానసిక వ్యాధులకు వారసత్వ కారణాలు కొన్నయితే, పరిస్థితుల ప్రభావం, దిగ్భ్రాంతి కలిగించే సంఘటనలు జరగడం, ఆల్కహాల్, డ్రగ్స్ తీసుకోవడం, తీవ్రమైన ఒత్తిడులకు గురికావడం వంటివి ఇతర కారణాలు. ఆలస్యం చేయకుండా అతణ్ణి ఒకసారి సైకియాట్రిస్ట్‌కు చూపించమని చెప్పండి. స్కిజోఫ్రినియా అనే మానసిక జబ్బుకు లోను కావడం వల్ల వారికి మీరు పేర్కొన్న లక్షణాలుండే అవకాశం ఉంది. తొలిదశలోనే గుర్తించి, సరయిన చికిత్స చేయిస్తే, తొందరగా కోలుకుని తిరిగి మంచి జీవితాన్ని గడపగలడు.



– డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

బ్యూటిప్స్

చర్మ సౌందర్యానికి కొబ్బరిపాలు



చర్మం మృదువుగా మారడానికి కొబ్బరిపాలు బాగా పని చేస్తాయి. ఒక బకెట్ వేడి నీటిలో ఒక కప్పు కొబ్బరిపాలు, అరకప్పు పన్నీరు, కప్పు గులాబీ రేకులు వేసి పది నిమిషాల తర్వాత ఆ నీటితో స్నానం చేయాలి. ● చర్మం తెల్లబడాలంటే స్నానానికి ఓ అరగంట ముందు కొబ్బరిపాలను ఒంటికి పట్టించి చర్మం పీల్చుకునే వరకు ఆరనిచ్చి ఆ తర్వాత సున్నిపిండితో స్నానం చేయాలి.





శ్రీజేశ్‌కు రూ. 2 కోట్ల నజరానా...

పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు కాంస్య పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించిన గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్‌కు కేరళ రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల రూపాయల నజరానా ప్రకటించింది. మంత్రివర్గ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సుదీర్ఘ కాలంగా జట్టులో కీలక సభ్యుడిగా కొనసాగిన శ్రీజేశ్ 'పారిస్' క్రీడల్లో భారత జట్టు కాంస్య పతకం గెలిచాక కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. త్వరలోనే జాతీయ జూనియర్ జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు.

అఫ్గానిస్తాన్ అసిస్టెంట్ కోచ్‌గా శ్రీధర్



టీమిండియా మాజీ ఫీల్డింగ్ కోచ్ రామకృష్ణన్ శ్రీధర్‌ను అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు తమ జట్టు అసిస్టెంట్ కోచ్‌గా నియమించింది. ముందుగా న్యూజిలాండ్‌తో జరిగే ఏకైక టెస్టుతో పాటు, దక్షిణాఫ్రికాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు శ్రీధర్ అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరిస్తారు. హైదరాబాద్‌కు చెందిన 54 ఏళ్ల శ్రీధర్ 2014 నుంచి 2021 వరకు భారత జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా పని చేశారు. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ, ఐపీఎల్‌లో పలు ఫ్రాంచైజీలకూ సేవలందించారు.


షకీల్, అయూబ్

పాకిస్తాన్ 158/4

బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు

రావల్పిండి: వర్షం అంతరాయం మధ్య బంగ్లాదేశ్‌తో బుధవారం ప్రారంభమైన తొలి టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ 41 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. భారీ వర్షం కారణంగా నాలుగున్నర గంటలు ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ అదరగొట్టింది. పచ్చికతో కూడిన పిచ్‌పై బంగ్లా పేసర్లు షరీఫుల్ ఇస్లామ్ (2/30), హసన్ మహమూద్ (2/33) నిప్పులు చెరిగారు. ఫలితంగా పాకిస్తాన్ ఒక దశలో 16 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అనంతరం ఓపెనర్ సయీమ్ అయూబ్ (98 బంతుల్లో 56; 4 ఫోర్లు, ఒక సిక్సర్), వైస్ కెప్టెన్ సౌద్ షకీల్ (92 బంతుల్లో 57 బ్యాటింగ్; 5 ఫోర్లు) అర్ధశతకాలతో రాణించడంతో ఆతిథ్య జట్టు కోలుకోగలిగింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 98 పరుగులు జోడించారు. ఆట ముగిసే సమయానికి షకీల్‌తో పాటు వికెట్ కీపర్ రిజ్వాన్ (24 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

శ్రీలంక 236 ఆలౌట్

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో బుధవారం మొదలైన తొలి టెస్టులో శ్రీలంక జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా (84 బంతుల్లో 74; 8 ఫోర్లు), మిలాన్ రథనాయకె (135 బంతుల్లో 72; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ శతకాలతో రాణించారు. నిషాన్ మధుషనక (4), కరుణరత్నే (2), ఏంజెలో మాథ్యూస్ (0), చండీమల్ (17), కమిందు మెండిస్ (12), ప్రభాత్ జయసూర్య (10) విఫలమవడంతో లంక 113 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో మిలాన్ అండగా.. ధనంజయ పోరాడటంతో శ్రీలంక ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్, షోయబ్ బషీర్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 22 పరుగులు చేసింది.

నీరజ్‌పైనే దృష్టి

నేడు లుసాన్ డైమండ్ లీగ్ మీట్



లుసాన్ (స్విట్జర్లాండ్): పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం గెలిచి చరిత్ర సృష్టించిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మరో ఈవెంట్‌కు సిద్ధమయ్యాడు. డైమండ్ లీగ్ సిరీస్‌లో భాగంగా నేడు లుసాన్ మీట్‌లో నీరజ్ బరిలోకి దిగుతున్నాడు. భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి గం. 12:10 నుంచి నీరజ్ ఈవెంట్ మొదలవుతుంది. పారిస్ ఒలింపిక్స్‌లో తొలి ఆరు స్థానాల్లో నిలిచిన జావెలిన్ త్రోయర్లలో పాకిస్తాన్ అథ్లెట్, స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ మినహా మిగిలిన ఐదుగురు లుసాన్ మీట్‌లో ఉన్నారు. స్పోర్ట్స్–18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో నీరజ్ ఈవెంట్‌ను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

డైమండ్ లీగ్‌లో భాగంగా మొత్తం 14 మీట్‌లు జరుగుతాయి. అయితే జావెలిన్ త్రో మాత్రం నాలుగు మీట్‌లలోనే నిర్వహిస్తారు. ఇప్పటికే దోహా, పారిస్ అంచెలు ముగిశాయి. లుసాన్ మీట్ తర్వాత జ్యూరిచ్‌లో (సెప్టెంబర్ 5న) చివరిదైన నాలుగో అంచె జరుగుతుంది. అనంతరం ఈ నాలుగు మీట్‌లలో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా టాప్–6లో నిలిచిన వారు సెప్టెంబర్ 14న బ్రస్సెల్స్‌లో జరగనున్న ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ఈ సీజన్‌లో దోహా మీట్‌లో మాత్రం పాల్గొని రెండో స్థానంలో నిలిచిన నీరజ్ ప్రస్తుతం 7 పాయింట్లతో పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. లుసాన్ మీట్‌లో మొత్తం 10 మంది జావెలిన్ త్రోయర్లు బరిలో ఉన్నారు. మొత్తం ఆరు అవకాశాలు ఇస్తారు. తొలి మూడు ప్రయత్నాలు ముగిశాక చివరి రెండు స్థానాల్లో నిలిచిన వారు నిష్క్రమిస్తారు. మిగిలిన ఎనిమిది మంది ఆరు త్రోలను పూర్తి చేస్తారు. టాప్–8లో నిలిచిన వారికి పాయింట్లు కేటాయిస్తారు. టాప్–3లో నిలిచిన వారికి వరుసగా 8,7,6 పాయింట్లు లభిస్తాయి. అనంతరం 4,5,6,7,8 స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా 5,4,3,2,1 పాయింట్లు కేటాయిస్తారు. డైమండ్ లీగ్ మీట్ ఫైనల్స్‌లో మాత్రమే పతకాలను అందజేస్తారు. ఈ సీజన్‌లో నీరజ్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. పోటీపడ్డ ఐదు ఈవెంట్స్‌లోనూ కనీసం టాప్–2లో నిలిచాడు.

గతంలో 2022లో డైమండ్ లీగ్ విజేతగా నిలిచిన 26 ఏళ్ల నీరజ్.. గత ఏడాది రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇటీవల గాయంతోనే 'పారిస్' క్రీడల్లో బరిలోకి దిగిన నీరజ్.. సీజన్ అత్యుత్తమ ప్రదర్శనతో రజతం చేజిక్కించుకున్నాడు. మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి పతకం గెలిచిన నీరజ్.. విశ్వక్రీడల అథ్లెటిక్స్‌లో దేశానికి తొలి పతకం అందించిన అథ్లెట్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. విశ్వక్రీడలు ముగియగానే స్వదేశానికి కూడా తిరిగిరాని నీరజ్‌చోప్రా.. నేరుగా స్విట్జర్లాండ్‌కు వెళ్లి ప్రాక్టీస్‌లో మునిగిపోయాడు. 'ఒలింపిక్స్ ముగియగానే... డైమండ్ లీగ్ సన్నాహాలు ప్రారంభించా. ఇందులో భాగంగానే స్విట్జర్లాండ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. గాయం గురించి పెద్దగా ఆందోళన చెందడం లేదు. మరో నెల రోజులైతే సీజన్ ముగుస్తుంది. ఆ తర్వాత వైద్యులను సంప్రదిస్తా' అని నీరజ్ వెల్లడించాడు.



సినెర్‌కు శిక్ష లేదా!

డోపింగ్ వివాదంపై టెన్నిస్ స్టార్ల ఆగ్రహం

వాషింగ్టన్: వరల్డ్ నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ యానిక్ సినెర్ (ఇటలీ)ని పెద్ద వివాదం చుట్టుముట్టింది. అతను రెండుసార్లు స్టెరాయిడ్ పరీక్షల్లో విఫలమైనా ఎందుకు చర్య తీసుకోవడం లేదంటూ ఇతర ఆటగాళ్లు తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. సినెర్‌ను పోటీల్లో ఇంకా ఎలా ఆడనిస్తున్నారని ప్రశ్నించిన వారు... అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోందని విమర్శించారు. ఈ ఏడాది మార్చిలో నిషేధిత అనబాలిక్ ఉత్ప్రేరకాన్ని తీసుకున్నందుకు రెండుసార్లు సినెర్ 'పాజిటివ్'గా తేలాడు. అయితే మంగళవారం వరకు కూడా ఎవరికీ ఈ విషయం తెలియదు. ఎందుకు ఈ విషయాన్ని ఇంత కాలం రహస్యంగా ఉంచారని, ఈనెల 26 నుంచి జరిగే యూఎస్ ఓపెన్‌లో అతడిని ఎలా అనుమతిస్తున్నారని పలువురు వ్యాఖ్యానించారు. 'వేర్వేరు ఆటగాళ్లకు వేర్వేరు నిబంధనలు' అంటూ షపవలోవ్ (కెనడా) ట్వీట్ చేయగా... ఇలాంటి పనికి నిషేధం తప్ప మరో శిక్షే లేదని నిక్ కిరియోస్ (ఆస్ట్రేలియా) తీవ్రంగా స్పందించాడు.

ఈ ఏడాది జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన సినెర్ జూన్‌లో వరల్డ్ నంబరవన్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. చేతికి గాయాలు తగిలినప్పుడు లేదా కోసుకుపోయినప్పుడు వాడే ఆయింట్‌మెంట్, స్ప్రేలలో ఉండే 'క్లోస్టెబల్' స్టెరాయిడ్స్ నిషేధిత జాబితాలో ఉంది. మార్చిలో ఇండియన్ వెల్స్ టోర్నీ సమయంలోనూ, టోర్నీ ముగిసిన వారం తర్వాత సినెర్ ఇచ్చిన శాంపిల్స్‌లో ఈ ఉత్ప్రేరకం ఉన్నట్లు తేలింది. దాంతో ఈ టోర్నీలో సినెర్ సెమీస్ చేరడం ద్వారా వచ్చిన 3,25,00 డాలర్ల ప్రైజ్‌మనీని వెనక్కి తీసుకోవడంతోపాటు 400 పాయింట్లలో కూడా కోత విధించారు. దీనిపై అప్పీల్ చేసిన సినెర్ తాను ఉద్దేశపూర్వకంగా తీసుకోలేదని, దానిని వాడిన ఫిజియోథెరపిస్ట్ మసాజ్ చేసిన కారణంగా తన శరీరంలోకి ప్రవేశించిందని, ఇక ముందు అలా జరగకుండా డోపింగ్ నిబంధనలు పాటిస్తానని స్పష్టం చేశాడు. అతని వాదనను అంగీకరిస్తూ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) సినెర్ తప్పేమీ లేదంటూ క్లీన్ చిట్ కూడా ఇచ్చింది. అయితే తాజాగా 'దురదృష్టకర ఘటనను మరిచి ముందుకు సాగుతాను' అని సినెర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో మళ్లీ చర్చ మొదలైంది. ఇలాంటి విషయాలను సాధ్యమైనని ఎక్కువ రోజులు రహస్యంగా ఉంచి, అంతా మరచిపోయేలా చేస్తూ అగ్రశ్రేణి ఆటగాళ్లను రక్షించడం కొత్త కాదని... అదే ఏ 400వ ర్యాంక్ ప్లేయర్ అయిఉంటే అది సాధ్యం కాదని మాజీ ప్లేయర్, టెన్నిస్ దిగ్గజం క్రిస్ ఎవర్ట్ కూడా అభిప్రాయపడింది. ముమ్ముందు ఈ విషయంలో ఎలాంటి పరిణామాలు జరుగుతాయనేది ఆసక్తికరం.



ప్రిక్వార్టర్స్‌లో సతీశ్

యోకోహామా: జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ నుంచి సతీశ్ కుమార్ కరుణాకరన్ ఒక్కడే మిగిలాడు. టోర్నీ రెండో రోజు బుధవారం బరిలోకి దిగిన భారత క్రీడాకారుల్లో సతీశ్ మినహా మిగతా వారందరూ ఓడిపోయారు. ప్రపంచ మూడో ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 47వ ర్యాంకర్ సతీశ్ 6–1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ దశలో ఆంటోన్సెన్ గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలగడంతో సతీశ్‌ను విజేతగా ప్రకటించారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో కాంతాపోన్ వాంగ్‌చరోయెన్ (థాయ్‌లాండ్)తో సతీశ్ తలపడతాడు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో కిరణ్ జార్జి 19–21, 14–21తో కొంటా సునెయామ (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యాడు. జెస్పెర్ టాఫ్ట్–అమెలీ మాగెలుండ్ (డెన్మార్క్)తో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో 1–3తో వెనుకబడిన దశలో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి (భారత్) జోడీ గాయం కారణంగా వైదొలిగింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రుతుపర్ణా పాండా–శ్వేతాపర్ణా (భారత్) ద్వయం 8–21, 14–21తో జూలీ ఫిన్–మాయ్ సురో (డెన్మార్క్) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

సాయినాథ్‌కు కాంస్యం



అమ్మాన్ (జోర్డాన్): ప్రపంచ అండర్–17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో బాలుర గ్రీకో రోమన్ 51 కేజీల విభాగంలో భారత రెజ్లర్ సాయినాథ్ కాంస్య పతకాన్ని సాధించాడు. కాంస్య పతక బౌట్‌లో సాయినాథ్ 3–1తో ముసాన్ (కజకిస్తాన్)పై నెగ్గాడు. మరోవైపు బాలికల విభాగంలో భారత్‌కు చెందిన అదితి (43 కేజీలు), నేహా (57 కేజీలు), పుల్కిత్ (65 కేజీలు), మాన్సీ (73 కేజీలు) ఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం రజత పతకాలను ఖరారు చేసుకున్నారు.

సినిమా

నాకు ఇష్టమైతే వస్తా - అల్లు అర్జున్


● రమ్య, రావు రమేష్, తబిత, సుకుమార్, అల్లు అర్జున్, అంకిత్ కొయ్య, లక్ష్మణ్ కార్య

"'పుష్ప 2: ది రూల్' క్లైమాక్స్ షూటింగ్‌లో ఉన్నా. నా జీవితంలో ఎంతో క్లిష్టమైన క్లైమాక్స్ షూటింగ్. సుకుమార్‌గారి భార్య తబితగారు వచ్చి 'మారుతినగర్ సుబ్రమణ్యం' సినిమాని నేను సమర్పిస్తున్నాను.. ప్రీ రిలీజ్ వేడుకకి రావాలని అడగ్గానే వస్తానని చెప్పాను. ఎందుకంటే మనకి ఇష్టమైన వాళ్లకి మనం సపోర్ట్‌గా నిలబడగలగాలి. అది మన ఫ్రెండ్ అయినా, కావాల్సిన వాళ్లు అయినా. నాకు ఇష్టమైతే నేను వస్తా.. నా మనసుకు నచ్చితే నేను వస్తా. అది మీ అందరికీ తెలిసిందే'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. రావు రమేష్, ఇంద్రజ, అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. తబితా సుకుమార్ సమర్పణలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించిన ఈ మూవీ ఈ నెల 23న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన **అల్లు అర్జున్ మాట్లాడుతూ–** ''సుకుమార్‌గారు ఇప్పుడు పాన్ ఇండియా రేంజ్‌లో ఉన్నారు. అయినా తబితగారు స్వతహాగా 'మారుతినగర్ సుబ్రమణ్యం' ని సపోర్ట్ చేస్తున్నందుకు థ్యాంక్స్. రావు రమేష్‌గారి లాంటి నటుడు ఉండటం మన తెలుగు ఇండస్ట్రీ అదృష్టం. ఈ మధ్య చిన్న చిత్రాలకు జనాలు థియేటర్స్‌కి వస్తుండటం మంచి ట్రెండ్. అదే ట్రెండ్ ఈ శుక్రవారం కూడా కొనసాగాలి. 'మారుతినగర్ సుబ్రమణ్యం' ని కూడా మీరు సపోర్ట్ చేయాలి. గత ఏడాది నాకు జాతీయ అవార్డు వచ్చినప్పుడు ఈ ఏడాది 'కాంతార' కి వస్తే బాగుండు అనుకున్నా. రిషబ్ శెట్టిగారికి వచ్చినందుకు అభినందనలు. నిత్యామీనన్ మంచి నటి. నాకు మంచి ఫ్రెండ్. తనకు జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉంది. అలాగే 'కార్తికేయ 2' మూవీ యూనిట్‌కి, జానీ మాస్టర్‌కి కూడా అభినందనలు. డిసెంబరు 6న అస్సలు తగ్గేదే లే.. ఇది మాత్రం ఫిక్స్. నా సినిమా ఎలా ఉన్నా మీకు(ఫ్యాన్స్) నచ్చుతుంది కాబట్టి 'పుష్ప 2: ది రూల్'ని మీకు అంకితం ఇస్తున్నా'' అని తెలిపారు.

డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ– ''ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి బన్నీ రావడం వల్ల ఈ చిన్న సినిమా కాస్త పెద్దది అయిపోయింది. బన్నీ ఎప్పుడూ కూడా తాను స్టార్ అనుకోడు.. నేను బాగా నటించాలన్నదే తన లక్ష్యం. ఓ స్టార్ హీరో నటించడమే గొప్ప విషయం అనుకుంటే గనక.. గొప్పగా నటించే రావు రమేశ్‌కూడా బిగ్గెస్ట్ స్టార్. ఈ సినిమా హిట్ కావాలి'' అన్నారు. ''ఇన్నేళ్లలో నాకు సరైన స్క్రిప్ట్ దొరికిందని నమ్మి, ఈ సినిమాలో లీడ్ రోల్ చేశాను'' అని **రావు రమేష్** చెప్పారు. ''ఇటీవల 'కమిటీ కుర్రోళ్ళు, ఆయ్' వంటి కంటెంట్ ఉన్న సినిమాలను ప్రేక్షకులు బాగా ఆదరించారు. ఆ కోవలో మంచి కథతో వస్తున్న మా 'మారుతినగర్ సుబ్రమణ్యం' ని కూడా ఆదరించాలి'' అన్నారు **తబితా సుకుమార్.** ఈ వేడుకలో నిర్మాతలు మోహన్ కార్య, బుజ్జి రాయుడు పెంట్యాల, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.


● మహేశ్‌బాబు

ముఫాసాకి మాట సాయం

హాలీవుడ్ చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్' తెలుగు వెర్షన్‌కి వాయిస్ ఓవర్ ఇచ్చారు మహేశ్‌బాబు. బారీ జెంకిన్స్ దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కింది. ఇండియాలో ఈ సినిమా డిసెంబర్ 20న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలోని లీడ్ రోల్ ముఫాసాకి మాట సాయం చేశారు మహేశ్ బాబు. ఈ విషయాన్ని డిస్నీ స్టార్ స్టూడియోస్ హెడ్ బిక్రమ్ దుగ్గల్ వెల్లడించారు. మహేశ్ బాబు మాట్లాడుతూ– ''డిస్నీ బ్లాక్‌బస్టర్ లెగసీ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్, టైమ్‌లెస్ స్టోరీ టెల్లింగ్ అంటే నాకెంతో ఇష్టం. తన కొడుకును నడిపించే ప్రేమగల తండ్రిగా మాత్రమే కాకుండా అడవికి రారాజుగా ముఫాసా పాత్ర ఉంటుంది. ఈ సినిమాని నా కుటుంబంతో కలిసి చూస్తాను. అలాగే నా అభిమానులు కూడా చూస్తారని ఎదురు చూస్తున్నాను'' అన్నారు. ఇక ఈ చిత్రంలోని పుంబా పాత్రకి బ్రహ్మానందం, టిమోన్ పాత్రకి అలీ వాయిస్ ఓవర్ ఇచ్చారు.

దసరాని సరిపోదా శనివారం బీట్ చేస్తుంది - 'దిల్' రాజు


● డీవీవీ దానయ్య, 'దిల్' రాజు, నాని, ప్రియాంకా అరుళ్ మోహన్, కల్యాణ్

''**స**రిపోదా శనివారం' కోసం చాలా కష్టపడుతున్న టీమ్‌కి పేరు పేరునా థ్యాంక్స్. మా డైరెక్టర్ వివేక్ ఆత్రేయ రెండు నెలలుగా నిద్ర పోయింది లేదు. మా యూనిట్ కోసం ఈ సినిమా వేరే లెవల్‌కి చేరాలని కోరుకుంటున్నా'' అని హీరో నాని అన్నారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో నాని, ప్రియాంకా అరుళ్ మోహన్ జంటగా నటించిన చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. బుధవారం నిర్వహించిన సమావేశంలో నాని మాట్లాడుతూ– ''ఆర్‌ఆర్‌ఆర్' వంటి సక్సెస్ చూశాక దానయ్యగారికి అంత త్వరగా ఏదీ ఆనదు. కానీ, మా సినిమా ఆనుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఈ మూవీ తెలుగు రాష్ట్రాల పంపిణీ హక్కుల్లో నన్ను భాగస్వామ్యం చేసినందుకు దానయ్యకు థ్యాంక్స్. నాని 'దసరా'ని 'సరిపోదా శనివారం' బీట్ చేయబోతోందని ట్రైలర్ చూశాక నమ్మకంగా చెప్పొచ్చు'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. ''ఈ సినిమా పెద్ద హిట్టవుతుంది'' అని డీవీవీ దానయ్య చెప్పారు.


● శోభితా ధూళిపాళ్ల, నాగచైతన్య

మార్చిలో ఏడడుగులు

హీరో నాగచైతన్య, హీరోయిన్ శోభితా ధూళిపాళ్లల నిశ్చితార్థం ఈ నెల 8న జరిగిన విషయం తెలిసిందే. అప్పట్నుంచీ వీరి వివాహం ఎక్కడ జరుగుతుంది? ఎప్పుడు జరుగుతుంది? అనే చర్చ ఆరంభమైంది. కాగా నాగచైతన్య, శోభితల వివాహం ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది మార్చిలో రాజస్తాన్‌లో జరిగే అవకాశం ఉందనే టాక్ ప్రచారంలోకి వచ్చింది. ఈ ఇద్దరి సినిమా కాల్షీట్స్, వీరి కుటుంబంలోని ముఖ్య సభ్యులు అందుబాటులో ఉండే సమయం వంటి అంశాలు చర్చించుకుని పెళ్లి తేదీ, వివాహ వేదికపై ఇద్దరి కుటుంబ సభ్యులు ఓ స్పష్టతకు వస్తారట. మరి... ఈ ఏడాది చివర్లో నాగచైతన్యతో శోభిత ఏడడుగులు వేస్తారా? లేక వచ్చే ఏడాది మార్చిలో శోభిత మెడలో చైతన్య మూడు ముళ్లు వేస్తారా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు. ఇక ప్రస్తుతం నాగచైతన్య 'తండేల్' సినిమాతో బిజీగా ఉన్నారు. సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు చందు మొండేటి దర్శకుడు.


ఇప్పుడు ఆ ట్రెండ్ నడుస్తోంది - రామ్‌గోపాల్ వర్మ


● రామ్‌గోపాల్ వర్మ, జ్ఞానముత్తు, అజయ్ భూపతి, సురేష్ రెడ్డి

''**డీ**మాంటీ కాలనీ 2' సినిమాను తమిళంలో, తెలుగు ప్రీమియర్ చూసిన వాళ్ల దగ్గర నుంచి మంచి టాక్ వచ్చింది. ప్రస్తుతం కథని బట్టి చిన్న సినిమాలు పెద్దవి అవుతున్నాయి.. పెద్దవి చిన్నవి అవుతున్నాయి. కంటెంట్ ఉన్న సినిమాలు చూసే ట్రెండ్ నడుస్తోంది. తమిళంలో హిట్ అయిన 'డీమాంటీ కాలనీ 2'ని తెలుగులోనూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వం వహించారు. ఈ నెల 15న తమిళంలో విడుదలైన ఈ చిత్రాన్ని ఎన్. శ్రీనివాస రెడ్డి సమర్పణలో బి. సురేష్ రెడ్డి, బి. మానస రెడ్డి తెలుగులో రేపు రిలీజ్ చేస్తున్నారు. బుధవారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో దర్శకులు రామ్‌గోపాల్ వర్మ, అజయ్ భూపతి, నిర్మాత బెక్కెం వేణుగోపాల్ అతిథులుగా పాల్గొన్నారు. ''ఈ చిత్రంలో హారర్ కంటే థ్రిల్లర్ అంశాలు ఎక్కువగా ఆకట్టుకుంటాయి'' అన్నారు బి. సురేష్ రెడ్డి. ''ఈ మూవీకి పార్ట్ 3, పార్ట్ 4 కూడా చేయబోతున్నాం'' అని అజయ్ ఆర్. జ్ఞానముత్తు పేర్కొన్నారు. ఈ సినిమాని నైజాంలో రిలీజ్ చేస్తున్న మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ నుంచి శశి పాల్గొన్నారు.

అద్భుతమైన కంటెంట్ ఉంది

''**మ**త్స్యకారుల జీవితాలతో తెరకెక్కిన చిత్రం 'రేవు'. ఈ సినిమా పాటలు, ట్రైలర్స్‌లో ఎంత కంటెంట్ ఉందో సినిమాలోనూ అంతే ప్రామిసింగ్ కంటెంట్ ఉంది'' అని హరినాథ్ పులి అన్నారు. వంశీరామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా. మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో మురళి గింజుపల్లి మాట్లాడుతూ– ''రేవు' నుంచి ఇప్పటికే విడుదలైన మూడు పాటలకు, ట్రైలర్‌కి మంచి స్పందన వచ్చింది. ఇందులోని మరో పాటని థియేటర్లో చూసి ఎగ్జయిట్ అవుతారు'' అన్నారు. ''రేవు' ట్రైలర్ చూడగానే ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఏర్పడింది'' అని నిర్మాణ సూపర్ విజన్, జర్నలిస్ట్ ప్రభు తెలిపారు. ''హరినాథ్ పులి తీసిన 'రేవు' సినిమా నచ్చడంతో మా ఫ్రెండ్స్ మురళి గింజుపల్లి, నవీన్ పారుపల్లిలకు చెప్పి రిలీజ్ వరకూ తీసుకొచ్చాం'' అని ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు పేర్కొన్నారు.


● 'రేవు'లో ఓ దృశ్యం


● శ్రీనిధి శెట్టి, నీరజ

తెలుసు కదా సెట్స్‌లో...

'**తె**లుసు కదా' సినిమా సెట్స్‌లో జాయిన్ అయ్యారు 'కేజీఎఫ్' ఫేమ్ హీరోయిన్ శ్రీనిధి శెట్టి. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీ చిత్రీకరణ ఇటీవల హైదరాబాద్‌లో ఆరంభమైంది. తొలి షెడ్యూల్‌లో సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా కాంబినేషన్‌లో కొంత టాకీ పార్టుతో పాటు ఓ పాట చిత్రీకరణ జరిగింది. తాజాగా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ మొదలైంది. ఈ షెడ్యూల్‌లో శ్రీనిధి శెట్టి పాల్గొంటున్నారు. సినిమాలోని ముఖ్య సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లుగా మేకర్స్ వెల్లడించారు.


● ఖుష్బూ, తేజస్

గుండె గంతులేసిందే...

''**ఓ**రి మాయలోడా నిన్ను సూడగానే గుండె గంతు లేసిందే... ఓ మాట కూడా నాకు సెప్పకుండా నిన్ను సుట్టుకుంటోంది...' అంటూ ప్రేమించిన అబ్బాయిపై తన ప్రేమనంతా కురిపిస్తూ పాట పాడింది ఓ అమ్మాయి. తేజస్ కంచర్ల హీరోగా ఖుష్బూ చౌదరి హీరోయిన్‌గా నటించిన 'ఉరుకు పటేల' చిత్రంలోని పాట ఇది. ఈ ఇద్దరి పై సాగే ఈ పాటను స్టార్ హీరోయిన్ శ్రీలీలతో రిలీజ్ చేయించారు మేకర్స్. సంగీతదర్శకుడు ప్రవీణ్ లక్కరాజు స్వరపరచిన ఈ పాటకు శ్రీనివాస మౌళి సాహిత్యం అందించగా స్ఫూర్తి జితేందర్ పాడారు. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 7న రిలీజ్ కానుంది.

సాక్షి బిజినెస్
గురువారం
22-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్	▲ 102	80,905
నిఫ్టీ	▲ 71	24,770

విదేశీ సూచీలు (తొలి సెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,883	▲ 70
డోజోన్స్	40,854	▲ 13
ఎఫ్‌టీఎస్ఈ 100	8,283	▲ 10
డాక్స్	18,449	▲ 91
షాంఘై	2,857	▼ 10
నికాయ్	37,952	▼ 111

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	71,719	▼ 226
బంగారం (99.5 స్వచ్ఛత)	71,432	▼ 225
వెండి (కిలో)	84,913	▲ 407

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎపేక్షం	83.41	84.43
£	బ్రిటన్ పౌండ్	ఎపేక్షం	108.03	110.63
€	యూరో	ఎపేక్షం	92.13	94.52
¥	జపాన్ ఎన్ (100)	ఎపేక్షం	57.06	58.36
AUS	ఆస్ట్రేలియా డాలర్	భారమపేక్ష	55.64	57.59
S$	సింగపూర్ డాలర్	భారమపేక్ష	61.91	66.60
SAR	సౌదీ రియాల్	భారమపేక్ష	21.49	23.04
UAE D	యూఏఈ దిర్హామ్	భారమపేక్ష	21.96	23.75
¥	చైనా యువాన్	భారమపేక్ష	10.90	12.72

పన్ను నోటీసుల్లో సరళ పదాలు వాడండి



- అధికారులకు ఆర్థికమంత్రి సూచన
- 165వ ఆదాయపు పన్ను దినోత్సవ వేడుకల్లో ప్రసంగం

న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుదారులకు పంపే నోటీసులు లేదా లేఖలలో సరళమైన పదాలను ఉపయోగించాలని సంబంధిత అధికారులకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఉన్న అధికారాన్ని వినియోగించడంలో న్యాయబద్ధంగా వ్యవహరించాలని కూడా విజ్ఞప్తి చేశారు. 165వ ఆదాయపు పన్ను దినోత్సవ వేడుకలను ఉద్దేశించి సీతారామన్ మాట్లాడుతూ, వ్యక్తిగత హాజరు అవసరం లేని ప్రస్తుత డిజిటల్ యుగంలో అధికారులు పన్ను చెల్లింపుదారులతో మరింత 'న్యాయంగా, స్నేహపూర్వకంగా' ఉండాలని అన్నారు. పన్ను నోటీసులు పన్ను చెల్లింపుదారులలో 'భయ భావనను' సృష్టించకూడదని అన్నారు. ఇందుకు బదులుగా నోటీసులు సరళంగా, సూటిగా ఉండాలన్నారు. నోటీసు పంపిన కారణాన్ని మదింపుదారునికి 'స్పష్టంగా' తెలియజేయాలని మంత్రి సూచించారు. ''మనం సరళమైన, సులభంగా అర్థమయ్యేలా నోటీసులు జారీ చేసే మార్గాలను అన్వేషించలేమా? ఎందుకు చర్య తీసుకున్నారో, నోటీసు ఎందుకు పంపడం జరుగుతోందో స్పష్టంగా వివరించలేమా?' అని ఆమె ఈ సందర్భంగా ప్రశ్నిస్తూ, ఆయా అంశాలను పన్ను చెల్లింపుదారులకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు.

వేగవంతంగా రిఫండ్స్...

రిఫండ్‌లను వేగంగా జారీ చేయడంలో మెరుగుదలకు తగిన చర్యలు తీసుకోవాలని కూడా ఆర్థికమంత్రి సూచించారు. సమస్యకు తగిన చర్యలను మాత్రమే తీసుకోవాలని పేర్కొన్నారు. పన్ను చెల్లింపులకు తగిన న్యాయపరమైన చర్యలను చివరి ప్రయత్నంగా మాత్రమే అమలు చేయాలని ఆమె కోరారు. పన్ను డిమాండ్‌కు స్వచ్ఛంద సమ్మతిని ప్రోత్సహించడం డిపార్ట్‌మెంట్ లక్ష్యంగా ఉండాలన్నారు. పన్నుల శాఖ మరింత స్నేహపూర్వకంగా, పారదర్శకంగా ఉండాలని తాను తరచూ పేర్కొంటున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, పన్ను అధికారులు ఇన్నాళ్లూ అన్యాయంగా వ్యవహరించారని తాను పేర్కొంటున్నట్లు అర్థం చేసుకోరాదని స్పష్టం చేశారు.

కల్యాణ్ జ్యువెల్లర్స్‌లో హైడెల్ వాటాల విక్రయం

ప్రమోటర్లకు 2.36 శాతం అమ్మకం; విలువ రూ. 1,300 కోట్లు

న్యూఢిల్లీ: కల్యాణ్ జ్యువెలర్స్‌లో విదేశీ ఇన్వెస్టరు హైడెల్ ఇన్వెస్ట్‌మెంట్ 2.36 శాతం వాటాలు విక్రయించనుంది. వీటి విలువ సుమారు రూ. 1,300 కోట్లుగా ఉండనుంది. ప్రమోటరు టి. సీతారామ అయ్యర్‌కి హైడెల్ 2.2 కోట్ల షేర్లను, ఒక్కోటి రూ. 535 రేటుకి విక్రయించనున్నట్లు కల్యాణ్ జ్యువెలర్స్ సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ఈ డీల్ అనంతరం ప్రమోటర్ గ్రూప్ షేర్‌హోల్డింగ్ 60.59 శాతం నుంచి 62.95 శాతానికి పెరుగుతుందని వివరించింది.

బుధవారం బీఎస్ఈలో కల్యాణ్ జ్యువెల్లర్స్ షేరు సుమారు 1% పెరిగి రూ. 548.15 వద్ద క్లోజయ్యింది.

స్కోడా కొత్త కారు.. కైలాక్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ స్కోడా ఆటో ఇండియా కొత్తగా తీసుకురానున్న కాంపాక్ట్ ఎస్‌యూవీకి కైలాక్ అని నామకరణం చేసింది. దేశవ్యాప్తంగా నేమ్ యువర్ స్కోడా క్యాంపెయిన్ ద్వారా ఈ పేరును ఎంపిక చేసినట్టు కంపెనీ ప్రకటించింది. ఈ మేరకు కైలాక్ టీజర్‌ను స్కోడా విడుదల చేసింది. మారుతీ సుజుకీ బ్రెజ్జా, టాటా నెక్సన్, కియా సోనెట్, మహీంద్రా 3ఎక్స్‌వో వంటి కార్లకు ఇది పోటీనివ్వనుంది.

సెంట్రల్ బ్యాంక్ చేతికి బీమా బిజినెస్

ఫ్యూచర్ గ్రూప్ కొనుగోలుకి బిడ్ సక్సెస్

న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో చిక్కుకున్న ఫ్యూచర్ ఎంటర్‌ప్రైజెస్(ఎఫ్ఈఎల్)కు చెందిన సాధారణ, జీవిత బీమా వెంచర్‌ను పీఎస్‌యూ సంస్థ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సొంతం చేసుకోనుంది. రుణదాతల కమిటీ(సీవోసీ) ఎఫ్ఈఎల్‌కు చెందిన ఫ్యూచర్ జనరాలి ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఫ్యూచర్ జనరాలి ఇన్సూరెన్స్ కంపెనీ ఆస్తులకు సెంట్రల్ బ్యాంక్‌ను విజయవంతమైన బిడ్డర్‌గా ఎంపిక చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-8-2024	
విశాఖ	505-00
చిత్తూరు	508-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	485-00
హైదరాబాద్	450-00
వరంగల్	452-00

అయిదో రోజూ నిఫ్టీ జోరు

పరిమిత శ్రేణి ట్రేడింగ్



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు బుధవారం వరుసగా అయిదో రోజూ లాభాలతో ముగిశాయి. అమెరికా ఫెడ్ సమావేశ వివరాలు వెల్లడి (బుధవారం రాత్రి)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. సెన్సెక్స్ 102 పాయింట్లు పెరిగి 80,905 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 150 పాయింట్లు బలపడి 80,953 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 71 పాయింట్లు ర్యాలీ చేసి 24,770 వద్ద నిలిచింది. కాగా, డాలర్ మారకంలో రూపాయి విలువ 13 పైసలు బలహీనపడి 83.90 స్థాయి వద్ద స్థిరపడింది.

ఐసెక్ డీలిస్టింగ్‌కు ఎన్‌సీఎల్‌టీ ఓకే

ఐసీఐసీఐ సెక్యూరిటీస్(ఐసెక్) డీలిస్టింగ్‌కు ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ అనుమతించింది. స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి డీలిస్టయ్యేందుకు కంపెనీ దాఖలు చేసిన దరఖాస్తుకు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

జొమాటోకు పేటీఎమ్ టికెటింగ్

బిజినెస్ విలువ రూ. 2,048 కోట్లు

న్యూఢిల్లీ: ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ బిజినెస్‌ను జొమాటోకు విక్రయించనున్నట్లు పేటీఎమ్ బ్రాండు డిజిటల్ చెల్లింపుల కంపెనీ వన్97 కమ్యూనికేషన్స్ తాజాగా పేర్కొంది. మూవీలు, క్రీడలు, ఈవెంట్లు తదితర టికెటింగ్ బిజినెస్ విక్రయ విలువను రూ. 2,048 కోట్లుగా వెల్లడించింది. అయితే 12 నెలలపాటు పేటీఎమ్ యాప్ ద్వారా టికెటింగ్ బిజినెస్ అందుబాటులో ఉంటుందని తెలియజేసింది.

ఎకానమీకి అమెజాన్ చేసిందేమీ లేదు

- మార్కెట్‌ను దెబ్బకొట్టే ధరలతో లాభమేంటి?
- వాణిజ్య మంత్రి గోయల్ విమర్శలు
- చిన్న రిటైలర్ల మార్కెట్‌ను కొల్లగొట్టడంపై ఆందోళన



న్యూఢిల్లీ: భారత్‌లో వ్యాపారం కొనసాగించడానికే అమెజాన్ తాజా పెట్టుబడులు చేస్తుందని, ఇందులో సంబరపడాల్సిందేమీ లేదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. అమెజాన్ తన పెట్టుబడులతో భారత్‌లోని సేవల రంగానికి, ఆర్థిక వ్యవస్థకు చేసిందేమీ లేదన్నారు. పనిలో పనిగా ఈ-కామర్స్ పరిశ్రమ లక్షలాది రిటైలర్ల ఉపాధిని దెబ్బతీస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,300 కోట్లు) ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అమెజాన్ చేసిన ప్రకటన పట్ల సంతోషించాల్సిందేమీ లేదన్నారు. భారత వ్యాపారంలో నష్టాలను పూడ్చుకోవడానికే తాజా పెట్టుబడులను తీసుకొస్తున్నట్టు వ్యాఖ్యానించారు. కొల్లగొట్టే ధరల విధానాన్ని ఈ నష్టాలు సూచిస్తున్నాయంటూ.. ఇది భారత్‌కు ఎంత మాత్రం మేలు చేయబోదని, చిన్న వర్తకులను దెబ్బతీస్తుందన్నారు. 'ఉపాధి అవకాశాలు, వినియోగదారుల సంక్షేమంపై ఈ-కామర్స్ రంగం చూపించే నికర ప్రభావం' పేరుతో ఓ నివేదికను మంత్రి బుధవారం ఢిల్లీలో విడుదల చేశారు. దేశంలో చిన్న రిటైలర్ల ఉపాధిని దెబ్బతీసే ఈ-కామర్స్ కంపెనీల వ్యాపార నమూనాను మంత్రి ప్రశ్నించారు.

ఈ-రిటైలర్లతో 1.58 కోట్ల ఉద్యోగాలు

ఆన్‌లైన్ వర్తకులు దేశంలో 1.58 కోట్ల మందికి ఉపాధి కల్పించినట్టు మంత్రి గోయల్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఇందులో 35 లక్షల మంది మహిళలు ఉన్నట్టు, 17.6 లక్షల రిటైల్ సంస్థలు ఈ-కామర్స్ ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తెలిపింది. ఈ నివేదికను పహలే ఇండియా ఫౌండేషన్ (పీఐఎఫ్) విడుదల చేసింది. భారత్‌లో ఉపాధి కల్పన పరంగా, కష్టమర్ల సంక్షేమం పరంగా (మెరుగైన అనుభవం) ఈ-కామర్స్ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తున్నట్టు ఈ నివేదిక తెలిపింది. ఈ-కామర్స్ తృతీయ శ్రేణి పట్టణాల్లోకి విస్తరిస్తున్నట్టు వెల్లడించింది. టైర్-3 పట్టణాల్లోని వినియోగదారులు నెలవారీగా రూ.5,000కు పైనే ఆన్‌లైన్ షాపింగ్‌పై ఖర్చు చేస్తున్నట్టు వివరించింది. ఉపాధిపై ఈ-కామర్స్ రంగం చూపిస్తున్న ప్రభావాన్ని తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా 2,062 మంది ఆన్‌లైన్ వర్తకులు, 2,031 ఆఫ్‌లైన్ వర్తకులు, 8,209 మంది వినియోగదారుల అభిప్రాయాలను పీఐఎఫ్ తెలుసుకుంది.

గోల్డ్ బాండ్.. రివర్స్!

- ఆశించిన లక్ష్యాలకు భిన్న ఫలితాలు
- తగ్గని పసిడి దిగుమతులు

సావరీన్ గోల్డ్ బాండ్ల (ఎస్‌జీబీ) పథకం విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలు నెరవేరలేదు. ముఖ్యంగా దిగుమతులను తగ్గించడంతోపాటు.. బంగారంపై పెట్టుబడులను డిజిటల్‌వైపు మళ్లించే లక్ష్యాలతో తీసుకొచ్చిందే సావరీన్ గోల్డ్ బాండ్ పథకం. పసిడిపై పెట్టుబడులను డిజిటల్ రూపంలోకి మళ్లించడంలో కేంద్రం ఒక విధంగా సక్సెస్ అయింది. కానీ, బంగారం దిగుమతులు ఏ మాత్రం తగ్గలేదు. ఎస్‌జీబీలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రభుత్వ హామీతో కూడిన సాధనం కావడంతో పెట్టుబడులకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఎస్‌జీబీల రూపంలో ప్రభుత్వంపై చెల్లింపుల భారం పెరిగిపోయింది. మరోవైపు బంగారం దిగుమతులు ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 16 శాతం పెరిగి 376 టన్నులకు చేరాయి. క్రితం ఏడాది మొదటి ఆరు నెలల్లో 325 టన్నుల పసిడిని భారత్ దిగుమతి చేసుకున్నట్టు ప్రపంచ స్వర్ణ మండలి గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఊరిస్తున్న రాబడులు

ఎస్‌జీబీలపై రాబడి ఇన్వెస్టర్లను ఊరిస్తోంది. మొదటి ఎస్‌జీబీ సిరీస్‌లో పెట్టుబడి పెట్టిన వారికి ఎనిమిదేళ్లలో రెట్టింపునకు పైగా రాబడి వచ్చినట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఒక ఎస్‌జీబీ మెచ్యూరిటీ (గడువు ముగింపు) తీరనుంది. దీనికి సంబంధించి ఎనిమిదేళ్ల క్రితం గ్రాము జారీ ధర రూ.3,007. నవంబర్‌లో మెచ్యూరిటీ తీరనున్న ఎస్‌జీబీకి సంబంధించి గ్రాము జారీ ధర రూ.3,150. ప్రస్తుతం గ్రాము ధర సుమారు రూ.7వేల స్థాయిలో ఉంది. అంటే ఎనిమిదేళ్లలోనే 130 శాతం రాబడి వచ్చింది. పైగా ఇటీవలే బంగారం దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని కేంద్రం 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడంతో ధరలు కొంత దిగొచ్చాయి. ఎస్‌జీబీలపై చెల్లింపుల భారం తగ్గించుకునేందుకే కేంద్రం సుంకం తగ్గించిందన్న అభిప్రాయాలు విశ్లేషకుల నుంచి వ్యక్తమయ్యాయి. పైగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంత వరకు ఒక్క ఎస్‌జీబీ ఇష్యూని కూడా కేంద్రం చేపట్టలేదు. సెప్టెంబర్‌లో తీసుకురావచ్చన్న అంచనాలున్నాయి. ఇటీవల ధరలు తగ్గడంతో ప్రభుత్వం తీసుకొచ్చే కొత్త ఇష్యూకి ఇన్వెస్టర్ల నుంచి మరింత స్పందన రావచ్చని చాయిస్ బ్రోకింగ్ కమోడిటీ అనలిస్ట్ ఆమిర్ మక్దా అభిప్రాయపడ్డారు. దీర్ఘకాల దృష్టితో ఇన్వెస్ట్ చేసుకోవాలని భావించే వారు, స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి సైతం కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు.

\- సాక్షి, బిజినెస్ డెస్క్

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
పటిష్టమైన ఫుడ్ బ్రాండుగా అమూల్ | పర్సనల్ కంప్యూటర్ల జోరు

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 64 ట్రెయినీ పోస్టులు

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్‌ఎల్).. ఒప్పంద ప్రాతిపదికన షిప్ డ్రాఫ్ట్స్‌మ్యాన్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 64.
» **పోస్టుల వివరాలు:** షిప్ డ్రాఫ్ట్స్‌మన్ ట్రెయినీ(మెకానికల్)-46, షిప్ డ్రాఫ్ట్స్‌మ్యాన్ (ఎలక్ట్రికల్)-18.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయసు: 25 ఏళ్లు మించకూడదు.
» **స్టైపెండ్:** మొదటి ఏడాది రూ.14,000, రెండో ఏడాది రూ.20,000.
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ప్రాక్టికల్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.08.2024.
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in/

హెచ్‌ఏఎల్‌లో 166 పోస్టులు

బెంగళూరు(కర్ణాటక)లోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్), ఎల్‌సీఏ తేజస్ డివిజన్.. నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 166.
» **పోస్టుల వివరాలు:** డిప్లొమా టెక్నీషియన్-43, టెక్నీషియన్-123.
» **ట్రేడులు:** మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, మెటలార్జీ, ఫిట్టర్, షీట్ మెటల్, ఫాం డ్రీమ్యాన్, వెల్డర్, మెషినిస్ట్, ఎలక్ట్రోప్లాటర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. అప్రెంటిస్‌షిప్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.44,796 -రూ.46,764.
» **వయసు:** 31.07.2024 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా..
» **దరఖాస్తులకు చివరితేది:** 28.08.2024.
» **వెబ్‌సైట్:** https://hal-india.co.in/

కోర్ వర్సెస్ కంప్యూటర్స్



- » సీఎస్ఈ వైపే మొగ్గు చూపుతున్న టాపర్స్
- » కోర్‌తో కొలువులకు ఢోకా లేదంటున్న నిపుణులు
- » కోర్సులో చేరినప్పటి నుంచే స్కిల్స్‌పై దృష్టిపెట్టాలి

ఇంజనీరింగ్.. లక్షల మంది విద్యార్థుల లక్ష్యం! ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ)లో చేరాలని ఎక్కువ మంది కోరుకుంటున్నారు. సీట్ల పరిమితి కారణంగా అందరికీ సీఎస్ఈలో చేరే అవకాశం లభించని పరిస్థితి!! దీంతో.. కోర్ బ్రాంచ్‌లలో చేరితే భవిష్యత్తు ఎలా ఉంటుంది.. జాబ్ మార్కెట్‌లో సీఎస్ఈకే ఎక్కువ అవకాశాలు ఉంటాయా? అనే సందేహాలు!! ఈ నేపథ్యంలో.. బీటెక్‌లో సీఎస్ఈ, కోర్ బ్రాంచ్‌లతో సానుకూలతలు, ప్రతికూలతలు.. అకడమిక్‌గా రాణించడానికి మార్గాలపై ప్రత్యేక కథనం.

టాపర్స్ ఛాయిస్ సీఎస్ఈ

గత కొన్నేళ్లుగా జేఈఈ, ఎంసెట్ తదితర ప్రవేశ పరీక్షల టాపర్స్ అంతా సీఎస్ఈ బ్రాంచ్‌కే మొగ్గు చూపుతున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పట్ల ఇంతటి క్రేజ్‌కు కారణం జాబ్ మార్కెట్‌లో కెరీర్ పరంగా ఢోకా ఉండదు అనే అభిప్రాయమే అంటున్నారు నిపుణులు. ఐటీ రంగం శరవేగంగా విస్తరిస్తుండటం, అన్ని రంగాల్లోనూ ఐటీ ఆధారిత సేవలు అందుబాటులోకి రావడంతో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెషనల్స్‌కు భారీ వేతనాలతో అవకాశాలు లభిస్తున్నాయి. దీంతో విద్యార్థులంతా సీఎస్ఈకే మొగ్గు చూపుతున్నారు.

అవకాశాలు ఘనంగా

అన్ని రంగాల్లోని సంస్థలు డిజిటల్ టెక్నాలజీల ఆధారంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీంతో ఐటీలో భవిష్యత్తు అవకాశాలు ఘనంగా ఉంటాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, నాస్‌కామ్, సీఐఐ వంటి పలు సంస్థల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సంస్థల అంచనాల ప్రకారం-ఐటీ, సాఫ్ట్‌వేర్ నియామకాలు రానున్న రోజుల్లో లక్షల సంఖ్యలో జరగనున్నాయి. మొత్తం ఐటీ నియామకాల్లో ఆటోమేషన్ ప్రొఫైల్స్‌లోనే దాదాపు యాభై శాతం ఉద్యోగాలు లభించనున్నాయి.

సీఎస్ఈ కోర్ నైపుణ్యాలివే

సీఎస్ఈలో చేరే విద్యార్థులు ముఖ్యంగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్, నెట్‌వర్కింగ్, అల్గారిథమ్స్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, ప్రోగ్రామ్ డిజైన్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఆపరేటింగ్ సిస్టమ్స్, ఆర్టిఫిషియల్, డేటాబేస్, డేటా స్ట్రక్చర్స్ తదితర అంశాలను అధ్యయనం చేస్తారు. వీటితోపాటు కోడింగ్‌పైనా పట్టు సాధించేలా బోధన విధానం అమలవుతోంది. ఫలితంగా.. సీఎస్ఈ సర్టిఫికెట్ పొందేనాటికి జాబ్ రెడీ స్కిల్స్ సొంతం చేసుకునే వీలుంది. అయితే చాలా మంది సీఎస్ఈ విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో కోడింగ్, ప్రోగ్రామింగ్‌లపై పట్టు ఉండట్లేదని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. కాబట్టి సీఎస్ఈలో చేరిన విద్యార్థులు ఇన్‌స్టిట్యూట్ స్థాయి అకడమిక్స్ అభ్యసనానికే పరిమితం కాకుండా.. తాజా నైపుణ్యాలపై ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ కార్యకలాపాలకు వెన్నెముకగా నిలిచే కోడింగ్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌పై పట్టు సాధించాలని నిపుణులు సూచిస్తున్నారు.

విభిన్న జాబ్ ప్రొఫైల్స్

సీఎస్ఈ పూర్తి చేసుకున్న వారికి విభిన్న జాబ్ ప్రొఫైల్స్ లభిస్తున్నాయి. ప్రధానంగా.. కంప్యూటర్ ప్రోగ్రామర్, సిస్టమ్ డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, సాఫ్ట్‌వేర్ డవలపర్, సిస్టమ్ డిజైనర్, రీసెర్చ్ అనలిస్ట్ వంటి ఉద్యోగాలు సొంతం చేసుకునే అవకాశముంది. ఆటోమేషన్‌లో ఏఐ ఇంజనీర్, క్లౌడ్ ఆర్కిటెక్ట్, సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామర్, రోబోటిక్ ప్రాసెస్ ఇంజనీర్, బ్లాక్ చైన్ డెవలపర్ వంటి కొలువులు దక్కించుకోవచ్చు. నైపుణ్యాలున్న వారికి ఆయా సంస్థలు రూ.8 లక్షల నుంచి రూ.పది లక్షల వరకు వార్షిక వేతనం ఆఫర్ చేస్తున్నాయి. ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో క్యాంపస్ డ్రైవ్స్ ద్వారా రూ.30 లక్షల వార్షిక సగటు వేతనం లభిస్తోంది.

ఈ స్కిల్స్ ఉంటేనే రాణింపు

అకడమిక్‌గా సీఎస్ఈ కరిక్యులంపై పట్టు సాధించడాలంటే.. విద్యార్థులకు తప్పనిసరిగా కొన్ని స్కిల్స్ ఉండాలి. అవి..మ్యాథమెటికల్ స్కిల్స్, కంప్యుటేషనల్ థింకింగ్, క్రిటికల్ ఎవాల్యుయేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు ఉండాలి. అప్పుడే ఈ బ్రాంచ్‌లోని సబ్జెక్ట్‌లను సులువుగా ఆకళింపు చేసుకోవడంతోపాటు తాజా నైపుణ్యాలను వేగంగా నేర్చుకోవడంలో ముందుంటారు. ఇటీవల ఐటీ, ఐటీఈఎస్ మొదలు సర్వీస్ సెక్టార్ వరకూ.. అన్ని రంగాలు ఆటోమేషన్ బాట పడుతున్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి పలు రకాల కొత్త టెక్నాలజీలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీలను అనుసరిస్తున్నాయి. వీటన్నింటినీ సమర్థంగా నిర్వహించాలంటే.. అందుకు అవసరమైన ప్రోగ్రామింగ్, కోడింగ్, నెట్‌వర్కింగ్ తదితర నైపుణ్యాలపై పట్టు సాధించాల్సి ఉంటుంది.

కోర్ బ్రాంచ్‌లకూ.. అవకాశాలు

ఇంజనీరింగ్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లను కోర్ బ్రాంచ్‌లుగా పిలుస్తారు. కొత్త కోర్సులు ఆవిష్కృతమవుతున్నా.. అవన్నీ కోర్ బ్రాంచ్‌ల పునాదుల నుంచే పుట్టుకొస్తున్నాయి. అందుకే కోర్ బ్రాంచ్‌లతోనూ విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి.

సివిల్ ఇంజనీరింగ్

బీటెక్ స్థాయిలో సివిల్ ఇంజనీరింగ్‌లో మౌలిక రంగం, నిర్మాణ రంగంలో కట్టడాలు, డిజైన్లకు సంబంధించి మూల భావనలు, నైపుణ్యాలు అందించేలా కోర్సు స్వరూపం ఉంటుంది. ప్రస్తుతం పట్టణీకరణ, స్మార్ట్ సిటీస్, రియాల్టీ, మౌలిక సదుపాయాల రంగాల విస్తీర్ణం నేపథ్యంలో.. ఈ బ్రాంచ్‌ను ఎంపిక చేసుకునే విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందక్కర్లేదనేది నిపుణుల అభిప్రాయం. డిజైన్, ప్లానింగ్, కన్‌స్ట్రక్షన్, క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ పరమైన అంశాలు నేర్పించే సివిల్ ఇంజనీరింగ్‌లో ఆయా అంశాలపై పట్టు సాధిస్తే.. భవిష్యత్తులో విస్తృత అవకాశాలు సొంతమవడం ఖాయం. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు అకడమిక్స్‌తోపాటు క్యాడ్, క్యామ్ వంటి స్కిల్స్ సొంతం చేసుకోవాలి.

మెకానికల్ ఇంజనీరింగ్

వాహన పరిశ్రమ నుంచి బోయింగ్ విమానాల ఉత్పత్తి వరకూ.. ప్రతి విభాగంలోనూ మెకానికల్ ఇంజనీరింగ్ నైపుణ్యాలు కలిగిన వ్యక్తుల అవసరం ఏర్పడుతోంది. ఫలితంగా ఈ బ్రాంచ్ నిత్య నూతనంగా వెలుగులీనుతోంది. ఈ రంగంలో రాణించేందుకు మెకానికల్ బ్రాంచ్ విద్యార్థులు డిజైన్, డ్రాయింగ్, డ్రాఫ్టింగ్ వంటి నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. వీటితోపాటు రోబోటిక్స్, క్యాడ్, క్యామ్, 3-డి డిజైన్ టెక్నాలజీస్ వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ ఆధారిత స్కిల్స్ పెంచుకోవాలి.

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

మరో కీలక కోర్ బ్రాంచ్.. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ). 2030 నాటికి స్వదేశీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల సంఖ్య పెంచాలని, ప్రస్తుత పరిస్థితితో పోల్చితే.. 2030 నాటికి 40 నుంచి 50 శాతం మేర స్వదేశీ ఉత్పత్తుల సంఖ్య పెంచాలనే దిశగా ప్రణాళికలు రూపొందుతున్నాయి. కాబట్టి ఈ బ్రాంచ్ విద్యార్థులకు అవకాశాల పరంగా ఢోకా ఉండదని చెప్పొచ్చు. అకడమిక్ కోణంలో ఈ రంగంలో రాణించాలనే అభ్యర్థులకు మైక్రో అనాలిసిస్ అప్రోచ్ అత్యంత ఆవశ్యకమైన లక్షణం. అంతేకాకుండా వాస్తవ పరిస్థితుల్లో కొత్త టెక్నాలజీపై అవగాహన కూడా అవసరం.

ఈసీఈ

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్(ఈసీఈ).. గత నాలుగు దశాబ్దాలుగా వేగంగా విస్తరిస్తున్న రంగం ఇది. ముఖ్యంగా 5-జి టెక్నాలజీస్, ఐఓటీ తదితర మార్పుల నేపథ్యంలో.. ఈసీఈ రంగంలో విస్తృత కార్యకలాపాలు సాగుతున్నాయి. ప్రభుత్వ స్థాయిలోనూ డిజిటల్ ఇండియా, డిజిటైజేషన్, డిజిటల్ లిటరసీ మిషన్ వంటి పలు పథకాలకు నాంది పడింది. ఫలితంగా ఈ బ్రాంచ్‌లో చేరిన విద్యార్థులు అకెడమిక్స్‌తో పాటు లేటెస్ట్ టెక్నాలజీపై పట్టు సాధిస్తే చక్కటి కెరీర్ అవకాశాలు దక్కించుకోవచ్చు.

వీడియో గేమ్ డిజైనర్



గత కొంతకాలంగా ఎంతో ఆసక్తి పెరుగుతున్న విభాగం.. వీడియో గేమింగ్. నేటి స్మార్ట్ ఫోన్ యుగంలో వ్యక్తుల కాలక్షేపం కోసం వీడియో గేమ్‌లు ఒక మార్గంగా మారాయి. అదే విధంగా చిన్నారులు సైతం పలు రకాల వీడియో గేమ్‌లు వీక్షిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో..వీడియో గేమ్ డిజైనర్లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. వీడియో గేమింగ్ కెరీర్ వివరాలు..

పలు యానిమేషన్ సంస్థలు ఆధునిక పరిస్థితులు, వ్యక్తుల అభిరుచులకు అనుగుణంగా కొత్త కొత్త గేమ్స్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తుండటంతో సృజనాత్మకత కలిగిన వీడియో గేమ్ డిజైనర్లకు డిమాండ్ పెరుగుతోంది. **విధులు ఇవే:** కొత్తగా ఒక గేమ్ ఐడియాను ఆవిష్కరించడం, దానిని ఆచరణలో పెట్టేందుకు అవసరమైన క్యారక్టర్ల సృష్టి వంటి అంశాలపై వీడియో గేమ్ డిజైనర్లు పని చేస్తారు. అంతేకాకుండా సదరు గేమ్‌కు సంబంధించి కంప్యూటర్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, కోడ్‌లు రాయడం వంటివి కూడా వీడియో గేమ్ డిజైనర్ల విధులుగా ఉంటున్నాయి. ఈ నైపుణ్యాలున్న వారికి యానిమేషన్, వీడియో గేమింగ్ సంస్థలు.. లీడ్ డిజైనర్స్, సీనియర్ డిజైనర్స్, యుఐ డిజైనర్స్, టెక్నికల్ డిజైనర్స్, సిస్టమ్ డిజైనర్స్, గేమ్ రైటర్స్, కంటెంట్ డిజైనర్స్ వంటి ఉద్యోగాలు అందిస్తున్నాయి.

ఫ్రీలాన్స్ విధానం: పార్ట్ టైమ్ లేదా ఫ్రీలాన్స్ విధానంలో నిర్దిష్టంగా ఒక ప్రాజెక్ట్‌ను బట్టి పారితోషికాన్ని సంస్థలు అందిస్తున్నాయి. వీడియో గేమ్ డిజైనర్స్‌గా రాణించాలంటే.. ఇన్నోవేషన్ స్కిల్స్, కమ్యూనికేషన్, టీమ్ వర్క్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు తప్పనిసరి. డిప్లొమా స్థాయిలో యానిమేషన్ అండ్ గేమింగ్, బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో గేమ్ డిజైనింగ్ అండ్ డెవలప్‌మెంట్, గేమింగ్ ఆర్ట్-డిజైన్ అండ్ టెక్నాలజీ వంటి కోర్సుల్లో చేరొచ్చు. పలు ఇన్‌స్టిట్యూట్‌లు ఈ కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సుల ద్వారా వీడియో గేమింగ్ రంగంలో అడుగు పెడితే నెలకు రూ.50 వేలకు పైగానే వేతనం సొంతం చేసుకోవచ్చు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


TVS Racing
TVS
ALL NEW
Apache
RTR SERIES
BLACK EDITION
#RacingDNAUnleashed
A BLAZE OF BLACK
భారతదేశపు అత్యంత శక్తివంతమైన* 160cc
PRICE STARTS @ ₹1 09 990**

సాక్షి ప్లస్
గురువారం ॥ 22-8-2024

సన్నిధి

ఉడుపి



ధర్మ సందేహాలు



ఏ దేవుడిని ఎప్పుడు ధ్యానించాలి?

జ: ఉదయం వేళలో మనం శ్రీహరి శ్రీహరి అంటూ విష్ణువునే స్మరించాలి. మన పోషకత్వాన్ని నిర్వహించేది విష్ణువు గనుక ఉదయం లేవగానే ఆయన్ని స్మరిస్తే మన నిత్యజీవితం సాఫీగా సాగిపోతుంది. సూర్యాస్తమయ సమయంలో శివుని స్మరించాలి. అలాచేస్తే మన నిత్యజీవితంలో సమతుల్యత లభిస్తుంది. హర శబ్దానికి హరించువాడని అర్థం ఆయన్ని సాయం సమయాల్లో ధ్యానిస్తే మన పాపాల్ని అన్నింటినీ హరింపచేస్తాడు.''ప్రదోషే హరిం న పశ్యాత్ నృసింహం రాఘవం వినా'' విష్ణువు నృసింహావతారం ఎత్తింది సాయం సంధ్యా సమయంలోనే గనుక నృసింహునకు మినహాయింపు. ఇక రాముని విషయానికొస్తే 'రమయతీతి రామః'' -ప్రజలను రంజింప చేసే వాడు కనుక రాముని ఎల్లవేళలా స్మరించవలసిందే. పక్షానికి ఒకసారి సంభవించే మహాప్రదోష కాలంలో శివదర్శనం, శివనామ జపం మనకు అమిత ప్రయోజనకరం.



ఎన్నో దేవతా స్తోత్రాలున్నాయి. ప్రతిదీ నిత్యం పారాయణ చేయాలని చెప్తారు. ఇన్నిన్ని స్తోత్రాలు ఎందుకు?

జ: అన్ని స్తోత్రాలు పారాయణ చేయడం నిత్యమూ సాధ్యం కాదు. అలాగని అవి ఎందుకు? అని ప్రశ్నించరాదు. బజారులో బోలెడన్ని కూరగాయలుంటాయి. అన్నీ రోజూ తినలేం. అలాగని ఇన్నిన్ని ఎందుకు... అంటామా?

ఎవరి అవకాశాన్ని, అభీష్టాన్నీ బట్టి నిత్యం సాధ్యమైన వాటినే అనుష్ఠించవచ్చు. రోజూ విందు భోజనం చేయలేం కదా! ఏ పండగకో పబ్బానికో విందునారగించినట్లు తీరిక దొరికిన వేళ సావకాశంగా స్తోత్రాలు పారాయణ చేసుకోవచ్చు. ఏదేమైనా – ఆనందంగా భక్తిగా వాటిని పఠించాలే తప్ప, తప్పనిసరి కృత్యంగా మొక్కుబడి వ్యవహారంగా తలచరాదు. నిత్యం మన అవకాశాన్ని బట్టి ఆహారం తిన్నట్టే, స్తోత్రమో, జపమో పరిమితమైన అనుష్ఠానం అవసరం. ఆయా దేవతలకి నిర్దేశించిన వారాలలో, తిథులలో, పర్వదినాలలో ఆయా స్తోత్రాలను నిదానంగా పఠించుకోవచ్చు. ఔషధశాలలో మందుల వలె వివిధ ప్రయోజనాలకోసం, వివిధ స్తోత్రాలుంటాయి. కొన్ని ఆరోగ్యం కోసం, కొన్ని దారిద్ర్య నివారణ కోసం...ఇలా! వాటిని ఆయా లక్ష్యాల సిద్ధికోసం వినియోగించుకోవచ్చు.

శ్రీనివాస విద్య ఒక సాధన



మంచి నడవడిక, క్రమశిక్షణతో కూడిన అలవాట్లు, పరోపకార గుణం, దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన మనిషిని మనీషిగా మారుస్తాయి. అదేవిధంగా కొన్ని రకాల సాధనలు మానవ జీవితంలో అద్భుతమైన మార్పును తీసుకు వస్తాయి. అఖండ ఐశ్వర్యాన్ని చేకూరుస్తాయి. అలాంటి వాటిలో శ్రీనివాస విద్య ఒకటి.

శ్రీనివాస విద్య ఒక అభ్యాసంలా సాధకుడికి ఎంతో మేలు చేస్తుంది, అమోఘమైన పరిష్కారం సూచిస్తుంది' అంటున్నారు పండితులు. తరతరాలకూ శుభాలను అందించే ఈ సాధన శ్రావణమాసానికే ప్రత్యేకం అంటున్నారు.

శ్రీనివాస విద్య అనేది ఒక అభ్యాసం. ఒక సాధన. సంపద, శ్రేయస్సు..తో సహా అన్ని ప్రాపంచిక ఆనందాలను పొందేందుకు అతి శక్తిమంతమైన రహస్య అద్భుతాలతో నిండి ఉంది. శ్రీనివాస విద్య అనేది ఐశ్వర్యం (8 రకాల సంపదలు) సాధించడానికి అత్యంత పవిత్రమైన, పురాతన రహస్య వ్యవస్థ.

ప్రాచీనకాలం నుంచి..

ఈ విద్యను ఆదిశంకరాచార్యులు తిరుమలలో ఉపయోగించారు. 14వ శతాబ్దంలో మహమ్మదీయుల దాడి నుండి విజయ నగర రాజ్యాన్ని రక్షించడానికి హరి హర, బుక్క రాయరాజులు కూడా ఉపయోగించారు. విజయ నగర రాజ్యంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో వజ్రాలు, రత్నాలను కుప్పలు విక్రయించే విషయం మనకు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. శ్రీనివాస విద్యను ఒక కుటుంబంలో ఒకసారి ప్రయోగిస్తే ఆ కుటుంబంలో కనీసం 3 తరాలకు లక్ష్మీదేవి సర్వ సంపదలను అందిస్తుందని నమ్ముతారు. మానవ జీవితంలో మనకు ఎదురయ్యే అన్నిరకాల భౌతిక సమస్యలకు పరిష్కారంగా ఈ విద్యను సాధన చేయవచ్చునని పండితులు చెబుతున్నారు.



ఇలా చేయాలి

శుక్ల పాడ్యమి రోజున మొదలయ్యే ఈ హోమం అమావాస్యతో ముగుస్తుంది. ఈ విధానంలో శుక్ల పక్షంలో శ్రీ సూక్తం, పురుష సూక్తం పదిహేను శ్లోకాలు పారాయణ చేయాలి.

ఇక కృష్ణ పక్షం నుంచి ముందు పురుష సూక్తం, తర్వాత శ్రీ సూక్తం 15 శ్లోకాలు ఒక్కొక్కటిగా జపించాలి. ప్రతి రోజు చివరలో నారాయణ కవచం జపించాలి. 30 రోజుల పాటు కఠినమైన బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, మారేడు దళాలతో పవిత్రీకరించిన నీటితో సూర్యోదయానికి ముందు స్నానం చేయాలి. సిద్ధం చేసిన హోమ కుండంలో వివిధ హోమ ద్రవ్యాలతో పాటు మారేడు దళాలను కూడా వేస్తూ సాధన ప్రక్రియను ప్రారంభించాలి. అద్భుతమైన ఈ విద్య గురించి తెలుసుకున్నా, పాల్గొన్నా విశేషమైన ప్రయోజనాలు కలుగుతాయి.

– కె.చందు మోహన రామానుజదాస్, తార్నాక, హైదరాబాద్

సరిగ్గా బ్రాహ్మీముహూర్తం రాగానే శంఖనాదాలు, దుందుభులు, నగారాలతో ప్రతిధ్వనిస్తుంది ఉడుపి మఠం. ఆలయ పూజారులతో సహా మఠంలో పని చేసేవారందరూ ఆ దివ్యనాదాలతో మేల్కొని, తమ దైనందిన చర్యలు ప్రారంభిస్తారు. కర్ణాటకలోని పేరెన్నికగన్న పుణ్యక్షేత్రాల్లో ప్రసిద్ధి పొందినది ఉడుపి. ధనిక-పేద; అగ్ర-నిమ్న కులాలనే భేదభావాలు మనుషులకే తప్ప పరమాత్ముడికి లేవనేందుకు సాక్షాత్తూ ఆ కృష్ణభగవానుడే నిదర్శనం చూపించిన పుణ్యస్థలి ఉడుపి.

కుల భేదాలిక్కడ కృష్ణార్పణం!

కర్ణాటక రాష్ట్రంలోని దక్షిణ కన్నడ జిల్లాకు పశ్చిమంగా, మంగుళూరుకు 60 కి.మీ దూరంలో ఉంది ఉడుపి పుణ్యక్షేత్రం. నిత్యం ఉత్సవాలతో, లక్షలాది మంది యాత్రికులతో కళకళలాడుతూ ఉంటుంది ఈ పవిత్ర యాత్రాస్థలం. 'ఉడుప'(చంద్రుడు)' అనే పదాన్ని అనుసరించి ఈ క్షేత్రానికి ఉడుపి అనే పేరు వచ్చింది. పేరుకు తగ్గట్టే ఈ పవిత్ర క్షేత్రం స్వచ్ఛంగా, వెన్నెలలో ప్రకాశించే చంద్రుడిలా అద్వితీయమైన, అగోచరమైన దివ్యచైతన్యంతో అక్కడక్కడ పెద్ద పెద్ద మామిడి, పనస తోటలు, సువిశాలమైన పొలాల గుండా ప్రయాణించే యాత్రికులకు కొబ్బరి, పోకచెట్లు తమ తల లూపుతూ స్వాగతం పలుకుతాయి. విశిష్టాద్వైత మత స్థాపకులు మధ్వాచార్యుల పవిత్ర హస్తాల మీదుగా స్థాపితమైన మఠం ఉడుపి. కనకదాసు అనే పరమభక్తుడిని నిమ్న కులస్థుడనే కారణంతో పూజారులు కృష్ణ దర్శనానికి నిరాకరించగా స్వయంగా తానే తన ప్రియభక్తునికి ప్రత్యక్ష దర్శనమిచ్చిన కరుణామూర్తి ఉడుపి చిన్నికృష్ణుడు.

ఉడుపి పూర్వపు పేరు శివళ్ళి. ఇది పరశురామక్షేత్రాలలో ప్రథమస్థానం కలిగి ఉంది. ప్రతి సంవత్సరం, లక్షలాది భక్తులు కృష్ణుని దర్శనం చేసుకోవటానికి ఉడుపిని సందర్శిస్తారు. స్వామి దర్శనం నవరంధ్రాలున్న కిటికీ ద్వారా చేసుకోవలసి ఉండటం ఈ దేవాలయ ప్రత్యేకత. ఉడుపి రథవీధిలో శ్రీ కృష్ణ మందిరం ఉంది. ఉత్తర ద్వారం గుండా గుడిలోకి ప్రవేశించినప్పుడు కుడివైపు దేవాలయ కార్యాలయం, ఇంకొద్దిగా ముందుకు వెళ్ళితే మధ్వ సరోవరం కనిపిస్తుంది. ప్రధాన ఆలయానికి ద్వారం ఎడమవైపు ఉంటుంది. కొద్దిగా ముందుకు వెళితే చెన్నకేశవ ద్వారం వస్తుంది. దీనిద్వారా ప్రవేశం పీఠాధిపతులకు తప్పితే అన్యులకు ఉండదు. చెన్నకేశవ స్వామి ద్వారం నుండి ముందు వెళ్ళితే ప్రదక్షిణం చేసిన తరువాత శ్రీకృష్ణ దర్శనం వెండితో తాపడం పెట్టిన నవరంధ్రాల గవాక్షం గుండా చేసుకోవచ్చు. గర్భగుడికి కుడివైపు ముఖ్యప్రాణ దేవత (హనుమంతుడు, వామభాగాన గరుడ దేవర ఉన్నారు. స్వామి దర్శనం చేసుకొని ముందుకు వెళ్ళి దక్షిణ మార్గం వైపు వెళితే, ఎడమభాగాన మధ్వాచార్యులు మంటపం కనిపిస్తుంది.

ఉడుపి శ్రీకృష్ణ మఠానికి అనుసంధానంగా అష్టమఠాలు కృష్ణ మఠాలు ఉన్నాయి. ఈ ఎనిమిది మఠాలు ఉడుపి రథవీధిలో, శ్రీ కృష్ణ దేవాలయానికి చుట్టూ ఉంటాయి. అవి: పుత్తిగె, పేజావర, పలిమారు, అదమారు, సోదె, శీరూరు, కాణియూరు, కృష్ణాపుర.

మధ్వాచార్యులవారు ఒకసారి సముద్రంలో తుఫానులో చిక్కుకున్న ఓడను, అందులోని ప్రయాణికులను తన తపశ్శక్తితో రక్షించాడు. అప్పుడు ఓడలోని నావికుడు ఆయనకు గోపీచందనం మూటను కానుకగా సమర్పించాడు. మధ్వాచార్యులు ఆ మూటను విప్పి చూడగా, ఆ చందనపు కణికల మధ్య చిన్నికృష్ణుడి విగ్రహం కనిపించింది. అది శ్రీకృష్ణుడి లీలగా భావించిన మధ్వాచార్యులవారు ఆ కృష్ణుడి విగ్రహాన్ని ఉడుపిలో ప్రతిష్ఠించారు. అదే మనం చూస్తున్న విగ్రహం. కనకదాసుకు కృష్ణ పరమాత్మ పశ్చిమాభిముఖుడై దర్శనమిచ్చిన చోటనే ఒక మంటపం కట్టించారు. ఆ మంటపానికే కనకదాసు మంటపమని పేరు.



ఉడుపిలో జరుపుకునే పండుగలు, పర్వదినాలు...

మకర సంక్రాంతి... మధ్వ నవమి, హనుమాన్ జయంతి, శ్రీ కృష్ణ జన్మాష్టమి, నవరాత్రి మహోత్సవం, మధ్వ జయంతి, (విజయ దశమి), దీపావళి, గీతాజయంతి వంటి పండుగలను పర్యాయ మఠంలో అంగరంగవైభవంగా జరుపుతారు.

దగ్గరలో ఉన్న మరికొన్ని ముఖ్య ప్రదేశాలు

కొల్లూరు మూకాంబికా దేవాలయం, మరవంతె బీచ్, మల్పే రేవు, కార్కళ లోని గోమతేశ్వరుడు, వేణూరులోని గోమతేశ్వరుడు, అత్తూరులోని సెయింట్ లారెన్స్ ఇగర్జి, సెయింట్ మేరీస్ ద్వీపం, మూడబిదరెలో సావిరకంబద బసది మణిపాల్, బైందూరు కోసళ్ళి జలపాతం, జామియా మసీదు, మధ్వాచార్యులు తన శిష్యులకు బోధించిన ప్రదేశమైన అనంతేశ్వర ఆలయం, జోమ్లు తీర్థం, దేవాలయాల గ్రామంగా పేరొందిన బార్కూర్, సీతానది, కోడి బెంగ్రే బీచ్, కుడ్లు తీర్థ జలపాతం.

పాజక : ఉడిపి నుండి 12 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ మాధవాచార్యుడు ద్వైతసిద్ధాంత ప్రసంగం చేసిన ప్రదేశం ఉంది.

కొల్లూరు (ఉడిపి) : ఉడిపి నుండి 74 కి.మీ దూరంలో ఉంది. పశ్చిమ కనుమలలో ఉన్న ఈ ప్రదేశం మూకాంబికాదేవి నివాసిత ప్రదేశమని భక్తుల విశ్వాసం. తమిళనాడు, కేరళ నుండి ఇక్కడికి భక్తులు తరలి వస్తుంటారు.

కర్కల : ఉడిపి నుండి 37 కి.మీ దూరంలో ఉంది. ఇక్కడ జైన బసదీలు (ఆలయాలు) గోమటేశ్వర శిల్పం బృహద్రూపం) ఉన్నాయి. ఇక్కడ ఇంకా పుదుతిరుపతి శ్రీ వెంకటరమణ ఆలయం, అత్తూర్ సెయింట్ లారెన్స్ చర్చి, శ్రీ హోసమారిగుడి ఆలయం, శ్రీ ఉచ్చంగి మరియమ్మ ఆలయం, శ్రీ అనంతపద్మనాభ ఆలయం, శ్రీ పద్మావతి టెంపుల్, శ్రీ మహాలింగేశ్వర దేవాలయం, శ్రీ సిద్ధివినాయక ఆలయం, శ్రీ ఉమామహేశ్వర ఆలయం, సల్మార్ జామా ఉంటాయి మసీదు మొదలైన ముఖ్యమైన స్థలాలు ఉన్నాయి.

ఇస్లాం వెలుగు

ఆ కారుణ్య ఛాయలో...



అది ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మ ప్రచారం చేస్తున్న తొలి దినాల మాట. ఒకసారి ఆయన మక్కా వీధిగుండా వెళుతున్నారు. కూడలిలో ఒక వృద్ధురాలు కొంత సామగ్రితో నిలబడి ఉంది. చేతిలో ఉన్న మూటలు బరువుగా ఉండడంతో దారిన వెళ్ళేవారిని బతిమాలుతోంది కాస్త సాయం చేయమని. చాలామంది ఆ దారిన వెళుతున్నారు కాని, ఎవరూ పట్టించుకోలేదు. అంతలో ముహమ్మద్ ప్రవక్త అటుగా వెళుతూ, ఆ వృద్ధురాలిని ఎవరూ పట్టించుకోక పోవడం చూసి, ఆమెను సమీపించారు. 'అమ్మా నేను మీకు సహాయం చేస్తాను' అన్నారు. 'బాబ్బాబూ.. నీకు పుణ్యముంటుంది. ఈ మూట చాలా బరువుగా ఉంది. మోయలేక పోతున్నాను. కాస్త సాయం చేస్తే నేను వెళ్ళిపోతాను' అన్నదా వృద్ధురాలు.

'అయ్యో! దీనికేం భాగ్యం' అంటూ మూట భుజానికెత్తుకొని, ఆమె కోరిన చోటుకు చేర్చారు ప్రవక్తమహనీయులు.

'బాబూ! దేవుడు నిన్ను చల్లగా చూడాలి. ఏ తల్లి కన్నబిడ్డవో గాని ముక్కూమొహం తెలియని నాలాంటి ముసలిదానికి ఇంత సహాయం చేశావు. బాబూ! ఒక్కమాట వింటావా. ఎవరో ముహమ్మద్ అట, ఏదో కొత్తమతాన్ని ప్రచారం చేస్తున్నాడట. అతని మాటల్లో ఏముందో గాని చాలామంది అతని ప్రభావంలో పడిపోతున్నారు. జాగ్రత్త నాయనా! అతని మాటల్లో పడకు. నేను కూడా అందుకే ఊరు విడిచి వెళ్ళిపోతున్నాను'. అని హితవు పలికింది. 'సరేనమ్మా' అంటూ ఆమె చెప్పిందంతా ఓపిగ్గా విని, వినయపూర్వకంగా అభివాదం చేసి సెలవు తీసుకున్నారు ముహమ్మద్ ప్రవక్త(స).

ఆ మహనీయుని మంచితనానికి, వినయ పూర్వకమైన ఆ వీడ్కోలుకు ఆనందభరితురాలైన వృద్ధురాలు ఒక్కసారిగా భావోద్రేకానికి లోనై, బాబూ! పేరైనా చెప్పు నాయనా కలకాలం గుర్తుంచుకుంటాను.' అంటూ అభ్యర్థించింది.

అప్పుడు ప్రవక్తమహనీయులు, 'అమ్మా! నా పేరు ఏమని చెప్పను? ఏ ముహమ్మద్‌కు భయపడి నువ్వు దూరంగా వెళ్ళిపోతున్నావో ఆ ముహమ్మద్ ను నేనే నమ్మా!' అన్నారు తలదించుకొని.

దీంతో ఒక్కసారిగా వృద్ధురాలు అవాక్కయిపోయింది. ఎవరి ముఖం కూడా చూడకూడదని పుట్టి పెరిగిన ఊరినే వదిలేసిందో, అతనే తనకు సహాయం చేశాడు. ఎవరూ పట్టించుకోని నిస్సహాయ స్థితిలో ఆప్యాయత కురిపించాడు. సహాయం కంటే ఎక్కువగా ఆయన మాట, మంచితనం, వినమ్రత, మానవీయ సుగుణం ఆమెను మంత్రముగ్ధురాల్ని చేశాయి. కళ్ళనుండి ఆనంద బాష్పాలు జలజలా రాలుతుండగా, 'బాబూ ముహమ్మద్ ! నువ్వునిజంగా ముహమ్మద్ వే అయితే, నీనుండి పారిపోవాలనుకోవడం నా దురదృష్టం. ఇక నేను ఎక్కడికీ వెళ్ళను. నీ కారుణ్య ఛాయలోనే సేద దీరుతాను.' అంటూ అదే క్షణాన ప్రవక్తవారి ప్రియ శిష్యురాలిగా మారిపోయింది.

ఇదీ ప్రవక్త మహనీయులవారి ఆచరణా విధానం. ఇందులో కొంతైనా, కనీస స్థాయిలోనైనా మనం ఆచరించగలిగితే, నేటి మన సమాజం ఎంత అందంగా ఉంటుందో ఊహించుకుందామా...

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సువార్త

నా కృప నీకు చాలును




కష్టాలు, కన్నీళ్లతో కూడిన విశ్వాసి గుడారంలో దేవుని కృప నివసిస్తుంది, విస్తరిస్తుంది. అందుకే 'ప్రభువా, నాకున్న ముల్లు తొలగించు' అని పౌలు మూడుసార్లు ప్రార్థించినా, దేవుడు దాన్ని తొలగించకుండా 'నా కృప నీకు చాలు, (నీ)బలహీనతల్లో నా శక్తి పరిపూర్ణమవుతుంది' అని జవాబిచ్చాడు (2 కొరింథీ 12:9). పౌలు గ్రీకులో రాసిన ఈ పత్రిక మూలప్రతిలోని ఈ వాక్యంలో ప్రాధాన్యత. 'కృప' అనే మాటకు కాకుండా 'చాలు' అనే మాటకు ఇవ్వబడింది. యధాతథంగా అయితే ఆ వాక్యాన్ని 'నా కృప నీకు చాలు' అని కాకుండా 'నీకు చాలినది నా కృపే' అని అనువదించాలన్నమాట. అంటే, ప్రార్థించినపుడు మనకు ఏది చాలో లేదా ఏది అవసరమో అదే దేవుడిస్తాడని దానర్థం. దారిలో అకస్మాత్తుగా భోరున వర్షం మొదలైతే దేవుడు ఒక చెట్టు నీడనిస్తే బావుండు అనుకుంటే, ఏకంగా ఒక రైన్ కోటు, ఒక గొడుగు దేవుడిస్తే ఎంత అద్భుతంగా ఉంటుంది? అప్పటి వర్షం నుండే కాదు, ఈ రెండూ మన తోనే ఉంటాయి కాబట్టి ఇంకెప్పుడు వర్షమొచ్చినా అవి కాపాడుతాయి. పౌలు తనలోని ముల్లు తీసెయ్యమని ప్రార్థిస్తున్నాడు కాని, ఒకటి పోతే కొత్తగా పది ముళ్లు గుచ్చుకునేంత విస్తారమైన పరిచర్యా జీవితంలో అతనికి 'కావలసింది', ప్రయోజనకరమైనది ముల్లు తొలగడం కాదు, ఎన్ని ముళ్ళైనా భరించగల తన కృప అని దేవుడు భావించాడు. ఎందుకంటే పరమ వైద్యుడుగా దేవుడు అప్పటికే అతని వ్యాధిని బాగు చెయ్యడం కాదు, ఆ వ్యాధే కాదు, భవిష్యత్తులో మరే వ్యాధీ అతన్ని బాధించకుండా ఉండే తరుణోపాయాన్నిస్తాడు.

మనకు ఎప్పుడు ఏ ఆపద ఎదురవుతుందో తెలియని పరిస్థితుల్లో, అవసరతల్లో ఆయా పరిష్కారాల కోసం ప్రార్థించే బదులు, అన్ని పరిస్థితులకూ చాలిన దేవుని కృప కోసం వేడుకోవడం సర్వోత్తమం. అంటే స్వస్థత కావాలని దేవుని అడగొద్దు. ఆరోగ్యం కావాలని, ఎన్ని జబ్బులనైనా ఎదుర్కోగలిగిన రోగనిరోధక శక్తినివ్వమని, ప్రాముఖ్యంగా ప్రతి ప్రతికూలతనూ ఎదుర్కోవడానికి చాలినంత దేవుని కృప కావాలని ప్రార్థించడం ప్రతి విశ్వాసి నేర్చుకోవాలి.

– డా. సుభక్త

స్ఫూర్తి

సంకల్ప బలం



సముద్రపు ఒడ్డున ఉన్న రాతి గుహల్లో ఒక చిన్న పక్షి వుండేది. అది సముద్రపు ఒడ్డున తన గుడ్లు పెట్టుకుంది. ఒకరోజు సముద్రంలో అలలు పొంగి ఆ గుడ్లు కొట్టుకుని పోయాయి. అప్పుడు ఆ పక్షి ఏడుస్తూ కూర్చోలేదు. ఓదార్చడానికి వచ్చిపోయే వాళ్ళతో మాట్లాడుతూ కూర్చోలేదు. ఎప్పుడైతే గుడ్లు కొట్టుకుపోయాయో, వెంటనే తన ముక్కుతో సముద్రపు నీరు నింపుకుని దూరంగా వెళ్ళి నేలపైన వేసేది. తన గుడ్లు కొట్టుకుపోయాయని తెలిసి ఎవరైతే సానుభూతి చూపించడానికి వచ్చారో వారు కూడ అదేపని చెయ్యడం మొదలు పెట్టారు. ఎలాగైనా సముద్రుడిని శుష్కింపచేయాలన్న దృఢ నిశ్చయంతో ఇక వారు ఎవరి మాటా వినలేదు.

ఇంత చిన్న పక్షి సముద్రుడిని శుష్కింప చేయగలదా చెప్పండి! కానీ దాని మనసులో ఎంతటి ఉత్సాహం! దృఢత్వం! పౌరుషం! ఎంతటి ప్రయత్నం. దేశ దేశాలనుండి పక్షులు రావడం మొదలు పెట్టాయి.

ఈ సమాచారం పక్షులకు రాజయిన గరుత్మంతుడికి తెలిసింది. సముద్రుడిని శుష్కింపజేయటానికి కోట్లాది పక్షులు ఆ పనిలో నిమగ్నమైవున్నాయట. 'పద నేను చూస్తాను' అని గరుడుడు కూడా వచ్చాడు.

'ఓ సముద్రమా! మా వారంతా ఒకటై నిన్ను శుష్కింపజేయాలనుకుంటున్నారు. నీవేమో ఇవి నన్నేం చేస్తాయి? అల్ప జీవులు అనుకుంటున్నావా ఇప్పుడు చూడు నా తడాఖా!' అని గరుడుడు సముద్రంపైన తన రెక్కలతో రెండు మూడు సార్లు బలంగా ప్రహారం చేశాడు. అప్పుడు సముద్రుడు ఉద్విగ్నుడైనాడు. పక్షి గుడ్లను తెచ్చి ఇచ్చాడు.

అంటే ఎంత పెద్ద పనైనా సరే సంకల్పించి, శక్తికొద్దీ ప్రయత్నిస్తే అప్పుడు నీకు సహాయం చేసేవాళ్ళు, నీకు సలహా ఇచ్చేవాళ్ళు నీకు లభిస్తారు. అప్పుడు ఆపని చెయ్యడం వలన నీకు సఫలత చేకూరుతుంది అని జగద్గురు శంకరాచార్యులవారి గురువు గౌడపాదాచార్యులవారు శిష్యులకు బోధించేవారు.

బిజినెస్ రీల్

పటిష్టమైన ఫుడ్ బ్రాండుగా అమూల్

బ్రాండ్ ఫైనాన్స్ లిస్టులో టాప్



న్యూఢిల్లీ: డెయిరీ దిగ్గజం అమూల్ తాజాగా ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన ఫుడ్ బ్రాండ్‌గా నిలిచింది. అలాగే పటిష్టమైన డెయిరీ బ్రాండ్‌గా వరుసగా నాలుగో ఏడాది తన స్థానాన్ని నిలబెట్టుకుంది. కన్సల్టెన్సీ సంస్థ బ్రాండ్ ఫైనాన్స్, యూకే విడుదల చేసిన 'ఫుడ్ అండ్ డ్రింక్ 2024' నివేదికలో ఈ విషయాల వెల్లడయ్యాయి. దీని ప్రకారం బ్రాండ్ సామర్థ్య సూచీ (బీఎస్ఐ)కి సంబంధించి అమూల్‌కి 100 మార్కులకు గాను 91.0 స్కోరుతో పాటు ట్రిపుల్ ఏ ప్లస్ రేటింగ్ లభించాయి. కంపెనీ గతేడాది రెండో ర్యాంకులో ఉంది. లిస్టులోని టాప్ 50 గ్లోబల్ బ్రాండ్స్‌లో భారత్ నుంచి అమూల్‌కి మాత్రమే చోటు లభించింది. 36 లక్షల మంది రైతులున్న తమ టీమ్‌కి ఇది గర్వకారణమని అమూల్ ఎండీ జయేన్ మెహతా తెలిపారు. గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ సంస్థ అమూల్‌ను మార్కెటింగ్ చేస్తోంది. ఇది ఏటా 11 బిలియన్ లీటర్ల పాలను సేకరిస్తోంది.

యాక్సిస్ బ్యాంక్ 'స్పర్శ్ వీక్' రెండో ఎడిషన్



ముంబై: ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ తమ కస్టమర్ల కోసం 'స్పర్శ్ వీక్' రెండో ఎడిషన్‌ను నిర్వహించింది. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా తమ 5,000 పైచిలుకు శాఖల్లో ఈ సందర్భంగా కస్టమర్లకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. రూ. 2,499 వార్షిక ప్రీమియంకే రూ. 30 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, ఉచిత యాక్సిస్ డైరెక్ట్ అకౌంట్, 50 బేసిస్ పాయింట్ల మేర తక్కువ వడ్డీ రేట్లకే వాహనాలకు 100 శాతం ఆన్-రోడ్ రుణాలు మొదలైనవి వీటిలో ఉన్నాయి. అలాగే, డిజిటల్ బ్యాంకింగ్‌పై సీనియర్ సిటిజన్ కస్టమర్లలో అవగాహన కల్పించడం, కొత్త కస్టమర్లకు చేరువ కావడం, కార్పొరేట్లను సత్కరించడం మొదలైన కార్యక్రమాలు నిర్వహించినట్లు బ్యాంకు గ్రూప్ ఎగ్జిక్యూటివ్ విజయ్ మూల్‌బగల్ తెలిపారు.

ఎస్ఏపీతో క్యాప్‌జెమినీ జట్టు

మూడేళ్లలో 8,000 మందికి నైపుణ్యాల్లో శిక్షణ



ముంబై: ఐటీ దిగ్గజం క్యాప్‌జెమినీ తాజాగా ఎస్ఏపీ ల్యాబ్స్‌తో చేతులు కలిపింది. వచ్చే మూడేళ్లలో దేశీయంగా 8,000 మంది వెనుకబడిన యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్యాల్లో శిక్షణ కల్పించేందుకు క్యాప్‌జెమినీ-ఎస్ఏపీ డిజిటల్ అకాడెమీ ప్రోగ్రాంను అందించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. దీని ప్రకారం ఇరు సంస్థలు సంయుక్తంగా వనరుల సమీకరణ, నెట్‌వర్క్‌లు మొదలైన వాటిపై ఇన్వెస్ట్ చేస్తాయని క్యాప్‌జెమినీ ఇండియా సీఈవో అశ్విన్ యార్ది తెలిపారు. తమ కెరియర్లలో విజయాలను అందుకునేందుకు దేశ యువతకు సాధికారత కల్పించేందుకు ఈ భాగస్వామ్యం సహాయకరంగా ఉండగలదని ఎస్ఏపీ ల్యాబ్స్ ఇండియా ఎండీ సింధు గంగాధరన్ పేర్కొన్నారు.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DIVISLAB	4,898.00	3.7
TITAN	3,559.00	2.42
SBILIFE	1,800.80	2.24
GRASIM	2,689.90	2.02
CIPLA	1,593.95	1.99

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,608.00	-1.26
TATASTEEL	152	-1.25
ULTRACEMCO	11,220.00	-1.14
POWERGRID	337.25	-0.95
HDFCBANK	1,628.00	-0.59

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,515
ఎన్ఎస్ఈ	1,17,624
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,11,441
ఎఫ్ఐఐ	- 800
డీఐఐ	+ 3,097

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.58	$ 73.17
బ్రెంట్	75.75	$ 77.20

పీసీల అమ్మకాల జోరు

కొనసాగుతున్న ల్యాప్‌టాప్స్ హవా ● అగ్రస్థానంలో దూసుకెళ్తున్న హెచ్‌పీ ● ఆఫ్‌లైన్ వైపు కంపెనీల మొగ్గు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పర్సనల్ కంప్యూటర్స్ (పీసీ) అమ్మకాలు దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్–జూన్ కాలంలో 33.9 లక్షల యూనిట్లు నమోదైంది. 2023 జూన్ త్రైమాసికంతో పోలిస్తే విక్రయాలు 7.1 శాతం పెరిగాయి. నాలుగు త్రైమాసికాలుగా పీసీ మార్కెట్ జోరు కొనసాగుతుండడం విశేషం. ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) ప్రకారం.. 2023 ఏప్రిల్–జూన్‌తో పోలిస్తే ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో డెస్క్‌టాప్స్ 5.9 శాతం, నోట్‌బుక్స్ 7.4, వర్క్‌స్టేషన్స్ 12.4 శాతం వృద్ధి చెందాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మెరుగైన డిమాండ్‌తో కంజ్యూమర్ విభాగం 11.2 శాతం దూసుకెళ్లింది. ఈ–టైల్ చానెల్స్ 22.4 శాతం ఎగశాయి. వాణిజ్య విభాగం 3.5 శాతం అధికమైంది. అమ్మకాల వృద్ధి చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల విభాగంలో 12.4 శాతం, భారీ వ్యాపార సంస్థల సెగ్మెంట్లో 33.1 శాతం నమోదైంది.

విక్రేతలు జూన్ త్రైమాసికంలో బ్యాక్ టు స్కూల్/కాలేజ్ ప్రచారాలను ప్రారంభించారు. ఆన్‌లైన్ విక్రయాల సమయంలో ఈ–టైల్ ఛానెల్‌లో మంచి డిమాండ్ కనిపించింది. స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు భారీ అమ్మకాలకు నాంది పలికింది. తద్వారా కంజ్యూమర్ పీసీ షిప్‌మెంట్లలో ఆరోగ్యకర వృద్ధిని అందించింది. భారత పీసీ విపణిలో 31.7 శాతం వాటాతో హెచ్‌పీ తొలి స్థానంలో నిలిచింది. లెనోవో 17.5 శాతం, డెల్ 14.8, ఏసర్ గ్రూప్ 14.7, ఏసస్ 7.1 శాతం వాటాతో ఆ తర్వాతి స్థానాల్లో పోటీపడుతున్నాయి.

హెచ్‌పీ వాటా 32శాతం

తిరిగి ఆఫ్‌లైన్ వైపు..

ఆఫ్‌లైన్ మీద కంపెనీలు ఫోకస్ చేస్తున్నాయని పీసీ డిస్ట్రిబ్యూటర్ ఐటీ మాల్ ఎండీ అహ్మద్ అలీ సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. 'ఒకప్పుడు ఈ కామర్స్ కంపెనీలు డీలర్స్‌తో ఒప్పందం చేసుకుని పీసీలను విక్రయించేవి. కొన్నేళ్లుగా తయారీ సంస్థల నుంచి నేరుగా ఈ–కామర్స్ కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. ఈ–కామర్స్ సంస్థలు ప్రాచుర్యంలోకి రావడంతో తయారీ వ్యయం కంటే తక్కువకే పీసీలను డిమాండ్ చేస్తున్నాయి. దీంతో తయారీ సంస్థలు తిరిగి ఆఫ్‌లైన్ వైపు పెద్ద ఎత్తున ఫోకస్ చేస్తున్నాయి. ఆఫ్‌లైన్ విధానంలో ఉత్పత్తిదార్లకు కూడా మార్జిన్ ఎక్కువగా ఉంటుంది. ప్రతి రిటైలర్‌కు చేరువగా సర్వీస్ కేంద్రాలను విస్తరిస్తున్నాయి. ఆన్‌లైన్‌కు ఆఫ్‌లైన్‌కు ధరలో వ్యత్యాసం ఎక్కువ లేదు. ఆఫ్‌లైన్‌లో అప్పుడప్పుడు తక్కువగా ఉంటుంది. కంపెనీలు ఆఫ్‌లైన్‌లో ఎక్కువ మోడల్స్ ఆఫర్ చేస్తున్నాయి' అని వివరించారు.



గేమింగ్ హవా..

గేమింగ్ మార్కెట్ బాగా ప్రాచుర్యంలో వస్తోంది. ల్యాప్‌టాప్ సెగ్మెంట్లో గేమింగ్ 65 శాతం వాటా ఉంటుందని పరిశ్రమ వర్గాల సమాచారం. మొత్తం పీసీ మార్కెట్లో ల్యాప్‌టాప్స్ వాటా అత్యధికంగా 75 శాతం దాకా ఉంది. డెస్క్‌టాప్స్ 10–12 శాతం, ఆల్ ఇన్ వన్స్ 8, వర్క్ స్టేషన్స్ 5 శాతం వాటా కైవసం చేసుకున్నాయి. రూ.50–60 వేల ధరల శ్రేణిలో ఎక్కువగా పీసీలు అమ్ముడవుతున్నాయి. ఈ విభాగానికి అత్యధికంగా 45 శాతం వాటా ఉంది. పరిమాణం పరంగా రూ.40–50 వేల సెగ్మెంట్ 25–30 శాతం, రూ.20–40 వేల విభాగం 10 శాతం, రూ.60 వేల నుంచి రూ.1 లక్ష వరకు 8–10 శాతం వాటా ఉంది. రూ.1 లక్ష పైన ఖరీదు చేసే పీసీల వాటా 5 శాతం ఉంటుంది. భారత పీసీ మార్కెట్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ 8–10 శాతం వాటా కైవసం చేసుకున్నాయి.

త్వరలోనే డేటా రక్షణ నిబంధనలు: కేంద్రం



న్యూఢిల్లీ: వ్యక్తిగత డిజిటల్ డేటా పరిరక్షణ చట్టం ముసాయిదా నిబంధనలను నెలరోజుల్లోనే విడుదల చేస్తామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ప్రభుత్వం తొలుత డిజిటల్‌గా ఈ చట్టం అమపై దృష్టి పెట్టినట్టు.. అందుకు అనుగుణంగా నిబంధనలు రూపొందించినట్టు చెప్పారు. "కార్యాచరణ సిద్ధమైంది. సంప్రదింపుల కోసం ముసాయిదా నిబంధనలను నెల రోజుల్లోపు ప్రజల ముందు ఉంచుతాం'' అని మీడియా ప్రతినిధులకు వైష్ణవ్ తెలిపారు. నిబంధనలకు సంబంధించి భాష సరళతరంగా ఉంటుందన్నారు. గోప్యత హక్కు అన్నది ప్రాథమిక హక్కుల్లో భాగమేనంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన ఆరేళ్ల తర్వాత.. 2023 ఆగస్ట్ 9న 'ద డిజిటల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు'కు పార్లమెంట్ ఆమోదం తెలపడం గమనార్హం. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు యూజర్ల వ్యక్తిగత డేటా దుర్వినియోగాన్ని ఈ చట్టం అడ్డుకుంటుంది. వ్యక్తిగత డేటా సేకరణ, ప్రాసెసింగ్‌కు సంబంధించి నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుంది. డేటా ఉల్లంఘన చోటుచేసుకుంటే రూ.250 కోట్ల వరకు జరిమాన చెల్లించే నిబంధన సైతం ఈ చట్టంలో భాగంగా ఉంది.

సెంబ్‌కార్ప్ గ్రీన్ అమోనియా ప్లాంట్

ట్యూటికోరన్‌లో ఏర్పాటుకు రెడీ

చెన్నై: గ్రీన్ అమోనియా తయారీకి తమిళనాడులోని ట్యూటికోరన్‌లో ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు సింగపూర్ కంపెనీ సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ తాజాగా పేర్కొంది. తద్వారా ఉద్గారరహిత ఇంధనాన్ని జపాన్‌కు ఎగుమతి చేయనుంది. ప్లాంటుకు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పునాదిరాయిని వేసినట్లు తెలియజేసింది. వ్యవసాయ ఎరువుల తయారీలో ఘాటైన గ్యాస్.. అమోనియాను విస్తారంగా వినియోగించే సంగతి తెలిసిందే. అయితే గ్రీన్ అమోనియా ఉత్పత్తిలో భాగంగా 100 శాతం పునరుత్పాదక, కర్బనరహితంగా అమోనియాను రూపొందించనున్నట్లు వివరించింది. ప్రకృతిలో పుష్కలంగా లభించే నైట్రోజన్, హైడ్రోజన్ కలయికతో అమోనియా తయారవుతుంది. భూవాతావరణంలో నైట్రోజన్, హైడ్రోజన్‌తో నిండిన



నీటిదే అధిక శాతం వాటాకాగా.. గ్రీన్ అమోనియా తయారీకి అవసరమయ్యే విద్యుత్‌కు పునరుత్పాదక మార్గాలను వినియోగించుకోనుంది. సౌర, పవన విద్యుత్ ద్వారా ఎలక్ట్రోలైజర్‌లో నీటి నుంచి హైడ్రోజన్‌ను విడదీయనుంది. ఆపై నైట్రోజన్‌తో నిండిన రియాక్టర్‌లో నింపనుంది.

తొలి ఒప్పందం

ఇండియా నుంచి జపాన్‌కు తొలిసారి గ్రీన్ అమోనియా ఎగుమతికి కుదిరిన ఒప్పందంలో భాగంగా ట్యూటికోరన్‌లో ప్లాంటు ఏర్పాటుకు సెంబ్‌కార్ప్ తెరతీసింది. ఒప్పందంపై సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్‌తో పాటు.. జపనీస్ సంస్థలు సోజిట్ కార్పొరేషన్, క్యూషు ఎలక్ట్రిక్ పవర్ కో, ఎన్‌వైకే లైన్ సంతకాలు చేశాయి. దేశీయంగా సెంబ్‌కార్ప్ రూపొందించే గ్రీన్ అమోనియాను క్యూషు ఎలక్ట్రిక్ ఎనర్జీ మిక్స్‌గా వినియోగించనుంది. తద్వారా జపాన్‌లోని థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో పాక్షికంగా బొగ్గుకు బదులుగా వినియోగించనుంది. సోజిట్ కార్పొరేషన్ అమోనియా తయారీదారు, కొనుగోలుదారు మధ్య బిజినెస్ మధ్యవర్తి(ఇంటర్మెడియరీ)గా వ్యవహరించనుంది. భారత్ నుంచి జపాన్‌కు గ్రీన్ అమోనియా సముద్ర రవాణాను ఎన్‌వైకే లైన్ పర్యవేక్షించనుంది. 160 ఎకరాలలో నెలకొల్పుతున్న ప్లాంటు తొలుత 2 లక్షల మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యంతో ప్రారంభంకానుంది.

నాస్కామ్ ప్రెసిడెంట్‌గా రాజేశ్ నంబియార్



న్యూఢిల్లీ: నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్, సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్) నూతన ప్రెసిడెంట్‌గా కాగ్నిజెంట్ ఇండియా చైర్మన్ రాజేశ్ నంబియార్ నియమితులయ్యారు. దేబ్జానీ ఘోష్ పదవీకాలం పూర్తయిన తర్వాత నవంబర్ 2024లో నాస్కామ్ ప్రెసిడెంట్‌గా నంబియార్ కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడైన ఆయన 2023లో నాస్కామ్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. టీసీఎస్, ఐబీఎం, సియెనా వంటి దిగ్గజ సంస్థల్లో పనిచేసిన అనుభవం ఉంది. కాగా, రాజేశ్ నంబియార్ కాగ్నిజెంట్ సీఎండీ పదవికి రాజీనామా చేశారు. గ్లోబల్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్, ఇండియా సీఎండీగా రాజేశ్ వారియర్‌ను ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ నియమించుకుంది. సెప్టెంబర్ 2 నుంచి గ్లోబల్ హెడ్‌గా, అక్టోబర్ 1 నుంచి సీఎండీగా బాధ్యతలు అందుకుంటారు. కాగ్నిజెంట్‌లో చేరక ముందు హెడ్ ఆఫ్ గ్లోబల్ సర్వీసెస్, ఇన్ఫోసిస్ అమెరికాస్ ఈవీపీగా వారియర్ పనిచేశారు. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్, యాక్టివ్‌క్యూబ్స్ వంటి సంస్థల్లోనూ ఉద్యోగం చేశారు.

కర్నాటక బ్యాంక్ క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ



న్యూఢిల్లీ: కర్నాటక బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ నవీ టెక్నాలజీస్ తాజాగా క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ సేవలను ఆవిష్కరించాయి. వినియోగదారు యూపీఐ ఖాతాకు క్రెడిట్ లైన్‌ను అనుసంధానించడం ద్వారా విభిన్న క్రెడిట్ కార్డ్‌లను వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) యాప్ ద్వారా చెల్లింపులు జరుపవచ్చు. ఇక కస్టమర్ యూపీఐ లావాదేవీల ఆధారంగా బ్యాంకులు ప్రీ-సాంక్షన్డ్ క్రెడిట్ లైన్ ఆఫర్ చేస్తాయి. ప్రస్తుతం ఎంపిక చేసిన ప్రీ-క్వాలిఫైడ్ కస్టమర్లకు ఈ సేవలను అందిస్తున్నట్లు బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. వినియోగదార్ల అభిప్రాయం మేరకు మరింత మందికి విస్తరిస్తామని వివరించింది. స్వల్పకాలిక నెలవారీ రుణ ఉత్పత్తితో ఈ సేవలు ప్రారంభించినట్లు బ్యాంక్ తెలిపింది. భవిష్యత్తులో కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా ఈఎంఐ సౌకర్యాలు, వర్కింగ్ క్యాపిటల్ క్రెడిట్ లైన్‌ల వంటి ఇతర వేరియంట్లను జోడించడం కోసం చర్చలు జరుపుతున్నట్లు పేర్కొంది. యూపీఐ ద్వారా ప్రజలు కార్డ్‌లు లేకుండా చెల్లించే విధానాన్ని విప్లవాత్మకంగా మారుస్తుందని భావిస్తున్నామని కర్నాటక బ్యాంక్ ఎండీ, సీఈవో శ్రీకృష్ణన్ హెచ్ అన్నారు.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఏయూఎం @ రూ. 3 లక్షల కోట్లు


ముంబై: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ తాజాగా రూ. 3 లక్షల కోట్ల ఏయూఎం (నిర్వహణలోని అసెట్స్) మైలురాయిని అధిగమించింది. ఈ ఏడాది జూలై 31 నాటికి మొత్తం ఏయూఎం రూ. 3.14 లక్షల కోట్లుగా ఉన్నట్లు కంపెనీ తెలిపింది. కవరేజీ అందిస్తున్న లైవ్స్ సంఖ్య 2022 జూన్‌లో 6.19 కోట్లుగా ఉండగా జూన్ ఆఖరు నాటికి 9.84 కోట్లకు చేరినట్లు వివరించింది. క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తి 99.17 శాతంగా ఉన్నట్లు కంపెనీ ఎండీ అనూప్ బాగ్చీ తెలిపారు.

నిధుల సమీకరణలో అప్పర్‌కేస్

ముంబై: లగేజ్ బ్రాండ్ అప్పర్‌కేస్ కొత్తగా 9 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది. అంతర్జాతీయ వెంచర్ క్యాపిటల్ సంస్థ యాక్సెల్ తదితర ఇన్వెస్టర్లు ఈ విడతలో ఇన్వెస్ట్ చేసినట్లు సంస్థ తెలిపింది. ఈ నిధులను వ్యాపార విస్తరణ కోసం వినియోగించుకోనున్నట్లు పేర్కొంది. వచ్చే మూడేళ్లలో 250 కొత్త స్టోర్స్ ప్రారంభించడం ద్వారా రూ. 500 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని చేరుకోనున్నట్లు వివరించింది. ఇప్పటివరకు మొత్తం మీద రూ. 150 కోట్లు సమీకరించినట్లు కంపెనీ వ్యవస్థాపకుడు సుదీప్ ఘోష్ తెలిపారు.

దేశీయంగా డెకథ్లాన్ పెట్టుబడులు

ఐదేళ్లలో రూ. 933 కోట్లు



న్యూఢిల్లీ: దేశీయంగా రానున్న ఐదేళ్లలో ఫ్రెంచ్ స్పోర్ట్స్ రిటైలర్ డెకథ్లాన్ 10 కోట్ల యూరోల(సుమారు రూ. 933 కోట్లు)ను ఇన్వెస్ట్ చేయనుంది. తద్వారా వేగవంత వృద్ధిలో ఉన్న దేశీ మార్కెట్లలో రిటైల్, తయారీ కార్యకలాపాలను విస్తరించనుంది. రానున్న మూడు, ఐదేళ్ల కాలంలో బిజినెస్ రెట్టింపుకాగలదని అంచనా వేస్తున్నట్లు డెకథ్లాన్ ఇండియా సీఈవో శంకర్ చటర్జీ పేర్కొన్నారు. కాగా.. ఐదేళ్లలో డెకథ్లాన్ 190 స్టోర్లను ఏర్పాటు చేసే ప్రణాళికల్లో ఉంది. దీంతో 90 పట్టణాలలో నెట్‌వర్క్‌ను విస్తరించాలని భావిస్తోంది. ప్రస్తుతం దేశీయంగా విక్రయిస్తున్న వస్తువులలో 68 శాతాన్ని స్థానికంగానే తయారు చేస్తోంది. గ్లోబల్ ప్రొడక్టులలో 8 శాతం వరకూ దేశీయంగానే రూపొందిస్తోంది. 2026కల్లా 85 శాతానికి దేశీ తయారీని పెంచుకునే లక్ష్యంతో ఉన్నట్లు చటర్జీ తెలియజేశారు. ప్రతీ ఏడాది 10–15 స్టోర్లను ఏర్పాటు చేయడంతోపాటు.. ఆన్‌లైన్ విక్రయాలను పెంచుకునే బాటలో సాగనున్నట్లు వెల్లడించారు.

వియత్నాంలో ఓఎన్‌జీసీ కాంట్రాక్టుల గడువు పొడిగింపు

- చమురు ఉత్పత్తి బ్లాక్‌కు మరో 16 ఏళ్లు
- మరో బ్లాక్‌లో అన్వేషణకు మూడేళ్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ ఓఎన్‌జీసీ విదేశీ విభాగమైన ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్‌కు వియత్నాంలో చమురు, గ్యాస్ ఉత్పత్తికి మరో 16 ఏళ్ల గడువు లభించింది. మరో బ్లాక్‌లో చమురు అన్వేషణకు మూడేళ్ల పాటు అదనపు గడువు మంజూరైంది. నామ్‌కాన్ సన్ బేసిన్‌లో బ్లాక్ 06.1లో ఇప్పటికే చమురు, గ్యాస్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఈ బ్లాక్‌కు 2039 వరకు అదనపు గడువు లభించింది. ఈ బ్లాక్‌లో ఓఎన్‌జీసీ విదేశ్‌కు 45 శాతం వాటా ఉంది. 1988లో దీన్ని సొంతం చేసుకుంది. 35 శాతం వాటా కలిగిన జరుబెంజెనెఫ్ట్ ఈపీ బీవీ బ్లాక్ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. పెట్రో వియత్నాంకు సైతం 20 శాతం వాటా ఉంది. మిలియన్ టన్నుల ఆయిల్, గ్యాస్ ఇక్కడ ఉత్పత్తి అవుతోంది. ఈ బ్లాక్‌లో ఓఎన్‌జీసీ విదేశ్‌కు ఉన్న కాంట్రాక్ట్ గడువు 2023 మే 19తో ముగియగా, అక్కడి నుంచి 16 ఏళ్ల అదనపు గడువు లభించింది. ఇక బ్లాక్ 128లో ఆయిల్, గ్యాస్ అన్వేషణకు ఎనిమిదో విడత గడువును వియత్నాం నియంత్రణ సంస్థ పీవీఎన్ పొడిగించింది. ఇక్కడ చమురు, గ్యాస్ అన్వేషణ గడువు 2023 జూన్ 15తో ముగియగా, 2026 జూన్ 15 వరకు తాజా గడువు మంజూరైంది. గత 18 ఏళ్లుగా (2006 మే నుంచి) ఈ బ్లాక్‌లో ఓఎన్‌జీసీ చమురు, గ్యాస్ కోసం శోధిస్తున్నప్పటికీ ఫలితాలు కనిపించడం లేదు. దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఈ బ్లాక్ ఉండడంతో వ్యూహాత్మక అవసరాల దృష్ట్యా ఎన్‌జీసీ విదేశ్ కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇస్తోంది.

వైద్య పరికరాల తయారీకి కొత్త పథకం

ఫార్మాస్యూటికల్స్ కార్యదర్శి చావ్లా



న్యూఢిల్లీ: దేశీ వైద్య పరికరాల తయారీ పరిశ్రమను బలోపేతం చేసేందుకు ఒక పథకాన్ని తీసుకురానున్నట్టు కేంద్ర ఫార్మాస్యూటికల్స్ విభాగం సెక్రటరీ అరుణీష్ చావ్లా తెలిపారు. పరిశ్రమతో విస్తృత సంప్రదింపుల అనంతరం ఈ పథకాన్ని రూపొందించినట్టు, దీనికి ఆర్థిక శాఖ సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. వచ్చే నెలలోనే దీన్ని అమల్లోకి తేనున్నట్టు చెప్పారు. రెండో మెడిటెక్ స్టాకథాన్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చావ్లా మాట్లాడారు. వైద్య పరికరాల తయారీ పరిశ్రమ అవసరాలను తీర్చేదిగా ఈ పథకం ఉంటుందని చెప్పారు. రానున్న రోజుల్లో దిగుమతులపై ఆధారపడడాన్ని ఇది తగ్గిస్తుందన్నారు. దీర్ఘకాలంలో దేశీ పరిశ్రమ స్వయంసమృద్ధి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు. వైద్య పరికరాలకు సంబంధించి ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) ఇప్పటి వరకు సత్ఫలితాలను ఇచ్చినట్టు, 20 పెద్ద ప్రాజెక్టులు కార్యకలాపాలు ప్రారంభించినట్టు చెప్పారు. కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీటీ) స్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ స్కాన్, డయలాసిస్ మెషిన్లు దేశీయంగా తయారవుతున్నట్టు చావ్లా తెలిపారు. గతేడాది కేంద్ర కేబినెట్ 'నేషనల్ మెడికల్ డివైజెస్ పాలసీ'కి ఆమోదం తెలపడం తెలిసిందే. వచ్చే ఐదేళ్లలో 50 బిలియన్ డాలర్ల స్థాయికి పరిశ్రమ ఎదిగేందుకు ఈ విధానం తోడ్పడుతుందని కేంద్రం భావిస్తోంది.

సకాలంలో బొగ్గు సరఫరా

- లేదంటే కోల్‌ఇండియాపై జరిమానా
- సరఫరాలు పెంచేందుకు కేంద్రం చర్యలు



న్యూఢిల్లీ: కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ఒప్పందం ప్రకారం బొగ్గు సరఫరా చేయకుంటే జరిమానా చెల్లించాల్సిన పరిస్థితి ఎదుర్కోనుంది. దేశ బొగ్గు ఉత్పత్తిలో 80 శాతం వాటా కలిగిన సీఐఎల్.. ఈ–వేలంలో కొనుగోలు చేసిన వారికి అనుకున్న విధంగా సరఫరా చేసేందుకు వీలుగా కేంద్రం ఈ నిబంధనలు అమలు చేయనుంది. సులభ వ్యాపార నిర్వహణకు కేంద్రం ప్రాధాన్యమిస్తుండడం తెలిసిందే. విద్యుత్ ప్లాంట్లు, స్వతంత్ర విద్యుత్ తయారీ సంస్థలకు (ఐపీపీలు) వార్షిక ఒప్పంద పరిమాణానికి మించి బొగ్గును ఇకపై సీఐఎల్ సరఫరా చేయనుంది. 2023–24లో 973 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదు కాగా, ఇందులో విద్యుత్ ప్లాంట్లకు 810 మిలియన్ టన్నుల సరఫరా జరిగింది. అంతకుముందు సంవత్సరంతో పోల్చితే 8.78 శాతం ఎక్కువ. అలాగే, నాన్ రెగ్యులేటెడ్ సెక్టార్ (ఎన్ఆర్ఎస్)కు 163 మిలియన్ టన్నుల మేర బొగ్గు సరఫరా నమోదైంది. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరం కంటే 22 శాతం అధికం. విద్యుదుత్పత్తిలో బొగ్గు వాటా 83.24 శాతంగా ఉంది. "కస్టమరే రారాజు. బొగ్గు రంగంలో ప్రతి ఒక్కరూ మెచ్చుకునేలా పనితీరు ఉండాలనుకుంటున్నాం. సీఐఎల్ టన్నుకు రూ.500 వరకు సెక్యూరిటీ డిపాజిట్ గతంలో తీసుకుంటుండగా, దీన్ని రూ.150కు తగ్గించింది. ఇప్పుడు బొగ్గు సరఫరాల్లో విఫలమైతే సీఐఎల్‌పై జరిమానా విధించడం అన్నది సమానత్వం, పారదర్శకత కోసమే. ఇది ఎన్ఆర్ఎస్‌కు బొగ్గు సరఫరాను పెంచుతుంది''అని ఓ అధికారి వివరించారు.

కీలక ఖనిజాలపై కోల్ ఇండియా కన్ను

దేశీయంగా, అంతర్జాతీయంగా లిథియం సహా కీలక ఖనిజ నిక్షేపాలను దక్కించుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు కోల్ ఇండియా చైర్మన్ పీఎం ప్రసాద్ తెలిపారు. ఇకపైనా వాటికి సంబంధించిన బ్లాకుల వేలంలో కంపెనీ చురుగ్గా పాల్గొంటుందని కంపెనీ 50వ వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సందర్భంగా వివరించారు. లిథియం, కోబాల్ట్ వంటి కీలక లోహాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునే లక్ష్యంతో దేశ, విదేశాల్లో ఆయా లోహాల అసెట్స్‌ను కొనుగోలు చేయడంపై దృష్టి పెడుతున్నట్లు ప్రసాద్ పేర్కొన్నారు. కంపెనీ ఇప్పటికే మధ్యప్రదేశ్‌లోని ఖట్టాలి చోటి గ్రాఫైట్ బ్లాక్ విషయంలో ప్రాధాన్య బిడ్డరుగా నిల్చినట్లు ఆయన చెప్పారు. ఇది తమకు తొలి బొగ్గుయేతర మైనింగ్ వెంచర్ కాగలదని వివరించారు.

ఎన్‌బీఎఫ్‌సీలూ... తస్మాత్ జాగ్రత్త!

మొండిబకాయిలు పెరిగే అవకాశం ఉందన్న ఇక్రా



న్యూఢిల్లీ: నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) మొండిబకాయిలు ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెరిగే అవకాశం ఉందని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేసింది. ఎన్‌బీఎఫ్‌సీల నిర్వహణలో ఉన్న ఆస్తులు (ఏయూఎం) కూడా పెద్దగా పెరిగే అవకాశం లేదని అభిప్రాయపడింది. వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఎన్‌బీఎఫ్‌సీల ఏయూఎంలు మార్చితో ముగిసిన 2023–24 ఆర్థిక సంవత్సరంలో 18 శాతం వృద్ధిని సాధించాయి. అయితే 2024–25లో ఈ వృద్ధి రేటు 13–15 శాతానికి పరిమితమయ్యే వీలుందని అంచనావేసింది. బ్యాంకు రుణాలను పరిమితం చేయడానికి సంబంధించి నియంత్రణ చర్యలుసహా అన్‌సెక్యూర్డ్ రుణాలు, టాప్–అప్ లోన్ల విషయంలో ఇబ్బందులను ఎన్‌బీఎఫ్‌సీలు ఎదుర్కొనే వీలుందని విశ్లేషించింది. రెగ్యులేటరీ పరమైన అపరాధాల సంగతికి వస్తే ఇవి 0.30 శాతం నుంచి 0.50 శాతం పెరగవచ్చని ఇక్రా గ్రూప్ హెడ్ కార్తీక్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. 2024–25లో తగిన రుణ వృద్ధిని కొనసాగించడానికి ఈ రంగానికి రూ. 6 లక్షల కోట్ల వరకు నిధులు అవసరమని శ్రీనివాసన్ అన్నారు. అయితే మూలధనం ఒక అడ్డంకి కానప్పటికీ, నిధుల సమీకరణ వ్యయాల విషయంలో కొంత అవరోధాలు ఉండవచ్చని అంచనా వేశారు.

భారత్‌తో సమరం...
‘యాషెస్’తో సమానం!

బోర్డర్-గావస్కర్ ట్రోఫీపై స్టార్క్ వ్యాఖ్య



సిడ్నీ: భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ఐదు టెస్టుల సిరీస్ ‘బోర్డర్-గావస్కర్ ట్రోఫీ’పై ఆసీస్ మేటి పేసర్ మిచెల్ స్టార్క్ కీలక వ్యాఖ్యలు చేశాడు. తమ దృష్టిలో ఈ సిరీస్ కూడా ఇంగ్లండ్‌తో జరిగే ప్రతిష్టాత్మక ‘యాషెస్’తో సమానమని అతను అభిప్రాయపడ్డాడు. 1991-92 తర్వాత తొలిసారి ఇరు జట్ల మధ్య సిరీస్‌లో ఐదు టెస్టులు జరగబోతున్నాయి. 2014-15 నుంచి ఇప్పటి వరకు బోర్డర్-గావస్కర్ ట్రోఫీ భారత్ వద్దే ఉంది. అందులోనూ ఆసీస్ గడ్డపై పర్యటించిన గత రెండుసార్లూ సిరీస్ భారత్‌కే దక్కింది. ఈ నేపథ్యంలో రాబోయే పోరులో తాము విజేతగా నిలవాలని భావిస్తున్నట్లు స్టార్క్ చెప్పాడు. ‘కొంత కాలంగా నడుస్తున్న ట్రెండ్‌ను తిరగరాయాలని కోరుకుంటున్నా. స్వదేశంలో ప్రతీ టెస్టు మ్యాచ్ గెలిచేందుకే మేం ప్రయత్నిస్తాం. అయితే భారత జట్టు ఎంత బలంగా ఉందో అందరికీ తెలుసు. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో ఉన్న మా జట్ల మధ్య సమరం అంటే సహజంగానే అందరిలోనూ ఆసక్తి ఎక్కువగా ఉంది. వచ్చే ఏడాది జనవరి 8న ట్రోఫీ మా చేతుల్లో ఉంటుందని ఆశిస్తున్నా’ అని స్టార్క్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. కెరీర్‌లో 89 టెస్టులు ఆడిన స్టార్క్ 100 టెస్టుల మైలురాయికి మరో 11 మ్యాచ్‌ల దూరంలో ఉన్నాడు. అయితే ఇప్పటికిప్పుడు టెస్టుల నుంచి తప్పుకునే ఆలోచన తనకు లేదని అతను స్పష్టం చేశాడు. పైగా టెస్టు కెరీర్ పెంచుకునేందుకు వన్డే, టి20 సిరీస్‌లను ఆచితూచి ఎంచుకుంటున్నట్లు కూడా అతను చెప్పాడు. ‘బ్యాగీ గ్రీన్ క్యాప్ ధరించిన ప్రతీసారి ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది. ఈ సీజన్‌లో జరిగే అన్ని టెస్టులు గెలవాలని కోరుకుంటున్నా. జట్టు తరఫున 100 టెస్టులు ఆడగలిగితే నిజంగా చాలా అదృష్టవంతుడినే. ఆ రోజు ఎంతో ప్రత్యేకమవుతుంది. నా దృష్టిలో అన్నింటికంటే టెస్టులకే ఎక్కువ ప్రాధాన్యత’ అని స్టార్క్ వ్యాఖ్యానించాడు. ఈ సీజన్‌లో ఆస్ట్రేలియా జట్టు భారత్‌తో ఐదు, శ్రీలంకతో రెండు టెస్టులు ఆడనుంది. ఇంగ్లండ్ గడ్డపై వన్డే, టి20 సిరీస్‌లలో పాల్గొన్న తర్వాత తిరిగొచ్చి బోర్డర్-గావస్కర్ ట్రోఫీ కోసం స్టార్క్ సన్నద్ధమవుతాడు.

ASHWIN
‘కోచ్‌లపై అతిగా ఆధారపడొద్దు’

- ఇది ప్రమాదకర సంప్రదాయం
- సొంత ఆలోచనలతో పని చేయాలి
- యువ ఆటగాళ్లకు అశ్విన్ సూచన



చెన్నై: కెరీర్‌లో ఎదగాలంటే సొంత బలాలు, బలహీనతలపై దృష్టి పెట్టాలని... ప్రతీదానికి కోచ్‌లను ఆశ్రయించే పనికి స్వస్తి చెప్పాలని భారత సీనియర్ ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. అలా చేయడం వల్ల యువ ఆటగాళ్లు కొత్తగా ఆలోచించడం మానేసి ఒక్క చోటనే ఆగిపోతారని అతను అభిప్రాయపడ్డాడు. అవతలి వారికి ఇష్టం ఉన్నా లేకపోయినా ఏదో నేర్చుకునే సాకుతో ‘అతుక్కుపోయే’ గుణం తనకు ఏమాత్రం నచ్చదని అశ్విన్ వ్యాఖ్యానించాడు. 14 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో మూడు ఫార్మాట్‌లలో కలిపి 744 వికెట్లు తీసిన అశ్విన్ పరిస్థితులకు తగినట్లుగా ఎప్పటికప్పుడు తన ఆటను మార్చుకోవడంలో అందరికంటే ముందుంటాడు. ‘చాలా మంది ఆటగాళ్లు కోచ్‌లు, మెంటార్‌లపై లేదా తమకు తెలిసిన ఎవరైనా మరో వ్యక్తిపై అతిగా ఆధారపడుతున్నారు. నా దృష్టిలో ఇది ప్రమాదకర సంప్రదాయం. ఎందుకంటే ఇలా ఇతరులను నమ్ముకునే వారు కొత్తగా ఆలోచించడం మరచిపోతారు’ అని అశ్విన్ అభిప్రాయం వ్యక్తం చేశాడు. కోచ్‌లు శిక్షణ ఇచ్చే కోణంలో కూడా ఇది చేటు చేస్తుందని అతను చెప్పాడు. ‘సాధారణంగా అందరు కోచ్‌లు నీకేదైనా సమస్య ఉంటే దానికి పలు విధాలుగా పరిష్కారం చెప్పేందుకు ప్రయత్నిస్తారు. అయితే ఒక ఆటగాడికి పని చేసిన సూత్రం మరో ఆటగాడి విషయంలో పని చేయదు. కానీ నేటి ఆధునిక తరహా కోచింగ్‌లో ఎవరూ దీనిని పట్టించుకోవడం లేదు. సందేహాలు ఉంటే రెండో వ్యక్తి వద్ద సలహా తీసుకోవడంలో తప్పు లేదు. కానీ నీ ఆటపై నీకు అవగాహన లేకుంటే, నీ లోపాలు నీవే గుర్తించలేకపోతే కష్టం. కోచ్‌ల వద్ద నేర్చుకునేవారు బాగుపడరని నేను చెప్పడం లేదు కానీ దీని వల్ల చాలా చోట్ల వెనుకబడిపోతారు’ అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. తన కెరీర్ ఆరంభంలో మాజీ క్రికెటర్ డబ్ల్యూవీ రామన్ కోచ్‌గా ఉన్నా... తాను ఏ మార్గంలో వెళితే బాగుంటుందని చెప్పారే తప్ప ఫలానా తరహాలోనే ఉండాలని బలవంత పెట్టలేదని ఈ ఆఫ్‌స్పిన్నర్ అశ్విన్ గుర్తు చేసుకున్నాడు. గౌతమ్ గంభీర్‌తో తనకు మంచి సాన్నిహిత్యం ఉందన్న అశ్విన్... అతనితో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పాడు.

చాలా సమయం పట్టింది!

అశ్విన్ బౌలింగ్ అమ్ములపొదిలో ‘దూస్రా’ కూడా ఒక పదునైన బలం. దీనిని సమర్థంగా వాడి అతను ఎన్నో వికెట్లు పడగొట్టాడు. అయితే దూస్రాను నేర్చుకునేందుకు చాలా సమయం పట్టిందని అశ్విన్ వెల్లడించాడు. లంక స్పిన్నర్ అజంతా మెండిస్ వేసిన దూస్రా బంతులను చూసి స్ఫూర్తి పొందాని... దాదాపు మూడేళ్ల పాటు సాధన చేసిన అనంతరం నమ్మకం కుదిరాకే దేశవాళీ క్రికెట్‌లో దానిని తొలిసారి ఉపయోగించానని అతను చెప్పాడు. మరోవైపు ఐపీఎల్ కారణంగా యువ ఆటగాళ్లకు, పేరు, డబ్బు రావడం మంచి పరిణామమే అయినా... అందరికీ భారత్ తరఫున ఆడాలనేది తొలి లక్ష్యం కావాలని అశ్విన్ సూచించాడు.



మైదానంలో మూత్ర విసర్జన...
ఫుట్‌బాలర్‌కు రెడ్‌కార్డ్

లిమా: పెరూకు చెందిన ఓ ఫుట్‌బాలర్ విజ్ఞత మరిచి ఫీల్డ్‌లోనే మూత్ర విసర్జన చేయడంతో ఆగ్రహించిన రిఫరీ రెడ్‌కార్డ్‌తో బయటికి పంపించాడు. లోయర్ డివిజన్ ఫుట్‌బాల్ టోర్నీలో భాగంగా అట్లెటికో అవజున్, కాంటర్సిల్లో ఎఫ్‌సీ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతున్న సమయంలో అవజున్ జట్టుకు 71వ నిమిషంలో కార్నర్ కిక్ లభించింది. సెబాస్టియన్ మునోజ్ కొట్టిన కిక్‌ను కాంటర్సిల్లో గోల్‌కీపర్ అడ్డుకున్నాడు. ఇది భరించలేకపోయిన మునోజ్ కనీస విజ్ఞత లేకుండా విరామ సమయంలో మైదానంలోనే మూత్ర విసర్జన చేశాడు. దీన్ని కాంటర్సిల్లో ప్లేయర్లు రిఫరీ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే అతనికి రెడ్‌కార్డ్ చూపి బయటికి పంపించాడు. ఫుట్‌బాల్ ఆటలో ఇలా మూత్రవిసర్జన చేయడం ఇదే మొదటిసారి కాదు. ఆర్సెనల్ గోల్‌కీపర్ లెహ్‌మన్, ఇంగ్లండ్ లెజెండ్ లినెకర్‌లు కూడా ఇలాంటి చర్యకు పాల్పడి మైదానం వీడారు.

వేదిక మార్పు సన్నాహాలపై ప్రభావం చూపదు: దీప్తి



ముంబై: మహిళల టి20 ప్రపంచకప్ వేదిక మార్పు తమ సన్నాహాలపై ప్రభావం చూపదని భారత జట్టు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ అభిప్రాయపడింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 3 నుంచి 20 వరకు బంగ్లాదేశ్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగాల్సి ఉండగా... అక్కడ రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వేదికను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి మార్చింది. ఈ నేపథ్యంలో దీప్తి మాట్లాడుతూ.. ‘టోర్నీ ఎక్కడ జరిగినా అత్యుత్తమ ప్రదర్శన చేయడమే మా లక్ష్యం. వేదిక మార్పు వల్ల సన్నద్ధతపై ఎలాంటి ప్రభావం పడదు. ఐసీసీ ట్రోఫీ కోసం టీమిండియా చాన్నాళ్లుగా ఎదురుచూస్తోంది. ఈ టోర్నీలో అటు బంతితో ఇటు బ్యాట్‌తో రాణించి జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించాలనుకుంటున్నా. యూఏఈలోని పిచ్‌లు ఎలా స్పందిస్తాయనే దానిపై కొంచెం అవగాహన ఉంది. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండాఆటను ఆస్వాదిస్తున్నా’ అని దీప్తి పేర్కొంది. ఇక ఇటీవల లండన్‌లో జరిగిన హండ్రెడ్ టోర్నీలో లండన్ స్పిరిట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన దీప్తి... సీజన్ ఆసాంతం రాణించింది. లార్డ్స్ వేదికగా జరిగిన తుదిపోరులోనూ సత్తా చాటిన దీప్తి భారీ సిక్సర్‌తో లండన్ స్పిరిట్ జట్టుకు తొలి హండ్రెడ్ టైటిల్‌ను కట్టబెట్టింది.

టీటీ లీగ్‌కు వేళాయె...

- నేటి నుంచి యూటీటీ టోర్నీ
- బరిలో ఎనిమిది జట్లు
- టోర్నీ నుంచి వైదొలిగిన శ్రీజ
- జైపూర్ జట్టుకు స్నేహిత్

చెన్నై: గత నాలుగు సీజన్లుగా భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్లకు చక్కని అవకాశాలు కల్పిస్తున్న అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) ఫ్రాంచైజీ లీగ్ టోర్నీకి రంగం సిద్ధమైంది. నేటి నుంచి చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో యూటీటీ ఐదో సీజన్ పోటీలు జరుగనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ గోవా చాలెంజర్స్‌తో పాటు మొత్తం ఎనిమిది ఫ్రాంచైజీలు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 4 వరకు లీగ్ దశ పోటీలు జరుగుతాయి. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన నాలుగు జట్ల మధ్య 5, 6 తేదీల్లో సెమీఫైనల్స్... 7న జరిగే ఫైనల్స్‌తో ఐదో సీజన్ ముగుస్తుంది. ప్రతి రోజూ రాత్రి గం. 7:30 నుంచి మొదలయ్యే మ్యాచ్‌లను స్పోర్ట్స్-18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో సత్తాచాటి మహిళల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన తెలంగాణ ప్లేయర్ ఆకుల శ్రీజ ఈ టోర్నీ నుంచి వైదొలిగింది. అయితే పురుషుల కేటగిరీలో హైదరాబాదీ ఆటగాడు సూరావజ్జుల స్నేహిత్ జైపూర్ పేట్రియాట్స్ జట్టు తరఫున బరిలోకి దిగుతున్నాడు. ఈ సీజన్‌లో రాణించడం ద్వారా అందరి దృష్టిలో పడేందుకు అతను ఉవ్విళ్లూరుతున్నాడు.

భారత స్టార్ మహిళా ప్లేయర్ మనిక బత్రా బెంగళూరు స్మాషర్స్ తరఫున సత్తా చాటేందుకు సిద్ధమైంది. శ్రీజతో పాటు మనిక కూడా పారిస్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్‌దాకా పోరాడింది. యూటీటీ టోర్నీ సందర్భంగా 29 ఏళ్ల మనిక మాట్లాడుతూ తన ప్రదర్శన మెరుగయ్యేందుకు ఈ ఫ్రాంచైజీ లీగ్ ఎంతగానో దోహదం చేసిందని చెప్పుకొచ్చింది. ‘వ్యక్తిగతంగా నేను రాణించేందుకు ఈ టోర్నీ ఉపయోగపడింది. విదేశీ ప్లేయర్లతో కలిసి ఆడటం ద్వారా మెలకువలు నేర్చుకునేందుకు, దీటుగా పోరాడేందుకు యూటీటీ దోహదం చేసింది. ఈ టోర్నీని ప్లేయర్లంతా ఆస్వాదిస్తున్నారు. మరి ముఖ్యంగా మహిళల సింగిల్స్‌లో పురోగతికి యూటీటీ కూడా ఒక కారణం. అంతర్జాతీయంగా మన క్రీడాకారిణులు సాధిస్తున్న విజయాలు యూటీటీ చలవే’ అని మనిక తెలిపింది. నిరుటి రన్నరప్ చెన్నై లయన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆచంట శరత్ కమల్ మాట్లాడుతూ భారత ఆటగాళ్లు రాటుదేలేందుకు యూటీటీ చక్కని వేదికని అన్నాడు. దీనివల్లే మన జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే కాదు... ఆకట్టుకునే ప్రదర్శన ఇచ్చాయని చెప్పాడు. మహిళల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్స్, టీమ్ ఈవెంట్‌లో క్వార్టర్ ఫైనల్ చేరడం గొప్ప మైలురాయని శరత్ తెలిపాడు. ఈ టోర్నీలో ఆడటాన్ని అమితంగా ఇష్టపడతానని పేర్కొన్నాడు. పారిస్ మెగా ఈవెంట్‌లో శరత్‌కు ఊహించని విధంగా తొలి రౌండ్లోనే చుక్కెదురైంది. కెరీర్‌లో చివరి ఒలింపిక్స్ ఆడిన 42 ఏళ్ల శరత్ రిటైర్మెంట్ అనంతరం అడ్మినిస్ట్రేషన్ వైపు వెళ్లే యోచనలో ఉన్నాడు. దీనిపై భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్యతో పాటు, తన కుటుంబసభ్యులతో మాట్లాడిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటానని తెలిపాడు.

బరిలో ఉన్న జట్లు

అహ్మదాబాద్ ఎస్జీ పైపర్స్, చెన్నై లయన్స్, దబంగ్ ఢిల్లీ టీటీసీ, గోవా చాలెంజర్స్, జైపూర్ పేట్రియాట్స్, బెంగళూరు స్మాషర్స్, పుణేరి పల్టన్ టీటీ, యూ ముంబా టీటీ.



సందేశ్ లేకుండానే...

ఇంటర్ కాంటినెంటల్ కప్‌కు భారత స్టార్ డిఫెండర్ దూరం
వచ్చే నెలలో హైదరాబాద్‌లో టోర్నీ ● భారత ఫుట్‌బాల్ ప్రాబబుల్స్ ఎంపిక



న్యూఢిల్లీ: ఇంటర్ కాంటినెంటల్ కప్‌లో పాల్గొనే భారత ఫుట్‌బాల్ ప్రాబబుల్స్ జాబితాను బుధవారం ప్రకటించారు. 26 మంది సభ్యులతో కూడిన ఈ జాబితాలో స్టార్ డిఫెండర్ సందేశ్ జింగాన్‌కు చోటు దక్కలేదు. ఫిట్‌నెస్ సమస్యల వల్లే అతని పేరును పరిగణించలేదని తెలిసింది. జనవరిలో జరిగిన ఆసియా కప్‌లో 31 ఏళ్ల సందేశ్ కుడి మోకాలుకి గాయమైంది. దీంతో మే నెలలో కువైట్, ఖతర్‌లతో జరిగిన 2026 ప్రపంచకప్ ప్రిలిమినరీ క్వాలిఫికేషన్ రౌండ్-2 మ్యాచ్‌లకూ అతను దూరమయ్యాడు. ఐఎస్ఎల్ ఫ్రాంచైజీ చెన్నయిన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఫార్వర్డ్ కియాన్ నాసిరిని తొలిసారి భారత ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశారు. కియాన్ తల్లిది షిల్లాంగ్ కాగా, తండ్రి ఈస్ట్ బెంగాల్ క్లబ్‌కు చెందిన జంషీద్ ఇరాన్ అండర్-20 జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ప్రాబబుల్స్‌కు ఎంపికైన వారంతా టోర్నీకి ముందు ఆగస్టు 31 నుంచి హైదరాబాద్‌లో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొనాల్సి ఉంటుంది. శిబిరాన్ని కొత్త హెడ్‌కోచ్ మనొలో మార్క్వెజ్ పర్యవేక్షిస్తారు. ఈ ప్రాబబుల్స్ ప్లేయర్లే దాదాపు భారత జట్టుకు ఖాయమవుతారు. ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో ఆతిథ్య భారత్ సహా సిరియా, మారిషస్ జట్లు తలపడతాయి. సెప్టెంబర్ 3 నుంచి 9 వరకు ఈ టోర్నీ మ్యాచ్‌లు హైదరాబాద్‌లో జరుగుతాయి. మ్యాచ్‌లన్నీ రాత్రి 7:30 గంటలకు మొదలవుతాయి. ప్రస్తుతం ‘ఫిఫా’ ర్యాంకింగ్స్‌లో భారత్ 124వ ర్యాంక్‌లో ఉండగా, సిరియా 93వ ర్యాంక్‌లో, మారిషస్ 179వ ర్యాంక్‌లో ఉన్నాయి. భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 3న మారిషస్‌తో... రెండో మ్యాచ్ 9న సిరియాతో ఆడుతుంది. సిరియా-మారిషస్ జట్ల మధ్య మ్యాచ్ సెప్టెంబర్ 6న జరుగుతుంది.

జాబితా: **గోల్‌కీపర్స్:** గుర్‌ప్రీత్ సింగ్ సంధూ, అమరిందర్ సింగ్, ప్రభ్‌సుఖన్ సింగ్ గిల్. డిఫెండర్స్: నిఖిల్ పూజారి, రాహుల్ భెకే, చింగ్లెన్‌సనా సింగ్, రోషన్ సింగ్ నోరెమ్, అన్వర్ అలీ, జై గుప్తా, ఆశిష్ రాయ్, సుభాశిష్ బోస్, మెహతాబ్ సింగ్. మిడ్‌ఫీల్డర్స్: సురేశ్ సింగ్, జీక్సన్ సింగ్, నందకుమార్ శేఖర్, నోరెమ్ మహేశ్ సింగ్, యాసిర్ మొహమ్మద్, లాలెంగ్మావియా రాల్తే, అనిరుధ్ థాపా, సాహల్ అబ్దుల్ సమద్, లాలిన్‌జులా చాంగ్తె, లాల్తతంగ ఖాల్‌రింగ్. ఫార్వర్డ్స్: కియాన్ నాసిరి గిరి, ఎడ్మండ్ లాల్‌రిండికా, మాన్వీర్ సింగ్, లిస్టన్ కొలాకో.

4 ఇంటర్ కాంటినెంటల్ కప్ జరగనుండటం ఇది నాలుగోసారి. 2018లో తొలిసారి ముంబైలో జరగ్గా భారత జట్టు చాంపియన్‌గా నిలిచింది. 2019 టోర్నీకి అహ్మదాబాద్ వేదికగా నిలువగా... ఉత్తర కొరియా జట్టుకు టైటిల్ దక్కింది. 2023లో భువనేశ్వర్‌లో జరిగిన మూడో టోర్నీలోనూ భారత్‌కు టైటిల్ లభించింది.

2036 వరకు...

- భారత హాకీ జట్టుకు స్పాన్సర్‌గా ఒడిశా ప్రభుత్వం
- పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన జట్టుకు సన్మానం





భువనేశ్వర్: వరుసగా రెండు ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకాలు సాధించిన భారత హాకీ జట్టుకు తమ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం కొనసాగిస్తుందని... 2036 వరకు భారత హాకీ జట్టుకు ఒడిశా ప్రభుత్వం స్పాన్సర్‌గా కొనసాగుతుందని ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ప్రకటించారు. బుధవారం భువనేశ్వర్‌లో భారత జట్టు సభ్యులకు ఒడిశా ప్రభుత్వం సన్మానించింది. పారిస్ క్రీడల్లో కాంస్యం నెగ్గిన భారత జట్టులో కీలక సభ్యుడైన ఒడిశాకు చెందిన డిఫెండర్ అమిత్ రోహిదాస్‌కు రూ. 4 కోట్ల నజరానాను చెక్ రూపంలో అందించింది. జట్టులోని ఇతర ఆటగాళ్లకు తలా రూ. 15 లక్షల, సహాయక సిబ్బందికి రూ. 10 లక్షల నగదు బహుమతి అందజేసింది. 2018 నుంచి భారత హాకీ జట్లకు ఒడిశా ప్రభుత్వం అధికారిక స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. ఈ సందర్భంగా భారత సారథి హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ.. ‘జర్మనీతో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో విజయానికి చేరువగా వచ్చాం. చాలా అవకాశాలు సృష్టించుకున్నాం. అయితే అది మా రోజు కాదు. అయినా కాంస్య పతక పోరులో తిరిగి సత్తాచాటాం. స్వర్ణం సాధించడమే లక్ష్యంగా పారిస్‌కు వెళ్లాం. కానీ అది సాధ్యపడలేదు. వరసగా రెండు విశ్వక్రీడల్లో పతకాలు సాధించడం చాలా ఆనందంగా ఉంది. ఒడిశా ప్రభుత్వం అందించిన సహాయ సహకారాలు మరవలేనివని.. ఇక్కడ హాకీకి కావాల్సిన సకల సదుపాయాలు ఉన్నాయి’ అని అన్నాడు.

ప్రజ్ఞానంద, గుకేశ్ గేమ్‌లు ‘డ్రా’

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్‌ఫీల్డ్ కప్ క్లాసికల్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, గుకేశ్ వరుసగా రెండో ‘డ్రా’ నమోదు చేశారు. మాక్సిమి లెగ్రావ్ (ఫ్రాన్స్) తో జరిగిన రెండో రౌండ్ గేమ్‌ను ప్రజ్ఞానంద 32 ఎత్తుల్లో... నెపోమ్‌నిషి (రష్యా)తో జరిగిన రెండో రౌండ్ గేమ్‌ను గుకేశ్ 60 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగించారు. మొత్తం పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు జరుగుతున్న ఈ టోర్నీలో రెండో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద, గుకేశ్ ఒక్కో పాయింట్‌తో ఏడు, ఎనిమిది ర్యాంక్‌ల్లో ఉన్నారు.



సాక్షి ప్లస్
గురువారం । 22 । ఆగస్టు । 2024





పాక్ పార్లమెంటులో ఎలుకల వేట!

మనకు రామాయణంలో పిడకల వేట తెలుసు. ఇప్పుడు పాక్ పార్లమెంట్ ఎలుకల వేట సాగుతోంది! పార్లమెంటు భవనంలో ఎలుకలు విపరీతంగా పెరిగిపోయాయట. 2008 నుంచి జరిగిన సమావేశాల రికార్డులను పరిశీలించాలని అధికారిక కమిటీ ఒకటి కోరడంతో సమస్య తీవ్రత వెలుగులోకి వచ్చింది. రికార్డులన్నీ కాగితం ముక్కలై కనిపించడంతో ఇదెవరి పనా అని ఆరా తీస్తే ఎలుకల నిర్వాకమని తేలింది. వాటి ఆకారాలు కూడా అలా ఇలా లేవట. ''ఎలుకలు ఎంత పెద్దగా ఉన్నాయంటే, బహుశా పిల్లులు కూడా వాటికి భయపడిపోతాయేమో! మా సిబ్బందికంటే వాటిని చూసీ చూసీ అలవాటైపోయింది. కానీ తొలిసారి వచ్చేవాళ్లంతా ఈ ఎలుకల విరాట్ స్వరూపాలను చూసి వణికిపోతున్నారంటే అతిశయోక్తి కాదు'' అని నేషనల్ అసెంబ్లీ అధికార ప్రతినిధి జాఫర్ సుల్తాన్ వాపోయారు. రికార్డులు మొదలుకుని దొరికిన దాన్నల్లా ఈ ఎలుకలు హాం ఫట్ అనిపిస్తున్నాయట. దాంతో వాటి వేటకు పిల్లుల కొనుగోలు తదితరాలకు వార్షిక బడ్జెట్‌లో 12 లక్షలు కేటాయించాల్సి వచ్చింది! ఎలుకలను ట్రాప్ చేయడానికి ప్రత్యేక నెట్ కిటికీలు ఏర్పాటు చేస్తున్నారు. ''పార్లమెంటులో మనుషుల అలికిడి ఉన్నప్పుడు చడీచప్పుడూ లేకుండా ఎక్కడో నక్కుతాయి. అంతా నిర్మానుష్యం కాగానే పార్లమెంట్ ఆవరణను మారథాన్ ట్రాకుగా మార్చేసుకుంటున్నాయి. ఇంత తెలివైన ఎలుకలను నేనెప్పుడూ చూడలేదు'' అని జాఫర్ చెప్పుకొచ్చారు. విపక్ష నాయకుని కార్యాలయం, స్టాండింగ్ కమిటీల భేటీలు జరిగే తొలి అంతస్తులోనే ఎలుకలు విపరీతంగా ఉన్నట్టు గుర్తించారు. చివరికి వీటి కట్టడికి పెస్ట్ కంట్రోల్ కంపెనీల కోసం పేపర్ ప్రకటనలు కూడా ఇవ్వాల్సి వచ్చిందట!

– సాక్షి, నేషనల్ డెస్క్

పావురం ఎగరలేదని..

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అని సామెత. అధికారంలో ఉన్నవాళ్లు ఎలాంటి ఆదేశాలైనా ఇస్తారనడానికి ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఈ ఘటనే ఉదాహరణ. రాష్ట్రంలోని ముంగేలీ జిల్లాలో ఆగస్టు 15న స్వాతంత్య్ర దిన వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథి, బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పున్నులాల్ మోహ్లేతో పాటు కలెక్టర్ రాహుల్ దేవ్, ఎస్పీ గిరిజా శంకర్ జైస్వాల్‌లకు పావురాలు అందజేశారు. ఎమ్మెల్యే, కలెక్టర్ వదిలిన పావురాలు రివ్వుమంటూ ఎగిరిపోయాయి. ఎస్పీ విడిచిపెట్టింది మాత్రం నేలపై పడిపోయిందట! సదరు వీడియోను సచిన్ గుప్తా అనే సోషల్ మీడియా యూజర్ తన 'ఎక్స్' హ్యాండిల్లో షేర్ చేశారు. ''ఛత్తీస్‌గఢ్‌లో పంచాయత్–3 (వెబ్ సిరీస్) రిపీటైంది. పంద్రాగస్టు సందర్భంగా ఎస్పీ ఎగరేసిన పావురం కింద పడిపోయింది. వీడియో చూడండి'' అని రాసుకొచ్చారు. దాంతో తన పరువు పోయిందని భావించిన పోలీస్ బాసు, సంబంధిత అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు ఏకంగా లేఖ రాశారు! ''పావురం అనారోగ్యంతో ఉండటమే దీనికి కారణం. అది ఎగరకుండా కింద పడిపోయిన వైనం సోషల్ మీడియాలో విపరీతంగా వైరలై జిల్లా యంత్రాంగం పరువు తీసింది. బాధ్యుడైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోండి'' అంటూ రాసుకొచ్చారట.

– సాక్షి, నేషనల్ డెస్క్





కత్తెర దెబ్బకు విమానాలే రద్దు!

అవున్నిజమే! జపాన్‌లో అత్యంత రద్దీగా ఉండే ఓ విమానాశ్రయంలో అక్షరాలా ఇదే జరిగింది!! జపాన్ ఉత్తర ద్వీపం హొక్కైడోలో సపోరో ప్రాంతానికి సేవలందించే న్యూ చిటోస్ విమానాశ్రయం (సీటీఎస్)లో డొమెస్టిక్ డిపార్చర్ వెయిటింగ్ ఏరియాలోని ఒక స్టోర్‌లో ఓ కత్తెర కనిపించకుండా పోయింది. మరింకేదో వస్తువయితే ఏమో గానీ, అదసలే కత్తెర! విమానంలో ఆయుధంగా వాడి హైజాక్ చేసేందుకు బహుశా ఏ ఉగ్రవాదో దొంగిలించి ఉంటే? అందుకే అధికారులు వెంటనే అలెర్టయ్యారు. విమానాశ్రయాన్ని పూర్తిగా మూసేసి మరీ గంటల తరబడి వెదికారు. ఈ పితలాటకం వల్ల 36 విమానాలు రద్దయ్యాయి. ఏకంగా 201 విమానాలు ఆలస్యంగా నడిచాయి! ఎట్టకేలకు కత్తెర దొరకడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విమాన రాకపోకలనూ పునరుద్ధరించారు. స్టోర్ నిర్వాహకుల నిర్వాకమే ఇందుకు కారణమని ఎయిర్‌పోర్టు నిర్వాహకులు తేల్చారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని చెప్పుకొచ్చారు. అన్నట్టూ, ఈ విమానాశ్రయంలో గత 30 ఏళ్లలో ఒక్కటంటే ఒక్క బ్యాగేజీ కూడా పోలేదట!

రాక్ బ్యాండ్ ప్రదర్శన రద్దు

కత్తెర కలకలం జపనీస్ రాక్ బ్యాండ్ '9ఎంఎం పారాబెలం బులెట్' ప్రదర్శనకు ఎసరు పెట్టింది. విమానాశ్రయం మూసివేత వల్ల వారి విమానం రద్దయింది. దాంతో హొక్కైడో వార్షిక రైజింగ్‌సన్ మ్యూజిక్ ఫెస్టివల్‌లో వారు ప్రదర్శన ఇవ్వలేకపోయారు. మరీ ఇలాంటి కారణంతో విమానం రద్దవుతుందని కల్లో కూడా అనుకోలేదంటూ బాధిత ప్రయాణికులు కూడా నిట్టూర్పులు విడుస్తున్నారు. 'ఎవరిదో కత్తెర పోతే నా ఫ్లైట్ రద్దయినందుకు ఏడుపొస్తోంది' అని ఓ ప్రయాణికుడు వాపోయాడు. అయితే, కత్తెర మిస్సవడాన్నే ఎయిర్‌పోర్టు ఇంత సీరియస్‌గా తీసుకోవడాన్ని అభినందించిన వాళ్లూ ఉన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సీరియల్ కిల్లర్ పరారీ

- లాకప్ నుంచి పరారవడంతో కలకలం

నైరోబీ: కెన్యాలో ఏకంగా 42 మంది మహిళలను పాశవికంగా హతమార్చిన కొలిన్స్ జుమైసీ ఖలూషా అనే సీరియల్ కిల్లర్ పోలీస్‌స్టేషన్ నుంచి తప్పించుకున్నాడు. అక్రమంగా దేశంలో ఉన్నందుకు అరెస్టయిన 12 మంది ఎరిత్రియా దేశ ఖైదీలతో కలిసి అతను తప్పించుకున్నట్టు డైరెక్టరేట్ ఆఫ్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్స్ హెడ్ మొహమ్మద్ అమీన్ తెలిపారు. వాళ్లంతా మంగళవారం తెల్లవారుజామున సెల్‌లోని వైర్ మెష్‌ను కట్ చేసి ప్రహరీ గోడ దూకి ఎంచక్కా పరారయ్యారట. ఉదయం ఆ సెల్‌లోకి అల్పాహారం తీసుకెళ్లగా ఖాళీగా కన్పించింది. దాంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ముక్కలు చేసి..

33 ఏళ్ల ఖలూషా తన భార్యను చంపి ముక్కలు చేసి డంపింగ్ యార్డ్‌లో పడేశాడు. తర్వాత మహిళలను వల్లో వేసుకుని కడతేర్చడం అలవాటుగా మార్చుకున్నాడు. అలా ఏకంగా 42 మందిని పొట్టన పెట్టుకున్నాడు. వాళ్ల శవాలనూ డంపింగ్ యార్డుల్లోనే పడేసేవాడు. నైరోబీ మురికివాడలోని పాడుబడిన క్వారీలో ఓ డంప్ సైట్‌లో ప్లాస్టిక్ సంచుల్లో పది మృత దేహాలు దొరికాయి. ఛిద్రమై, కుళ్లిపోయిన స్థితిలో ఉన్నాయి. హత్యకు గురైన మహిళ సెల్ ఫోన్ పోలీసులకు దొరకడంతో ఖలూషా బండారం బయటపడింది.



పోలండ్ మనసు గెలిచిన మహారాజు

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో వేలాదిమంది పోలండ్ ప్రజలకు ఆశ్రయం

- వారికోసం కొల్హాపూర్ సమీపంలో సకల సౌకర్యాలతో నగర నిర్మాణం
- 'గుడ్ మహారాజా' అంటూ నేటికీ స్మరించుకుంటున్న పోలండ్‌వాసులు
- వార్సాలో జామ్‌సాహెబ్ పేరిట స్మారకం, కూడలి

రాజు రాతి విగ్రహాల్లోనూ, సుకవులు ప్రజల నాల్కల మీదా జీవిస్తారన్నారు కవికోకిల గుర్రం జాషువా. కానీ కొందరు మనసున్న మారాజులు కూడా ప్రజల నాల్కలపై నిలిచిపోయారు. అలాంటి పాలకుల్లో ఏకంగా విదేశీయుల నాల్కలపైనే నిత్యం జీవిస్తున్న ధన్య జీవి ఒకరున్నారు. ఆయనే రెండో ప్రపంచయుద్ధ కాలంలో గుజరాత్‌లోని జామ్‌నగర్ సంస్థానాన్ని పాలించిన మహరాజా దిగ్విజయ్ సింగ్ జీ రంజిత్ సింగ్ జీ జడేజా. జామ్‌సాహెబ్‌గా ప్రఖ్యాతుడైన ఆయన్ను పోలండ్ దేశీయులు అభిమానంగా 'గుడ్ మహరాజా' అని పిలుచుకుంటారు. ఆయనకు గుర్తుగా రాజధాని వార్సాలో 'జామ్ సాహెబ్ ఆఫ్ నవానగర్' పేరిట ఓ స్మారకమే నిర్మించుకున్నారు. ఆ కూడలిని నేటికీ 'గుడ్ మహరాజా స్క్వేర్'గా పిలుచుకుంటున్నారు. పోలండ్ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ కూడా బుధవారం రాత్రి విమానాశ్రయం నుంచి నేరుగా ఆ స్క్వేర్‌కే వెళ్లారు. జామ్ సాహెబ్ స్మారకం వద్ద పుష్పగుచ్ఛముంచి ఘనంగా నివాళులర్పించారు. ఎక్కడి జామ్‌నగర్, ఎక్కడి పోలండ్? వాళ్లకూ, ఆయనకూ ఏం సంబంధం? ఇది తెలియాలంటే రెండో ప్రపంచయుద్ధ కాలానికి వెళ్లాల్సిందే...

– సాక్షి, నేషనల్ డెస్క్

జామ్‌సాహెబ్ 1933లో తన మేనమామ అయిన ప్రఖ్యాత క్రికెటర్ కేఎస్ రంజిత్‌సింగ్ అనంతరం నవానగర్ (నేటి జామ్‌నగర్) మహరాజాగా నియమితులయ్యారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో పోలండ్‌ను ఇటు సోవియట్, అటు జర్మనీ ఆక్రమించుకున్నాయి. దాంతో 1943లో పోలండ్ వాసులు భారీ సంఖ్యలో దేశం వీడారు. వారికి ఆశ్రయం కల్పించాల్సిన బాధ్యత నాటి బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌పై పడింది. ఆయన సూచన మేరకు మహిళలు, పిల్లలు, వృద్ధులతో కూడిన 6,000 మందికి పైగా పోలిష్ శరణార్థులకు ఆశ్రయమిచ్చేందుకు జామ్‌సాహెబ్ ముందుకొచ్చారు. వారికి అనువైన వాతావరణముండే ప్రాంతం కోసం సంస్థానమంతా జల్లెడ పట్టారు. చివరికి ముంబైకి దక్షిణంగా 500 కిలోమీటర్ల దూరంలో కొల్హాపూర్ సమీపంలోని వలివాడేను ఎంపిక చేశారు. అక్కడ పోలిష్ శరణార్థి శిబిరం ఏర్పాటు చేశారు. వారికి సకల సౌకర్యాలూ కల్పించి కన్నబిడ్డల్లా చూసుకున్నారు.

ముమ్మూర్తులా పోలండ్‌ను పోలేలా...

5,000 మందికి పైగా అన్నివిధాలైన సదుపాయాలతో చక్కని వసతి కల్పించేలా వలివాడేను పూర్తి స్థాయి పోలిష్ ఆవాసంగా జామ్‌సాహెబ్ అభివృద్ధి చేశారు. ఆ సెటిల్మెంట్‌ను ఐదు బ్లాకులుగా తీర్చిదిద్దారు. చర్చి, కమ్యూనిటీ సెంటర్, పాఠశాలలు, ఒక కాలేజీ, పోస్టాఫీసు, థియేటర్ వంటి సౌకర్యాలన్నీ కల్పించారు. ఒక్కో కుటుంబానికో బంగ్లాను కట్టించారు. వాటిలో అన్ని మౌలిక సదుపాయాలతో పాటు చుట్టూ పచ్చని చెట్లతో తీర్చిదిద్దారు. అలా మహారాష్ట్రలో ఓ చిన్నపాటి పోలిష్ పట్టణాన్నే సృష్టించారు. వలివాడే నిత్యం పోలిష్ సాంస్కృతిక, సామాజిక కార్యకలాపాలతో కళకళలాడేది. స్కౌట్స్, క్రీడలు, మతపరమైన వేడుకలు, నాటక ప్రదర్శనలతో ఆకట్టుకునేది. యుద్ధం ముగిశాక 1948 కల్లా పోలిష్ శరణార్థులంతా వలివాడేను ఖాళీ చేశారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో స్థిరపడ్డారు. అయినా నాటి స్మారక చిహ్నాలతో వలివాడే ప్రాముఖ్యతను నేటికీ సంరక్షిస్తున్నారు. అక్కడే మరణించిన పోలిష్ పౌరులను ఖననం చేసిన కొల్హాపూర్లోని స్మశానాన్ని 2014లో పునరుద్ధరించారు.



మహారాష్ట్రలోని వలివాడేలో పోలండ్ శరణార్థులతో మహారాజా దిగ్విజయ్ రంజిత్ జడేజా (ఫైల్)

నేటికీ కొనసాగుతున్న బంధం...

ఒకప్పుడు వలివాడేలో నివసించిన పోలిష్ శరణార్థులు భారత్ తో బలమైన సంబంధాలను కొనసాగించారు. 1954 లో ప్రారంభమైన రీయూనియన్లు, సమావేశాలు అనంతర కాలంలో అధికారిక సమావేశాలుగా మారాయి. చరిత్రను పరిరక్షించడానికి 1990లో స్థాపించిన 'అసోసియేషన్ ఆఫ్ పోల్స్ ఇన్ ఇండియా 1942–1948' మాజీ శరణార్థులు, భారతీయుల మధ్య సంబంధాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది. వలివాడేలో ఉండి వెళ్లిన పోలండ్‌వాసుల వారసులు నేటికీ భారత్‌ను సందర్శిస్తుంటారు. తమ పూర్వీకులను, గతాన్ని గుర్తు చేసుకుంటుంటారు. జామ్‌సాహెబ్‌కు కృతజ్ఞతలు తెలుపుతుంటారు. 'గుడ్ మహరాజా' అంటూ ఆప్యాయంగా గుర్తు చేసుకుంటుంటారు.



వార్సాలోని మహారాజా స్క్వేర్

10, 12 పరీక్షలు తప్పిన 65 లక్షల మంది విద్యార్థులు

- రాష్ట్రాల విద్యాబోర్డుల్లో ఇదే అత్యధిక విఫల రేటు
- విద్యార్థుల ఫలితాల గణాంకాలను వెల్లడించిన కేంద్ర విద్యాశాఖ

న్యూఢిల్లీ: గత సంవత్సరం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పరిధిలో 10, 12 తరగతుల పరీక్ష రాసిన వారిలో ఏకంగా 65 లక్షలకుపైగా విద్యార్థులు ఫెయిల్ అయ్యారని కేంద్ర విద్యాశాఖ తన తాజా గణాంకాల్లో వెల్లడించింది. కేంద్ర బోర్డుల పరిధిలో పోలిస్తే రాష్ట్రాల బోర్డ్ ఎగ్జామ్స్‌లో ఎక్కువ మంది తప్పారని పేర్కొంది. దేశవ్యాప్తంగా రాష్ట్రాల్లోని 56 స్టేట్ బోర్డులు, మూడు కేంద్ర బోర్డులు, 59 స్కూల్ బోర్డుల 10, 12 పరీక్షలు రాసిన లక్షలాది విద్యార్థుల ఫలితాలను కేంద్రం క్రోడీకరించి బుధవారం వెల్లడించింది. గణాంకాల ప్రకారం .. ప్రైవేట్ స్కూళ్లు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల నుంచి బాలుర కంటే బాలికలు ఎక్కువ మంది 10, 12 తరగతి పరీక్షలకు హాజరయ్యారు. కుమారులను ప్రైవేట్‌లో చదివిస్తూ కుమార్తెలను ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో తల్లిదండ్రులు చేరుస్తున్నారని గణాంకాల్లో తేలింది. టెన్త్ క్లాస్ పరీక్షరాసిన విద్యార్థుల్లో 33.5 లక్షల మంది పై క్లాసుకు వెళ్లలేకపోయారు. 5.5 లక్షల మంది కనీసం పరీక్ష రాయలేదు. 28 లక్షల మంది ఫెయిల్ అయ్యారు. అదేవిధంగా 12వ తరగతి పరీక్షరాసిన విద్యార్థుల్లో 32.4 లక్షల మంది తదుపరి తరగతికి వెళ్లలేకపోయారు. 5.2 లక్షల మంది కనీసం పరీక్ష రాయలేదు. 27.2 లక్షల మంది ఫెయిల్ అయ్యారు. సెంట్రల్ బోర్డ్ ఎగ్జామ్ పరీక్షరాసిన టెన్త్ విద్యార్థుల్లో కేవలం 6 శాతం మంది ఫెయిల్ అయితే రాష్ట్రాల టెన్త్ బోర్డ్ ఎగ్జామ్స్ రాసిన వారిలో ఏకంగా 16 శాతం మంది విద్యార్థులు పరీక్ష తప్పారు. సెంట్రల్ బోర్డ్ ఎగ్జామ్ పరీక్షరాసిన 12వ తరగతి విద్యార్థుల్లో 12 శాతం మంది ఫెయిల్ అయితే రాష్ట్రాల 12వ తరగతి బోర్డ్ ఎగ్జామ్స్ రాసిన వారిలో 18 శాతం మంది విద్యార్థులు పరీక్ష తప్పారు. రాష్ట్రాలవారీగా చూస్తే టెన్త్ ఎక్కువ మంది ఫెయిల్ రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్ తొలిస్థానంలో, బిహార్, ఉత్తరప్రదేశ్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 12వ తరగతికి సంబంధించి ఉత్తరప్రదేశ్‌లో, ఆ తర్వాత మధ్యప్రదేశ్‌లో ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు.

ఇరాన్‌లో ఘోర ప్రమాదం

- 28 మంది పాకిస్తాన్ షియా యాత్రికుల దుర్మరణం

టెహ్రాన్: ఇరాన్‌లో ఘోర ప్రమాదం సంభవించింది. యాత్రికులతో వెళ్తున్న బస్సు బ్రేకులు ఫెయిలై అదుపు తప్పి బోల్తా పడింది. వెంటనే మంటల్లో చిక్కుకుంది. ఈ దుర్ఘటనలో 28 మంది యాత్రికులు మరణించారు. మరో 23 మంది గాయపడ్డారు. వీరిలో 14 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఇరాక్‌లో కర్బలా ప్రావిన్స్‌లో జరిగే మతపరమైన కార్యక్రమంలో పాల్గొనేందుకు పాకిస్తాన్‌లోని లార్కానా నుంచి 51 మంది షియా యాత్రికులు బస్సులో బయలుదేరారు. కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో మహ్మద్ ప్రవక్త మనవడు హుస్సేన్ చేసిన ప్రాణత్యాగాన్ని స్మరించుకోవడానికి వీరంతా ప్రయాణం కట్టారు. మంగళవారం అర్ధరాత్రి సెంట్రల్ ఇరాన్‌లో బస్సు ప్రమాదానికి గురైంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు 500 కిలోమీటర్ల దూరంలో టాఫ్ట్ సిటీ సమీపంలో బ్రేకులు ఫెయిలై బోల్తా పడడంతో బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగినట్లు స్థానిక అధికారి ఒకరు చెప్పారు. డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంతో బస్సు అదుపు తప్పిందని అన్నారు. బస్సు ప్రమాదంలో పాకిస్తాన్ పౌరులు మృతిచెందడం పట్ల పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు తగిన సాయం అందించాలంటూ తమ అధికారులను ఆదేశించామని చెప్పారు.

ఏప్రిల్‌కల్లా ఐఎస్ఎస్‌కు భారత వ్యోమగామి

న్యూఢిల్లీ: నాసా–ఇస్రో సంయుక్త ప్రాజెక్టులో భాగంగా భారత వ్యోమగామి వచ్చే ఏడాది ఏప్రిల్‌కల్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోకి పంపిస్తామని కేంద్ర శాస్త్ర, సాంకేతికత శాఖ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం ప్రకటించారు. ఆక్సియమ్ స్పేస్ ఏఎక్స్–4 మిషన్‌లో భాగంగా ఇప్పటికే గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా, గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్‌లు అమెరికాలో వ్యోమగామి శిక్షణ పొందుతున్న విషయం తెల్సిందే. ప్రధాన వ్యోమగామిగా కెప్టెన్ శుక్లాను, అనివార్య పరిస్థితుల్లో బ్యాకప్‌గా కెప్టెన్ బాలకృష్ణన్‌ను గతంలోనే ఎంపికచేయడం విదితమే. భారత్ ప్రయోగించిన విక్రమ్ ల్యాండర్ గత ఏడాది ఆగస్ట్ 23న చంద్రుడిపై విజయవంతంగా దిగినందుకు గుర్తుగా ఈ ఏడాది తొలిసారిగా నిర్వహించనున్న జాతీయ అంతరిక్ష దినోత్సవం కార్యక్రమ వివరాలను వెల్లడిస్తూ మంత్రి ఈ విషయం చెప్పారు. చంద్రయాన్–3 మిషన్ ద్వారా సేకరించిన డేటాను 23వ తేదీన బహిర్గతం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

నటిస్తున్నందుకు మంత్రి పోస్ట్ పీకేస్తే హ్యాపీ

- కేంద్ర మంత్రి సురేశ్ గోపి వ్యాఖ్య

కోచి: నటనా జీవితానికి తన తొలి ఓటు అని కేంద్ర మంత్రి, మళయాల నటుడు సురేశ్ గోపి పరోక్షంగా చెప్పారు. ''కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రిగా ఉంటూనే సినిమాల్లో చేస్తే ఒప్పుకోబోమని నన్ను గనక మంత్రి పదవి నుంచి పీకిపారేస్తే నా అంత అదృష్టవంతుడు ఇంకొకరు ఉండరు'అని బుధవారం ఆయన వ్యాఖ్యానించారు. 'ఒటకొంబన్ సినిమా షూటింగ్ ప్రారంభం నేపథ్యంలో నటించేందుకు అనుమతి కోసం కేంద్ర హోం మంత్రి అమిత్ షా దగ్గరకు వెళ్లా. ఎన్ని సినిమాల్లో నటించబోతున్నారు? అని ఆయన అడిగారు. దాదాపు 22 సినిమాల్లో అని చెప్పీ చెప్పగానే నా అభ్యర్థనను ఆయన పక్కన పెట్టారు. అయితే అనుమతి ఇస్తాంలే అని తర్వాత అమిత్‌షా హామీ ఇచ్చారు. ఏదేమైనా నేను మాత్రం సెప్టెంబర్ ఆరున షూటింగ్‌లో పాల్గొంటా''అని అన్నారు. బుధవారం కోచిలోని కేరళ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సురేశ్ మాట్లాడారు.

వైద్యుడి రూపంలోని రాక్షసుడు



- రహస్యంగా కెమెరాలు అమర్చి మహిళలు, చిన్నారుల నగ్న వీడియోలు, ఫొటోలు రికార్డు
- మహిళలకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం
- అమెరికాలో భారతీయ డాక్టర్ ఒమెయిర్ ఎజాజ్ అరెస్టు

వాషింగ్టన్: చికిత్స కోసం వచ్చే రోగుల పట్ల అభిమానం, వాత్సల్యం ప్రదర్శిస్తూ సాంత్వన చేకూర్చాల్సిన వైద్యుడు రాక్షసంగా ప్రవర్తించాడు. తాను పనిచేసే ఆసుపత్రిలో రహస్యంగా కెమెరాలు అమర్చి మహిళలు, చిన్నారుల నగ్న వీడియోలు, ఫొటోలు చిత్రీకరించాడు. కొందరు మహిళలకు మత్తుమందు ఇచ్చి అపస్మారక స్థితికి చేరుకున్నాక అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ దృశ్యాలను సైతం రికార్డు చేసి, తన కంప్యూటర్‌లో భద్రపర్చాడు. ఆఖరికి సొంత ఇంట్లో కూడా కెమెరా అమర్చి వీడియోలు చిత్రీకరించాడంటే అతడెంత ఉన్మాదో అర్థం చేసుకోవచ్చు. చివరికి పాపం పండడంతో కట్టుకున్న భార్యే అతడి బాగోతాన్ని పోలీసులకు తెలియజేసింది. పోలీసులు రంగంలోకి దిగి ఆ దుర్మార్గుడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. అతడొక భారతీయ వైద్యుడు కావడం గమనార్హం. భారతీయుడైన ఒమెయిర్ ఎజాజ్(40) స్వదేశంలో వైద్య విద్య పూర్తి చేసిన తర్వాత 2011లో వర్క్ వీసాపై అమెరికా చేరుకున్నాడు. తొలుత అలబామాలో నివసించాడు. 2018లో మిషిగాన్‌కు మకాం మార్చాడు. మొదట రెండు ఆసుపత్రుల్లో డాక్టర్‌గా పనిచేశాడు. తర్వాత ఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని వేర్వేరు ఆసుపత్రుల్లో కాంట్రాక్ట్ డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. డాక్టర్‌గా విధుల్లో చేరినప్పటి నుంచే తనలోని మరో కోణం బయటపడకుండా జాగ్రత్తపడ్డాడు. బాత్‌రూమ్‌లు, బట్టలు మార్చుకొనే గదులు, హాస్పిటల్‌లో మహిళా రోగులు ఉండే గదుల్లో రహస్యంగా కెమెరాలు అమర్చేవాడు. కెమెరాల్లోని దృశ్యాలను రికార్డు చేసి, ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో భద్రపర్చేవాడు. మహిళలు, చిన్నారులే అతడి టార్గెట్. రెండేళ్ల పసిపాప వీడియోలు సైతం రికార్డు చేశాడు. అలాగే తనవద్దకు చికిత్స కోసం వచ్చే మహిళలపై అత్యాచారానికి పాల్పడేవాడు. ఈ వ్యవహారమంతా చాలా ఏళ్లపాటు కొనసాగింది. ఇంట్లో కూడా రహస్యంగా కెమెరా ఏర్పాటు చేసినట్లు ఒమెయిర్ ఎజాజ్ భార్య కొన్ని రోజుల క్రితమే గుర్తించింది. అందులో రికార్డయిన దృశ్యాలను చూసి నిర్ఘాంతపోయింది. తన భర్త నిర్వాకంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాక్ష్యాధారాలు కూడా అందజేసింది. దీంతో ఈ నెల 8వ తేదీన ఒమెయిర్ ఎజాజ్‌ను ఓక్‌లాండ్ కౌంటీ పోలీసులు అతడి ఇంట్లోనే అదుపులోకి తీసుకున్నారు. ఆ ఇంట్లో సోదా చేయగా పెద్ద సంఖ్యలో ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ డిస్కులు లభ్యమయ్యాయి. వాటిలో అభ్యంతరకరమైన వీడియోలు, ఫొటోలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక హార్డ్ డిస్క్‌లో 13 వేల వీడియోలు ఉన్నట్లు పోలీసులు చెప్పారు.

నేడు వక్ఫ్ జేపీసీ తొలి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ) గురువారం తొలిసారి సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం పార్లమెంటరీ, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు నేతృత్వంలో పార్లమెంటులో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా.. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు తీసుకురావడానికి గల కారణాలు, తదితర అంశాలను జేపీసీకి రిజిజు వివరించారు.

మాస్కోపై డ్రోన్ల దాడి

మాస్కో: రష్యా రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ అతిపెద్ద డ్రోన్ల దాడికి దిగింది. 2022లో యుద్ధం ప్రారంభమయ్యాక ఈ స్థాయిలో డ్రోన్ల దాడి చేయడం ఇదే తొలిసారి. రాత్రివేళ మాస్కో దిశగా వస్తున్న 45 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేశామని రష్యా బుధవారం ప్రకటించింది. మాస్కో ప్రాంతంలో 11, బ్రియాన్స్క్ ప్రాంతంలో 23, బెల్గొరోడ్ ప్రాంతంలో ఆరు, కలూగా ప్రాంతంలో మూడు, కర్స్క్ రీజియన్‌లో రెండు డ్రోన్లను కూల్చేశామని తెలిపింది. 'డ్రోన్లను ఉపయోగించి మాస్కోపై జరిగిన అతిపెద్ద దాడి ఇది. రాజధాని చుట్టూ మొహరించిన పటిష్ట రక్షణవ్యవస్థల కారణంగా డ్రోన్లు లక్ష్యాలను చేధించకముందే వాటిని ధ్వంసం చేయగలిగాం'అని మాస్కో మేయర్ సెర్గీ సొబ్యానిన్ టెలిగ్రామ్‌తో పేర్కొన్నారు. డ్రోన్లను కూల్చివేస్తున్న దృశ్యాలను రష్యాలో పలు సోషల్ మీడియా చానళ్లు ప్రసారం చేశాయి. రష్యా ఆక్రమణను అడ్డుకోవడానికి, పోరాటశక్తిని దెబ్బతీసేందుకు ఉక్రెయిన్ శత్రుదేశం చమురు శుద్ధికర్మాగారాలను, విమానాశ్రయాలను, మాస్కోను లక్ష్యంగా చేసుకొని డ్రోన్ దాడులకు దిగుతోంది.

ఇంటర్నెట్ సేవలు బంద్

బద్లాపూర్‌లో ఉద్రిక్తత కట్టడికి రంగంలోకి దిగిన పోలీసులు

థానె/ముంబై: మహారాష్ట్రలోని బద్లాపూర్‌లో అభం శుభం తెలియని నర్సరీ స్కూలు విద్యార్థులపై స్వీపర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో ఉద్రిక్తత, అల్లర్లను అదుపులోకి తెచ్చేందుకు థానె పోలీసులు ఇంటర్నెట్ సేవలను నిలిపేశారు. మంగళవారం బద్లాపూర్‌లో రైల్వేస్టేషన్ సహా పలు చోట్ల రాళ్లు రువ్విన ఘటనల్లో 72 మంది ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆందోళకారుల దాడిలో మొత్తంగా 25 మంది రాష్ట్ర, రైల్వే పోలీసులు గాయపడ్డారు. ఉద్రిక్తతలను చల్లార్చేందుకు పెద్దసంఖ్యలో బలగాలను బద్లాపూర్‌లో మొహరించామని, ప్రస్తుతం పరిస్థితి అదుపులోకొచ్చిందని పోలీసులు తెలిపారు. ఈనెల 17న స్వీపర్ చేసిన దురాగతం తాజాగా వెలుగుచూడటంతో వేల మంది నిరసనకారులు పట్టణంలో స్కూల్ ధ్వంసం, రైల్‌రోకో సహా బీభత్సం సృష్టించిన విషయం విదితమే. ఉద్రిక్తత నేపథ్యంలో బుధవారం బద్లాపూర్‌లో పాఠశాలలు తెరచుకోలేదు.

నా భద్రత తొలగించి ప్రజలకు రక్షణ కల్పించండి: సూలే

బారామతి పార్లమెంట్ సభ్యురాలిగా తనకు ప్రభుత్వం కల్పించిన పోలీసు భద్రతను తొలగించి ఆ పోలీసులను సామాన్య ప్రజల రక్షణ కోసం వినియోగించాలని ఎన్‌సీపీ (ఎస్పీ) నాయకురాలు సుప్రియా సూలే వ్యాఖ్యానించారు. ఈ మేరకు మహారాష్ట్ర హోం శాఖమంత్రికి సుప్రియా బుధవారం లేఖ రాశారు.

రాజకీయ ప్రేరేపితం: షిండే

ఆందోళనలను రాజకీయ ప్రేరేపిత చర్యగా సీఎం ఏక్‌నాథ్ షిండే అభివర్ణించారు. ''ఆందోళనల్లో పాల్గొన్న వారిలో స్థానికులను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. మెజారిటీ జనం బయటివాళ్లు. ఇవన్నీ రాజకీయ దురుద్దేశంతో చేపట్టిన నిరసనలు. ఆందోళనకారుల అన్ని డిమాండ్లను మంత్రి గిరిశ్ మహాజన్ ఒప్పుకున్నా నిరసనకారులు శాంతించట్లేరు. ప్రభుత్వం పరువు తీయాలని నిర్ణయించుకున్నారు''అని సీఎం అన్నారు.

కీచక టీచర్ అరెస్ట్

అకోలా: విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు సమాజం తలదించుకునేలా ప్రవర్తించిన ఘటన మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో వెలుగుచూసింది. వక్రబుద్ధి బయటపెట్టిన జిల్లా పరిషత్ స్కూల్ టీచర్ ప్రమోద్ సర్దార్(47)ను విధుల నుంచి తప్పించినట్లు జిల్లా పరిషత్ సీఈవో బి.వైష్ణవి బుధవారం తెలిపారు. గత నాలుగు నెలలుగా ఫోన్లో నగ్న వీడియోలు చూపిస్తూ టీచర్ తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరుగురు పాఠశాల విద్యార్థినులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి వాపోయారు. దీంతో వెల్ఫేర్ కమిటీ సభ్యులు మంగళవారం ఉదయం పాఠశాలకొచ్చి విద్యార్థుల వాంగ్మూలం తీసుకున్నారు. కేసు నమోదుచేసి పోలీసులు టీచర్‌ను అరెస్ట్‌చేశారు. భారతీయ న్యాయ సంహిత, పోక్సో చట్టాల సెక్షన్లు అతనిపై మోపామని ఉరాల్ పోలీస్‌స్టేషన్ అధికారి చెప్పారు.

క్లుప్తంగా...

మెడికల్ కౌన్సిల్‌లో పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయండి

పేరెంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం విదేశాల్లో ఎంబీబీఎస్ చదివి.. ఏపీలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన జూనియర్ డాక్టర్లకు ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయాలని 'ది పేరెంట్స్ అసోసియేషన్' బుధవారం ఒక ప్రకటనలో కోరింది. 'విదేశాల్లో ఎంబీబీఎస్ చదివి.. ఎన్ఎంసీ పరీక్షలో అర్హత సాధించడంతో పాటు ఏపీలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన జూనియర్ డాక్టర్లకు న్యాయం చేయాలి. కరోనా సమయంలో ఆన్‌లైన్‌లో తరగతులకు హాజరైన వారికి మాత్రమే రెండేళ్లపాటు ఇంటర్న్‌షిప్ నిబంధన ఉందని జూన్ 9న ఎన్ఎంసీ స్పష్టం చేసింది. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రెండు నెలల నుంచి మెడికల్ కౌన్సిల్ పర్మినెంట్ రిజిస్ట్రేషన్ చేయడం లేదు. నీట్ పీజీ రాసిన తమ పిల్లల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది' అని వాపోయింది.

సీమ అభివృద్ధిపై దృష్టిపెట్టకపోవడం దుర్మార్గం

కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డి



తిరుపతి కల్చరల్: సీఎం చంద్రబాబు అమరావతిపై చూపే శ్రద్ధలో కనీసం 10శాతం రాయలసీమపై చూపకపోవడం దుర్మార్గమని కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమ అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ మీటర్లు అమర్చడానికి తెచ్చిన జీవో 22ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌ను సందర్శించిన మంత్రి కొల్లు

ఉక్కునగరం: రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆయన స్టీల్‌ప్లాంట్‌కు చేరుకున్నారు. అక్కడ స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లతో సమావేశమయ్యారు. ప్లాంట్ సమస్యలు, ప్రస్తుత పరిస్థితిని ప్రజాప్రతినిధులకు సీఎండీ వివరించారు. మంత్రి ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్‌ను సందర్శించగా అధికారులు వారికి ప్లాంట్ గురించి వివరించారు. బ్లాస్ట్‌ఫర్నేస్-3ను మంత్రి సందర్శించి, ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడారు.

ప్రాణాలు తీసిన పాతకాలం రియాక్టర్!

తరచూ ప్రమాదాలకు కారణం పాత రియాక్టర్లే

- అధిక పీడనం లేదా ఉష్ణోగ్రతలు పెరిగితే పేలుళ్లు
- రసాయనాల మిశ్రమాల కొలతల్లో తేడాలు ఉన్నా ఇంతే
- నాణ్యత లోపించడం వల్లే ప్రమాదాలు
- ప్రతి 6 నెలలకోసారి రియాక్టర్లను తనిఖీలు చెయ్యాల్సిందే
- కనీసం పట్టించుకోని ఫార్మా కంపెనీలు
- ఒక్కో రియాక్టర్‌లో వేల లీటర్ల రసాయనాలు
- అత్యాధునిక రియాక్టర్లయితే పేలుడును నియంత్రించే వ్యవస్థ



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమలే ఉసురు తీస్తున్నాయి. ఫార్మా కంపెనీల్లోని రియాక్టర్లే ప్రాణాలు గాల్లో కలిపేస్తున్నాయి. కార్మికుల భద్రతని గాలికొదిలేస్తూ.. భద్రతా ప్రమాణాల్ని పట్టించుకోకుండా.. కేవలం లాభాలు గడించేయాలన్న దురాలోచనతో పరిశ్రమలు వేస్తున్న తప్పటడుగులతో కార్మికుల ప్రాణాలు గాల్లో దీపాలుగా మారిపోతున్నాయి. ఫార్మా కంపెనీల్లోని రియాక్టర్లలో నాణ్యత లోపించడం వల్లే ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది. రియాక్టర్ల తనిఖీలు పట్టించుకోవడం లేదు.. వీటిని పర్యవేక్షించాల్సిన ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారో లేదో కూడా తెలియని పరిస్థితి. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కంపెనీలో పేలుడుకు అది పాతకాలం రియాక్టర్ కావడమేనని ఫార్మా రంగ నిపుణులు చెబుతున్నారు. మన రాష్ట్రంలో తరచూ ప్రమాదాలకు పాత రియాక్టర్లే కారణమవుతున్నాయని అంటున్నారు. ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లే అత్యంత కీలకం. వీటిలోనే రసాయనాలను మిశ్రమం చేస్తారు. ఈ కొలతల్లో తేడా వచ్చినా పీడనం, ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గులు సంభవించినా ఈ రియాక్టర్లు ఒక్కసారిగా పేలిపోతాయి. ఇప్పుడు ఎసెన్షియా ఫార్మా కంపెనీలో కూడా రియాక్టర్ పేలడానికి ఎక్సోథర్మల్ రియాక్షనే కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. ఒకసారి రసాయనాల మిశ్రమంలో తేడా వస్తే దాని ఉధృతిని ఆపే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. రసాయన మిశ్రమాల పరిమాణంపై దీని నష్ట తీవ్రత ఆధారపడి ఉంటుందంటున్నారు.

ఇప్పటికీ చాలా కంపెనీల్లో పాత రియాక్టర్లే..

విదేశాల్లో పోలిస్తే మన దేశ ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లు తరచూ పేలడానికి సరైన నిబంధనలు, పర్యవేక్షణ లేకపోవడమే ప్రధాన కారణమని పేర్కొంటున్నారు. చాలా కంపెనీలు ఇప్పటికీ అత్యాధునిక రియాక్టర్లను కాకుండా పాత కాలం నాటి రియాక్టర్లనే వాడుతున్నాయని.. ఇవే ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణమని విశ్లేషిస్తున్నారు. అత్యాధునిక రియాక్టర్లలో ఎక్సో థర్మల్ రియాక్షన్ మొదలైతే దానికదే నీటిని వెదజిమ్ముకోవడం లేదా ఉష్ణోగతలను తగ్గించుకోవడం, తీవ్రతను బట్టి దానికదే ఆగిపోవడం జరుగుతుందంటున్నారు. కానీ మన రాష్ట్రంలో కొత్త రియాక్టర్లు ఖరీదైనవి కావడంతో పాతకాలం రియాక్టర్లనే కంపెనీలు కొనసాగిస్తున్నాయి. పాత రియాక్టర్ల స్థానే కొత్త రియాక్టర్లను బిగించుకునేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచిస్తున్నారు. అప్పుడే ఇలాంటి ప్రమాదాలను అరికట్టగలమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఎసెన్షియా ఫార్మాలో పేలుడు జరగడానికి గల కారణాలు ఇంకా తెలియలేదని, విచారణలో ప్రమాద కారణాలు తెలియాల్సి ఉందంటున్నారు.

అనుక్షణం అప్రమత్తత..

అచ్యుతాపురం సెజ్‌లో దాదాపు 208 ఫార్మా కంపెనీలు దాదాపు పక్కపక్కనే ఉన్నాయి. ప్రతి ఫార్మా పరిశ్రమలోనూ సామర్థ్యాన్ని బట్టి 2 నుంచి 108 పైగా రియాక్టర్లు ఉంటాయి. ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లలో హై టెంపరేచర్‌లో ద్రావకాలను మరిగించాల్సి ఉంటుంది. రియాక్టర్‌కు 140 డిగ్రీల సెల్సియస్ నుంచి 180 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను మాత్రమే తట్టుకునే సామర్థ్యం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రియాక్టర్‌పై ఒత్తిడి పెంచే సమయంలో సంబంధిత నిపుణులు, కార్మికులు దానిని నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించినా.. రియాక్టర్లు వేడిని తట్టుకోలేక పేలిపోతుంటాయి. రియాక్టర్ టీమ్‌లో ఉండేవారు దానిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. 140 డిగ్రీల నుంచి 180 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రత పెరుగుతున్న సమయంలో వెంటనే దానిని చల్లబర్చాల్సి ఉంటుంది. రియాక్టర్‌లో రసాయనాల్ని బాయిల్ చేయడం ఆపివేయాల్సి ఉంటుంది.

ఒత్తిడి తగ్గించే రప్చర్ డిస్క్, సేఫ్టీ వాల్వ్

రియాక్టర్ ప్రెజర్ కుక్కర్ మాదిరిగా పనిచేస్తుంటుంది. కుక్కర్‌లో ఎలా అయితే ఒత్తిడి పెరిగితే విజిల్ రూపంలో దాన్ని బయటికి పంపిస్తుంటుందో.. ప్రతి రియాక్టర్‌కు రప్చర్ డిస్క్, సేఫ్టీ వాల్వ్ ఉంటాయి. రియాక్టర్లో అధిక ఉష్ణోగ్రత కారణంగా ఒత్తిడి ఎక్కువైనట్లు అనిపిస్తే.. రప్చర్ డిస్క్ ఓపెన్ అయి.. ప్రెజర్‌ని రిలీజ్ చేస్తుంటుంది. అది పనిచేయకపోతే సేఫ్టీ వాల్వ్ వెంటనే ఓపెన్ అయి.. ప్రెజర్‌ని బయటకు పంపించేస్తుంటుంది. ఈ రెండూ సక్రమంగా పనిచేస్తే ఏ రియాక్టర్ కూడా పేలే అవకాశం ఉండదు.

ఎసెన్షియాలో ఏం జరిగి ఉంటుంది?

ఎసెన్షియాలో రియాక్టర్ నాణ్యమైనది కాకపోవడం వల్ల పేలిందా లేక రియాక్టర్‌లో ఒత్తిడి కారణంగా అనేది తెలియాల్సి ఉంది. రియాక్టర్‌లో రసాయనాలను మిశ్రమం చేస్తున్నప్పుడు ఉష్ణోగ్రత పెరుగుతుంటుంది. ఈ సమయంలో ఉష్ణోగ్రతని బయట నుంచి పరిశీలించేందుకు టెంపరేచర్ గేజ్ ఉంటుంది. రియాక్టర్ తట్టుకునే ఉష్ణోగ్రతని దాటుతుందా లేదా అనేది ఇక్కడ పరిశీలిస్తుంటారు. అప్పుడు అక్కడ ఉన్న సిబ్బంది దీన్ని పరిశీలించలేదా? లేదా ఆ సమయంలో ప్రెజర్ పెరిగితే రప్చర్ డిస్క్ ఓపెన్ అవ్వలేదా? పోనీ అది విఫలమయితే.. వెంటనే సేఫ్టీ వాల్ ఓపెన్ అవ్వాలి. ఈ మూడు జరగకపోతేనే రియాక్టర్ పేలుతుంది. ఇక్కడ అదే జరిగి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

ఫార్మాలో నాలుగు రకాల రియాక్టర్లు

ఫార్మా రంగంలో ప్రధానంగా చిన్న స్థాయి ఉత్పత్తి కోసం బాచ్ రియాక్టర్లు, ఉత్పత్తి నాణ్యతను నిరంతరం నిలిపి ఉంచడం కోసం కంటిన్యూ స్టిర్డ్-ట్యాంక్ రియాక్టర్లు, పెద్ద స్థాయి ఉత్పత్తి కోసం ప్లగ్ ఫ్లో రియాక్టర్లు, అధిక పీడనం, ఉష్ణోగ్రత అవసరం ఉండే వాటి కోసం ఆటోక్లేవ్ రియాక్టర్లను ఉపయోగిస్తారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ రసాయనాలను మిశ్రమం చేస్తున్నప్పుడు ఉత్పత్తి అయ్యే ఉష్ణం, పీడనాన్ని నియంత్రించలేనప్పుడు, రియాక్టర్ల సరైన నిర్వహణ లేనప్పుడు, మానవ తప్పిదాలు ప్రమాదాలు జరగడానికి కారణమవుతున్నాయి. రియాక్టర్ల ప్రమాదాలను నియంత్రించాలంటే ఈ చర్యలను తప్పనిసరిగా పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

సంపూర్ణ డిజైన్- నిర్వహణ..

- రియాక్టర్లు, అవి ఉపయోగించే రసాయన ప్రతిక్రియలకు తగ్గట్టు డిజైన్ చేయాలి. అందుకు తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలి.
- పరికరాల్లోని యాంత్రిక సమస్యలను గుర్తించడానికి, పరిష్కరించడానికి నిరంతర పరిశీలన, తగిన నిర్వహణ అవసరం.

రసాయనాల నిల్వలో జాగ్రత్తలు

- ప్రమాదకర రసాయనాల నిల్వ, నిర్వహణకు కఠినమైన ప్రోటోకాల్స్ పాటించాలి.
- రసాయనాల లక్షణాలపై ఉద్యోగులకు సరైన శిక్షణ ఇవ్వడం లేదా అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చు.

ఆధునిక నిఘా నియంత్రణ వ్యవస్థలు

- ఉష్ణోగ్రత, పీడనం, ఇతర ముఖ్యమైన పారామితులను నిరంతరం ట్రాక్ చేసే ఆటోమేటెడ్ నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను ముందే గుర్తించవచ్చు.
- 'ఎమర్జెన్సీ స్టాప్' వ్యవస్థలు ఉండాలి. ఇవి ప్రమాదం సంభవించినప్పుడు ప్రతిక్రియలను సురక్షితంగా నిలిపివేయడానికి ఉపయోగపడతాయి.

నిరోధకాలు ఉపయోగించాలి..

- వేడిని గరిష్ట స్థాయి నుంచి తగ్గించే ఏర్పాట్లను వినియోగించుకోవడం అవసరం. ఉదాహరణకు కూలింగ్ జాకెట్లు లాంటివి వాడాలి.
- కెమికల్ రియాక్షన్ వేగాన్ని తగ్గించడానికి నిరోధకాలు ఉపయోగించాలి. రియాక్షన్ కైనెటిక్స్‌ను సవరించడం ద్వారా అధిక ఉష్ణం ఉత్పత్తి అయ్యే పరిస్థితులను నివారించవచ్చు.

ఉద్యోగ శిక్షణ, భద్రతా డ్రిల్లులు

- రియాక్టర్ల ఆపరేషన్, అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానాలపై క్రమం తప్పకుండా సిబ్బందికి శిక్షణ అవసరం. అందుకు తగిన విధంగా శిక్షణ కార్యక్రమాలు ఉండాలి.
- భద్రతా డ్రిల్లులు నిర్వహించడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగులు వేగంగా, సమర్థంగా స్పందించవచ్చు.

నెలకోసారి మెయింటెనెన్స్ డే నిర్వహించాలి



ఫార్మా పరిశ్రమల్లో డ్రగ్స్ తయారీ సమయంలో వివిధ రసాయన మిశ్రమాలను రియాక్టర్లలో కలుపుతారు. ఈ సమయంలో ఆర్గానిక్ సాల్వెంట్స్ బాయిలింగ్ టెంపరేచర్ వద్ద త్వరగా ఆవిరైపోతుంటాయి. అప్పుడు రియాక్టర్లలో ఒత్తిడి పెరుగుతుంది. వీటిని సరైన ఉష్ణోగ్రత వద్ద వేడి చేయాల్సి ఉంటుంది. ఉష్ణోగ్రత ఎక్కువైనా రియాక్టర్ పేలుతుంది. ఒక్కోసారి ప్రెజర్ మీటర్, సేఫ్టీ వాల్వ్ పనిచేయవు. ఆ సమయంలో సరిగా గమనించకపోతే రియాక్టర్ పేలిపోతుంది. అందుకే ప్రతి రోజూ సేఫ్టీ వాల్వ్ చెక్ చేస్తుండాలి. ఫార్మాలో పెద్ద పెద్ద రియాక్టర్లని స్థానికంగా స్టీల్ కొనుగోలు చేసి పరిశ్రమల్లోనే తయారు చేస్తుంటారు. ఈ సమయంలో జాయింట్స్‌ని వెల్డింగ్ చేస్తారు. రసాయన మిశ్రమాలు నిరంతరం జరుగుతున్నప్పుడు ఈ జాయింట్స్ వీక్ అవుతుంటాయి. ఒత్తిడి పెరిగినప్పుడు జాయింట్స్ సక్రమంగా లేకపోయినా పేలుడు జరుగుతుంది. అందుకే రియాక్టర్స్ జాయింట్స్‌ని కూడా ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. ప్రతి పరిశ్రమ నెలకోసారి మెయింటెనెన్స్ డే నిర్వహించి ఒకరోజు షట్‌డౌన్ చేయాలి. అప్పుడు ప్రతి విభాగాన్ని కచ్చితంగా తనిఖీ చేసుకోవాలి. అయితే పరిశ్రమలు ఇలా చేయడం లేదు. అందువల్లే ప్రమాదాలు తలెత్తుతున్నాయి.

– ప్రొ.జి.నాగేశ్వరరావు,
ఏయూ ఫార్మాస్యూటికల్ ప్రొఫెసర్,
కోల్ ఇండియా డైరెక్టర్

ఇది శాడిస్టు సర్కారు

మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఫైర్

- చంద్రబాబు పాలనలో ఉన్నతాధికారులతో సహా ప్రభుత్వ ఉద్యోగులపై వేధింపులు
- వారు స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం కల్పించింది జగన్ ప్రభుత్వమే
- అధికారంలోకి రాకముందు ఉద్యోగులపై బాబు కపటప్రేమ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం పాలిస్తున్నట్లు కన్పించడంలేదని.. ప్రతి అంశంలోనూ కక్ష సాధింపు కనిపిస్తోందని.. చంద్రబాబు సర్కారు శాడిస్టు ప్రభుత్వంలా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. తనకున్న మీడియా బలాన్ని వాడుకుని ప్రత్యర్థి పార్టీలను, ఆ పార్టీల్లోని వ్యక్తుల వ్యక్తిత్వాలను హననం చేయడం.. తాను చేస్తున్న ప్రచారాలకు బలం చేకూర్చేలా, అది ప్రజలు నిజమని నమ్మేలా ఉండేందుకు ఉన్నతాధికారులు సహా, ఉద్యోగుల్లో ఎలాంటి వారినైనా చంద్రబాబు బలి చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మట్లాడుతూ.. ఇటీవల నెల్లూరులో సమాచార శాఖ ఉద్యోగిపై చంద్రబాబు శివాలెత్తారని.. శ్వేతపత్రాలు జారీచేస్తున్న సందర్భంలోనూ ఇలాగే అధికారులపై చిర్రుబుర్రులాడారని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వోద్యోగులపై కపటప్రేమ చూపిన ఆయన ఇప్పుడు మళ్లీ తన నిజ స్వరూపం చూపిస్తున్నారని విమర్శించారు. ఇదంతా చంద్రబాబు ఆడుతున్న పబ్లిసిటీ డ్రామా అన్నారు. గడికోట ఇంకా ఏమన్నారంటే.. ఈమధ్య చంద్రబాబు తరచూ తనలో 95 నాటి సీఎంను చూస్తారంటున్నారు. ఆ రోజుల్లో చంద్రబాబు తన మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటుపొడిచి కుర్చీలాక్కున్నాడు. ఆకస్మిక తనిఖీలు, అధికారులకు బెదిరింపులు, అందరిముందూ వారిని అవమాన పరచడం.. ఒక హైడ్రామా క్రియేట్ చేశారు. ప్రస్తుతం చంద్రబాబు పాలనలో ఉన్నతాధికారుల నుంచి దిగువ స్థాయి ఉద్యోగుల వరకూ గౌరవం లేకుండాపోయింది. అందరి మీదా వేధింపులు కొనసాగుతున్నాయి.

మేం ఎవరిపైనా పక్షపాతం చూపించలేదు..

అదే 2014–19 మధ్య చంద్రబాబు సీఎంగా పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్‌లకు మా ప్రభుత్వంలో కూడా మంచి పోస్టింగ్ ఇచ్చాం. ఎవరిపైనా పక్షపాతంతో వ్యవహరించలేదు. ఏదైనా ఉంటే.. చట్ట ప్రకారం చేసుకోండి. ఇబ్బందిలేదు. కానీ, ఎలాంటి ఆధారాల్లేకుండా, మీ పత్రికల్లో రాయించుకుని, అవే నిజాలుగా చూపించి మీరు చర్యలు తీసుకుంటున్నారు. ఇది సరైంది కాదు. ఈ మధ్య రోజూ పత్రికల్లో గనుల రెడ్డి, మైన్ల రెడ్డి, ఇసుక రెడ్డి అంటూ రాస్తునారు. ఒక ప్రాంత వాసులను, ఒక సామాజికవర్గాన్ని టార్గెట్ చేసి రాయడం సబబా? చంద్రబాబూ.. ఇకనైనా మీ పద్ధతులు మార్చుకోండి. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రజలకు మంచి చేయడంపై దృష్టిపెట్టండి. ప్రజలకు, అధికారులకు విలువ ఇచ్చి ముందుకుసాగండి.

వెలిగొండకు పునాది వేసింది వైఎస్సార్.. పూర్తి చేసింది జగన్

- ఆ ప్రాజెక్టు పూర్తిచేసినట్లు టీడీపీ చెప్పుకోవడం దిగజారుడుతనమే
- ఈవీఎంలపై అనుమానాలు నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీదే
- ఎంపీ వైవీ సుబ్బారెడ్డి వెల్లడి


మీడియాతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

ఒంగోలు: వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు పునాది వేసింది వైఎస్సార్ అయితే దానిని పూర్తి చేసింది ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. ఇక్కడి తన నివాసంలో మంగళవారం తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు వెలిగొండ ప్రాజెక్టుకు ఎంత ఖర్చుపెట్టింది, ఆ తర్వాత తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎంత ఖర్చుపెట్టింది, ఎన్ని కిలోమీటర్లు సొరంగాలు తవ్వింది ప్రజలందరికీ తెలుసన్నారు. చిత్తశుద్ధితో పనిచేశాం కాబట్టే రెండు సొరంగాలతో పాటు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం కూడా పూర్తిచేసి జాతికి అంకితం చేసినట్లు చెప్పారు. ఇప్పుడు టీడీపీ నాయకులు ఆ ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పుకోవడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు.

ఈవీఎంలపై అనుమానాలు..

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం)పై అనేక అనుమానాలు తలెత్తాయన్నారు. ఈవీఎంలు హ్యాక్ చేయవచ్చనే వాదనలు ఉన్న నేపథ్యంలో ఎవరికైనా వాటిపై అభ్యంతరాలు వ్యక్తం చేసే హక్కు ఉంటుందన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం ఎన్నికల కమిషన్‌కు డిపాజిట్ చేసి మరీ సవాల్ చేసినట్లు చెప్పారు. ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌కు ఉందన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలు అలా లేవంటూ ఎన్నికల కమిషన్ చెబుతోందని ఈ నేపథ్యంలో న్యాయస్థానం దీనిపై స్పష్టత ఇస్తుందని భావిస్తున్నామన్నారు. ఈవీఎంలలో ఏవైనా మతలబు ఉంటే తాము కూడా నిగ్గుతేల్చాలని కోరతామని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.


ఉద్యమంలోనూ వృత్తి ధర్మం!



ఓ వైపు న్యాయం కోసం ఉద్యమిస్తూనే.. మరో వైపు వృత్తి ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నారు జూనియర్ వైద్యులు. కోల్‌కతాలో ఇటీవల మహిళా డాక్టర్‌పై జరిగిన దారుణ హత్యాచారానికి నిరసనగా తిరుపతి నగరంలోని సిమ్స్ ఆస్పత్రి వద్ద జూనియర్ డాక్టర్లు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. అయితే ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందుల్లేకుండా ఆస్పత్రి ప్రాంగణంలోని ఓ చెట్టు కింద కూర్చొని ఓపీ వైద్య సేవలందిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

పచ్చని పందిరి



రహదారికి ఇరువైపులా భారీ వృక్షాలు గొడుగుపడితే.. ఆ దారిలో రయ్యిరయ్యిన సాగిపోతే ఆ హాయే వేరు.. సుందర నగరం విశాఖలో రైల్వే న్యూకాలనీ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో పచ్చదనం ఇలా పందిరి వేసింది. వేసవిని తలపిస్తున్న ఎండల్లో ప్రజలు హాయిగా ఈ రహదారిలో సాగిపోతున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం


ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం సందర్భంగా బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన బొత్స సత్యనారాయణ, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి ప్లస్
గురువారం । 22-8-2024

క్లుప్తంగా...

దుర్గమ్మకు రూ.3.25 లక్షల విరాళం

అన్నదానం, బంగారు తాపడం పనులకు చెక్ అందజేత



దాతలకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఏఈవో చంద్రశేఖర్

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఖమ్మం జిల్లాకు చెందిన కుటుంబం బుధవారం రూ.3.25 లక్షల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఖమ్మం జిల్లా, మామిళ్ల గూడేనికి చెందిన జి.కోటేశ్వరరావు, నిర్మల కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చింది. దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు రూ.1.75 లక్షలు, నిత్యాన్నదానానికి రూ.1.50 లక్షల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం వారికి అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను ఏఈవో చంద్రశేఖర్ అందజేశారు.

ఆ పేర్లను తొలగించడం సమంజసమే

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు (దర్గామిట్ట): నెల్లూరు, సంగం బ్యారేజ్‌లకు గత ప్రభుత్వం పెట్టిన పేర్లను తొలగించడం సమంజసమే రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రైతాంగ ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. బుధవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమశిల జలాశయాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించి, పనులకు నిధులు మంజూరు చేయడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జలాశయాలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఈ సెప్టెంబర్‌లోగా సోమశిల ప్రాజెక్టు ఆప్రాన్ రక్షణకు 25 వేల నుంచి 30 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వేయాలని అధికారులను సీఎం ఆదేశించారన్నారు. 2025 మార్చిలోగా 37 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. క్రస్ట్‌గేట్లతో పాటు గ్రీజు పెట్టేందుకు, ఇతర మరమ్మతులకు రూ.2.42 కోట్లను విడుదల చేస్తామని చెప్పారు.

బంద్‌కు సహకరించమన్నందుకు కత్తితో దాడి

టి.నరసాపురం: బంద్‌కు సహకరించాలని కోరిన దళిత యువకుడిపై ఓ హోటల్ యజమాని కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన బుధవారం ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం బందంచర్లలో జరిగింది. ఎస్సీ వర్గీకరణకు నిరసనగా బుధవారం టి.నర్సాపురం మండలంలో దళిత సంఘాలు బంద్ నిర్వహించాయి. బందంచర్ల గ్రామంలో బంద్‌కు సహకరించాలని కోరుతూ దుకాణాలు, హోటళ్లను మూసివేయిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మారుమూడి పవన్.. జాలాది దివాకర్‌ను హోటల్ మూసివేసి బంద్‌కు సహకరించాలని కోరాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దివాకర్ ఆగ్రహంతో కత్తితో పవన్‌పై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన పవన్‌ను స్థానికులు చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దళిత సంఘాల నాయకులు చింతలపూడిలో ధర్నా చేశారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.



ఫ్యూచర్ థ్రెట్..

సైబర్ టెర్రరిజం

సైబర్ నేరగాళ్లు.. లక్షలు, కోట్లలో డబ్బులు వ్యక్తిగత ఖాతాల్లోంచి కొల్లగొట్టడమే కాదు.. సైబర్ టెర్రరిజానికి తెరతీస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న ఉగ్రవాద ముప్పు క్రమంగా కొత్త రూపు సంతరించుకుంటోంది.. ఇది భవిష్యత్తులో జడలువిప్పుకుని సైబర్ టెర్రరిజంగా మారి మానవాళికి ఫ్యూచర్ థ్రెట్‌గా మారబోతోందని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు సైబర్ టెర్రరిజం అంటే ఏంటి? దీంతో ప్రపంచ దేశాలకు వచ్చే ముప్పు ఏంటి? దీన్ని ఎలా ఎదుర్కోవాలి? అన్న విషయాలపై 'సాక్షి 'ప్రత్యేక కథనం.

రోజువారీ జీవితంలో సాంకేతికతపై ఆధారపడటం విపరీతంగా పెరిగిపోయింది. అదే సమయంలో సాంకేతికంగా అభివృద్ధి చెందిన తీవ్రవాదులు వారి ప్రయోజనాల కోసం ఇందులో ఉన్న లొసుగులను ఉపయోగించుకొనే అవకాశం కూడా పెరుగుతోంది. జనజీవనాన్ని స్తంభింపజేసి, వ్యవస్థలను గందరగోళపర్చి తమ గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు డిజిటల్ సాధనాలు, సాంకేతికతను ఉపయోగించడాన్ని సైబర్ టెర్రరిజంగా చెబుతున్నారు సైబర్ భద్రత నిపుణులు. తరచుగా హింసపై ఆధారపడే సంప్రదాయక ఉగ్రవాద రూపాల్లా కాకుండా సైబర్ ఉగ్రవాదులు తమ లక్ష్యాలను సాధించడానికి ఇంటర్నెట్‌ను ఉపయోగించుకుని వర్చువల్‌గా పనిచేస్తారు. సైబర్ దాడులతో ప్రభుత్వ, ప్రైవేట్ వ్యవస్థలను హ్యాక్ చేయడం, కీలకమైన మౌలిక సదుపాయాలకు తీవ్ర అంతరాయాన్ని కలిగించడం, సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేయడం, ప్రజల్లో విస్తృతమైన భయాందోళనలు సృష్టించడం సైబర్ ఉగ్రవాదుల ప్రధాన లక్ష్యాలు.

- సాక్షి, హైదరాబాద్



- సాధారణ సైబర్ నేరాలకు భిన్నంగా సైబర్ టెర్రరిజం
- జనజీవనాన్ని స్తంభింపచేస్తారు.. వ్యవస్థలను గందరగోళపరుస్తారు..
- కీలక మౌలిక సదుపాయాలకు తీవ్ర అంటకాలు సృష్టిస్తారు..
- సైబర్ టెర్రరిజం ముప్పు గుర్తించకపోతే అనర్థాలే

4 రకాలుగా హాని



- **సైద్ధాంతిక ఉగ్రవాదం:** సైబర్ ఉగ్రవాదులు తమ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి, అనుచరులను నియమించుకోవడానికి, ప్రత్యర్థులపై హింసను ప్రేరేపించడానికి సైబర్‌స్పేస్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకుంటున్నారు.
- **భౌగోళిక, రాజకీయ లక్ష్యాలు:** ప్రత్యర్థి ప్రభుత్వాలను అణగదొక్కడం, రహస్యమైన సమాచారాన్ని దొంగిలించడం, శత్రు భూభాగంలో కీలకమైన అవసరాలకు అంతరాయం కలిగించడం లాంటివి చేస్తారు.
- **ఆర్థిక లాభం:** సైబర్ టెర్రరిజం లక్ష్యం సైతం ఆర్థిక వ్యవస్థల్ని దోచుకోవడమే. ఉగ్ర సంస్థలు లేదా హ్యాకర్లు ర్యాన్సమ్‌వేర్ దాడులు, ఆర్థిక మోసాలతో డబ్బులు కొల్లగొడుతారు. అవసరమైన డేటాను ఎన్‌క్రిప్ట్, డిక్రిప్ట్ చేయడానికి భారీగా డబ్బును డిమాండ్ చేస్తారు.
- **సైకలాజికల్ వార్‌ఫేర్:** భయం, అనిశ్చితి, అపనమ్మకాన్ని వ్యాప్తి చేసే లక్ష్యంతో ప్రజల మానసిక స్థితిపై ప్రభావం చూపేలా ప్రభుత్వ రంగ సంస్థలను హ్యాక్ చేస్తుంటారు.

ఎలా చేస్తారు?

- **మాల్వేర్:** వైరస్‌లు, ట్రోజన్‌లు, ర్యాన్సమ్‌వేర్ వంటి హానికర సాఫ్ట్‌వేర్లను సైబర్ ఉగ్రవాదులు ఎక్కువగా వాడుతున్నారు.
- **ఫిషింగ్:** వీటిని సోషల్ ఇంజినీరింగ్ ఎటాక్‌గా చెప్పొచ్చు. లక్ష్యంగా ఎంచుకున్న సంస్థల నెట్‌వర్క్‌లు, సంస్థలు, వ్యక్తులకు మోసపూరిత ఈ- మెయిల్‌లు, ఎస్ఎంఎస్‌లలో లింకులు పెట్టి పంపుతారు. దీని ద్వారా హాక్ చేస్తే కలిగే నష్టం ఊహించడానికి కూడా భయంకరంగా ఉంటుంది.
- **డిస్ట్రిబ్యూటెడ్ డినైయల్ ఆఫ్ సర్వీస్:** వీటినే డీడీఓఎస్ దాడులు అంటారు. టార్గెట్ చేసిన నెట్‌వర్క్‌కు విపరీతమైన ట్రాఫిక్ ఉండేలా చేసి వాటిని వినియోగదారులకు అందుబాటులో లేకుండా చేస్తారు. కీలకమైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక లేదా ప్రభుత్వ సంస్థల కార్యకలాపాలకు అంతరాయం కలిగించేందుకు ఉపయోగిస్తారు. ఆర్థిక, ఆరోగ్య రంగాల్లో గందరగోళం సృష్టించడం ఈ దాడి లక్ష్యం.
- **సాఫ్ట్‌వేర్ వల్నరబిలిటీ ఎటాక్:** సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌లు, ఆపరేటింగ్ సిస్టమ్, నెట్‌వర్క్ ప్రోటోకాల్‌లోని చిన్నపాటి లోపాలను ఆసరాగా తీసుకుని దాడులు చేస్తారు.
- **సప్లై చైన్ అటాక్స్:** కస్టమర్‌లు లేదా క్లయింట్‌ల నెట్‌వర్క్‌లలోకి చొరబడేందుకు థర్డ్ పార్టీ విక్రేతలుగా చేరి నెట్‌వర్క్‌కు హాని కల్గిస్తారు.

సైబర్ టెర్రరిజానికి గురవుతున్న ప్రధాన రంగాలు

సైబర్ ఉగ్రవాదులు ప్రభుత్వరంగ సంస్థలు, పవర్ గ్రిడ్‌లు, రవాణా నెట్‌వర్క్‌లు, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు వంటి కీలకమైన మౌలిక సదుపాయాకు అంతరాయం సృష్టించి ప్రజా భద్రత, సంక్షేమానికి ఆటంకాలు కలిగిస్తారు. ప్రతికూల పరిస్థితులను సృష్టించి సామాజిక జీవనాన్ని బలహీనపర్చడం వీరి లక్ష్యం. సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఫోరమ్‌ల ద్వారా తీవ్రవాద భావజాల వ్యాప్తికి, హింసను ప్రేరేపించేందుకు సైబర్ టెర్రరిజాన్ని వాడుతున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలను చూస్తే..

సైబర్ టెర్రరిజం వేళ్లూనుకుంటుందనడానికి ఇటీవలి కొన్ని పరిణామాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి. హ్యాకర్లు సోనీ అంతర్జాతీయ సంస్థపై సైబర్ దాడి చేసి గోప్యమైన సమాచారాన్ని హ్యాక్ చేసి సంస్థ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగించారు. ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రి డేటాపై రామ్సన్‌వేర్ ఎటాక్ జరగడం, హైదరాబాద్‌లో ఏపీ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు హ్యాకింగ్ ఘటన, తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేయడం కూడా ఇలాంటి కోవలోనివే.

సైబర్ టెర్రరిజాన్ని ఇలా ఎదుర్కోవచ్చు



- **సైబర్ సెక్యూరిటీ చర్యలు:** సైబర్ టెర్రరిస్టుల నుంచి డిజిటల్ మౌలిక సదుపాయాలను కాపాడుకునేందుకు సైబర్ సెక్యూరిటీ సాంకేతికతను, సైబర్ దాడులను అడ్డుకోవడానికి బలమైన ఫైర్‌వాల్స్‌ను ఏర్పాటుచేసుకోవాలి. చొరబాట్లను గుర్తించే వ్యవస్థలు, ఎన్‌క్రిప్షన్ మెకానిజమ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. వీటి కోసం ప్రభుత్వం అదనంగా పెట్టుబడి పెట్టాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు పరస్పర సహకారంతో సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేసేలా ఉమ్మడి ప్రణాళికలు అమలు చేయాలి.
- **అంతర్జాతీయ సహకారం:** సైబర్ ఉగ్రవాదం ముప్పును సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, సైబర్‌నేరగాళ్లను పట్టుకోవడానికి ఆయా దేశాలు ద్వైపాక్షిక, బహుపాక్షిక ఒప్పందాలు చేసుకోవాలి.
- **ప్రజల్లో అవగాహన పెంచాలి:** ఫిషింగ్ స్కామ్‌లు, మాల్‌వేర్ బెదిరింపులు ఇతర సైబర్ ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. విద్యాసంస్థలు, సైబర్ సెక్యూరిటీ సంస్థలు శిక్షణ, వర్క్‌షాప్‌లు, అవగాహన కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలి.

గుర్తించకపోతే అనర్థాలు

సాంకేతికత వినియోగం పెరిగేకొద్దీ సైబర్ టెర్రరిజం ముప్పు కూడా పెరుగుతోంది. ఇది అనేక రంగాలకు విస్తరించే ప్రమాదం ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వాలు అన్ని స్థాయిల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు చర్యలు ప్రారంభించాలి. భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే సైబర్ టెర్రరిజం ముప్పును గుర్తించకపోతే అనర్థాలు తప్పవు.

– అద్వైత్ కంభం, సైబర్ సెరిటీ ట్రైనర్

అరటి.. ధర అదిరింది!

మధురమైన రుచులతో సామాన్యులకు అందుబాటులో ఉండే అరటి పండు ధర అమాంతం పెరిగింది. సామాన్యులు కొనుగోలు చేయాలంటేనే బెదిరిపోతున్నారు. నిన్నమొన్నటి వరకు ధరలు లేక తోటల్లో గెలలు చెట్లకే మగ్గిపోయిన పరిస్థితి. ఇప్పుడు బహిరంగ మార్కెట్‌లో భారీగా ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి లేని సమయంలో డిమాండ్ పెరగడంతో మరికొందరు రైతులు మాత్రం ఆవేదన చెందుతున్నారు. పండ్ల కొనుగోలుదారులు మాత్రం అరటి అంటే చాలు అమ్మో అనే పరిస్థితికి వచ్చారు.

- కొరత కారణంగా పెరిగిన పండ్ల ధరలతో అన్నదాతలకు ఊరట
- దిగుబడి లేక కొందరికి తప్పని నిరాశ
- ప్రస్తుతం అరకొరగా గెలల దిగుబడి
- మారిన వాతారణ పరిస్థితులే కారణం
- శుభకార్యాల నేపథ్యంలో పండ్లకు పెరిగిన డిమాండ్
- ఎన్నడూ లేని ధరతో కొనుగోలుదారులకు అవస్థలు

కొల్లూరు: మారిన వాతావరణ పరిస్థితిలో అరటి దిగుబడి అంతగా లేదు. పెనుగాలులు, ఎండలు, ప్రస్తుతం వాతావరణంలో వేడి తీవ్రంగా ఉండటంతో అరటి దిగుబడి మందగించింది. జిల్లాలో సుమారు 2,379 మంది రైతులు 3,710 ఎకరాలలో అరటి సాగు చేస్తున్నారు. కర్పూర, చక్రకేళి, కూర అరటి రకాలు ఇందులో ఉన్నాయి. ఎకరాకు 800 వరకు అరటి మొక్కలు సాగు చేస్తే 10 నెలల వ్యవధిలో పంట చేతికి అందుతుంది. ఎకరాకు సుమారు రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి అవసరం. పంట చేతికందిన అనంతరం స్థానిక మార్కెట్లలో అమ్మకాలు జరపడంతోపాటు తోటల్లోనే వ్యాపారులకు గెలలు విక్రయిస్తున్నారు. రాష్ట్రంలోని నెల్లూరు, ప్రకాశం, విజయవాడ, తిరుపతి ప్రాంతాలతోపాటు తెలంగాణ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒరిస్సా వంటి రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. ప్రస్తుతం సాగు విస్తీర్ణంలో 5 శాతం కంటే తక్కువ తోటల్లో మాత్రమే గెలలు అందుబాటులో ఉన్నాయి. దీంతో కొరత ఏర్పడి ధరలకు రెక్కలొచ్చాయి. దీనికితోడు శ్రావణమాసంలో అధికంగా పూజలు, శుభకార్యాలు ఉండటంతో పండ్లకు డిమాండ్ పెరిగింది. వేసవిలో గెలలు కొనే వారే లేకపోవడంతో సాధారణ, మొదటి రకం గెలలు రూ. 20 నుంచి రూ. 30కు సైతం విక్రయించిన రైతులు నష్టాలపాలయ్యారు. ప్రస్తుతం కర్పూర అరటి మొదటి రకం రూ. 1,200, సాధారణ రకం రూ. 800 వరకు పలుకుతున్నాయి. చక్రకేళి రకం గెలకు రూ. 450 వరకు ధర లభిస్తోంది. కూర అరటి గెల రూ. 300కు అమ్ముడవుతోంది. పండ్లు డజను రూ. 80 నుంచి రూ. 120 వరకు విక్రయిస్తున్నారు.



కొల్లూరు ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతవుతున్న కర్పూర రకం అరటి గెలలు

గెల రూ. 400 పలికినా లాభమే..



అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న అరటి పంటకు ప్రస్తుతం పలుకుతున్న ధరలు ఇలాగే ఎప్పుడూ ఉండవు. కనీసం గెలకు రూ. 400 వరకు పలికినా లాభాలు వస్తాయి. రెండేళ్ల పంట కాలంలో రెండు పర్యాయాలు కాపునకు వచ్చే గెలలు అధికంగా దిగుబడి వచ్చే నవంబర్ నుంచి రేట్లు పడిపోకుండా ఉంటే మాకు మేలు చేకూరుతుంది.

– ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, కిష్కిందపాలెం, కొల్లూరు మండలం

బొజ్జ గణపయ్యా...

పొట్ట నింపవయ్యా!

- కార్మికుడి కష్టం కాంట్రాక్టర్ పాలు
- ప్రారంభమైన వినాయక విగ్రహాల వ్యాపారం

కడప కల్చరల్: మరో మూడు వారాల్లో శ్రావణ మాసం ముగిసి భాద్రపదం వస్తుంది. సందుగొందుల్లో సైతం గణపయ్య విగ్రహాలు వెలుస్తాయి. ఏటా నెలరోజుల ముందే ఊరిబయట విగ్రహాల తయారీ మొదలవుతుంది. రాజస్థాన్, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి విగ్రహాల తయారీదారులు వచ్చి అక్కడి నుంచి తెచ్చుకున్న సామగ్రితోపాటు స్థానికంగా లభించే సామగ్రితో విగ్రహాలు తయారు చేస్తారు. ఊరి బయట పెద్ద టెంట్లు వేసుకుని కుటుంబాలతో గడుపుతారు. ఒకటి, రెండు నెలలపాటు తయారు చేసిన విగ్రహాలను అమ్ముకుని సంతృప్తిగా తిరిగి తమ ప్రాంతానికి వెళతారు. కానీ ఈ సంవత్సరం పరిస్థితి కొద్దిగా మారింది. స్థానికంగా ఉండే పెట్టుబడిదారులు ముందే ముడి విగ్రహాలను తెచ్చిపెట్టుకుని రాజస్తానీ కళాకారులకు కాంట్రాక్టుపై రంగులు పూసే పని అప్పగించారు. సదరు పెట్టుబడి పెట్టిన స్థానికులే విగ్రహాలకు అడ్వాన్సులు తీసుకుని ప్రజలు కోరిన తేదికి విగ్రహాలను సిద్ధం చేయాలని కళాకారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఆలస్యమైతే కూలీ తగ్గుతుందన్న భయంతో కళాకారులు రేయింబవళ్లు కష్టపడుతున్నారు. కడప నగరంతోపాటు ఇతర పట్టణాలు, మండల కేంద్రాల శివార్లలో పెద్ద టెంట్లు వేసుకుని గణపయ్య విగ్రహాలను తయారు చేస్తున్నారు. నిజానికి విగ్రహాల వ్యాపారం నిన్న, మొన్నటివరకు కళాకారుల ద్వారానే జరిగేది. ప్రస్తుతం పెట్టుబడి దారులు రంగప్రవేశం చేశాక కళాకా రులంతా కూలీలుగా మారారు. తయారీదారుల ప్రమేయం లేకుండా కాంట్రాక్టర్లే విగ్రహాలకు ధరలు నిర్ణయించి అమ్ముతున్నారు. ఐదు అడుగుల విగ్రహం రూ. 8-10 వేలకు విక్రయిస్తున్నారు. 13 అడుగుల భారీ విగ్రహం రూ. 50-60 వేలకు ఇస్తున్నారు. తాము మాత్రం ఇష్టమొచ్చిన ధరకు అమ్ముకుంటూ కళాకారులకు కూలీ మాత్ర మే ఇస్తున్నారు. సీజన్ పోతే ఈ ఆదాయం కూడా ఉండదంటూ కళాకారులు వచ్చిన కాడికే తీసుకుంటున్నారు.



విగ్రహానికి రంగులు వేస్తున్న కళాకారుడు



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,082 మంది స్వామివారిని దర్శించుకోగా 27,972 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.46 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తుంది.

30న శ్రీకపిలేశ్వరాలయంలో లక్ష కుంకుమార్చన

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 30వ తేదీన శ్రీకామాక్షి అమ్మవారికి శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగనున్నాయి.

23న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని 23వ తేదీన ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఆచరించనున్నారు. రూ. 1500 టికెట్ కొనుగోలు చేసిన భక్తులు ఈ సేవలో పాల్గొనవచ్చు. అనంతరం ఉదయం 10 గంటలకు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించనున్నారు. ఉచిత సేవలో పాల్గొనేందుకు 500 మంది భక్తులకు దేవస్థానం అవకాశం కల్పిస్తోంది.

27 రోజులు.. రూ.2.39 కోట్లు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. గత 27 రోజులకు గాను నగదు రూపేణా రూ.2,39,96,220, కానుకల రూపంలో 145 గ్రాముల బంగారం, 6.19 కేజీల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించినట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు.

టెంపుల్, అటవీ టూరిజానికి ప్రణాళిక

దేవరపల్లి: ద్వారకాతిరుమల కేంద్రంగా టెంపుల్ టూరిజం, ఏజెన్సీ ప్రాంతాన్ని అనుసంధానిస్తూ ఆటవీ టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ద్వారకాతిరుమల, గోపాలపురం, జంగారెడ్డిగూడెం, పోలవరం ప్రాంతాల్లో పురాతన ఆలయాలు ఉన్నందున ద్వారకాతిరుమల కేంద్రంగా టెంపుల్ టూరిజం, బుట్టాయిగూడెం, పోలవరం ప్రాంతాన్ని ఆటవీ టూరిజంగా అభివృద్ధి చేయనున్నట్టు బుధవారం దేవరపల్లిలో జరిగిన సమావేశంలో వివరించారు.

23, 30న సామూహిక వ్రతాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఈ నెల 23, 30వ తేదీల్లో వచ్చే శుక్రవారాలల్లో సామూహిక వరలక్ష్మీ వత్రాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ భళ్ల నీలకంఠం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్రత సామగ్రిని దాతలు అందజేస్తారని చెప్పారు.



జీపీటీలో ఉచిత ఉపాధి శిక్షణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కాకినాడ గవర్నమెంట్ పాలిటెక్నిక్ (జీపీటీ) కళాశాలలో ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యసంస్థ అధికారి డి.హరిశేషు బుధవారం తెలిపారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సుకు శిక్షణ ఇస్తున్నామని, 10వతరగతి ఉత్తీర్ణులై 18నుంచి 40 సంవత్సరాల వయస్సు లోపుగల యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 9010737998 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

నేడు, రేపు అంతర్జాతీయ సదస్సు

మండపేట: మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీల్లో స్మార్ట్ మెటీరియల్‌పై అంతర్జాతీయ సదస్సు ఉంటుందన్నారు. దీనికి దక్షిణ కొరియా, న్యూయార్క్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి ఐఏఎస్ఎస్, ఐఐటీ, నీట్ ప్రతినిధులు వస్తారన్నారు.

తిరుపతి వర్సిటీల్లో అడ్మిషన్ల సమాచారం

తిరుపతి సిటీ: తిరుపతిలో పలు వర్సిటీలలో వివిధ కోర్సులకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇంజనీరింగ్ కోర్సులలో అడ్మిషన్లు తుదిదశకు చేరుకోగా పీజీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. అలాగే బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు నేటి నుంచి రెండో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది. వెటర్నరీ వర్సిటీలో ఈనెల 27 నుంచి బీవీఎస్సీ కౌన్సిలింగ్ ప్రారంభం కానుంది. ఎస్వీయూలో ఈనెల 28న పీజీ (ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్) సీట్ల కేటాయింపు జరగనుంది.సంస్కృత వర్సిటీలో ఆచార్య, శాస్త్రీ, ప్రాక్ శాస్త్రి కోర్సులలో స్పాట్ అడ్మిషన్లకు ఈనెల ఆఖరితో గడువు ముగియనుంది.

ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటి రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ఏర్పాటయ్యిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఈ స్కిల్ హబ్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవెలపర్, ఫీల్డ్ టెక్నీషియన్ నెట్ వర్కింగ్ అండ్ స్టోరేజ్ కోర్సులకు కాలవ్యవధి 210గంటలు, ఆయా కోర్సులకు పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 72073 89948 నంబరులో పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

30 నుంచి పీజీ రెండో పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బుధవారం నుంచి ప్రారంభం కావల్సిన పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఎగ్జిమినేషన్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. భారత్ బంద్ నేపథ్యంలో వాయిదా వేశారు. విద్యార్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

మెలకువగా ఉన్నంతసేపూ మొబైల్‌తో గడుపుతున్నారు. నిద్రాహారాలకు దూరమవుతున్నారు. శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. 'డిజిటల్ డిమెన్షియా'గా పిలిచే ఈ ముప్పు మరింత పెరుగుతోంది. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు ఇతర డిజిటల్ పరికరాలపై ఎక్కువగా ఆధారపడేవారి సంఖ్య విపరీతంగా పెరిగింది. డిజిటల్ సాధనాల అధిక వినియోగంతో 'డిజిటల్ డిమెన్షియా'కు దారితీసే కారణాలు, పరిస్థితులను అంచనా వేసి, వాటి నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలనేది కీలకంగా మారింది. - సాక్షి, హైదరాబాద్





బానిస 'సెల్'!

- విపరీతంగా పెరిగిన మొబైల్ వినియోగం
- ఫోన్లతోనే అత్యధిక సమయం
- పెరిగిన 'డిజిటల్ డిమెన్షియా' ముప్పు
- రోజులో 4 గంటలు మించితే శారీరక సమస్యలు
- వైద్య నిపుణుల హెచ్చరిక

టీవీ, కంప్యూటర్ల ముందు గడిపితే చిక్కులే

2022లో ఓ సంస్థ నిర్వహించిన అధ్యయనాన్ని పరిశీలిస్తే.. ఆరోగ్యకరమైన జీవనశైలికి స్వల్ప వ్యాయామం మొదలుకుని శారీరక శ్రమ లాంటివి చేయకుండా.. ఎక్కువకాలం టీవీ, కంప్యూటర్ల ముందు గడిపితే చిక్కులు తప్పవని తేలింది. ఇవన్నీ కూడా పూర్తిస్థాయిలో డిమెన్షియాకు దారితీసేందుకు కారణమవుతాయని స్పష్టం చేసింది. రోజుకు నాలుగు గంటల కంటే అధికంగా డిజిటల్ స్క్రీన్స్‌ను వినియోగించుకునే వ్యక్తులకు వాస్క్యులర్ డిమెంతియా, అల్జీమర్స్ జబ్బు, నరాల బలహీనతలు, డిమెన్షియా తదితర సమస్యలు తప్పవని మరో పరిశీలనలో వెల్లడైంది.

నిపుణులు ఏమంటున్నారంటే..

రోజూ డిజిటల్ స్క్రీన్స్‌ను ఎక్కువ సేపు ఉపయోగించడం వల్ల మెదడులోని ప్రత్యేక ప్రాంతాల్లో మార్పులు చోటుచేసుకున్నాయని ఫోర్టిస్ హిరానందని ఆసుపత్రి డైరెక్టర్–న్యూరాలజీ డాక్టర్ పవన్ ఓజా తెలిపారు. డిజిటల్ డిమెన్షియాకు సంబంధించిన లక్షణాలను డిమింతియాతో పోల్చిచూడతగినవేనని స్పష్టం చేశారు. స్వల్పకాలిక జ్ఞాపకశక్తి క్షీణించడంతో పాటు కొన్నిపదాలను గుర్తు చేసుకోవడంలో ఇబ్బందులు, ఒకేసారి ఒకటి మించి పనుల (మల్టీ టాస్కింగ్) నిర్వహణలో సమస్యలు ఎదుర్కోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఏ విషయంపైనైనా ఎక్కువ సేపు దృష్టి కేంద్రీకరించలేకపోవడం వంటివి తలెత్తుతాయని చెప్పారు. ఇవన్నీ కూడా ఆందోళన, ఆదుర్దా పెరగడానికి కారణమవుతాయని వెల్లడించారు. దీంతో పాటు డిజిటల్ సాధనాలతో అధిక సమయం గడపడం, నీలం రంగు స్క్రీన్స్ 'స్లీప్ సైకిల్స్'కు అంతరాయం కలిగించి నిద్రకు దూరం చేయడం ద్వారా జ్ఞాపకశక్తి, ఇతర ప్రక్రియలపై ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. డిజిటల్ రూపాల్లో వెలువడుతున్న సమాచారంతో మెదడుపై అధికభారం పడుతుందని పేర్కొన్నారు.

నివారణకు నిపుణుల సూచనలివి

- స్మార్ట్‌ఫోన్ నోటిఫికేషన్లను నియంత్రించాలి. దీనిద్వారా ఫోన్లలో గడిపే కాలం తగ్గిపోతుంది.
- ఉపయోగించే అప్లికేషన్స్‌పై (యాప్‌లపై) నియంత్రణ విధించుకోవాలి.
- ప్రతీ దానికి డిజిటల్ సాధనాలపై ఆధారపడకుండా బుర్రను ఉపయోగించాలి. దేనిగురించి అయినా సొంతంగా గుర్తుచేసుకునేందుకు ప్రయత్నించాలి.
- ఏదైనా కొత్త భాషను నేర్చుకోవాలి. మెదడును ఉపయోగించి ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకునే ప్రయత్నం చేయాలి.
- నడక, స్వల్ప వ్యాయామం, శారీరక శ్రమ వంటి వాటి ద్వారా మెదడు చురుగ్గా పనిచేస్తుంది. దీనిద్వారా మెదడు ఆరోగ్యంగా ఉంటుంది.
- మెదడు ఆధారిత వ్యాయామాలు, టీచింగ్ మెథడ్స్, స్కూల్ ప్రోగ్రామ్స్ చేయాలి.
- కిండిల్‌లో కూడా.. స్వయంగా పుస్తకాన్ని చదవాలి. అధ్యయనం అనేది బుర్రకు చైతన్యాన్ని కలిగించి చురుగ్గా ఉండేలా చేస్తుంది. అదే కిండిల్ వంటి ఎలక్ట్రానిక్ సాధనాల ద్వారా మనిషి శరీరం ఎలక్ట్రో మ్యాగ్నటిక్ తరంగాలకు గురై ఎలక్ట్రానిక్ డిమెన్షియాకు దారితీస్తుంది.
- పిల్లలు అధికంగా వ్యాయామం, క్రీడా మైదానాల్లో ఆటలు, పుస్తకాల చదువు తదితర వ్యాపకాలకు ప్రాధాన్యమివ్వాలి.
- భోజనం చేసే సమయంలో కుటుంబ సభ్యుల మధ్య సంభాషణ, ఏదైనా విషయమై చర్చ వంటి ఆసక్తికరమైనవి జరిగేలా టీవీలను వీక్షించకుండా ఆపేయాలి.

తిరుగుబాటుకు ప్రతిరూపం బస్తర్

13వ శతాబ్దంలోనే కాకతీయుల దండయాత్ర	ఆ తర్వాత రిజర్వ్ ఫారెస్ట్‌చట్టంతో ఆదివాసీలకు ఇక్కట్లు	బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాడినా కుట్రతో అణచివేసిన పాలకులు	ఇప్పుడు మావోలు, రాజ్యం మధ్య కొనసాగుతున్న ఘర్షణ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బస్తర్‌లో కేంద్ర భద్రతాదళాలకు ప్రతిఘటన ఎదురవుతూనే ఉంది. అయితే ఈ తరహా ప్రతిఘటన బస్తర్‌లో ఇప్పుడు మొదలైందేమీ కాదు. తమను ఇబ్బంది పెట్టిన వారిని ఎదిరించి నిలవడం.. అవసరమైతే ప్రాణాలు అర్పించడం అడవుల్లో ఆది నుంచే ఉంది. యువరాణి చమేలీదేవి, ఆదివాసీ వీరుడు గుండాదూర్, మహారాజ ప్రవీర్‌చంద్ర భంజ్‌దేవ్‌ల చరిత్ర అందుకు ఉదాహరణలుగా నిలుస్తాయి.

ఆయుధం ఎత్తారు..

బస్తర్ అడవుల్లో ఆధిపత్యం కోసం భద్రతాదళాలు, మావోయిస్టుల మధ్య జరుగుతున్న పోరులో వేలాది మంది మరణించారు. ఇక్కడ బాంబుల మోత, తుపాకుల గర్జన నిత్యకృత్యం. బస్తర్‌లో జనతన్ సర్కార్ పేరుతో మావోయిస్టులు సాగిస్తున్న సమాంతర పాలనకు ముగింపు ఇచ్చేందుకు 2009లో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభించింది. మొదటి పదేళ్లు మావోయిస్టుల దాడుల్లో భద్రతాదళాలు తీవ్రంగా నష్టపోయాయి. 2010 ఏప్రిల్ 6న సుకుమా జిల్లా చింతల్నార్ దగ్గర జరిగిన బాంబుదాడిలో ఏకంగా 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించారు. దీంతో ఇక్కడ సాధారణ పద్ధతుల్లో పైచేయి సాధించడం కష్టమని భావించిన కేంద్రం సీఆర్‌పీఎఫ్‌కు తోడుగా డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్), కోబ్రా దళాలను రంగంలోకి దించింది. ఫలితంగా బస్తర్‌పై భద్రతాదళాల పట్టు పెరుగుతూ వస్తోంది. దండకారణ్యంలో మావోయిస్టులపై చేస్తున్న పోరు తుదిదశకు చేరుకుందంటూ ఆపరేషన్ కగార్(ఫైనల్ మిషన్)ను 2024 జనవరిలో కేంద్రం ప్రకటించింది. దీనికి తగ్గట్టుగానే అధికారిక లెక్కల ప్రకారమే గడిచిన ఆరునెలల్లో బస్తర్ అడవుల్లో జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు 132 మంది మావోయిస్టులు, వారి సానుభూతిపరులు చనిపోయారు. అయితే, ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని పౌరహక్కుల నేతలు అంటున్నారు.

నూతన సామ్రాజ్య విస్తరణకు అన్నమదేవుడు

ఢిల్లీ సుల్తానులు, మహారాష్ట్రలోని దేవగిరి రాజుల నుంచి దాడులు పెరిగాయి. ఆ తర్వాత వరంగల్ కేంద్రంగా కాకతీయ సామ్రాజ్యం ఎంతోకాలం మనలేదనే నిర్ణయానికి వచ్చిన రెండో ప్రతాపరుద్రుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను తన తమ్ముడైన అన్నమదేవుడికి అప్పగించారు. ఆయన నూతన సామ్రాజ్య విస్తరణకు నాగవంశీయుడైన హరిశ్చంద్రుడి పాలనలో అంతర్గత పోరుతో సతమతం అవుతున్న దండకారణ్యాన్ని అనువైన ప్రదేశంగా ఎంచుకున్నాడు.



చిత్రకూట జలపాతం వద్ద ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చమేలీదేవి విగ్రహం

పెళ్లి రాయబారం..

యుద్ధానికి సిద్ధమైన అన్నమదేవుడు రణానికి ముందు దండకారణ్యాన్ని ఏలుతున్న హరిశ్చంద్రుడికి రాయబారం పంపాడు. యుద్ధానికి బదులు యువరాణి చమేలీదేవిని తనకిచ్చి వివాహం జరిపించాలని కోరాడు. ఈ ఒప్పందం సమ్మతమైతే హరిశ్చంద్రుడినే రాజుగా కొనసాగిస్తామంటూ సందేశం పంపారు. అయితే అన్నమదేవుడి ప్రతిపాదనను అంగీకరిస్తే నాగవంశీయుల ప్రతిష్ఠకు భంగమంటూ యువరాణి చమేలీదేవి తేల్చిచెప్పింది. ఆమె కళలతోపాటు రాజకీయం, రణతంత్రంలో శిక్షణ పొంది ఉండటంతో యుద్ధరంగంలోనే అమీతుమీ తేల్చుకుందామంటూ అన్నమదేవునికి కబురు పంపింది.

ఆత్మార్పణం

ప్రస్తుత బీజాపూర్ జిల్లాలో ఉన్న బెలియాపాల్ దగ్గర దండకారణ్యాన్ని పాలిస్తున్న నాగవంశీయులకు, త్రిలింగ దేశాన్ని పాలిస్తున్న కాకతీయుల సైన్యాలకు మధ్య భీకర యుద్ధం కొనసాగింది. రాజు హరిశ్చంద్రకు తోడుగా యువరాణి చమేలీదేవి యుద్ధరంగంలోకి దిగింది. మూడోరోజు జరిగిన యుద్ధంలో తీవ్రంగా గాయపడిన హరిశ్చంద్ర మరణించాడు. ఆ మరుసటి రోజు కోటలో హరిశ్చంద్రకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తుండగా కాకతీయ సైన్యాలు కోటను చుట్టుముట్టాయి. తీవ్రనిర్బంధం మధ్య తండ్రి అంత్యక్రియలను కొనసాగించిన చమేలీదేవీ చివరకు తనకు తాను నిప్పంటించుకుని ఆత్మాహుతికి పాల్పడింది. చమేలీదేవి ప్రాణత్యాగంపై భిన్నాభిప్రాయాలు ఉన్నా, అన్నమదేవుడికి ఎదురు నిలిచిన వైనంపై ఏకాభిప్రాయం ఉండటం గమనార్హం. ఇండియా నయాగరాగా పేరొందిన చిత్రకూట (ఇంద్రావతి నది) జలపాతం దగ్గర యువరాణి చమేలీదేవి విగ్రహాన్ని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆమెను గౌరవించింది.

బ్రిటీషర్లకు ఎదురు నిలిచి..

చమేలీదేవి మరణంతో దండకారణ్యంలో 1324లో కాకతీయ వంశస్తుల పాలన మొదలైంది. ముందుగా మదొతా, బార్సూర్, దంతెవాడ తర్వాత జగదల్‌పూర్ కేంద్రంగా బస్తర్ పేరుతో సామ్రాజ్యం నిలదొక్కుకుంది. ఇందుకు నాలుగు వందల ఏళ్లు పట్టింది. ఆ తర్వాత కాలంలో బ్రిటీషర్లు ఇండియాకు రావడం రాజ్యసంక్రమణ సిద్ధాంతం, సైన్య సహకార పద్ధతి వంటి కుట్రపూరిత విధానాలతో ఒక్కో స్వదేశీ రాజ్యాలను తమ గుప్పిట్లో పెట్టుకుంటూ వచ్చారు. అందులో బస్తర్ కూడా చేరింది. తమపై తెల్లవారి పెత్తనాన్ని నిరసిస్తూ కర్రలు, కత్తులు, కారంపొడులను ఆయుధాలుగా వాడుకొని తిరుగుబాటు చేసి రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యానికి సైతం కాళ్లకింద నేల కంపించేలా బస్తర్ ఆదివాసీలు భూంకాల్ పోరాటం చేశారు.

గురుకులాల టైమింగ్స్ మార్చండి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గురుకుల జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సమయపాలనలో మార్పులు చేయాలని గురుకుల జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలసిన జేఏసీ అధ్యక్షుడు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మధుసూదన్, ప్రతినిధులు కె.జనార్దన్, ఏ.నరసింహులు, ఎస్.గణేశ్ 14 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ...పాఠశాలల సమయపాలనలో మార్పులు చేయడంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గురుకుల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, ప్రభుత్వ గురుకులాలను విద్యార్థులను సమీప డాక్టర్లు వారానికి రెండుసార్లు కచ్చితంగా పరీక్షించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా అన్ని గురుకులాల అడ్మినిస్ట్రేటివ్ నిర్ణయాల కోసం ఒక కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గురుకులాలలో ఉద్యోగులకు కూడా ఒకటో తేదీనే వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపై సీఎస్ సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు.

తెలుగు తేజానికి ఐఐటీ–ఢిల్లీ డాక్టరేట్

ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్న ఐఏఎస్ అధికారి ప్రసాద్

సాక్షి, న్యూఢిల్లీ: హరియాణా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న తెలుగు ఐఏఎస్ అధికారి టీవీఎస్ఎన్ ప్రసాద్‌ను ఐఐటీ–ఢిల్లీ డాక్టరేట్ వరించింది. ఆర్థికశాస్త్రంలో ఆయన రాసిన పరిశోధన పత్రానికి ఐఐటీ–ఢిల్లీ డాక్టరేట్ అందించింది. పాఠశాల విద్యను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో పూర్తిచేసిన ప్రసాద్.. హార్వర్డ్ యూనివర్సిటీలో మాస్టర్స్ చేశారు. వరల్డ్ బ్యాంక్‌లో ఏడేళ్లపాటు పనిచేసి అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ అర్థిక నిపుణుడిగా పేరు తెచ్చుకున్నారు. హరియాణా కేడర్‌లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా ఆ రాష్ట్ర ఆర్థిక సంస్కరణల్లో కీలక పాత్ర పోషించారు. అంతేగాక సెంట్రల్ సర్వీసెస్‌లో 'నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగ' ప్రాజెక్ట్ హెడ్‌గా పని చేసి పర్యావరణం, నీటి వనరుల నిర్వహణలో కీలకభూమిక పోషించారు. ఎకనామిక్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎనర్జీ రంగాల్లో పనిచేసిన ప్రసాద్ అత్యున్నత ప్రతిభను చాటారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన ఎస్‌పీడీసీఎల్‌లో సీఎండీగానూ వ్యవహరించారు. ఆయన రాసిన అనేక వ్యాసాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

ఫార్మా రంగ సమస్యలను పరిష్కరించండి

కేంద్రమంత్రి నడ్డాకు మంత్రి శ్రీధర్‌బాబు లేఖ

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఫార్మాస్యూటికల్ సేవల రంగాన్ని ప్రభావితం చేస్తున్న అంశాలను పరిష్కరించాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు లేఖ రాశారు. అంతర్జాతీయంగా పేరొందిన భారతీయ ఫార్మా రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ప్రత్యేకించి కాంట్రాక్టు రీసెర్చ్ ఆర్గనైజేషన్స్ (సీఆర్‌వోలు), కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్లు (సీడీఎంవోలు) రంగాల్లో భారీ వృద్ధికి అవకాశముందని తెలిపారు. 10.75 శాతం వృద్ధిరేటుతో 2030 నాటికి ఈ రంగం 2.5 బిలియన్ డాలర్ల వృద్ధి సాధించే అవకాశముందని లేఖలో వివరించారు. ఈ వృద్ధిని వేగవంతం చేసేందుకు నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీ), తయారీ లైసెన్సుల జారీ ప్రక్రియను సులభతరం చేయాలని కోరారు. ఎగుమతులకు ప్రోత్సాహం, కస్టమ్స్ డ్యూటీలో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారాలు, ఉత్పత్తుల పేర్లకు సంబంధించిన గోప్యత, ఎగుమతుల ప్రోత్సాహానికి అవసరమైన డేటా లభ్యత తదితర అంశాలపై దృష్టి సారించాలని నడ్డాకు రాసిన లేఖలో శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు.

ఏడేళ్ల తర్వాత పీఈటీ కొలువుల భర్తీకి మోక్షం

- గురుకుల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రాథమిక జాబితా విడుదల
- టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో జాబితా

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) కొలువుల భర్తీకి ఎట్టకేలకు మోక్షం కలిగింది. వివిధ సొసైటీల పరిధిలో 594 ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఏడేళ్ల తర్వాత బుధవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసింది. ఈ జాబితాను బుధవారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. 2017 ఏప్రిల్ 14న గురుకులాల్లో పీఈటీ ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ, రాత పరీక్షలు నిర్వహించినప్పటికీ న్యాయపరమైన చిక్కులతో ఫలితాల ప్రకటన వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా ఈ అంశంపై గురుకుల సొసైటీలు పీఈటీలు 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బోధించేలా నిబంధనల్లో సడలింపులు చేశాయి. ఈమేరకు నిర్ణయాన్ని లిఖితపూర్వకంగా కమిషన్‌కు అందజేయడంతో కొలువుల భర్తీకి మార్గం సుగమమైంది. ఈ క్రమంలో కమిషన్ తాజాగా ప్రాథమిక ఎంపిక జాబితాను విడుదల చేసింది. ఇందులో అర్హత సాధించి ఉద్యోగాల్లో చేరని అభ్యర్థుల స్థానంలో తదుపరి మెరిట్‌లో ఉన్న వారితో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు కమిషన్ తెలిపింది. వెబ్‌లింకు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని చెప్పింది.

ఎస్సీ గురుకులంలో మళ్లీ డిస్‌లొకేషన్ లొల్లి

177 మంది ఉద్యోగులకు కొత్తగా కేటాయింపులు.. సొసైటీ కార్యాలయాన్ని చుట్టుముట్టి నిరసన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్)లో ఉద్యోగుల డిస్‌లొకేషన్ లొల్లి మళ్లీ మొదటికొచ్చింది. ఇప్పటివరకు కోర్టు ఉత్తర్వులు, ఇతర కారణాలతో వారి పోస్టింగులను తాత్కాలికంగా నిలిపివేసిన సొసైటీ అధికారులు... బుధవారం వారందరికీ కొత్తగా పోస్టింగ్ ఇచ్చారు. వివిధ కేటగిరీల్లో 177 మందికి నూతనంగా జోన్‌లు, మల్టీజోన్లను కేటాయిస్తూ సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి ఉత్తర్వులు జారీ చేయడంతో సొసైటీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఉత్తర్వులు నూతన కేటాయింపులు స్థానికతకు విరుద్ధంగా ఉన్నాయంటూ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ సొసైటీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ కేటాయింపులు చేయడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం పొద్దుపోయే వరకు కూడా ఉద్యోగులంతా సొసైటీ ప్రాంగణంలో ఆందోళన వ్యక్తం చేశారు. నిర్దేశించిన చోట విధుల్లో చేరాలని స్పష్టం చేయడంతో న్యాయపోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

అక్రమ ఇసుక రవాణా అరికట్టాలి

సాక్షి, హైదరాబాద్: అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని, లారీ యజమానుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీ యజమానుల సంఘం, తెలంగాణ సరకు రవాణా యజమానుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు బుధవారం గనుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిని నాయకులు సుర్వి యాదయ్యగౌడ్, రాజేందర్‌రెడ్డి కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇసుక రీచ్‌ల వద్ద లారీ యజమానుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని వారు ఫిర్యాదు చేశారు.

అధిష్టానానికి రామ్‌మాధవ్ కృతజ్ఞతలు

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించినందుకు బీజేపీ అధిష్టానానికి రామ్‌మాధవ్ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతోపాటు.. తనను విశ్వాసంతో మళ్లీ పార్టీలోకి తీసుకుని కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాలకు బుధవారం 'ఫేస్‌బుక్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు.

రాజీవ్ విగ్రహం ఏర్పాటు తథ్యం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయం ముందు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరుతామని మహిళా ఆర్థిక సహకార కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ స్పష్టం చేశారు. వారు బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాజీవ్‌గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాలను ఎక్కడ ఏర్పాటు చేయాలో తమకు తెలుసునన్నారు. కొంతమంది మేధావులు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీలకతీతంగా చిల్లర రాజకీయాలను ఖండించాలని కోరారు.

25న మహిళా సాధికారతపై సెమినార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్). ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఐఫియా) సంయుక్తంగా ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లో మహిళా సాధికారత, లింగ సమానత్వంపై సెమినార్ నిర్వహించనుంది. దీనికి సంబంధించిన కరపత్రాన్ని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఆసుపత్రుల భద్రతపై పోలీసుల దృష్టి

సాక్షి, హైదరాబాద్: కోల్‌కతాలో ఆసుపత్రి వైద్యురాలిపై హత్యాచార ఘటనతో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలల వద్ద భద్రత పెంపుపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. ఈ మేరకు ఆయా ఆసుపత్రుల వద్ద రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రధాన ఆసుపత్రుల వద్ద వైద్యుల రక్షణకు తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరం మేరకు తనిఖీలు, జాగ్రత్తలు తీసుకునేలా ప్రైవేటు రక్షణ సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు.

కొత్త చట్టాలను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకోవాలి

భూ చట్టాల నిపుణుడు సునీల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాలు కొత్తగా తెస్తున్న చట్టాలను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకొని ముందుకెళ్లాల్సిన అవసరం ఆయా శాఖల సమన్వయంతో పనిచేస్తున్న వారందరిపై ఉంటుందని భూచట్టాల నిపుణుడు ఎం.సునీల్‌కుమార్ (భూమి సునీల్) వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తేవాలని భావిస్తున్న రైట్స్ ఆఫ్ రికార్డ్స్ –2024 ముసాయిదా చట్టాన్ని కూడా అర్థం చేసుకోవడం భూమితో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బుధవారం పారా లీగల్స్ అండ్ కమ్యూనిటీ సర్వేయర్స్ అసోసియేషన్ (సెర్ప్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఫిక్కీ ప్రధాన కార్యాలయంలో ఆర్వోఆర్–2014 ముసాయిదా చట్టంపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సునీల్ మాట్లాడుతూ కొత్త చట్టంలో తెలంగాణ రైతాంగ సమస్యల పరిష్కారానికి అవసరమైన అంశాలను చేర్చినట్టు చెప్పారు. ఈ చర్చా కార్యక్రమంలో సీఎంఆర్వో పీడీ వి.లచ్చిరెడ్డి, అసోసియేషన్ నేతలు శంకరయ్య, నగేశ్, పెదపాక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు వేల ఏళ్లనాటి డాల్మెన్ సమాధి గుర్తింపు



రహమంతాపూర్ శివారు గుట్టపై ఉన్న ఇనుప యుగపు సమాధిని పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇది ఇనుప యుగపు డాల్మెన్ సమాధి. క్రీ.పూ. వెయ్యేళ్ల కిందటిది. ఇలాంటి ఆదిమానవుల గూడు సమాధులు క్రమంగా చెదిరిపోతున్నాయి. గుట్టలపై ఉండే వీటిని క్వారీల నిర్వాహకులు ధ్వంసం చేసేస్తున్నారు. తాజాగా నల్లగొండ జిల్లా, గుండ్లపల్లి మండలం, రహమంతాపూర్ గ్రామ శివారులోని రామేశ్వరగుట్టపై దీనిని గుర్తించారు. గ్రామానికి చెందిన ఎలిమినేటి వెంకట్ ద్రావిడ్ ఇచ్చిన సమాచారం మేరకు పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా.ఈమని శివనాగిరెడ్డి బుధవారం దీనిని పరిశీలించారు. గుట్టపై కాకతీయులకాలం నాటి త్రికూటాలయానికి చేరువలో ఇది ఉందని తెలిపారు. గతంలో ఇలాంటి సమాధులు ఇక్కడ మరిన్ని ఉండేవని, క్వారీ పనుల్లో మిగతావి ధ్వంసం కాగా, ఇదొక్కటే మిగిలిందని శివనాగిరెడ్డి చెప్పారు. ఐదడుగుల ఎత్తు రాళ్ల వరుసపై, 25 అడుగుల పొడవు, 18 అడుగుల వెడల్పు, అడుగున్నర మందం గల పెద్ద గ్రానైట్ రాతి పలకను అమర్చి, ఒకవైపు ద్వారంతో దీనిని నిర్మించినట్టు వివరించారు.

రాష్ట్ర విధాన పరిషత్ బిల్లును తిరస్కరిస్తే..



రాష్ట్ర శాసనసభ

శాసనసభ్యుల అనర్హతలు

ఆర్టికల్ 191 ప్రకారం రాష్ట్ర శాసనసభ్యుల సభ్యత్వం ఈ కింది సందర్భాల్లో రద్దవుతుంది.

- ఎన్నికైన తర్వాత ప్రభుత్వంలోని లాభదాయక పదవుల్లో కొనసాగినప్పుడు.
- మానసిక స్థిమితం కోల్పోయినట్లు సంబంధిత కోర్టు ధ్రువీకరించినప్పుడు.
- దివాలా తీసినట్లు కోర్టు ధ్రువీకరిస్తే.
- విదేశీ పౌరసత్వాన్ని పొందినప్పుడు లేదా ఇతర దేశాల పట్ల విధేయత ప్రకటించిన సందర్భంలో.
- పార్టీ ఫిరాయింపులకు పాల్పడినప్పుడు
- సభాధ్యక్షుల అనుమతి లేకుండా వరుసగా 60 రోజులు శాసనసభా సమావేశాలకు గైర్హాజరు అయినప్పుడు.
- పార్లమెంటు నిర్ణయించిన ఇతర సందర్భాల్లోనూ సభ్యత్వం రద్దవుతుంది.

ఆర్టికల్ 192 ప్రకారం శాసనసభ్యుల అనర్హతను గవర్నర్ నిర్ణయిస్తారు. కేంద్ర ఎన్నికల సంఘం సలహా మేరకు శాసనసభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేయవచ్చు. గవర్నర్‌దే తుది నిర్ణయం. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ఆయా సభాధ్యక్షులు సంబంధిత పార్టీ అధ్యక్షుడి సలహా మేరకు శాసనసభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేయవచ్చు. శాసనసభ్యులు తమ రాజీనామాను లిఖిత పూర్వకంగా ఆయా సభాధ్యక్షులకు వ్యక్తిగతంగా సమర్పించాలి.

విధాన సభ ఒక బిల్లును ఆమోదించి విధాన పరిషత్‌కు పంపితే ఎగువ సభ దానిపై మూడు నెలల్లోగా తన అభిప్రాయాన్ని తెలపాలి. ఒకవేళ విధాన పరిషత్ ఆ బిల్లును తిరస్కరిస్తే, విధాన సభ రెండోసారి ఆ బిల్లును ఆమోదించి ఎగువ సభ ఆమోదం కోసం మళ్లీ పంపవచ్చు. ఈసారి ఎగువ సభ నెల రోజుల్లోగా తన అభిప్రాయం తెలపాలి. ఆ తర్వాత ఎగువసభ అభిప్రాయంతో నిమిత్తం లేకుండా బిల్లు ఆమోదం పొందినట్లు పరిగణిస్తారు.

పదవీ ప్రమాణ స్వీకారం

శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం గురించి ఆర్టికల్ 188 తెలుపుతుంది. విధాన సభ సభ్యులు, విధాన పరిషత్ సభ్యులతో రాష్ట్ర గవర్నర్ లేదా ఆయన నియమించిన ప్రతినిధి ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ఈ వివరాలను మూడో షెడ్యూల్‌లో పొందుపరిచారు.

జీతభత్యాలు

శాసనసభ్యుల జీతభత్యాలను శాసనసభ ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. వీరి జీతాలను రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. పదవీ విరమణ తర్వాత పెన్షన్ సౌకర్యం ఉంటుంది.

శాసన నిర్మాణ ప్రక్రియ

శాసన నిర్మాణ ప్రక్రియ పార్లమెంటు శాసన నిర్మాణ ప్రక్రియను పోలి ఉంటుంది. సాధారణ బిల్లుల విషయంలో పార్లమెంటులో రాజ్యసభకు లోక్‌సభతో సమానమైన అధికారాలు ఉంటాయి. కానీ రాష్ట్ర శాసనసభలో దిగువ సభ అయిన విధానసభకు ఆధిపత్యం ఉంటుంది. విధానసభ నిర్ణయమే అంతిమంగా చెల్లుబాటు అవుతుంది. ఆర్టికల్ 196 ప్రకారం సాధారణ బిల్లులను ఉభయ సభల్లో ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.

ఎగువసభ ఒక సాధారణ బిల్లును గరిష్ఠంగా నాలుగు నెలల వరకు వాయిదా వేయవచ్చు. కానీ అంతిమంగా విధాన సభ నిర్ణయమే చెల్లుబాటు అవుతుంది. ఉభయ సభల మధ్య బిల్లు విషయంలో వివాదం తలెత్తితే సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. ఒకవేళ బిల్లు ఎగువ సభలో ప్రవేశపెట్టి, ఆమోదించిన తరువాత దాన్ని దిగువ సభ ఆమోదానికి పంపితే, విధాన సభ ఆ బిల్లును తిరస్కరిస్తే బిల్లు వీగిపోతుంది. దీన్నిబట్టి విధాన పరిషత్‌కు సాధారణ బిల్లు విషయంలో కూడా విధాన సభతో సమాన అధికారాలు లేవని అర్థమవుతోంది. ఎగువ సభ బిల్లును వాయిదా వేస్తుందే కానీ అడ్డుకోలేదు. ఆర్థిక, ద్రవ్య బిల్లుల విషయంలో కూడా విధాన సభదే అంతిమ అధికారం.

సభాధ్యక్షులు

(స్పీకర్, డిప్యూటీ స్పీకర్, చైర్మన్, డిప్యూటీ చైర్మన్)

శాసనసభలో ఉభయ సభలకు వేర్వేరుగా సభాధ్యక్షులు ఉంటారు. సభా కార్యక్రమాల నిర్వహణలో వీరు కీలక పాత్ర వహిస్తారు.

స్పీకర్/డిప్యూటీ స్పీకర్

రాష్ట్ర విధాన సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవుల గురించి ఆర్టికల్ 178 తెలుపుతుంది. విధాన సభ సభ్యులే వీరిని ఎన్నుకుంటారు, తొలగిస్తారు. స్పీకర్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యే వ్యక్తి విధాన సభలో సభ్యుడై ఉండాలి. ఆర్టికల్ 179 ప్రకారం స్పీకర్ తన రాజీనామాను డిప్యూటీ స్పీకర్‌కు, డిప్యూటీ స్పీకర్ తన రాజీనామాను స్పీకర్‌కు సమర్పించాలి. రాష్ట్ర విధాన సభ రద్దయినా, తిరిగి నూతన విధాన సభ ఏర్పడే వరకు స్పీకర్ తన పదవిలో కొనసాగుతాడు. ఆర్టికల్ 186 ప్రకారం స్పీకర్, డిప్యూటీ స్పీకర్, విధాన సభ చైర్మన్, డిప్యూటీ చైర్మన్ల జీతభత్యాలను శాసనసభ నిర్ణయిస్తుంది. ఈ అంశాలను రాజ్యాంగంలోని రెండో షెడ్యూల్‌లో పేర్కొన్నారు. వీరి జీతభత్యాలను రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు.

స్పీకర్ అధికారాలు, విధులు

లోక్‌సభ స్పీకర్‌కు ఉన్న అధికారాలు, విధులే రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు కూడా ఉంటాయి. ఆర్టికల్ 181 ప్రకారం స్పీకర్ శాసనసభకు అధ్యక్షత వహించి, సభా కార్యక్రమాలు నిర్వహిస్తాడు. సభలో సభ్యుల ప్రవర్తన, ఇతర ప్రక్రియలను నియంత్రిస్తాడు. సభా కార్యక్రమాలను వాయిదా వేస్తాడు. వివిధ కమిటీలకు చైర్మన్‌లను నియమిస్తాడు. సభావ్యవహారాల కమిటీ, రూల్స్ కమిటీల చైర్మన్‌గా వ్యవహరిస్తాడు. ఒక బిల్లు ద్రవ్య బిల్లా, సాధారణ బిల్లా అనే అంశాన్ని స్పీకర్ ధ్రువీకరిస్తారు. ఈ విషయంలో స్పీకర్‌దే తుది నిర్ణయం. స్పీకర్‌కు నిర్ణయాత్మక ఓటు ఉంటుంది. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం సభ్యులను అనర్హులుగా ప్రకటించే అధికారం స్పీకర్‌కు ఉంది. సభలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను ఏ న్యాయస్థానంలోనూ ప్రశ్నించరాదు.

విధాన పరిషత్ చైర్మన్/డిప్యూటీ చైర్మన్

విధాన పరిషత్ చైర్మన్, డిప్యూటీ చైర్మన్ పదవుల గురించి ఆర్టికల్ 182 తెలుపుతుంది. వీరిని విధాన పరిషత్ సభ్యులే ఎన్నుకుంటారు, తొలగిస్తారు. చైర్మన్ తన రాజీనామా పత్రాన్ని డిప్యూటీ చైర్మన్‌కు, డిప్యూటీ చైర్మన్ తన రాజీనామాను చైర్మన్‌కు సమర్పించాలి.

అధికారాలు, విధులు

విధానసభ స్పీకర్‌కు ఉండే అధికారాలు, విధులే పరిషత్ చైర్మన్‌కు ఉంటాయి. సభకు అధ్యక్షత వహించడం, కార్యక్రమాల నిర్వహణ, సభ్యుల క్రమశిక్షణ నియంత్రణ, కార్యక్రమాల వాయిదా, నిర్ణయాత్మక ఓటు హక్కు కలిగి ఉండటం మొదలైనవాటిని ఉదాహరణగా పేర్కొనవచ్చు. ద్రవ్యబిల్లు విషయంలో విధాన సభ స్పీకర్‌కు ప్రత్యేక అధికారం ఉంటుంది. పరిషత్ చైర్మన్‌కు అలాంటి అధికారాలు లేవు.

వివరణ: రాష్ట్ర శాసనసభలోని ప్రక్రియలు, పద్ధతులు, ఇతర వ్యవహారాలు పార్లమెంటు ప్రక్రియతో సమానంగా ఉంటాయి. కోరం, ప్రశ్నోత్తరాలు, తీర్మానాలు, ప్రతిపాదనలు, తదితర విషయాల్లో శాసనసభకు, పార్లమెంటుకు తేడాల్లేవు.

శాసనసభలో అధికార భాష

ఆర్టికల్ 210 ప్రకారం శాసనసభ కార్యక్రమాలను హిందీ లేదా ఆంగ్ల భాష మాధ్యమంలో నిర్వహిస్తారు. అయితే సభాధ్యక్షుల అనుమతితో సభ్యులు మాతృభాషలో కూడా మాట్లాడవచ్చు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల శాసనసభ సభ్యులు ఇంగ్లిష్, తెలుగు, హిందీ, ఉర్దూ భాషల్లో ప్రసంగించవచ్చు.

శాసనసభ కమిటీలు: కమిటీల గురించి రాజ్యాంగంలో ప్రత్యక్ష ప్రస్తావన లేదు. అయితే ఆర్టికల్ 194లో పరోక్షంగా ప్రస్తావించారు. పార్లమెంటులో మాదిరిగానే రాష్ట్ర శాసనసభలో కూడా కమిటీలు ఉంటాయి. కమిటీల నిర్మాణం, సభ్యుల సంఖ్య, విధులను రాష్ట్ర శాసన సభ ఒక చట్టం ప్రకారం నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ కమిటీల విధులకు సంబంధించి సవరణ చేయాలని ప్రతిపాదించారు.

శాసన నిర్మాణం- పార్లమెంట్, రాష్ట్ర శాసన సభ-పోలికలు, తేడాలు

పార్లమెంటు	రాష్ట్ర శాసన సభ
సాధారణ బిల్లులను ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.	సాధారణ బిల్లులను ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.
ఒక బిల్లు చట్టంగా మారడానికి మూడు దశలుంటాయి.	ఒక బిల్లు చట్టంగా మారడానికి మూడు దశలు ఉంటాయి.
సాధారణ బిల్లు విషయంలో ఉభయ సభల మధ్య ప్రతిష్టంభన ఏర్పడితే సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తారు.	ఈ విషయంలో ఉభయసభల మధ్య సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. దిగువ సభ నిర్ణయమే చెల్లుబాటవుతుంది.
ఒక సభ ఆమోదం పొందిన బిల్లు మరో సభకు వచ్చినప్పుడు, ఆ సభ ఆరు నెలల వరకు ఆ బిల్లును వాయిదా వేయవచ్చు.	విధాన సభ ఆమోదం పొందిన బిల్లు పరిషత్ ఆమోదానికి వచ్చినప్పుడు, ఆ బిల్లును గరిష్ఠంగా నాలుగు నెలల వరకు వాయిదా వేయవచ్చు.
సాధారణ బిల్లు విషయంలో పార్లమెంట్ ఉభయ సభలకు సమాన అధికారాలు ఉంటాయి.	సాధారణ బిల్లు విషయంలోనూ విధాన సభ నిర్ణయమే అంతిమంగా చెల్లుబాటు అవుతుంది.
ద్రవ్య బిల్లు విషయంలో లోక్ సభదే అంతిమ నిర్ణయం.	ద్రవ్యబిల్లు విషయంలో విధాన సభదే అంతిమ నిర్ణయం.
ద్రవ్య బిల్లుపై రాజ్యసభలో చర్చించవచ్చు. ఓటింగ్ అధికారం లేదు. రాజ్యసభ 14 రోజుల్లోగా ద్రవ్య బిల్లుపై తన నిర్ణయాన్ని తెలపాలి.	ద్రవ్యబిల్లుపై విధాన పరిషత్‌లో చర్చించవచ్చు. ఓటింగ్ అధికారం లేదు. విధాన పరిషత్ 14 రోజుల్లోగా ద్రవ్యబిల్లుపై తన నిర్ణయాన్ని తెలపాలి.
రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్ ఏ సభలోనైనా ప్రతిపాదించవచ్చు.	రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రతిపాదించే అధికారం శాసన సభకు లేదు. కానీ పార్లమెంటు ఆమోదించిన కొన్ని రాజ్యాంగ సవరణలను శాసనసభల అంగీకారం కోసం నివేదిస్తారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. గవర్నర్‌ను అభిశంసించే అధికారం ఎవరికి ఉంటుంది?
   ఎ) పార్లమెంట్ బి) రాష్ట్ర అసెంబ్లీ
   సి) సుప్రీంకోర్టు డి) ఎవరూ కాదు
2. కింది ఏ రాష్ట్రానికి ఇప్పటి వరకు మహిళ ముఖ్యమంత్రిగా పని చేయలేదు?
   ఎ) కర్ణాటక బి) కేరళ సి) ఏపీ డి) పైవన్నీ
3. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులను ఎవరు నియమిస్తారు?
   ఎ) గవర్నర్ బి) ముఖ్యమంత్రి
   సి) రాష్ట్రపతి డి) యూపీఎస్సీ

సమాధానాలు: 1) డి; 2) డి; 3) ఎ.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది?
   ఎ) విధాన సభ్యుల సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్‌కు 10వ స్థానం
   బి) విధాన సభ్యుల సంఖ్యాపరంగా తెలంగాణకు 14వ స్థానం
   సి) విధాన పరిషత్ సభ్యుల సంఖ్యాపరంగా ఆంధ్రప్రదేశ్‌కు 5వ స్థానం
   డి) పైవన్నీ
2. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ పదవీకాలాన్ని ఎన్ని పర్యాయాలు పొడిగించారు?
   ఎ) ఒక పర్యాయం
   బి) రెండు పర్యాయాలు
   సి) మూడు పర్యాయాలు
   డి) పైవేవీ కాదు
3. రాష్ట్ర విధాన పరిషత్ బిల్లును తిరస్కరిస్తే జరిగే పరిణామం?
   ఎ) బిల్లు వీగిపోతుంది
   బి) సంయుక్త సమావేశం ఉంటుంది
   సి) విధాన సభ నిర్ణయం నెగ్గుతుంది
   డి) గవర్నర్ విచక్షణ అధికారంపై ఆధారపడి ఉంటుంది.
4. రాష్ట్ర ఎగువ సభ ఉనికి ఎవరి విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది?
   ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
   సి) రాష్ట్ర దిగువ సభ డి) పైవేవీ కాదు
5. దేశంలో మొదటి దళిత ముఖ్యమంత్రి?
   ఎ) జగ్జీవన్‌రామ్-ఉత్తరప్రదేశ్
   బి) కాన్షీరామ్-బిహార్
   సి) దామోదరం సంజీవయ్య-ఆంధ్రప్రదేశ్
   డి) మాయావతి-ఉత్తరప్రదేశ్
6. రాష్ట్ర విధానసభ స్పీకర్ రాజీనామా లేఖను ఎవరికి అందజేయాలి?
   ఎ) రాష్ట్రపతి బి) గవర్నర్
   సి) ముఖ్యమంత్రి డి) డిప్యూటీ స్పీకర్

సమాధానాలు:
1) డి; 2) ఎ; 3) సి; 4) సి; 5) సి; 6) డి.

‘పఠనం కంటే లేఖనం సులువైన నైపుణ్యం’



భాషా నైపుణ్యాలు

మాదిరి ప్రశ్నలు

1. భాషా నైపుణ్యాలకు మరోపేరు?
   1) స్పష్టీకరణలు 2) ప్రాతిపదిక లక్ష్యాలు
   3) బోధనా నైపుణ్యాలు
   4) బోధనాభ్యసన సూత్రాలు
2. భాషా నైపుణ్యాల్లో కఠినతరమైంది ఏది?
   1) శ్రవణం 2) భాషణం
   3) పఠనం 4) లేఖనం
3. ‘పఠనం కంటే లేఖనం సులువైన నైపుణ్యం’ అని పేర్కొన్న విద్యావేత్త?
   1) బ్రూనర్ 2) రైబర్న్
   3) మాంటిస్సోరి 4) ఫ్రోబెల్
4. ‘నయనమితి’ ఏ పఠనానికి ఉపయోగపడుతుంది?
   1) క్షుణ్న పఠనం 2) విస్తార పఠనం
   3) మౌన పఠనం 4) ప్రకాశ పఠనం
5. భాషా నైపుణ్యాలన్నింటికీ ప్రథమ సోపానం ఏది?
   1) భాషణం 2) పఠనం
   3) శ్రవణం 4) లేఖనం
6. ఉపాధ్యాయుడు బోధిస్తుంటే వింటూ అక్షరాలను చూడకుండా అక్షర స్వరూపాన్ని గుర్తుచేసుకుంటూ రాసే లేఖనం?
   1) దృష్ట లేఖనం 2) ఉక్త లేఖనం
   3) సంక్షిప్త లేఖనం
   4) వివరణాత్మక లేఖనం
7. మాట్లాడేటప్పుడు భావానుగుణమైన స్వర భేదం పాటిస్తూ వ్యక్తీకరిస్తే అది ఏ భాషణంలోకి వస్తుంది?
   1) వాచిక చర్య 2) ఉక్త రచన
   3) ఆంగికాభినయం
   4) వాచికాభినయం
8. పద్య గద్యాత్మకమైన వాచక పుస్తకాల్లో విద్యార్థులు చేసే పఠనం ఏది?
   1) ప్రకాశ పఠనం 2) క్షుణ్న పఠనం
   3) మౌన పఠనం 4) విస్తార పఠనం
9. శిశుగీతాలు, అభినయ గేయాల ద్వారా ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో ఏ నైపుణ్యాన్ని పెంపొందిస్తాడు?
   1) భాషణం 2) శ్రవణం
   3) పఠనం 4) లేఖనం
10. వాచికాభినయంతోపాటు ఆంగికాభినయం కూడా ఉండే గేయాలను ఏమంటారు?
    1) కథా గేయాలు 2) అభినయ గేయాలు
    3) బాల గేయాలు 4) శిశు గేయాలు
11. విద్యార్థుల అందమైన దస్తూరిని ప్రామాణీకరించే సాధనాలను ఏమంటారు?
    1) నికషలు 2) చెక్‌లిస్ట్
    3) రేటింగ్ స్కేల్ 4) లింగ్వాఫోన్
12. విద్యార్థుల్లో వాచిక చర్యను పెంపొందించడానికి ఉపకరించేవి ఏవి?
    1) బాల గేయాలు (శిశు గేయాలు)
    2) అభినయ గేయాలు
    3) కథాకథనం - నాటకీకరణం
    4) పైవన్నీ
13. ఒక విద్యార్థి దాశరథి బిరుదును ‘కవి బ్రహ్మ’ అని చెప్పాడు. అతడు చేసిన దోషం?
    1) భాషాదోషం 2) భావదోషం
    3) సాహిత్య దోషం 4) ఉచ్చారణ దోషం
14. విద్యార్థుల పఠన దోషాలను సవివరంగా క్రోడీకరించి తెలిపిన వారు?
    1) రస్సెల్ 2) బ్రూనర్
    3) మెంజిల్ 4) రైబర్న్
15. ‘రాత నేర్పడం అనేది చాలా కష్టమైన చర్య’ అని పేర్కొన్న విద్యావేత్త?
    1) మాంటిస్సోరి 2) రైబర్న్
    3) స్టాన్లీహాల్ 4) బ్రూనర్
16. శ్రోతలు అనుసరించలేనంత వేగంగా మాట్లాడటం అనేది ఎలాంటి దోషం?
    1) భావదోషం 2) సమవేగ రాహిత్యం
    3) భాషాదోషం 4) ఉచ్చారణ దోషం
17. విద్యార్థుల వాగింద్రియాల్లో లోపం ఉన్నప్పుడు ఏర్పడే దోషాలు?
    1) భావ దోషాలు 2) ఉచ్చారణ దోషాలు
    3) భాషా దోషాలు 4) పైవన్నీ
18. విద్యార్థులకు పఠన నైపుణ్యం ఏ విధంగా అలవడుతుంది?
    1) జన్మతః అలవడుతుంది
    2) ప్రేరణ ద్వారా అలవడుతుంది
    3) భాషణం వల్ల అలవడుతుంది
    4) ప్రయత్న పూర్వకంగా అలవడుతుంది
19. ‘చూపుమేర, పలుకుమేర’ అంతరాన్ని మరో విధంగా ఏమని పిలుస్తారు?
    1) వాఙ్మితి 2) వాఙ్మయనమితి
    3) నయనమితి 4) పురోగమన వాఙ్మయనమితి
20. కింది వాటిలో భావ దోషం ఏది?
    1) నన్నయ బిరుదు ‘కవిబ్రహ్మ’
    2) తిక్కన ఆదికవి
    3) వానమామలై వరదాచార్యులు ‘అభినవ తిక్కన’
    4) పైవన్నీ
21. ‘స్త్రీ మహిళా జాతిని తక్షణమే ఉద్ధరించాలి’ అనే వాక్యంలో ఉన్న దోషం ఏది?
    1) భావ దోషం 2) భాషా దోషం
    3) వ్యాకరణ దోషం 4) అలంకార దోషం
22. జ్ఞాన సముపార్జనకు ఉపయోగపడే భాషా నైపుణ్యం?
    1) శ్రవణం 2) భాషణం
    3) పఠనం 4) లేఖనం
23. ‘ఇమ్ముగ జదువని నోరును... గుమ్మరి మను ద్రవ్వినట్టి గుంటర సుమతీ!’ అనే పద్యంలో ఏ భాషా నైపుణ్య ప్రాధాన్యాన్ని కవి వివరించాడు?
    1) భాషణం 2) పఠనం
    3) శ్రవణం 4) లేఖనం
24. ఉత్తమ పఠనం ప్రయోజనం ఏది?
    1) లోకజ్ఞాన సముపార్జన
    2) మూర్తిమత్వ వికాసం
    3) జ్ఞాన సంపద విస్తరణ
    4) పైవన్నీ
25. కథా పద్ధతిని శ్రేష్ఠమైందిగా పేర్కొన్న మనోవైజ్ఞానిక శాస్త్రవేత్త ఎవరు?
    1) స్టాన్లీహాల్ 2) రైబర్న్
    3) మాంటిస్సోరి 4) బ్రూనర్
26. ‘భాష ఏక లక్షణం ఉన్న వస్తువు కాదు. అది సంక్లిష్ట దృగ్విషయం’ అని పేర్కొన్న వారు?
    1) ఎస్.కె. కృష్ణస్వామి 2) ఎస్.కె. వర్మ
    3) ఎన్. కృష్ణస్వామి 4) 2, 3
27. అక్షర చిత్రాలను చదివించడం వల్ల విద్యార్థుల్లో ప్రధానంగా పెంపొందే సామర్థ్యం ఏది?
    1) శ్రవణం 2) పఠనం
    3) లేఖనం 4) భాషణం
28. ప్రకాశ పఠనం ప్రయోజనం ఏది?
    1) స్పష్టమైన ఉచ్చారణ సామర్థ్యం
    2) చక్కని పఠన శైలి
    3) భావస్ఫోరక పఠనం 4) పైవన్నీ
29. ప్రకాశ పఠనం అనేది ఏ దశ విద్యార్థులకు ఉపయోగం?
    1) ప్రాథమిక దశ 2) మాధ్యమిక దశ
    3) ఉన్నత పాఠశాల దశ 4) కళాశాల దశ
30. గ్రంథాలయాల్లో ఉపయోగించకూడని పఠనం?
    1) క్షుణ్న పఠనం 2) మౌన పఠనం
    3) ప్రకాశ పఠనం 4) విస్తార పఠనం
31. మౌన పఠనానికి పర్యాయ పదం?
    1) అంతర పఠనం 2) నిగూఢ పఠనం
    3) గంభీర పఠనం 4) పైవన్నీ
32. కింది వాటిలో మౌన పఠన ప్రయోజనం ఏది?
    1) విస్తృత జ్ఞానప్రాప్తి
    2) పాఠకుడికి మానసిక విశ్రాంతి
    3) గ్రంథాలయాల్లో ఉపయోగం 4) పైవన్నీ
33. ‘కొన్ని పుస్తకాలను రుచి చూడాలి. మరికొన్ని పుస్తకాలను నమిలి మింగాలి. ఇంకొన్ని పుస్తకాలను నమిలి మింగడమేకాక జీర్ణం చేసుకోవాలి’ అని వ్యాఖ్యానించిన వారెవరు?
    1) మహాత్మా గాంధీ 2) రవీంద్రనాథ్ ఠాగూర్
    3) ఫ్రాన్సిస్ బేకన్ 4) హెర్బర్ట్ రీడ్
34. క్షుణ్న పఠనం ద్వారా సమగ్ర జ్ఞాన సముపార్జన, భాషపై అధికారం సమకూరుతుందని పేర్కొన్నవారు?
    1) గొడవర్తి సూర్యనారాయణ 2) హెర్బర్ట్ రీడ్
    3) ఎస్.కె. వర్మ 4) ఫ్రాన్సిస్ బేకన్
35. క్షుణ్న పఠన ప్రయోజనం ఏది?
    1) రసానుభూతి 2) ఆనందానుభూతి
    3) భాషపై పట్టు, అధికార సాధన 4) పైవన్నీ

సమాధానాలు

1) 2	2) 4	3) 3	4) 3	5) 3
6) 2	7) 4	8) 2	9) 1	10) 2
11) 3	12) 4	13) 2	14) 3	15) 2
16) 3	17) 4	18) 4	19) 2	20) 4
21) 2	22) 3	23) 2	24) 4	25) 2
26) 4	27) 2	28) 4	29) 1	30) 3
31) 4	32) 4	33) 3	34) 4	35) 4

గతంలో అడిగిన ప్రశ్నలు

1. విద్యాలక్ష్యాలు సాధించడానికి విద్యావిధానంలో చేర్చిన ప్రక్రియ ఏది? (టెట్ - 2012)
   1) మూల్యాంకనం 2) బోధన
   3) అభ్యసనం
   4) బోధనాభ్యసన క్రియ
2. ‘సామూహిక విద్యా సౌకర్యాలకు కావ్య భాష చాలదు’ అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారెవరు? (టెట్ - 2012)
   1) గురజాడ అప్పారావు
   2) కందుకూరి వీరేశలింగం
   3) వేదం వేంకటరాయశాస్త్రి
   4) గిడుగు రామ్మూర్తి
3. ముఖయంత్రంలో ధ్వని పుట్టే పై భాగాలను ఏమంటారు? (టెట్ - 2011)
   1) ప్రయత్నం 2) జిహ్వ
   3) స్థానం 4) కరణం
4. ఒక్క గుక్కలో ఒకేసారి ఉచ్చరించగలిగే పద సముదాయాన్ని ఏమంటారు? (టెట్ - 2011)
   1) పురోగమన వాఙ్మయ సమితి
   2) తిరోగమన వాఙ్మయ సమితి
   3) నయనమితి 4) వాఙ్మితి
5. విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసేది?
   1) విద్యా ప్రణాళిక 2) వార్షిక ప్రణాళిక
   3) పాఠ్య ప్రణాళిక
   4) సహపాఠ్య ప్రణాళిక
6. ఉక్త రచన ద్వారా కింది వాటిలో ఏ భాషా నైపుణ్యాన్ని పెంపొందించవచ్చు? (ఎల్.పి. - 2012)
   1) భాషణం 2) శ్రవణం
   3) లేఖనం 4) పఠనం
7. విద్యార్థులకు లేఖనాన్ని నేర్పడానికి తెలుగు వర్ణాల్లో దాగి ఉన్న అనేక రకాల గీతలను ముందుగా రాయించాలి. ఈ పద్ధతిని ఏమని పిలుస్తారు? (ఎల్.పి. - 2012)
   1) ఆధునిక పద్ధతి
   2) సాంప్రదాయిక పద్ధతి
   3) అక్షర పద్ధతి
   4) రూప సాదృశ్య పద్ధతి
8. చూచి రాతకు, మేలు బంతి రాతకు (ఒరవడి) ఉన్న ప్రధాన భేదం? (ఎల్.పి. - 2012)
   1) స్వతంత్ర లేఖనం కాకపోవడం
   2) చూచి రాయడం
   3) కాలనిర్ణీతి లేకపోవడం
   4) అక్షర పరిమాణం నియతంగా ఉండటం
9. విద్యా ప్రణాళిక అంటే ఏమిటి? (డీఎస్సీ - 2012)
   1) విద్యాసంస్థ బయట నిర్వహించే కార్యక్రమాల సమూహం
   2) విద్యాసంస్థల్లో నిర్వహించే కార్యక్రమాల సమూహం
   3) తరగతి గదిలో నిర్వహించే కార్యక్రమాల సమూహం
   4) విద్యాసంస్థ లోపల, బయట నిర్వహించే కార్యక్రమాల సమూహం
10. మౌఖిక భాషకు స్థిరత్వం కల్పించేది? (డీఎస్సీ - 2012)
    1) వాచికం 2) పఠనం
    3) లేఖనం 4) శ్రవణం

సమాధానాలు

1) 1	2) 4	3) 3	
4) 4	5) 1	6) 1	
7) 1	8) 4	9) 4	10) 3

ఉద్యోగాలు

జేఎన్ఏఆర్‌డీడీసీ, వాడి నాగ్‌పూర్‌లో జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ ఖాళీలు

వాడి నాగ్‌పూర్(మహారాష్ట్ర)లోని జవహర్ లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్(జేఎన్ఏఆర్‌డీడీసీ).. సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్)/జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 05

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు గేట్/నెట్ స్కోరు ఉండాలి.

వేతనం: నెలకు సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్) పోస్టులకు రూ.28,000, జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్) పోస్టులకు రూ.25,000.

వయసు: 30 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తులకు చివరితేది: 30.08.2024.

వెబ్‌సైట్: https://jnarddc.gov.in/

హెచ్ఏఎల్ బెంగళూరులో 25 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్).. నాన్ ఎగ్జిక్యూటివ్ (గ్రూప్-డి, సి) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 25

పోస్టుల వివరాలు: డిప్లొమా టెక్నీషియన్ (డి-6)-06, ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్ (డి-6)-17, ఆపరేటర్(సి-5)-02.

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ వర్క్స్, స్ట్రక్చర్, గ్రైండర్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.

వయసు: 31.07.2024 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

వేతనం: నెలకు గ్రూప్-డి పోస్టులకు రూ. 48,764, గ్రూప్-సి పోస్టులకు రూ.46,796.

ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తులకు చివరితేది: 30.08.2024.

రాతపరీక్ష తేది: 22.09.2024.

వెబ్‌సైట్: https//hal-india.co.in

సమాచార ప్రసారానికి తోడ్పడే వాతావరణ పొర ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్

పర్యావరణం

భూమిపై ఉన్న ఘన, ద్రవ, వాయు, జీవ సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు. జీవుల మనుగడకు అవసరమైన గాలి, నీరు, ఆహారం పూర్తిగా కలుషితమవుతున్నాయి. సహజ వనరులు తరిగిపోతుండటంతో డిమాండ్ పెరుగుతోంది. ఫలితంగా వాటి దుర్వినియోగం కూడా అధికమై పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితిగతులపై పర్యావరణ నష్ట ప్రభావం తీవ్రంగా ఉంది. వంట చెరకు లభ్యత, పశుగ్రాసం, భూగర్భ, ఉపరితల వనరులు తగ్గి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోంది. ఒక ప్రాంత సుస్థిరాభివృద్ధి పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉంటుంది.

పర్యావరణ విభాగాలు

పర్యావరణాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. అవి..

1. వాతావరణం(అట్మాస్ఫియర్)
2. శిలావరణం(లిథోస్ఫియర్)
3. జలావరణం(హైడ్రోస్ఫియర్)
4. జీవావరణం(బయోస్ఫియర్)

వాతావరణం (అట్మాస్ఫియర్)

భూమి ఉపరితలంపై ఉన్న వాయు పొరల నిర్మాణమే వాతావరణం లేదా అట్మాస్ఫియర్. గురుత్వాకర్షణ శక్తి వల్ల ఇది భూమిపై ఉంటుంది. ఇందులో ట్రోపోస్ఫియర్, స్ట్రాటోస్ఫియర్, మీసోస్ఫియర్, థర్మోస్ఫియర్ అనే నాలుగు విభాగాలున్నాయి. రెండు పొరల మధ్య హద్దుగా ఉండే ప్రాంతాన్ని 'పాజ్' అంటారు. ఉదాహరణకు.. స్ట్రాటోస్ఫియర్, మీసోస్ఫియర్ మధ్యనున్న ప్రాంతాన్ని స్ట్రాటోపాజ్ అంటారు.

ట్రోపోస్ఫియర్

ఇది భూమి ఉపరితలానికి దగ్గరగా ఉన్న వాతావరణ పొర. ఈ పొర ధ్రువాల వద్ద 6-8 కి.మీ. ఎత్తు వరకు, భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. పైకి వెళ్లేకొద్దీ ప్రతి కిలోమీటరుకు ఉష్ణోగ్రత ఆరు డిగ్రీల చొప్పున తగ్గుతుంది. సుమారు 12 కి.మీ. ఎత్తు వద్ద ట్రోపోపాస్ అనే పరివర్తన ప్రాంతం మొదలవుతుంది. ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతాయి.

స్ట్రాటోస్ఫియర్

వాతావరణంలోని రెండో పొర అయిన స్ట్రాటోస్ఫియర్, ట్రోపోపాజ్ నుంచి మొదలై 50 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది.



ఇక్కడ ఉష్ణోగ్రత మైనస్ 60 డిగ్రీలుగా ఉంటుంది. ఈ ప్రాంతంలో గంటకు 320 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. స్ట్రాటోస్ఫియర్‌లో ఓజోన్ అధిక మోతాదులో ఉండటం వల్ల దీన్ని ఓజోనోస్ఫియర్ అని కూడా అంటారు. హానికర అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని చేరకుండా ఈ పొర అడ్డుకుంటుంది.

మీసోస్ఫియర్

స్ట్రాటోపాజ్ నుంచి దాదాపు 80 కి.మీ. ఎత్తు వరకు ఈ ప్రాంతం విస్తరించి ఉంటుంది. ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతాయి. మీసోస్ఫియర్ పైనున్న ప్రాంతం వాతావరణంలోని అన్ని భాగాల కంటే అత్యంత శీతలంగా ఉంటుంది. ఉల్కాపాతం భూమిని చేరకపోవడానికి మీసోస్ఫియరే కారణం.

థర్మోస్ఫియర్

ఇది మీసోపాజ్ నుంచి మొదలవుతుంది. థర్మోస్ఫియర్‌ను ఐనోస్ఫియర్, ఎక్సోస్ఫియర్‌లుగా విభజిస్తారు. కింది భాగమైన ఐనోస్ఫియర్ భూవాతావరణంలో 100-120 కి.మీ. ఎత్తు నుంచి 550 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. ఐనోస్ఫియర్‌లో నత్రజని, ఆక్సిజన్ లాంటి మూలకాల పరమాణువులు సౌర వికిరణాన్ని గ్రహించి అయానీకరణం చెందుతాయి. భూ ఉపరితలం నుంచి వచ్చే రేడియో తరంగాలను పరావర్తనం చేసి సమాచార ప్రసారానికి ఐనోస్ఫియర్ తోడ్పడుతోంది. బలమైన సౌరగాలులు వీచినప్పుడు ఐనోస్ఫియర్ సంఘటనం మారే ప్రమాదం ఉంది. ఫలితంగా సమాచార వ్యవస్థలు దెబ్బతింటాయి.

శిలావరణం

భూమిపై ఉన్న ఖండాలన్నింటినీ కలిపి శిలావరణం అంటారు. భూమి ఉపరితలం మొత్తం కొన్ని ప్రత్యేక ఫలకాలపై అమరి ఉంటుంది. ఈ ఫలకాల నిర్మాణం, వాటి కదలికలను ప్లేట్ టెక్టానిక్స్ సిద్ధాంతం వివరిస్తుంది. 200 మిలియన్ సంవత్సరాల కిందట భూభాగం మొత్తం ఒకే చోట కలిసి ఉండేది. దీన్ని పాంజియా అని పిలుస్తారు. 50 మిలియన్ ఏళ్ల క్రితం ఇది రెండు భాగాలుగా చీలింది. ఉత్తరంగా ఉన్న భాగాన్ని లారెన్షియా అని, దక్షిణ దిశగా విడిపోయిన ప్రాంతాన్ని గోండ్వానా అని పిలుస్తారు. ఇవి మరింత దూరం కదిలి ప్రస్తుత ఖండాలు ఏర్పడ్డాయి. ఖండ చలన సిద్ధాంతం.. ఖండాల నిర్మాణం, వాటి కదలికలను వివరిస్తుంది. భూమి ఉపరితలం నుంచి లోపలి వైపు మూడు భాగాలుంటాయి. భూపటలం(క్రస్ట్), భూప్రావారం (మాంటిల్), భూకేంద్రం(కోర్). భూపటలం ఉపరితలం నుంచి సుమారు 100 కి.మీ. లోతు వరకు ఉంటుంది. భూపటల ఉపరితలంపై వదులుగా ఉండే పొరలను మృత్తిక లేదా నేల అంటారు. 100 కి.మీ. లోతు నుంచి 2900 కి.మీ. లోతు వరకు భూప్రావారం(మాంటిల్) అనే పొర ఉంటుంది. దీని తర్వాత మధ్యభాగం భూకేంద్రం(కోర్). దీనిలో బాహ్యకేంద్రం, అంతర కేంద్రం అనే రెండు భాగాలు ఉంటాయి. బాహ్యకేంద్రం 2900 కి.మీ. నుంచి 5100 కి.మీ. వరకు ఉంటుంది. అంతర కేంద్రం 5100 కి.మీ. నుంచి సుమారు 6378 కి.మీ. వరకు ఉంటుంది.

జలావరణం

భూమిపై వివిధ రూపాల్లో ఉన్న మొత్తం నీటిని జలావరణం లేదా హైడ్రోస్ఫియర్ అంటారు. పూర్వం సముద్ర జలమంతా పూర్తిగా సాదు జలంగా ఉండేది. కొన్ని మిలియన్ సంవత్సరాల నుంచి నేల క్రమక్షయం జరిగి ఖనిజాలు సముద్రంలోకి చేరడంతో లవణీయత పెరిగింది. భూమి ఉపరితలం 75 శాతం నీటితో నిండి ఉంది.

భూమిపై ఉన్న మొత్తం నీటిలో 97.5 శాతం సముద్రాల్లోనే ఉంది. మిగతా 2.5 శాతం నీరు సాదుజలం లేదా మంచి నీరు. మంచి నీటిలో 0.3 శాతం నదులు, సరస్సుల్లో ఉంది. భూగర్భ జలంగా 30.8 శాతం, హిమనీనదాల రూపంలో 68.9 శాతం ఉంది.

భూమిపై నీటి విస్తరణను జల వలయం నిర్ధారిస్తుంది. నీరు ఆవిరై మేఘాల రూపంలోకి సాంద్రీకరణం చెంది ఆ తర్వాత మంచు, వర్షం రూపంలో భూమిని చేరుతుంది. ఇలా చేరిన నీటిలో కొద్ది మొత్తం భూగర్భంలోకి ఇంకుతుంది. మిగతాది నదులు, సముద్రాల్లోకి చేరుతుంది. ధ్రువ ప్రాంతాల్లో శీతాకాలంలో ఈ నీరు గడ్డకట్టి వేసవిలో కరుగుతుంది. ఈ రకమైన నిరంతర నీటి ఆవిరి కదలికలను జలవలయం అంటారు.

జీవావరణం

భూమిపై ఉన్న జీవులు, జీవం విస్తరించిన ప్రాంతాలన్నింటినీ కలిపి బయోస్ఫియర్ అంటారు. భూమిపై సుమారు 3.5 బిలియన్ సంవత్సరాల క్రితం జీవం ఆవిర్భవించింది. అనేక సిద్ధాంతాలు భూమిపై జీవం ఆవిర్భవించే విధానాన్ని వివరిస్తున్నాయి. వీటిలో ముఖ్యమైనవి...

1. ప్రత్యేక సృష్టి సిద్ధాంతం: దీని ప్రకారం భూమిపై జీవులను దేవుడు సృష్టించాడు. ఈ సిద్ధాంతానికి తగిన నిదర్శనాలు లేని కారణంగా దీన్ని నమ్మకంగానే భావిస్తారు.
2. పాన్‌స్పెర్మియ సిద్ధాంతం: దీని ప్రకారం భూమిపై జీవులు ఆవిర్భవించలేదు. భూమి ఆవల నుంచి గ్రహశకలాలు లేదా గ్రహాంతర వాసుల ద్వారా భూమిపైకి చేరి ఆ తర్వాత పరిణామ క్రమంలో మార్పు చెందాయి.
3. జీవ ఆవిర్భావ సిద్ధాంతం: అలెగ్జాండర్ ఇవనోవిచ్ ఒపారిన్, జె.బి.ఎస్. హాల్డెన్ అనే శాస్త్రవేత్తలు ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం భూమిపై జీవ ఆవిర్భావానికి ముందు జీవ రసాయనాలు ఆవిర్భవించాయి. ఈ జీవ రసాయనాల చర్యల ద్వారా భూమిపై పూర్వ జీవకణాలు ఏర్పడ్డాయి. తర్వాత వాటి నుంచి సంపూర్ణ జీవకణాలు ఆవిర్భవించాయి. భూమిపై ఆవిర్భవించిన తొలి తరం జీవులన్నీ అవాయు జీవులు. ఇలాంటి కొన్ని అవాయు జీవులు నీటి అణువులను విచ్ఛిన్నం చేయడంతో గాల్లోకి క్రమంగా ఆక్సిజన్ విడుదలైంది. తొలుత కేంద్రక పూర్వ జీవులు ఏర్పడి ఆ తర్వాత నిజ కేంద్రక జీవులు ఆవిర్భవించాయి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆవరణ వ్యవస్థలో గతిశీల భాగం? (గ్రూప్-2, 2008)
   ఎ) ఆహార గొలుసు బి) ఇకలాజికల్ నిచే
   సి) ఎకోటోన్ డి) ఏదీకాదు
2. పాన్‌స్పెర్మియ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది? (2004 గ్రూప్-1)
   ఎ) అర్హీనియస్ బి) ఒపారిన్
   సి) స్వారెజ్ డి) ఎవరూ కాదు
3. తక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకునే జీవులను ఏమంటారు? (గ్రూప్-1 2010 రీ ఎగ్జామ్)
   ఎ) స్టెనోథర్మల్ బి) సైక్రోఫైల్స్
   సి) యూరిథర్మల్ డి) పైకిలో థర్మల్
4. భారతదేశంలోని విశిష్టమైన స్త్రీ పర్యావరణ వేత్త (ఎన్విరాన్‌మెంటలిస్ట్) ఎవరు? (గ్రూప్-1, 1999)
   ఎ) మేధాపాట్కర్ బి) మమతా బెనర్జీ
   సి) సరోజినీ మహర్షి డి) మార్గరెట్ ఆల్వా
5. కింది వాటిలో ఫ్లోటింగ్ నేషనల్ పార్కు ? (సివిల్స్ ప్రిలిమ్స్-2015)
   ఎ) కజిరంగ జాతీయ పార్కు
   బి) కైబుల్ లామ్జావు జాతీయ పార్కు
   సి) కార్బెట్ జాతీయ పార్కు
   డి) ఏదీకాదు

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) బి.

మాదిరి ప్రశ్నలు

1. ఓజోన్ పొర సంరక్షణకు ఏర్పాటైన అంతర్జాతీయ ఒప్పందం?
   ఎ) క్యోటో ఒప్పందం
   బి) మాంట్రియాల్ ఒప్పందం
   సి) స్టాక్‌హోమ్ ఒప్పందం
   డి) రామ్సార్ ఒప్పందం
2. కింది వాటిలో ఓజోన్ పొరను దెబ్బతీసేది?
   ఎ) క్లోరోఫ్లోరో కార్బన్లు బి) హాలోన్లు
   సి) మిథైల్ బ్రోమైడ్ డి) పైవన్నీ
3. చిప్కో ఉద్యమం ఏ ప్రాంతంలో ప్రారంభమైంది?
   ఎ) ఉత్తరాంచల్ బి) కర్ణాటక
   సి) బిహార్ డి) మధ్యప్రదేశ్
4. చిప్కో ఉద్యమంలో పాల్గొన్నవారు?
   ఎ) సుందర్‌లాల్ బహుగుణ
   బి) చండీ ప్రసాద్ భట్
   సి) సుదేశాదేవి డి) పైవారందరూ
5. సైలెంట్ స్ప్రింగ్ అనే గ్రంథాన్ని రచించి అమెరికాలో డి.డి.టి.కి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించింది ఎవరు?
   ఎ) జాన్ ముయర్
   బి) బెంజిమిన్ ఫ్రాంక్లిన్
   సి) రాచెల్ కార్సన్ డి) ఎవరూ కాదు
6. 'ఎ శాండ్ కౌంటీ ఆల్మనాక్' గ్రంథ రచయిత ఎవరు?
   ఎ) డేవిడ్ హెన్రీ
   బి) ఆల్డో లియోపోల్డ్
   సి) జాన్ ముయర్
   డి) బెంజిమిన్ ఫ్రాంక్లిన్
7. అటవీ హక్కు చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
   ఎ) 2006 బి) 2007
   సి) 2008 డి) 2009
8. 1986లో అమల్లోకి వచ్చిన చట్టం?
   ఎ) జల కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం
   బి) వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం
   సి) పర్యావరణ పరిరక్షణ చట్టం
   డి) జల కాలుష్య సుంకం చట్టం
9. జీవవైవిధ్య చట్టాన్ని అమలు చేసే నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ ఎక్కడ ఉంది?
   ఎ) చెన్నై, తమిళనాడు
   బి) బెంగళూరు, కర్ణాటక
   సి) హైదరాబాద్, తెలంగాణ
   డి) తిరువనంతపురం, కేరళ
10. భూమిపై ఆవిర్భవించిన మొదటి పూర్వకణానికి ఒపారిన్ ఇచ్చిన పేరు?
   ఎ) ప్రోటినాయిడ్ బి) సింబయాంట్
   సి) కొయసెర్వేట్ డి) ప్రోక్యారియోట్

సమాధానాలు


1) బి; 2) డి; 3) ఎ; 4) డి; 5) సి;
6) బి; 7) ఎ; 8) సి; 9) ఎ; 10) సి.

How many students in the College..

Model Questions

Directions (Q. No. 1-5) : Study the given information carefully and answer the questions given below.

The number of Mobile users of Three Brands (LG, Samsung and Nokia) in Different cities. The percentage of Female among these Mobiles users.



Cities	Percent Female (LG)	Percent Female (Samsung)	Percent Female (Nokia)
A	30	45	51
B	36	42	48
C	54	50	45
D	39	49	50
E	46	58	55
F	49	58	42

1. What is the number of female mobile users of LG brand in city C?
   a) 18750 b) 19700 c) 20400
   d) 21600 e) 22500



2. What is the total number of male users of Nokia brand in all the cities?
   a) 156100 b) 157200 c) 158400
   d) 159700 e) None of these
3. What is the difference between the average number of Samsung mobile users and the average number of LG mobile users in all the six cities together?
   a) 3500 b) 2800 c) 3750
   d) 4200 e) None of these
4. The number of Female Samsung users in city A and B together is approximately what percent of the total no. of male LG users in cities C and D together?
   a) 71.165% b) 77.4%
   c) 83.721% d) 84.64%
   e) 104.29%
5. The number of Male Nokia users in City E is approximately what percentage more than the number of female Nokia users in City F?
   a) 84 b) 93 c) 98
   d) 74 e) 62

Directions (Q. No. 6-10) : Study the following information carefully to answer the given questions.

In a medical college there are 1600 students studying Dentistry and Homeopathy. Each student from each course knows one or more languages out of English, Hindi and Bangla. 45% of the students study Dentistry and remaining students study Homeopathy.

Out of the students studying Dentistry, boys and girls are in the ratio of 5:3 respectively. Out of the boys studying. Dentistry, 16% know only English, 10% know only Hindi and 4% only known Bangla. 24% know English as well as Hindi, 20% know English as well as Bangla and 14% and know Hindi as well as Bangla. Remaining boys know all three languages.

Out of the girls studying Dentistry, 20% know only English, 10% know only Hindi and 10% know only Bangla. 20% know English as well as Hindi, 20% know English as well as Bangla and 10% know Hindi as well as Bangla. Remaining girls know all three language.

Out of the students studying Homeopathy, boys and girls are in the ratio 4 : 7 respectively. Out of the boys studying Homeopathy, 20% know only English, 15% know only Hindi and 5% know only Bangla. 15% know English as well as Hindi, 25% know English as well as Bangla and 10% know Hindi as well as Bangla. Remaining boys know all three languages.

Out of the girls studying Homeopathy, 15% know only English, 15% know only Hindi and 5% know only Bangla 20% know English as well as Hindi, 20% know English as well as Bangla and 15% know Hindi as well as Bangla. Remaining girls know all the three languages.

6. How many students of Dentistry know only Either English or Hindi?
   a) 166 b) 162 c) 308
   d) 198 e) 248
7. How many students in the College know all three languages?
   a) 108 b) 132 c) 169
   d) 137 e) 142
8. What percent of the total number of girls in the college know Bangla?
   a) 45% b) 53% c) 48%
   d) 42% e) 50%
9. Out of the total number of students studying Dentistry, what percent knows at least two languages?
   a) 61 12/13% b) 57 13/18%
   c) 59 13/17% d) 66 1/4%
   e) 62 12/19%
10. What percent of the total number of girls in the college do not know Hindi? (Rounded off to nearest integer)
   a) 38% b) 46% c) 48%
   d) 36% e) 43%
11. A milk vendor bought 28 L of milk at the cost of Rs. 8.50 per L. After adding some water, he sold the mixture at the same price. If he gains 12.5%, then how much water did he add?
   a) 5.5L b) 4.5 L c) 3.5 L
   d) 2.5 L e) 1.5L
12. Some amount was lent at 6% per annum at simple interest. After 1 yr, Rs. 6800 is repaid and the rest of the amount is repaid at 5% per annum. If the second year's interest is 11/20 of the first year's interest, find what amount of money was lent out.
   a) Rs. 17000 b) Rs. 16800
   c) Rs. 16500 d) Rs. 17500
   e) Rs. 18000

Key with Solutions

1) d; Number of Female mobile users of LG brand in City C
= 40×(54/100)
= 21.6 thousand
= 21600

2) c; Total number of Male users of Nokia brand
= 45 × 0.49 + 30 × 0.52 + 75 × 0.55 + 20 × 0.5 + 90 × 0.45 + 50 × 0.58 thousand
= 22.05 + 15.6 + 41.25 + 10 + 40.5 + 29
= 158.4 thousand = 158400

3) a; Required difference
=[(345-324)/6] × 1000
= 3500

4) e; Female Samsung users of A and B together = 32 × 0.45 + 72 × 0.42
= 14.4 + 30.24
= 44.64 thousand
= 44640
Male LG users of C and D together
= 40 × 0.46 + 40 × 0.61 = 18.4 + 24.4= 42.8 thousand
= 42800
∴ Required percent
= 104.29%

5) b; Male users of Nokia in City E
= 90 × 0.45
= 40.5 thousand
Female users of Nokia in City F = 50 × 0.42 = 21 thousand
Percent = [(40.5-21)/21]× 100
= 92.857 ≈ 93%

(6-10)

	Dentistry (720) Boys (450)	Dentistry (720) Girls (270)	Homeopathy (880) Boys (320)	Homeopathy (880) Girls (560)
E	72	54	64	84
H	45	27	48	84
B	18	27	16	28
E+H	108	54	48	112
H+B	63	27	32	84
B+E	90	54	80	112
All	54	27	32	56

6) d; required students = Boys [English+Hindi] + Girls [English + Hindi] = 72 + 45+54 + 27 = 198
198 students know only either Hindi or English

7) c; Required students
= 54 + 27 + 32 + 56 = 169
i.e. 169 students know all three languages.

8) e; Total number of girls
= 270 + 560 = 830
Total number of girls who know Bangla
(B, H + B, B + E) = 27 + 27 + 54 + 27 + 28 + 84 + 112 + 56 = 415
Required percentage
= (415/830) × 100% = 50%

9) d; Total number of students in Dentistry = 450 + 270 = 720
Number of boys know at least two languages (Dentistry)
= 108 + 63 + 90 + 54 + 27 + 54 + 27 + 54 = 477
∴ Required percentage
=(477/720)×100 = 66¼ %

10) e; Total no. of girls=270+560=830
Number of girls who do not know Hindi = 84 + 54 + 27 + 28 + 54 + 112 = 359
∴ Required percentage
= (359/830) × 100 ≈ 43%

11) c; Given,
Cost price of 1 L = Rs. 8.50
∴ Total CP of milk
= 28 × 8.50 = Rs. 238
∴ Profit = 12.5% of 238
= (12.5/100)× 238 = Rs. 29.75
Let he added x L of water
Profit = x × 8.5
⇒ 29.75 = x × 8.5 ⇒ x = 3.5L

12) a;

అడ్మిషన్స్

నిమ్స్ హైదరాబాద్‌లో ఎంపీటీ కోర్సులో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ(ఎంపీటీ) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం సీట్ల సంఖ్య: 15 సీట్లు.

కోర్సు వ్యవధి: రెండేళ్లు.

స్పెషాలిటీ: మస్క్యులోస్కెలెటెల్ సైన్సెస్-05, కార్డియోవాస్కులర్ -పల్మనరీ సైన్సెస్- 05, న్యూరో సైన్సెస్-05.

అర్హత: బీపీటీ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 31.12.2024 నాటికి 22 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: ప్రవేశపరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.09.2024.

దరఖాస్తు హార్డ్‌కాపీ సమర్పణకు చివరితేది: 05.09.2024.

వెబ్‌సైట్: https://www.nims.edu.in

ఎన్‌ఎల్‌యూ ఢిల్లీలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీలో ప్రవేశాలు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ ఢిల్లీ 2025-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆల్-ఇండియా లా ఎంట్రన్స్ టెస్ట్-2025 (ఏఐఎల్‌ఈటీ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

కోర్సుల వివరాలు:

డిగ్రీ కోర్సులు: ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ (ఆనర్స్) ప్రోగ్రామ్-120 సీట్లు; బీకాం ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్) నాన్-రెసిడెన్షియల్ ప్రోగ్రామ్-60 సీట్లు.

అర్హత: సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులవ్వాలి.

పీజీ కోర్సులు: ఏడాది నాన్ రెసిడెన్షియల్ ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్-80 సీట్లు; ఎల్‌ఎల్‌ఎం(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్-25 సీట్లు; ఎంఏ(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్-25 సీట్లు.

అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.

పీహెచ్‌డీ కోర్సులు: లా, సోషల్ సైన్స్ ప్రోగ్రామ్‌లు-31 సీట్లు.

ఎంపిక విధానం: ఆల్ ఇండియా లా ఎంట్రన్స్ టెస్ట్-2025 ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తులకు చివరితేది: 18.11.2024.

వెబ్‌సైట్:
https://nationallawuniversitydelhi.in
www.nludelhi.ac.in.